
# సంఘకాపరులకు
## పౌలు సలహా

1&2 తిమోతి, తీతుకు



ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను.

1 కొరింథీ 10:11


రెవ. డా॥ జెర్రి స్మోయర్

అనువాదం: ప్రొఫెసర్. రెవ. సి.హెచ్. షద్రక్, డైరెక్టర్ (SBLC)

రెవ. డా. జెర్రి స్మోయర్

# కాపరులకు పౌలు సలహా
# 1 & 2 తిమోతి మరియు తీతు పత్రికలు



రెవ. డా. జెర్రి స్మోయర్
అనువాదము: ప్రొఫెసర్. రెవ. సి. హెచ్. షద్రక్

# కాపరులకు పౌలు సలహా
# 1 & 2 తిమోతి మరియు తీతు పత్రికలు

రెవ. డా. జెర్రి స్మోయర్

© 2023

ప్రచురణ - 5000 కాపీలు
© సర్వ హక్కులు రచయితవే

కాపీల కొరకు సంప్రదించండి
**బేతేలు ప్రేయర్ ఫెలోషిప్**
ఇ.నెం. 8-2-293/128, రోడ్ నెం. 14,
వెంకటేశ్వరనగర్, బంజారా హిల్స్,
హైదరాబాద్-500034,
తెలంగాణ, ఇండియా,
ఫోన్: 9866543468

ముద్రణ
స్ఫూర్తి ప్రింటర్స్
హైదరాబాద్, తెలంగాణ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| **I కాపరులు** | - | 1 |
| **A. పౌలు** | - | 1 |
| 1. చారిత్రాత్మక కాలమానము | - | 1 |
| 2. పౌలు ప్రారంభ జీవితము | - | 2 |
| 3. పౌలు పరిచర్య | - | 14 |
| 4. పౌలు జీవితము నుండి నేర్పబడు పాఠాలు | - | 18 |
| a) దేవుడు ఎవరినైనను వాడుకోగలడు | - | 18 |
| b) మనము సాధించిన ఘనవిజయాలు మనహద్దుల నేర్పరచవు | - | 21 |
| c) సంతుష్టి సహితమైన జీవిత ప్రాముఖ్యత | - | 23 |
| d) పౌలు మనుష్యులను కాక దేవుని సంతోషపెట్టునట్లు జీవించినాడు | - | 25 |
| 5. ఓడ మునిగిపోవు సమయమున పౌలు నాయకత్వ లక్షణముల నుండి నేర్పబడు పాఠాలు | - | 27 |
| a) దైవభక్తి గల నాయకుడు నమ్మబడగలడు | - | 28 |
| b) దైవభక్తి గల నాయకుడు చొరవతీసుకొంటాడు | - | 30 |
| c) దైవభక్తి గల నాయకుడు కష్ట సమయములో ధృడముగా ఉంటాడు | - | 32 |
| d) దైవభక్తి గల నాయకుడు ఇతరులను ప్రోత్సాహపరచును | - | 34 |
| e) దైవభక్తి గల నాయకుడు పాపమునకు వ్యతిరేకంగా నిలుస్తాడు | - | 36 |

f) దైవభక్తి గల నాయకుడు మంచి మాదిరిని ఉంచుతాడు - 38
g) దైవభక్తి గల నాయకుడు పరిచర్య ఎప్పుడైనను చేయగలడు - 39
**B. తిమోతి** - 42
1. జీవితము మరియు పరిచర్య - 42
2. తిమోతి నుండి నేర్పబడు పాఠాలు - 48
a) తిమోతి యొక్క మాదిరి - 48
b) నిరుత్సాహపరచుట – సాతాను సాధనము - 51
c) బోధింపదగిన ఆత్మ - 54
d) కష్ట సమయములలో అంటిపెట్టుకొని యుండుట - 57
e) కష్టములను ఎదుర్కొను కాపరులకు ప్రోత్సాహముగా ఉండుట - 59
3. భయాలను నియంత్రించు అవగాహన - 62
**C. తీతు** - 65
1. జీవితము మరియు పరిచర్య - 65
2. తీతు నుండి నేర్పబడు పాఠాలు – అవి అన్నియు నా గురించి కాదు, ఇవి ఏవియు నా గురించి కావు. - 67

**II. 1 తిమోతి** - 70
A) 1 తిమోతి పూర్వరంగము - 70
B) 1 తిమోతి పత్రిక రూపురేఖలు - 74
C) కాపరుల కొరకు ఇవ్వబడు సలహాలు - 75

1. ప్రతి ఒక్కరికి ఒక పౌలు అవసరము - 75
2. పిరికివాడైన తిమోతి (1:1-3, 18-19) - 78
3. మన మధ్యగల మత భ్రష్టత్వము (1: 4-20) - 81
4. పౌలు వలె ప్రార్థించుట (2:18) - 84
5. స్త్రీల యొక్క పాత్ర (2:9-15) - 87
6. కాపరి చేయవలసినవి (3:1-3) - 92
7. నాయకుని యందు దేవుడు చూచునవి (3:1-3) - 95
8. సంఘ పరిచారకుల యందు దేవుడు చూచునవి (3:8-16) - 99
9. అబద్ధ బోధకుని ఎలా గుర్తించుట (4:1-5) - 102
10. ఆజ్ఞాపించుము మరియు బోధించుము (4:6-15) - 106
11. నేటి కాపరులకు పౌలు ఆజ్ఞాపించునవి (4:12-16) - 108
12. నీ గొర్రెలతో (సంఘ సభ్యులు) ఎలా మసలుకోవాలి (5:1-16) - 112
13. దైవభక్తిగల కాపరుల ఎంపిక మరియు సన్మానము (5:17-25) - 116
14. తప్పుడు బోధకులను ఎలా గుర్తించాలి (6:1-5) - 120
15. దైవజనుని కొరకు ఇవ్వబడు ఆజ్ఞలు (6:6-21) - 123

III. **2 తిమోతి** - 128

A) 2 తిమోతి పూర్వరంగము - 128

B) 2 తిమోతి పత్రిక రూపురేఖలు - 131

C) కాపరులకు ఇవ్వబడు సూచనలు - 132

1 పౌలు మరణవాంగ్మూల మాటలు (1:1-5) - 132

2 నమ్మకమైన సంఘకాపరి లక్షణములు 1:
పట్టుదల & ధైర్యము (1:6-12) - 135

3 నమ్మకమైన సంఘకాపరి లక్షణములు 1:
నమ్మకత్వము (1:13-18) - 138

4 కర్తవ్యము 1: ధృడముగా ఉండు (2:1) - 139

5 కర్తవ్యము 2: సత్యము మరొక తరమునకు
అందించుట (2:2) - 143

6 కర్తవ్యము 3: శ్రమలను సహించుట (2:3-7) - 145

7 శ్రమలను సహించుటలో యేసు మన మాదిరి
(2:8-13) - 148

8 కర్తవ్యము 4: తప్పుడు బోధను ఎదిరించుట
(2:14, 16-19) - 150

9 కర్తవ్యము 5: దేవుని ఆమోదము మాత్రము
వెదుకుట (2:15) - 154

10 కర్తవ్యము 6: పరిశుద్ధత కలిగి యుండు
(2:20-26) - 157

11 కర్తవ్యము 7: లోకవ్యతిరేకతకు అప్రమత్తంగా
ఉండుట (3:1-9) - 160

12 కర్తవ్యము 8: హింసల యందు నమ్మకముగా ఉండు
(3:10-13) - 163

13 కర్తవ్యము 9: వాక్యమందు జీవించుము
(3:14-17) - 165
14 కర్తవ్యము 10: వాక్యము బోధించుట (4:1-2) - 168
15 కర్తవ్యము 10: వాక్యము ప్రకటించుటకు సంసిద్ధత
కలిగి యుండుట (4:1-2) - 172
16 కర్తవ్యము 10: దిద్దుబాటు చేయుము, ఖండించుము,
ప్రోత్సహించుము (4:1-2) - 174
17 కర్తవ్యము 10: వాక్యము ఎలా బోధించాలి
(4:1-2) - 176
18 కర్తవ్యము 10: వాక్యము ఎందుకు బోధించాలి
(4:3-5) - 179
19 భార్యల పట్ల మన కర్తవ్యము - 183
20 పిల్లల పట్ల మన కర్తవ్యము - 187
21 కాపరి భార్య యొక్క కర్తవ్యము - 189
22 కర్తవ్యము 11: అంతమువరకు నమ్మకముగా
ఉండు -1 (4:6-8) - 193
23 కర్తవ్యము 11: అంతమువరకు నమ్మకముగా
ఉండు - 2 (4:6-8) - 197
24 పౌలు & తిమోతిల చివరి సంవత్సరములు
(4:9-22) - 200
25 వారి కాపరుల పట్ల క్రైస్తవుల కర్తవ్యము - 203
26 ఇతర కాపరుల పట్ల కాపరుల కర్తవ్యము - 206

IV. **తీతు** - 209

A. తీతు పూర్వ రంగము - 209

B. తీతు పత్రిక రూపురేఖలు - 212

C. కాపరులకు ఇవ్వబడు సలహా - 213

1. వాక్య సందేశము అందించుము (1:1-4) - 213
2. దేవుని క్రమము రూపకల్పన (1:5) - 216
3. దైవభక్తిగల నాయకుల ప్రవర్తన (1:6-9) - 221
4. తప్పుడు బోధకుల ప్రవర్తన (1:10-14) - 223
5. నేటి దినములలో తప్పుడు బోధలు 1 (1:15-16) - 227
6. నేటి దినములలో తప్పుడు బోధలు 2 (1:15-16) - 231
7. తప్పుడు బోధల పర్యవసానాలు (1:10-16) - 235
8. తప్పుడు బోధలను ఎలా గుర్తించాలి (1:10-16) - 240
9. పురుషుల యొక్క ప్రవర్తన (2:1-2) - 245
10. స్త్రీలు & యౌవనస్థుల యొక్క ప్రవర్తన (2:3-8) - 249
11. దాసుల యొక్క ప్రవర్తన (2:9-10) - 253
12. దైవిక ఎంపికలు చేయుట (2:11-15) - 258
13. అధికారుల యొక్క ప్రవర్తన (3:1-7) - 262
14. యేసు ఆగమనము కొరకు వేచి యుండుట (3:8-15) - 266

V. **కాపరుల & నాయకుల కొరకైన ప్రమాణాలు** - 270

A. దైవభక్తిగల నాయకుడు తప్పక దైవభక్తి గల నాయకునిగా ఉండుటకు ఇష్టపడాలి. - 270

B. దైవభక్తిగల నాయకుడు అంతరంగములో దైవిక లక్షణాలు కలిగి ఉండాలి. - 271

C. దైవభక్తిగల నాయకుడు ఒకరిపట్ల ఒకరు దైవిక
లక్షణాలు కలిగి ఉండాలి. - 273

D. దైవభక్తిగల నాయకుడు దైవకీర్తి ప్రసిద్ధి
చేయువాడుగా ఉండాలి. - 275

E. దైవభక్తిగల నాయకుడు దైవిక ఆధ్యాత్మిక
జీవితము కలిగి ఉండాలి. - 277

**VI. సంఘర్షణ–పరిష్కారము** - 281

A. ఘర్షణలు అనివార్యములు - 281

B. మొదటి చర్య తీసుకొనవలయును - 284

C. సమాధాన స్థాపన విఫలము చెందినపుడు - 287

D. ఫిలిప్పి సంఘము నందు సంఘర్షణ - 291

**ముగింపు** - 296

పుస్తకము యొక్క పునః పరిశీలన ప్రశ్నలు - 296



# పీఠిక

బైబిలు నందు దేవుని ప్రజలకు ఎన్నో విధములైన సూచనలు మరియు మార్గదర్శకములు ఇవ్వబడినవి. నూతన నిబంధన యందు క్రైస్తవ సంఘములో ఉన్న విశ్వాసులు  వారిమధ్య నెలకొల్పబడవలసిన సంబంధ బాంధవ్యములు తెలియచేయబడినవి. ముఖ్యముగా సంఘ కాపరులు మరియు సంఘనాయకులు కలిగి యుండవలసిన లక్షణములు మరియు సంఘములో వారి పాత్రను గూర్చి అపోస్తలుడైన పౌలు 1 & 2 తిమోతి మరియు తీతు పత్రికల యందు వ్రాసినాడు. ఆదిమ సంఘమునందు విమతములు, తప్పుడు సిద్ధాంతములు గందర గోళ వాతావరణమును సృష్టించినవి. ఈలాంటి పరిస్థితులు అప్పటి కాలమునకు మాత్రమే పరిమితి చేయబడలేదు, నేటి సంఘముల యందు కూడా విస్తృతముగా ప్రాచుర్యములో యున్నవి. తప్పుడు బోధలు సంఘములకు ఒక కొరుకుడు పుండు వంటిది, అది ప్రారంభ ములోనే అరికట్టబడకపోతే దాని యొక్క ప్రభావము సంఘమంతటి పైన పడుతుంది. కాబట్టి తప్పుడు బోధలు ఖండించబడవలెను మరియు సంఘము సత్యమును, హితబోధను ఎరుగునట్లు వాక్యమును నేర్పించవలెను, బోధించవలెను.

రెవ. డా. జెర్రి స్మోయర్ గారు రచించిన "సంఘ కాపరులకు పౌలుసలహా 1& 2 తిమోతి మరియు తీతు" అను పుస్తకమునందు ఈ విషయములను విపులముగా చర్చించినారు. రెవ. డా. జెర్రి స్మోయర్ గారు ఒక అనుభవజ్ఞుడైన సంఘ కాపరిగా మరియు దైవజ్ఞాన కళాశాల అధ్యాపకులుగా ఆచరణబద్ధమైన మరియు వివరణాత్మకమైన వ్యాఖానములను స్పష్టముగా వివరించినాడు. ఈ పుస్తకమును తెలుగు భాషలోనికి తర్జుమా చేయుటలో పాల్గొనుట దేవుడు నాకిచ్చిన ఆధిక్యతగా భావిస్తున్నాను. ఈ పుస్తకము నేటి సంఘము ఎదుర్కొంటున్న అనేకమైన సమస్యలకు పరిష్కారమును చూపుతుంది. ఈ పుస్తకముసంఘకాపరులకు, నాయకులకు, దైవజ్ఞాన కళాశాల అధ్యాపకులకును మరియు శిక్షకులకును ఎంతో ప్రయోజన కరమైనదిగా యుంటుంది. దైవజనుడైన రెవ. డా. జెర్రి స్మోయర్ గారి ద్వారా వెలువడిన ఈ పుస్తకము నేటి సంఘమునకు అభివృద్ధి మరియు క్షేమము కలుగజేయును గాక!

**ప్రొఫెసర్. రెవ. సి. హెచ్ షడ్రక్** (పాత నిబంధన అధ్యాపకులు)
Church of Cross Theological College, Hyderabad
& డైరెక్టర్ SBLC, Hyderabad

# ముందుమాట

బైబిలు నందు దేవుని ప్రజల కొరకు సూచనలు మరియు మార్గదర్శక ములు ఇవ్వబడినవి. ఈ మార్గదర్శకములు లేకుండా మనము ఎలా జీవించాలి, ఆయనను ఎలా సేవించాలి, అను విషయములు తెలుసు కొనలేము. క్రైస్తవులు యేసు కొరకు ఎలా జీవించాలి అను విషయ ములు వీటియందు కనుగొనగలరు. దీని యందు భర్త మరియుభార్య, తల్లిదండ్రులు మరియు ప్రభుత్వ అధికారులు మొదలగువారికి సూచనలు ఇవ్వబడినవి. దీనియందు కాపరులకు కూడా తగిన సూచనలు ఇవ్వబడినాయి. ఇవి ఒక గొప్ప కాపరిగా గుర్తింపబడిన అపొస్తలుడైన పౌలు ద్వారా అన్ని కాలముల వారికీ ఇవ్వబడినవి.

ఒక కాపరిగా నేను పౌలుతో కూర్చొండి ఆయన ద్వారా ఇవ్వబడిన సూచనలు విను అవకాశము కొరకు ఇష్టపడినాను. కాని అది సాధ్యపడదు. కాని దాని తరువాత వాటిని నేర్చుకొనే మరియొక మంచి అవకాశము కలదు. ఆయన వ్రాసిన పత్రికలైన 1 & తిమోతి మరియు తీతుల యందు ఆయన చర్చించిన విషయముల నుండి నేర్చుకొని మరియు వీటియందు ఇవ్వబడిన సూచనలను నేటి సంఘ కాపరులు తమ పరిచర్యకు అన్వయించుకొనగలరు. ఈ పత్రికల యందు సంఘకాపరుల కొరకు ప్రత్యేకమైన లోతైన అంశములు, వివరణతో కూడిన మార్గదర్శకములు మరియు ఆదేశములు ఇవ్వబడినవి. సంఘమును నడిపించు కాపరులుగా తిమోతి మరియు తీతు ఏమి చేయవలయునో మరియు వేటిని చేయకూడదో వాటినే పౌలు తెలియజేసినాడు.

సంఘములో ఒక మంచి కాపరిగా తన విధులను నిర్వర్తించ వలయునంటే అది అంత సులభమైన పనికాదు. ప్రజల నుండి ఎన్నో రకములైన క్లిష్ట పరిస్థితులు కల్పించబడుతాయి. 1 & 2 తిమోతి మరియు తీతు పత్రికల యందు వాటిని చూడగలము. తిమోతి సంఘ కాపరిగా ఉండుటకు పంపబడిన ఎఫెసీ సంఘము నందు వివిధ రకములైన సవాళ్లతో కూడిన పరిస్థితులు ఉన్నాయి. అయితే పౌలు తన అనుభవముల నుండి కష్టతరమైన సమయము. మరియు పరిస్థితుల యందు పరిచర్య ఎలా చేయవలయునో దైవభక్తితో కూడిన సలహాలను ఇచ్చియున్నాడు.

ఈ పత్రికల నుండి నాయకత్వము వహించుట, కాపరత్వ నిర్వహణ, భయానక పరిస్థితులను సమర్థవంతముగా ఎదుర్కొని పరిష్కరించుట, మరియు తప్పుడు బోధలను ముఖా ముఖిగా ప్రతిఘటించుట, మరియు తప్పిపోయిన సంఘ సభ్యులను తిరిగి దేవుని వైపు మళ్లించుట మొదలగు వాటికి సంబంధించిన విషయాలను నేర్చుకోగలము. ఈ పుస్తకము నందు మన జీవితము నకు, పరిచర్యకు సంబంధించిన అనేక విషయాలు నేర్చుకొనుటకు మరియు వాటిని అన్వయించుకొనుటకు తగిన సూచనలు మరియు ప్రాముఖ్యమైన సంగతులు పొందుపరచబడినవి.

ఈ పుస్తకము నందు పౌలు, తిమోతి మరియు తీతు యొక్క జీవితములను పరిశీలించి వాటి నుండి అనేకమైన పాఠములు తెలియ జేయబడినవి. అవి నేటి పరిస్థితులకు మరియు పరిచర్యకు సహాయ కరముగా ఉండగలవు. వారి జీవితాలు ప్రస్తుత పరిస్థితులలో మనకును మరియు అన్ని కాలముల వారికి దేవుని సేవించునట్లు ప్రోత్సాహాన్ని, ప్రేరణను మరియు సవాళ్లను ఎదుర్కొనగల శిక్షణను

ఇవ్వగలవు. ఈ వ్యక్తుల జీవితాలలో ఎన్నో బలహీనతలు, లోపాలు ఉన్నప్పటికీ దేవుడు వారిని గొప్పగా వాడుకొన్నాడు. దీనిని బట్టి దేవుడు నిన్ను కూడా గొప్పగా వాడుకోగలడు. బైబిలు మనుష్యులకు శిక్షణ నిచ్చు నిర్దేశక గ్రంథము. పౌలు, తిమోతి మరియు తీతుల జీవితాలు మరియు వారి రచనలు నేటి సంఘ నాయకులకు మరియు కాపరులకు మార్గదర్శక సూత్రావళి. ఈ పుస్తకమును ప్రార్థన పూర్వకముగా ఆయన సత్యమునుచూపించవలెయునని అడిగి చదువ వలయును. దేవుడు నీతోమాట్లాడువిషయాలను వ్రాసుకొని దేవుడు నీ జీవితములో వేటిని అన్వయించు కొనవలయునని గుర్తు చేస్తున్నాడో వాటిని అంగీకరించుము. దేవుడు పౌలును, ఆశీర్వదించి, వాడుకొన్న ప్రకారము నిన్ను ఆశీర్వదించి తనపరిచర్యలో వాడుకొనగలడు.

# I. కాపరులు

## A. పౌలు

### 1. చారిత్రాత్మక కాలమానము

బైబిలు పుస్తకముల ఆధారము: అపొ.కా. 13-26, పౌలు పత్రికలు
బైబిలు వచనము: 2 తిమోతి 2,4:7-8 "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని, ఇకమీదట నా కొరకు నీతికిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికి అనుగ్రహించును" కాలము: క్రీ.శ 34 - 96

### ఆ కాలమునందలి ప్రాపంచిక సంఘటనలు

భారతదేశమునకు అపొస్తలుడైన తోమా రాకతో ఇక్కడ సంఘము ప్రారంభించబడినది. రోమా సామ్రాజ్యము వేల్సు పట్టణమును జయించినది. క్లౌదియా చక్రవర్తి భార్య జూలియా అగ్రిప్పను తన భర్తకు విషమునిచ్చి చంపి అతని కుమారుడైన నీరోను చక్రవర్తిగా జేసినది. ఆ పిదప అతడు ఆమెను హతమార్చినాడు. రోము పట్టణము అగ్నితో కాల్చబడినది. యూదయ రోమా సామ్రాజ్యమునకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేయుటవలన రోమా చక్రవర్తి టైటస్ క్రీ.శ. 70 నందు యెరుషలేమును ధ్వంసం చేసినాడు. యెసూబియస్ పర్వతము పేలుటద్వారా 20,000 మంది ప్రజలు చనిపోయినారు.

**భౌగోళిక ప్రదేశము:**

**మధ్యదరా పరివాహక ప్రదేశము, పాలస్తీనా, స్పెయిన్**

ఆదిమ సంఘము అభివృద్ధిచెంది, వ్యాపిస్తూ ఉన్నపుడు సంఘము యెరుషలేములోను మరియు పాలస్తీనా వెలుపల భాగముల యందు హింసను,వ్యతిరేకతను ఎదుర్కొనినది. ఈలాంటి పరిస్థితులలో సంఘమును సత్యములో నడపించుటకు ఒక సమర్థ వంతుడైన వ్యక్తి అవసరమైనది. అలాంటి పరిస్థితులలో అపొస్తలుడైన పేతురు ఆదిమ సంఘ వ్యాప్తి చెందుటకు నాయకత్వము వహించినాడు మరొక వైపుగా సంఘమును నడిపించుటకు సరియైన మార్గదర్శకాలు అందించుటకు విద్యావంతుడైన, మంచి వ్యక్తిత్వము కలిగిన అపొస్తలుడైన పౌలు దేవునికి అవసరమైనది. పౌలును క్రీస్తువంటి వ్యక్తిత్వము గల నాయకునిగా తీర్చిదిద్దుటలో దేవుడు సంఘమును కూడా వాడుకొన్నాడు.

## 2. పౌలు యొక్క ప్రారంభ జీవితము

పౌలు తన అభిప్రాయమును వ్యక్తము చేయునపుడు అనగా సంఘములో జరుగు విషయాలను సమర్థించునపుడు లేదా వ్యతిరే కించునపుడు నూటికి నూరు శాతము నిర్దిష్టమైన భావములు కలిగి యుండేవాడు తప్ప వాటికి మధ్యస్తముగా ఉండేవాడు కాదు.

**పూర్వీకులు**

పౌలు యొక్క పూర్వీకులు బెన్యామీను గోత్రమునకు చెందిన వారు. వారు గలలియ ప్రాంతములోని గిస్కలా నుండి తార్సు పట్టణ మునకు వెళ్లినారు. అతని తల్లితండ్రులు అతనికి సౌలు అని పేరు పెట్టినారు. అతడు ఒక రోమా పౌరుడుగా పౌలు (లాటిన్) అను పేరుతో పిలువబడినాడు.

## స్వస్థలము

పౌలు యొక్క స్వస్థలము తార్సు. ఇది ½ మిలియన్ జన సాంద్రత కలిగిన స్వయంపాలక పట్టణము. ఇది విద్యాలయాలు కలిగియున్న వ్యాపారకేంద్రిత పట్టణము.

## తల్లిదండ్రులు

పౌలు యొక్క తండ్రి ధనవంతుడైన పరిసయ్యుల తెగకు చెందినవాడు. ఇతడు స్థానిక గొర్రెల నుండి తీయబడిన నల్లని ఉన్నితో గుడారములు తయారు చేయు వృత్తి చేయువాడు. అతడు రోమా పౌరసత్వము కలిగినవాడు. మరియు తార్సు పట్టణమునందు ఒక పేరుపొందిన నాయకుడు. పౌలు తల్లిని గూర్చి మనకు ఎక్కువ సమాచారము ఇవ్వబడలేదు. బహుశా పౌలు సహోదరికి  జన్మనిచ్చే సమయములో ఆమె మరణించి యుండవచ్చును.

## విద్యాభ్యాసము

పౌలు విద్యాభ్యాసము ఇంటియొద్దనే జరిగినది. అతడు హీబ్రూ భాషను సునగోగునందు నేర్చుకొన్నాడు మరియు 13 సంవత్సరముల ప్రాయమునకే యూదా సాహిత్యము, చరిత్ర, కావ్య గ్రంథము, ప్రవక్తల పుస్తకములయందు ప్రావీణ్యత పొందినాడు. అతడు బహు ప్రజ్ఞాశీలుడు మరియు అతీతమైన జ్ఞాపకశక్తిగలవాడు.

## భాష

పౌలు జీవించిన కాలమునందు ప్రతి ఒక్కరు బహు భాషల యందు ప్రవీణులు. అతడు బాల్యమునందే గ్రీకు భాషను ఎరిగినవాడు ఆ రోజులలో గ్రీకు ప్రాథమికమైన భాష.

అరేమియిక్ వాడుక భాష, యూదులు తమ ఇంటి యొద్ద ఈ భాషను వాడుతారు. హీబ్రూ భాషను లేఖనము అధ్యయనము చేయుటకు నేర్చుకొంటారు. మరియుఆ రోజులలో అధికార భాషయైన లాటిను నందు కూడా పౌలునకు ప్రావీణ్యత కలదు.

## వృత్తి

పౌలు దేరాలు కుట్టు వృత్తికి చెందినవాడు. ఆ రోజులలో సంచారజీవులు, ఎడారులలో ప్రయాణించు యాత్రికులు మరియు సైనికులు దేరాలను వాడుక చేయువారు. కాబట్టి వీటి వాడకము విరివిగా ఉండేది.

## విశ్వాసము

పౌలు రోములోని ప్రసిద్ధి చెందిన తార్సు పట్టణమునకు చెందినవాడు అయినప్పటికి అక్కడి మత విశ్వాసములైన బయలు ఆరాధన, అన్య దేవతలను ఆరాధించుట మొదలగు మతవిశ్వాసాలు మరియు వారి అనైతిక జీవనశైలి అతనిపై ఏమాత్రము ప్రభావము చూపలేదు. కాని అతని పూర్వికులు ఆరాధించు దేవుడైన యెహోవా యందును మరియు వారి లేఖనములయందును విశ్వాసముంచినాడు.

## గృహజీవితము

మంచి దైవభక్తి గలవారై దేవునికి సంపూర్ణ విధేయత కలిగియుండాలి అను బలమైన మత విశ్వాసము గల గృహములో పౌలు జీవించినాడు. బాల్యము నుండి పౌలు ఈలాంటి పరిసరాల మధ్య జీవించినాడు.

## వ్యక్తిత్వ ఎదుగుదల

పౌలు తన తండ్రితో వ్యాపార మరియు ఆధ్యాత్మిక కారణ ములను బట్టి ఆయా ప్రాంతములకు ప్రయాణించినాడు. ఆయా సందర్భములలో రబ్బీ గమలియేలు యొద్ద శిక్షణ పొందుటకు యెరుషలేమునకు వెళ్లేవాడు. పౌలు 13వ ఏట ప్రతి యూదా బాలునికి జరిపించు ఉత్సవము "బర్ మిత్స్ వా" లో పాల్గొనుటకు తన తండ్రితో కలిసి మొదటిసారి యెరుషలేముకు వెళ్లినాడు. (bar is a Jewish, Babylonia, Aramaic word meaning 'son' ben in Hebrew). And mitzwac commandment & law)"బర్ మిత్స్ వా" అనగా యూదారబ్బీ యొద్ద ధర్మశాస్త్రమును అభ్యసించిన ఒక యూదా బాలుని యెరుషలేము దేవాలయములో 13వ సంవత్సరమునందు యూదా మత కార్యక్రమాలలో పాల్గొనుటకు అనుమతించుట. ఈ వేడుకకు కొన్ని సంవత్సరములకు ముందు యేసు కూడా రబ్బీ గమలియేలును దేవాలయములో కలుసుకొన్నాడు. పౌలు చాలా కఠినమైన మరియు దీర్ఘకాలికమైన శిక్షణను అభ్యసించినాడు. అతడు కేవలము హిబ్రూ లేఖనముల యందు మాత్రమే కాక యూదుల యొక్క వ్యాఖ్యాన గ్రంథములైన మిష్నా ( The *mishna* or the *Mishna* is the first major collection of the Jewish traditions which is known as the oral Torah. It is also the first major collection), జెమరా మరియు తార్ గామ్ ల యందు కూడా నిష్ణాతుడిగా ఉన్నాడు. అతడు తన సమకాలీకులందరిని మించిన ప్రజ్ఞాశీలుడు. అతడు హేతుబద్ధముగా ఆలోచించేవాడు. అచంచలమైన జ్ఞాపకశక్తి గలవాడు. బహిరంగంగా ఇతరులకు ఆకట్టుకొనుటకు ప్రయత్నిస్తారు. అయితే పౌలు ఎల్లపుడు సరైన కారణముల నిమిత్తము సరియైన నిర్ణయము చేయుటకు ప్రయత్నిస్తాడు. అయితే పౌలు అన్ని విషయాలలో పరిపూర్ణత చెందినవాడుగా కనిపిస్తాడు. కాని అంతరంగంలో ఉన్న

గర్వము, శారీరక కోరికలు మరియు ఐహిక సంబంధమైన విషయాలను బట్టి సతమత మవుతుండేవాడు.

## తార్సుకు తిరుగు ప్రయాణం

పౌలు తాను  30 సంవత్సరముల వయస్సులో ఉన్నపుడు తార్సు పట్టణమునకు తిరిగి వస్తాడు. అక్కడ అతడు సమాజ మందిరములో లేఖనములను బోధించుటకు నాయకునిగా ఉంటాడు. తన అవసరతల నిమిత్తము గుడారాలను కుట్టేవాడు. ఆ సమయమందే అతడు బర్నబాను కలుసుకొంటాడు.

## బాహ్యరూపము

పౌలు మంచి శరీర ధారుడ్యము గల ఒక క్రీడాకారునివలె చూపబడినాడు. కాని యూదా సాంప్రదాయము ప్రకారము 5 అడుగుల ఎత్తు, విస్తృత భుజాలు, దట్టమైన కనుబొమ్మలు, గడ్డము, మరియు పొడవైన వంకర ముక్కుగలవాడు. అతడు దమస్కు మార్గములో పొందిన దర్శనమును బట్టి కనుదృష్టి కోల్పోయినాడు. అతని స్నేహితులు పౌలును వికారాకృతిగలవాడుగా పేర్కొంటారు. అయినను అతనికిగల జ్ఞానము, విద్యను బట్టి లోకము ప్రభావితము చేయబడి, అతని శారీర రూపాకృతిని పట్టించుకొనలేదు.

## వివాహము

పౌలు యొక్క వైవాహిక జీవితమును గూర్చి అంతగా తెలియబడలేదు. అయినను అతని పరిస్థితులను ఆధారము చేసుకొని దానిని అంచనా వేయగలము. యూదుల మహాసభ అయిన సన్ హెడ్రియన్ సభయందు సభ్యునిగా ఉన్నాడు. వారు తప్పక

వివాహితులై యుండవలెను. దీనినిబట్టి ఒక సన్ హెడ్రియన్ సభ సభ్యుడుగా పౌలుకు వివాహము అయినది మరియు పిల్లవాడు కూడా ఉండి ఉండ వచ్చును, అయితే వారు ఇరువురు ఆ రోజులలో తరచుగా వచ్చు అంటువ్యాధులలో చనిపోయినారు. ఇది పౌలు యొక్క మనస్సును కలచి వేసి ఉండవచ్చును. ఈ సంఘటన కారణమును బట్టి 14-04-33 నందు యెరూషలేమునకు తిరిగి వెళ్లినాడు. ఆ రోజు మధ్యాహ్నము 12 గంటలకు ఆ ప్రదేశమంతట దట్టమైన చీకటి కమ్మినది. మరియు మధ్యాహ్నము 3 గంటల సమయములో భూకంపము, ఆకాశము నుండి ఉరుములు, మెరుపుల వంటి అమానుషమైన సంఘటనలు నజరేయుడైన యేసు సిలువ వేయబడిన పరిసర ప్రాంతములలో జరిగినట్లు పౌలు వింటాడు. ఒక సనాతన యూదునిగా ఇవన్నియు పౌలులో ఆసక్తిని రేపినవి. యేసే మెస్సియా అను బోధను ఒక ఉద్యమముగా చేపట్టిన ఈ విమతమును అణచివేయుటకు తీర్మాణించుకొంటాడు.

## పౌలు – హింసకుడు

తన కుటుంబాన్ని కోల్పోయిన నిస్పృహ, ఒంటరితనము నుండి తప్పింపబడుటకు తాను ఈ ఉద్యమమును అణచివేయుటను ఒక సవాలుగా తీసుకున్నాడు. అతడు యెరూషలేములో గుడారాలు తయారుచేయు వృత్తికి చెందిన ప్రాంతములో నివసిస్తూ ఆ పనిని కొనసాగిస్తూనే, యెరూషలేములో  మత నాయకులతో ఎక్కువ సమయమును గడిపేవాడు. ఒకప్పుడు ఎంతో మెచ్చుకొంటూ గౌరవించే వ్యక్తులైన నికోదేము, అరిమతయి యోసేపు మరియు

స్తెఫను మొదలగువారిని ద్వేషించే శత్రువులుగా పరిగణింపబడినాడు. సన్ హెడ్రియన్ సభ సభ్యులలో అతి చిన్న వయస్సుగల గొప్ప ప్రఖ్యాతి గాంచిన వ్యక్తిగా అతడు ఉండినాడు.

## ఆధ్యాత్మిక తృష్ణ

పౌలు జీవితములో ఉన్న శూన్యతను, అసంతృప్తిని బట్టి జీవితము యొక్క పరమార్థము మరియు ఉద్దేశ్యము కొరకు వెదకుటకు ప్రారంభించినాడు. తాను ఒక పరిపూర్ణ క్రమశిక్షణ గల యూదుడుగా కఠిన నియమములు ప్రారంభించినప్పటికి సంతృప్తిలేని వాడుగా మిగిలి పోయినాడు. అతనిలోని ఒత్తిడిని యేసు అనుచరుల మీద తీర్చుకొని అందులో సమాధానము పొందాలని చూచినాడు.

## యేసు మాత్రమే సంతృప్తిపరచును

ఈ లోకము ఇవ్వగలిగేవన్నింటిని, పౌలు కలిగి యున్నాడు. అతడు ప్రేమించి, సహకరించే కుటుంబము ఉన్న యూదుడుగా, హీబ్రూ భాషయందు మరియు లౌకిక పరముగా గ్రీకునందు గొప్ప పాండిత్యము గలవ్యక్తిగా, వృత్తిపరముగా మంచి నైపుణ్యము గలవాడుగా మరియు యూదా రబ్బీగా సమర్థవంతుడైన బోధకుడుగా ఉండగలిగినాడు. అతడు మతపరమైన విషయాలలో నిష్ణాతుడుగా బాహ్యముగా నిందారహితుడుగా ప్రదర్శింపబడినాడు. కాని అతని అంతరంగములో తీరని లోటుతో ఉన్నాడు. కేవలము సంతృప్తి కలుగజేయు యేసునుండి తొలగిపోయినాడు. యేసును గూర్చి చాలా విషయాలు విన్నాడు. అతని స్నేహితుడైన స్తెఫను నుండి చాలా విషయాలు విన్నాడు. మరియు అతడు సమాజమందిరమునకు హాజరగునపుడు కూడా వాటిని విని యున్నాడు. సన్ హెడ్రియన్ సభ

ఎదుట స్తెఫను ప్రసంగించినపుడు దానికి ధీటుగా మరే ఇతర వాదనను చూపలేకపోయినాడు. పౌలు బాల్యము నుండే తన జీవితాన్ని యూదుల ధర్మశాస్త్రము మరియు మతపరమైన ఆచారాలపైన నిర్మించుకొన్నాడు కాబట్టి స్తెఫను యొక్క మాటలను అంత త్వరగా అంగీకరించలేకపోయాడు. కాబట్టి చివరకి తన యొక్క అధికారమును ఉపయోగించుకొని స్తెఫనును రాళ్లతో కొట్టి హతమార్చుటకు అనుమతించినాడు.

## ప్రబలమైన హింస

స్తెఫను మరణముతో  పరిస్థితులు మరియు సమస్య సద్దుమ నగలేదు. కాబట్టి పౌలు తన శక్తి వంచన లేకుండా క్రైస్తవులపై దాడి చేసినాడు. పౌలు దేవుని విషయము కలిగిన రోషమును బట్టియు మరియు తనలో ఉన్న ఆధ్యాత్మిక శూన్యత మరియు తన ఒంటరి తనమును బట్టియు, తాను ఏ శాంతికొరకు వెదకుతున్నాడో దానిని క్రైస్తవులలో చూచుట ద్వారా వారిపై ద్వేషమును పెంచుకొని ఈలాగున వారిపై దాడి చేయుటకు కంకణము కట్టుకొంటాడు. అతడు సునగోగులలో మరియు వారి ఇండ్లలో ప్రవేశించి క్రైస్తవులను భయాభ్రాంతులకులోను చేసినాడు. స్త్రీలను, పిల్లలను చెరసాలలో వేయించుట లేదా చంపివేయుట చేసినాడు.  ఈ సంఘటన జరుగుచు న్న  సమయములో పౌలు సువార్తను విని దాని గూర్చి ఆలోచించటం ప్రారంభించినాడు.  వారి ఆరాధనలకు రహస్యముగా హాజరై సభ ఎదుట యేసుని గూర్చి వాదించే విషయాలను బట్టి యేసును గూర్చి నేర్చుకొంటాడు. యేసు అనుచరులు యేసు చేసిన మహాత్కార్యాము లను గూర్చి మాట్లాడుకోవడం, మరియు ఆయన బోధనలను

కంఠస్తము చేయుట మొదలగువిషయాలను గమనించినాడు. మరొక వైపుగా క్రైస్తవులు హింసింపబడినప్పటికీ చెరగని ఆనందమును చూచి ఆశ్చర్యపోయేవాడు.

## క్రైస్తవ్యము వ్యాప్తి చెందుట

క్రైస్తవులను యెరూషలేము నుండి తరిమి వేసినట్లయితే లేదా వారిని సమూలంగా ధ్వంసం చేసినట్లయితే యెరూషలేమును ఈ విమతము నుండి తప్పించగలమని పౌలు తలంచినాడు. కాని క్రైస్తవ్యము నలుమూలల వ్యాపిస్తుందని గుర్తించి దీనిని త్వరితగతిన నిలిపివేయుట తన శక్తికి  మించిన పనిగా ఉంటుందని భయపడినాడు అయితే క్రైస్తవ్యము అప్పటికే యెరూషలేముకు ఉత్తరంగా ఉన్న దమస్కు వరకు వ్యాప్తి చెందిన విషయాన్ని విని ఇది ఈలాగున కొనసాగినట్లయితే  యూదా మతానికి గొప్ప నష్టం వాటిల్లుతుందని తలంచినాడు.

## దమస్కునకు ప్రయాణం

దమస్కు పట్టణము యెరూషలేమునకు 150 మైళ్ల దూరములో ఉంది. అది గాడిద మీద ప్రయాణించినప్పుడు 4 దినముల దూరములో ఉంటుంది. అధిక సంఖ్యాకులైన యూదులు దమస్కు పట్టణమునందు నివసిస్తున్నారు. కాబట్టి క్రైస్తవ్యము వారి మధ్య వ్యాప్తి చెందకముందే అక్కడికి చేరుకొనవలెనని అధికారుల నుండి పత్రములు తీసుకొని యూదులలోని కొందరు లేవీ గోత్రము నకు చెందిన సైనికులను మరియు ఇతర అధికారులను తీసుకొని దమస్కునకు బయలుదేరినాడు.

## పరివర్తనము చెందుట

వారు  మార్గమున వెళ్లుచుండగా అకస్మాత్తుగా సూర్య ప్రకాశము కంటే అధికమైన షకీనా మహిమను పౌలు మరియు అతని తో ప్రయాణించువారు చూచినారు. వెంటనే వారందరు ముందుకు పడిపోయి ఒక శబ్దాన్ని వింటారు. కాని  పౌలు మాత్రమే సౌలా, సౌలా నీవేలా నన్ను హింసించుచున్నావు? అను మాటలు తన వయస్సు గల ఒక వ్యక్తి మాట్లాడటము చూస్తాడు. వెంటనే పౌలు ఆ వ్యక్తి ఎవరు అనేది గ్రహించగలిగినాడు. ఆయనను ఇంతకు ముందు కలువలేదు గాని, తన సందేహమును నిర్ధారించుటకొనుటకు, నీవు ఎవరు? అని ప్రశ్నించినాడు. అతడు అనుకొన్న ప్రకారముగా నేను యేసును అను సమాధానము ఇవ్వబడినది. వెంటనే పౌలు ఎవరిని హింసిస్తున్నానో ఆ యేసు పౌలును ప్రేమిస్తున్నాడని గుర్తించినాడు. వెంటనే పౌలు విరిగిన హృదయముతో తన్ను తాను అప్పగించు కొన్నాడు. అతనిలో ఉన్న వేదాంత వాదనలు తొలగిపోయినాయి. అతనితో సనాతన యూదులైన సమకాలీకులు ఏమి ఆలోచిస్తారు, లేదా యూదామతము యొక్క భవిష్యత్తు ఏమవుతుంది అనే భావములను విస్మరించినాడు. స్తెఫనును తన భావనలో వాస్తవికత గలవాడుగా తాను తప్పుడు మార్గములో ఉన్నవానిగా నిర్ధారించుకొన్నాడు. పౌలు తన జీవితములోదేనిని వెదకుతున్నాడో దానిని పొందగలిగాడు. ఆ క్షణములోనే మధురమైన శాంతితో తన హృదయం నింపబడినది. యూదుల మెస్సియ, దేవుడైయుండి మనిషిగా భూమిపైకి వచ్చిన నజరేయుడైన యేసు యొక్క అధికారమునకు తన్ను తాను సంపూర్ణముగా 100% అప్పగించుకొన్నాడు. తన మిగిలిన జీవితమును ఆయనను సేవించుటకు తన్నుతాను అప్పగించుకొన్నాడు.

## పౌలు నూతన జీవితము యొక్క ప్రారంభ దినాలు

పౌలు దమస్కు మార్గంలో తన దృష్టిని కోల్పోయిన కారణముచేత మూడు దినములు గ్రుడ్డివాడుగా ఉన్నాడు. ఇది తన జీవిత కాలమంతటికి చెరగని గుర్తుగా ఉండిపోయినది. ఈ మూడు దినములు అతనికి అన్నపానములు చేయాలనే ఆశ కూడా లేకుండా తనకు జరిగిన సంఘటను గూర్చి ఆలోచిస్తాడు. అహంకారియు, స్వయంసంతృప్తిగల పౌలు దమస్కు మార్గములో చేయి పట్టుకొని నడిపించబడి ఇతరులచేత జాగ్రత్తగా తీసుకొనిపోబడినాడు. ఇప్పుడు అతడు విజయం పొందిన వీరుడుగా కాక తప్పిపోయిన కుమారుని వలె పట్టబడినవాడు. అతని మనస్సులో ఎన్నో జ్ఞాపకాలు తొలచి వేస్తున్నాయి. స్తెఫను యొక్క మాటలు తన మనస్సులో పదునైనా కత్తివలె దూసుకుపోతున్నాయి. వాటిని జ్ఞాపకము చేసుకుంటున్నప్పుడు అవి టైంబాంబు పేలినట్లు చలించిపోయినాడు. అతనిలో ఉన్న అపరాధభావము, పాపభీతి తొలగిపోయి దేవుని కృపను మరియు సమాధానమును పొందగలిగినాడు. యేసు యొక్క మాటలు తనలో శాశ్వతముగా నిలిచిపోయినవి అవి తన పరిచర్యకు ఒక నమూనాగా ఏర్పరచబదినవి, ఆ సమయంలో దేవుడు అననీయ అను పేరు గల వ్యక్తిని పౌలు వద్దకు పంపినాడు. అక్కడి క్రైస్తవులు పౌలు దమస్కు వరకు రాకూడదని ప్రార్థించినారు. అయితే అననియ అతనిని కలుసుకొని ప్రార్థించినప్పుడు పౌలు తిరిగి తన చూపును పొందినాడు మరియు బహిరంగముగా తన విశ్వాసాన్ని బాప్తీస్మము ద్వారా చూపించినాడు. పౌలు కొన్ని దినములు దమస్కులో సమయము గడిపి తిరిగి యేసే మెస్సియా అని సమాజ మందిరములలో బోధించినాడు. అయితే కొందరు ఇతడు కుయుక్తిగా సంఘంలో ప్రవేశించి క్రైస్తవులను కనుగొని వారిని చంపుటకు ఇదంతయు చేస్తున్నట్లు తలచినారు,

కాబట్టి పౌలు ఎక్కువ కాలము దమస్కునందు ఉండలేకపోయాడు.

## ప్రాథమిక శిక్షణ

క్రీ.శ. 35-37 కాలము వరకు మూడు సంవత్సరములు పౌలు అరేబియా ఎడారిలో సమయం గడిపినాడు. పౌలు తన ప్రాణమును రక్షించుకొనుటకు ఆ ప్రాంతమునకు పారిపోయినప్పటికీ, తాను అంగీకరించిన  నూతన విశ్వాసమును గూర్చి చాలా విషయాలు నేర్చుకున్నాడు. దేవుని మీద ఆధారపడుట నేర్చుకున్నాడు. అనేకమైన ఆధ్యాత్మిక సత్యాలు, అప్పటికే అతడు నేర్చుకున్న పాత నిబంధన విషయాలు క్రైస్తవ్యమునకు ఎలా అన్వయించవలయునో దేవుడు అతనికి బోధించినాడు. ఈ నూతన ప్రపంచము యొక్క స్థితిగతులను తన జీవితము ద్వారా చూపించుటకు సమయాన్ని తీసుకొని ఆలోచించినాడు. ఈ సమయంలో తన నూతన విశ్వాసాన్ని పంచుకొనుటకు నేర్చుకున్నాడు.  మోషేకు దేవుని ప్రత్యక్షత కలిగిన ఎడారి  ప్రాంతములోనే పౌలు కూడా తన సమయాన్ని గడిపి ఎప్పటి కప్పుడు ఆధ్యాత్మి కంగా ఎదుగగలిగినాడు. పౌలు ఆధ్యాత్మికంగా ఎదుగుటకు దేవుడు ఈసమయాన్ని వాడుకున్నాడు.

## శిష్యరికము

క్రీ.శ. 37 సంవత్సరము వేసవి కాలమునందు పౌలు దమస్కునకు తిరిగి వచ్చి యెరూషలేము వెళ్లి తిరిగి తార్సు పట్టణం చేరుకుంటాడు. అతనికి కలిగిన నూతన అనుభవమును, జ్ఞానమును ఆచరణలో ఉంచాలనే  భారము ఉండుట ద్వారా యేసుని గూర్చి బోధించుటకు తగిన సామర్ధ్యము  పొందగలిగినాడు. పౌలు యొక్క ప్రవర్తనను యెరుషలేములో ఉన్న విశ్వాసులైన యూదులు నమ్మక

పోవుట ద్వారా అక్కడ యుండుట పౌలునకు కష్టమైనది. అయితే అతని మిత్రుడైన బర్నబా అతని పక్షముగా నిలబడి అతనిని ప్రోత్సహించినాడు. సంఘములో కలిగిన హింస ఆగిపోయి శాంతి నెలకొల్పబడి సువార్త వ్యాప్తి చెందే సమయములో పౌలు తన స్వస్థలమైన తార్సు పట్టణము చేరుకున్నాడు. ఆ సమయంలో పౌలులో కలిగిన మార్పునకు అతని తండ్రి మరియు ఇతరులు ఎలా స్పందించినారో తలచుకుంటే నాకు చాలా ఆశ్చర్యము కలుగుతుంది. అయితే పౌలు వారిని చూడాలని మరియు వారిని యేసు నందలి విశ్వాసంలోనికి నడిపించాలని కోరిక కలిగి ఉన్నాడు. కాని పౌలు ఆశించినట్లుగా వారుమార్పు చెందినారో లేదో తెలియదు. కాని ఆయన సమాజమందిరపు అధికారుల చేత ఐదుమార్లు కొరడాలతో కొట్టించబడినాడని, అంత త్వరగా ఎవరు సువార్త అంగీకరించలేదని చెపుతారు. మరియు అతడుతన సొంత కుటుంబం నుండియు యూదా మతం నుండియు పూర్తిగా దూరం చేయబడినాడు.

## 3. పౌలు పరిచర్య

పౌలు క్రీ.శ 43వ సంవత్సరమునందు సిరియా మరియు కిలికియ పట్టణములకు వెళ్లి ఎక్కడ ఐదున్నర సంవత్సరాలు ఉండి పరిచర్యను జరిగించినాడు కాని అదే సమయంలో చాలా విషయాలు నేర్చుకున్నాడు. అతడు ప్రయాణాలు చేస్తూ వాక్యమును బోధించి సంఘములను స్థాపించుటకు విశ్వాసులను సిద్ధపరచినాడు. మరియు అనేక శ్రమలను సహనముతో ఓర్చుకుంటూ పరిచర్య చేసినాడు. మరియు కొన్ని పర్యాయములు ప్రాణపాయ స్థితిగతులను ఎదుర్కొని మరణం వరకు వెళ్లి తిరిగి యధావిధిగా తన పరిచర్య జరిగించినాడు (2కొరింథి 12: 1-10). పౌలు యొక్క జీవితము మరియు

హృదయము పూర్తిగా మార్చబడినది. బాహ్యారీతిగా అతడు ఒక యూదామత నాయకుడిగా ఉన్నత స్థితిలోనున్నప్పటికిని హింసింపబడి తృణీకరింపబడు క్రైస్తవునిగా అయినాడు. అయినప్పటికీ అంతరంగము లో అపరాధభావము వలన కలిగే నొప్పిగలస్థితి నుండి సంతృప్తి గల జీవితం మరియు సమాధానస్థితితో నిండిన స్థితిని పొందగలిగినాడు. పౌలు తన ప్రయాణమును ముగించుకొని చివరికి అంతియొక సంఘమునకు చేరుకున్నాడు. అప్పటికే అంతియొక పట్టణమునందు ఒక గొప్ప క్రైస్తవ సంఘం ఏర్పడినది. ఆ సంఘంలో ఉన్న విశ్వాసులు మొదట క్రైస్తవులనబడిరి. పౌలు ఆ సంఘములో ఒక తర్ఫీదు నందించగల నాయకుడుగా ఉన్నాడు. దేవుడు ఈ సంఘముచేత పౌలును అన్యజనుల మధ్య మిషనరీగా పంపుటకు సిద్ధపరుచుకున్నాడు

## మొదటి మిషనరీ ప్రయాణం

పౌలును మరియు బర్నబాను సువార్త ప్రకటన నిమిత్తము మిషనరీలుగా పంపుటకు దేవుడు అంతియొకయ సంఘమును ప్రేరేపించినాడు(అపో. 12: 1-3). క్రీ.శ. 48 ఏప్రిల్ నందు వీరు కుప్ర ప్రాంతం నుండి ఆసియా మైనర్ ప్రాంతంలో దక్షిణము వైపుగా ప్రయాణించి రెండు సంవత్సరములు యేసు గూర్చి ప్రకటించినారు (అపో 12: 1-4). వీరు మొదట యూదుల సమాజ మందిరములలో ప్రవేశించి అక్కడ వారికి వాక్యం ప్రకటించేవారు. అయితే యూదులు వారి వాక్యమును తృణీకరించినందున వారు అన్యజనులకు సువార్తను ప్రకటించునట్లు వారివైపునకు తిరిగినారు. మరియు వారు సువార్త ప్రకటించిన స్థలాలలో సంఘములను ఏర్పచి కొంతకాలము తరువాత వాటిని మరల దర్శించి వారిని ప్రోత్సాహపరిచి అక్కడ నాయకులను ఏర్పరచినారు. ఆ పిదప వారు క్రీ.శ.50 నందు అంతియొకయకు తిరిగి చేరుకొన్నారు.

## యెరుషలేము సమాలోచన సభ

అనేకమంది యూదేతరులైనవారు యేసును అంగీకరించుట ద్వారా యూదులలో ఒక వివాదము తలెత్తినది. అదేమనగా కొందరు యూదా విశ్వాసులు యేసును అంగీకరించిన యూదేతరులైన విశ్వాసులు కూడా ధర్మశాస్త్రములో ఉన్న ఆచార, నియమాలు పాటించాలని మరియు సున్నతి సంస్కారం పొందాలని వాదించినారు. అయితే పౌలు, బర్నబా మరియు మరికొందరు యూదులు, యూదే తరులైన విశ్వాసులు ఆ నియమాలు పాటించవలసిన అవసరం లేదని చెప్పినారు. ఈ విషయాలను గూర్చి నిర్ధారించుటకు క్రీ.శ. 49 నందు యెరుషలేము సభ ఏర్పాటు చేయబడినది. ఈ సభ యందు రక్షణ కేవలం విశ్వాసము వలననే తప్ప క్రియల ద్వారా కలుగునది కాదని నిర్ధారించబడినది. రక్షణ అనునది కేవలము దేవుని కృప ద్వారా మరియు యేసునందలి విశ్వాసం ద్వారా అనుగ్రహింపబడును. ఈ నిర్ణయము సంఘమునకు సరిహద్దు గుర్తుగా సిద్ధపరచబడినది. ఈ నిర్ణయము నాటి సంఘముపైన గొప్ప ప్రభావమును చూపినది.

## రెండవ మిషనరీ ప్రయాణం

పౌలు క్రీ.శ 50-53 నందు తాను స్థాపించిన సంఘములను తిరిగి దర్శించి యెరుషలేము ఆలోచన సభ యందు చేయబడిన నిర్ణయమును తెలియపరిచినాడు (అపో 16 -18), ఈ సమయంలో సీలా అతని జత పనివానిగా ఉన్నాడు మరియు తిమోతి కూడా వారితో చేరినాడు. వారు పశ్చిమ ఆసియా ప్రాంతముల దిక్కుగా ప్రయాణించి గ్రీసు చేరుకున్నారు. అక్కడి నుండి యూరప్ భూభాగములో సువార్తను ప్రకటించి సంఘములను స్థాపించినాడు. అటు పిమ్మట యెరుషలేమునకు వెళ్లి అక్కడనుండి అంతియొకయ చేరుకున్నారు.

## మూడవ మిషనరీ ప్రయాణం

పౌలు మరియు సీలా కొన్ని నెలలు అంతియొకయలో గడిపి క్రీ.శ. 53సెప్టెంబర్ నుండి 57 మే వరకు తాముస్థాపించిన సంఘమును దర్శించి, ఇంకా మరి ఇతర స్థలాలలో సంఘాలను స్థాపించినాడు (అపో 19- 20). ఈ సమయమునందు వారు యూదుల చేతను మరియు యూదేతరల చేతను హింసను ఎదుర్కొంటారు. నూతనముగాఏర్పడిన సంఘాలయందు విశ్వాసులు కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటారు. అయినను దేవుడు వారి పనిని ఆశీర్వదించినాడు. పౌలు యెరుషలేములో ఉన్న బీదలైన క్రైస్తవుల కొరకు సేకరించిన కానుకలను తీసుకొని యెరుషలేముకు తిరిగి వెళ్తాడు.

## రోమా పట్టణముకు ప్రయాణం

పౌలు చాలా కాలం వరకు రోమా గవర్నర్ ఎదుట మరియు యూదుల సన్ హిడ్రియన్ సభ ఎదుట తనపై మోపబడిన వివాదాస్పద విషయాలను గూర్చి విమర్శింపబడి, చెరసాల యందు బందీగా ఉంచబడినాడు. పౌలు రోమా చక్రవర్తి ఎదుట విమర్శింపబడి కొంతకాలం వరకు అద్దె ఇంటిలో బందీగా ఉన్నప్పుడు తిమోతికి మరియు తీతుకు పత్రికలను వ్రాసినాడు. ఆ తర్వాత క్రీ.శ. 65 నందు రోమా చక్రవర్తి నీరో చేత శిరచ్ఛేదము చేయబడివాడై హతసాక్షిగా మరణించినాడు.

## 4. పౌలు జీవితము నుండి నేర్పబడు పాఠాలు

### a). దేవుడు ఎవరినైనను వాడుకోగలడు

కొన్ని పర్యాయములు దేవుడు చేసే పనులు మనము అనుకున్నవాటికి భిన్నంగా ఉంటాయి. దేవుడు సంఘములో ఒక వ్యక్తి చేత ఇంతవరకు ఎవరిచేత చేయబడని మంచి పనులు జరిగించు కొనుటకు అప్పటివరకు సంఘమునకు హాని తలపెట్టే వ్యక్తిని ఎంచుకున్నాడు. సంఘములో చాలామంది మరణమునకు కారకుడైన వ్యక్తినే ఎంతోమంది అవిశ్వాసులను జీవములోనికి నడిపించుటకు వాడుకున్నాడు. సంఘ విధ్వంసమునకు కారకుడైన వ్యక్తి గొప్ప సంఘ స్థాపకుడుగా మార్చబడతాడు.

పౌలు యూదామత విశ్వాసముపట్ల ఆసక్తి కలిగియుండి యేసును మెస్సియ్యగా అంగీకరించిన యూదులను హింసించుటకు ఒక సమాజమందిరం నుండి మరొక సమాజమందిరము వరకు బయలువెళ్లినాడు. స్తెఫను హత్య చేయబడుటకు ఆమోదించి అందులో పాల్గొన్నాడు (అపో 7: 54- 8:1). ఆ తరువాత దమస్కు మార్గము నందు దేవుడు తన్నుతాను బయలు పరచుకొన్నప్పుడు అతని జీవితం పూర్తిగా మార్చబడినది (అపో 9: 1 -9). అప్పటివరకు సంఘమును హింసించే వ్యక్తిగా పౌలు సంఘం కొరకు హింసింపబడుటకు ఇష్టపడుతూ అక్కడనుండి ముందుకు వెళ్ళినాడు. పౌలు విశ్వాసిగా మారకముందు అతనిని ఎరిగిన వ్యక్తులు అతడు దేవుని చేత సంఘ స్థాపకుడుగా వాడబడతాడని ఊహించి ఉండలేదు. ఏ వ్యక్తి కూడా దేవునికి దూరంగా ఉండడని పౌలు రుజువు చేసినాడు.దేవుడు రక్షించి తన పనికి వాడుకొనలేనంతగా ఉండే వారు ఎవరు లేరని పౌలు ద్వార చూపబడినది.

ఒక వ్యక్తిలో ఉండే పాపక్రియలను బట్టి మరియు అతనిలో ఉండే చెడుకోరికలను బట్టి నీవు అతనిని వదలుకొనుటకు ప్రయత్నించ వచ్చును కాని దేవుడు ఎవరిని వదలడానికి ఇష్టపడడు. నీవు గత కాలములో చేసిన పాపములను బట్టి ఆయనను సేవించగలిగే అర్హతలు కోల్పోయానని అనుకోవచ్చు కాని దేవుడు అలా అనుకొనడు. దేవుడు ఎవరిని ఎంతమాత్రం విడిచిపెట్టడు, వాస్తవముగా ఎవరైతే దేవుని సేవించుటకు అర్హులు కారని అనుకుంటారో వారినే దేవుడు వాడుకుంటాడు. ఎందుకనగా దేవుడు ఆ వ్యక్తి ద్వారా మహిమ పరచబడాలని ఉద్దేశించినాడు. దేవుడు రెండవ అవకాశము అనుగ్రహించువాడు. ఆయన ఎన్నో పర్యాయములు రెండవ అవకాశ ములను ఇచ్చేవాడు. ఆయన అలాంటి స్వభావాన్ని కలిగి ఉన్నాడు. ఆయన కృప అంత సమృద్ధిగా అన్ని పరిస్థితులలో అనుగ్రహింప బడుతుంది (2 కొరింథి 12:9).

దేవుని కృప వెలుపల ఎవరూ లేరు, ఎవరు కూడా పనికిమాలిన వారుగా లేదా వ్యర్థులుగా ఉండలేదు. ఎవరు కూడా ఆయన విమోచన ప్రణాళిక వెలుపల లేరు. తరచుగా చెప్పబడునట్లు ప్రతి పరిశుద్ధుని వెనుక ఒక గతం ఉంటుంది అదే విధముగా ప్రతి పాపి ఒక భవిష్యత్తును కలిగి ఉంటాడు. కాబట్టి ప్రతి ఒక్కరి కొరకు ప్రార్థించాలి మరియు వారి పట్ల సాక్ష్యాన్ని లేవనెత్తాలి. ఎవరిని బట్టి ఆశలు వదులుకోవద్దు. నిన్ను గూర్చి నీవు కూడా ఆశలు వదలవద్దు. దేవుడు హంతకుడైన పౌలును, దావీదును మరియు యేసును ఎరుగనని బొంకిన పేతురును, పిరికివాడుగా దాగుకున్న గిద్యోనును, లేదా వేశ్య అయిన రాహాబును, పాపియైన సంసోనును వాడుకో గలిగినట్లయితే, నిన్ను, నన్ను కూడా ఆయన తన పని కొరకు వాడుకోగలడు. దేవుడు మన సామర్థ్యతవైపు చూడడం లేదు.

ఆయన ఒకరికి దానిని ఇవ్వగలడు లేదా తీసివేయగలడు. అన్నిటికంటే ముఖ్యముగా ఆయన తన పరిచర్యకు మనలను వాడుకొనుటకు మనము అందుబాటులో ఉన్నామా? లేదా అని చూస్తున్నాడు. నీవు అందుబాటులో ఉన్నావా? ఆయన నిన్ను వాడుకొనునట్లు నీవు ఇష్టపడుతున్నావా?

**పౌలు సలహా**

ఎవరైతే దేవునికి తన్నుతాను అందుబాటులో ఉంచుకోగలరో, అతనిని దేవుడు వాడుకోగలడు. నీవు కూడా అందులో చేర్చబడినావు

(ఎఫె 2:8-9). మీరు విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షించబడి ఉన్నారు. ఇది మీ వలన కలిగేది కాదు. దేవుని వరమే క్రియలవలన కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు.

దేవుని చేత వాడబడకుండా ఆయనకు దూరంగా వెళ్లిపోయిన వారితో మాట్లాడకుండా, వారి కొరకు ప్రార్థించకుండా ఉంటున్నావా? ఇప్పుడే వారి కొరకు ప్రార్థించు, నీ ప్రార్థనలో వారిని గుర్తు చేసుకొనుము, నీవునీ పాపముల ద్వార తప్పిపోయిన విషయాలను దేవుడు క్షమించాలని అనుకోకుండా వాటిలో కొనసాగినట్లయితే ఆలోచించు, ఆయన నిన్ను ఎంత మాత్రం వాడుకొనడు అలాంటి దృక్పథము పాపము అని ఒప్పుకొనుము. ఆయనను సేవించుటకు సంపూర్ణముగా నిన్ను నీవు అప్పగించుకొనుము. దేవుని నుండి తొలగిపోయిన వ్యక్తులను నీవు ఎరుగుదువా? వారిని నీవు వదులు కున్నావా? దేవుడు అలా చేయడు కాబట్టి అలాంటి వారిని తిరిగి దేవుని కొరకు గెలుచుకో గలుగునట్లు నీవు ఏమిచేయవలయునో చూపించమని దేవునిని అడుగుము.

**(b) మనము సాధించిన ఘన విజయాలు మన హద్దుల నేర్పరచవు**

యేసు తన్ను వెంబడించుటకు ఎంపిక చేసుకున్న వ్యక్తులు ఎక్కువమంది సామాన్యమైన పని చేసే వ్యక్తులే. వారిలో కొందరు జాలరులు, సామాన్య రైతులు, వడ్రంగి పని చేయువారు లేదా రోజు కూలీలు ఉన్నారు. కాని పౌలు వారికి పూర్తిగా భిన్నముగా ఉన్నాడు. అయితే ఆయన తన స్వహస్తాలతో డేరాలు తయారు చేసినాడు (అపో 18: 1-4). కాని ఆయన మంచి శిక్షణ పొందిన విద్యావంతుడు మరియు ఒక ఉన్నత స్థానమునకు చెందిన యూదుడు. ధర్మశాస్త్రమును పాటించినవాడు (ఫిలిప్పి3:4-9). ఆయన స్వభావ సిద్ధముగా తలాంతులు గల సమర్థవంతుడైన నాయకుడు. అయినప్పటికీ ఆయన ఇతరుల కంటే తన్ను ప్రత్యేకమైన వానిగా ఎంచుకోలేదు. ఆయన పత్రికల యందు తన్ను తాను క్రీస్తు యొక్క దాసుడు అని పరిచయం చేసుకొంటాడు. పౌలు రక్షించబడక ముందు తన స్థానం మరియు రక్షింపబడిన తర్వాత తన స్థితిని గూర్చి గొప్పగా చెప్పుకొనుటకు అవకాశం ఉన్నప్పటికీ పౌలు అలాగు చేయుటకు ఇష్టపడలేదు. పౌలు తాను ఏమై ఉన్నాడో అది దేవుని కృప ద్వారా కలిగినదని గుర్తించినాడు (1 కొరింథి 15: 10). అతడు ఇంకా పాపముతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పాడు (రోమా 7:15). కాని యేసు కొరకు తాను చేయవలసిన పరిచర్యలో ఓటమిని ఎదుర్కొనుటకు ఇష్టపడలేదు.తాను సాధించిన లక్ష్యాలను బట్టి ఇతరుల కంటే తాను గొప్ప అని ఆలోచించలేదు.

కాబట్టి నేటి దినములలో పౌలు మనకు మంచి మాదిరిగా ఉన్నాడు. మన ఉద్యోగములను బట్టి మనము సాధించిన విషయాలను బట్టి తరచుగా మనలను మనము నిర్ధారించుకుంటాము. చాలామంది కాపరులు మరియు మిషనరీలు సంఘములో చాలా ఆధ్యాత్మికంగా ఉంటారు అయితే వారి మధ్యకు ఇతర సంఘ కాపరులు మరియు

నాయకులు వచ్చినప్పుడు వారితో తమ్మునుతాము పోల్చుకొని గర్వపడు తుంటారు. కాని యేసు చెప్పినట్లు మనము వినయముతో దేవుని మరియు ఇతరులను సేవించుటలో విఫలము చెందుతున్నాము. అయితే పౌలు తాను సాధించిన విషయాల మీద తన స్థితి ఆధారపడదని, దేవుని కొరకు తాను చేసిన వాటిని బట్టి కాక దేవుడు తన కొరకు చేసిన కార్యమును బట్టి తన విలువ ఆధారపడి ఉంటుందని గుర్తించినాడు.

దేవుడు ఆయన కొరకు నీవు ఏదైనా మంచి కార్యము చేసినప్పుడు ఎక్కువగా ప్రేమిస్తున్నాడని లేదా ఏదైనా పాపం చేసినప్పుడు, ఓటమిపాలైనప్పుడు తక్కువగా ప్రేమిస్తున్నాడని తలంచు చున్నావా? గుర్తుంచుకోండి దేవుడు మనకు ఏదైనా ఇప్పుడు చేయాలంటే, మనలను ఆయన ప్రేమించాలంటే మనము ఆయన కొరకు ఏమి చేయాల్సిన అవసరం లేదు. మన యొక్క విలువ మనము ఏమి చేసినాము అను దాని మీద కాక మనము ఏమై ఉన్నామో అను దాని మీద ఆధారపడి ఉంటుంది. మనము రక్తము చేత కొనబడిన దేవుని పిల్లలము, క్షమింపబడి నిత్యత్వములో ఆయనతో ఉండుటకు నిర్ధారింపబడినవారము. ఈ దేవుని సంకల్పమునకు ఏమి కలపలేము లేదా దాని నుండి ఏమియు తీసివేయలేము.

## పౌలు సలహా

మనమెవరమై యున్నామో దానిని బట్టి దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు. కాని మనము ఏమి చేసినాము అను దానిని బట్టికాదు. ఆయన ప్రేమను పొందుటకు ఏదైనా కృషి చేయాలని కాదు ఇప్పటికే ఆయన ప్రేమను కలిగి ఉన్నాము.

ఇదివరకే నేను గెలిచితినని అయినను ఇదివరకే సంపూర్ణ సిద్ధిపొందితినని యైనను నేను అనుకొనుటలేదు కాని నేను దేని నిమిత్తము క్రీస్తు యేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొనివలెనని పరిగెత్తుచున్నాను (ఫిలి 3: 12). అయినను నేను ఏమై ఉన్నాను అది దేవుని కృపవలనే అయి ఉన్నాను. వారందరికంటే నేను ఎక్కువగా ప్రయాసపడితిని, ప్రయాసపడినది నేను కాను నాకు తోడైయున్న దేవుని కృపయే (1 కొరింథి 15: 10).

ఇతరులు ఏమి చేసినారు అని అంచన వేయుట ద్వారా నీలో అపరాధభావం కలిగి ఉన్నావా? సంఘ కార్యక్రమములలో చురుకుగా ఉంటూ విజయవంతంగా పని చేయనివారిని సమర్థులుగా నిర్ణయిస్తున్నావా? నిన్ను నీవు ఒక వ్యక్తిగా ఏమై ఉన్నావో దాన్నిబట్టి కాక నీవు క్రైస్తవుడవైనందున నీవు చేసే పనులను నిర్ధారిస్తున్నావా?

## (c). సంతుష్టి సహితమైన జీవిత ప్రాముఖ్యత

సమాజములో నాయకుడిగా బాగా ప్రాచుర్యం పొందిన వ్యక్తిగా ఉన్నతమైన గౌరవం పొంది, మంచి స్థితిలో ఉన్న వ్యక్తి, రాళ్లతో కొట్టబడి, ఈడ్వబడి, చెరసాలలో వేయబడుటకు ఊహించుము? జీవితములో ఇలాంటిమార్పును అంగీకరించి బాగా ఎలా ఉండగలవు? అయినను పౌలు అలాంటి పరిస్థితుల్లో కూడా సంతృప్తిగా ఉండగలిగినాడు. అతడు పట్టణములో ప్రవేశించినప్పుడు ఒక ధనవంతుని భవనము లోనికి ఆహ్వానింపబడేవాడు. కొన్నిసార్లు ఒక బీదవాని చిన్న గుడిసెలో కూడా నివసించినాడు. అన్ని పరిస్థితులలో అతడు సంతృప్తిగా ఉండగలిగినాడు. ఎందుకనగా ఆ పరిస్థితులు దేవుని వలన కలిగినవని నమ్మినాడు. “సంతృప్తి కలిగి ఉండ నేర్చుకుని ఉన్నాను” అను పౌలు మాటలను గమనించుము (ఫిలి 4: 11-13). సంతృప్తి కలిగి ఉండుట తప్పక నేర్చుకునేది.

అది స్వాభావికముగా రాదు. తనకు అవసరమో అది వెంటనే దొరకదనుకునే చిన్న బాలికలో సంతృప్తిని  నీవు చూశావా? దీనికి సమాధానం లేదనే చెప్పాలి. ఈ పరిస్థితుల నుండి ఆ బాలిక ఎప్పుడు బయటకు వస్తుంది? ఆలాగుననే మనమందరము స్వార్థకేంద్రితమైన వారము. మన గురించి మనము ఆలోచిస్తాము మరియు మనము ఆశించిన వాటిని పొందుకోవాలని కోరుకుంటాము. అసంతృప్తి మన జీవిత కాలమంతా ఏదో ఒకటి సాధించాలని పోరాడుతుంది. సంతృప్తి కలిగి ఉండుటకు తప్పక నేర్చుకోవాలి. కాని అది అంత సులభమైనది కాదు. దేవునియందు నమ్మిక ఉంచి, ఆయన అనుగ్రహించు దానితో సర్దుబాటు చేసుకునే వైఖరి కలిగి ఉండుట ద్వారా సంతృప్తిగల జీవితము ఉంటుంది. దేవుడు తన అవసరతలన్నింటిని తీర్చగలడని పౌలు తెలుసుకున్నాడు (ఫిలి 4:19).

మనము ఎప్పుడైతే దేవుని కొరకు జీవించాలని, ఆయనను సేవించాలని కోరుకుంటామో అప్పుడు మనకు ఏది మంచిదో అది ఆయన ఎరుగుననియు, మన జీవితములో సంభవించినవి ఆయన నుండి కలిగినవనినమ్ముతాము. దేవుడు మనలను తన మహిమ కొరకు వాడుకోవాలని ఎప్పుడు కోరుకుంటామో అప్పుడు మనపై మనకు గల హక్కులను విడిచిపెట్టి ఆయన కోరినట్లుగా వాడబడుటకు  సిద్ధపరచు కుంటాము. ప్రభువు ప్రార్థన యందు "నీ చిత్తం నెరవేర్చును గాక"! నీ రాజ్యం వచ్చును గాక! అని ప్రార్థిస్తాము. సంతృప్తి కలిగియుందుట అనగా దేవుని పరిపూర్ణమైన  ప్రణాళిక నెరవేరుటకు ఇష్టపడుట, మనకు సంభవించు వాటన్నిటిని అంగీకరించుట. అనగా దీని అర్థం పరిస్థితులు ప్రతికూలముగా ఉన్నప్పటికీ నమ్మకముతో ఆయనను సేవించుట.

కష్టములను మరియు బాధలను ఓర్చుకొనుట చాలా కష్టము. మంచి వైఖరితో వీటిని ఎదుర్కొనుట ఇంకా ఎంతో కష్టం. సంతృప్తి

కలిగి ఉండుట కూడా ఇలాంటిదే. మనము ఎదుర్కొనే పరిస్థితులు ఎలా ఉన్నను అవి దేవుని నుండి కలిగినవని అంగీకరించుట అవసరము, దీనిని చేయుటకు పౌలు నేర్చుకొనినాడు. మనము కూడా అలాగున నేర్చుకోనవలయును.

**పౌలు సలహా**

నీ జీవితముతో సంతృప్తిగా ఉండుము. ఈలాగు ఉండకపోతే దేవుని పరిపూర్ణమైన ప్రణాళికను నమ్మలేవు.

నాకు కొదవ కలిగినందున నేనీలాగు చెప్పటలేదు నేనే స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి ఉండ నేర్చుకొని ఉన్నాను. దీన స్థితిలో ఉండ నేనెరుగుదును (ఫిలి 4: 11- 13), సంపన్న స్థితిలో ఉండ నేనెరుగుదును. ప్రతి విషయములోనూ అన్ని కార్యములలోను కడుపు నిండి యుండుటకును ఆకలిగాను ఉండుటకు సమృద్ధి కలిగి ఉండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకుని ఉన్నాను. కొలబద్దపై గల 1 నుండి 10 అంకెలలో నీవు ఎంతవరకు సంతృప్తి కలిగి ఉన్నావని చెప్పగలవు? దేవుడు నీకు ఎంత రేటింగ్ ఇవ్వగలడు? బాగా కష్టంలో ఉన్నప్పుడు సంతృప్తిగా ఉన్నావా?ఎందుకు? నీ వైఖరిలో ఎలాంటి సర్దు బాట్లు తప్పక రావాలి?

**d. పౌలు మనుష్యులను కాక దేవుని సంతోషపెట్టునట్లు జీవించినాడు**

క్రైస్తవులముగా సువార్త నిమిత్తము అనేక పర్యాయములు వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాము. దానికి గల కారణము మన విశ్వాస విషయములో రాజీ పడలేకపోవడం. దేవుని వాక్యములోని సత్యములను ప్రకటించినప్పుడు ప్రజలు దానిని స్వీకరించకపోవడం మరియు దానినిప్రకటించుట ద్వారా మనము ఏ మాత్రము

ప్రసిద్ధులము కాకపోవటమును బట్టి దాని కొరకు నిలబడుట మనకు కష్టముగా ఉంటుంది. పౌలుకు కూడా ఇది కష్టమైనప్పటికి అతడు సువార్తను ప్రకటించినాడు (గలతీ 1:10). అతడు సత్యమునకు రంగులు వేసి ప్రకటించలేదు. అయినను ప్రజలు దానిని అంగీక రించినారు. అతనిని గూర్చి ప్రజలు ఏమనుకుంటున్నారో అని అతడు భయపడలేదు. అతని గూర్చి దేవుడే మనుకుంటాడో అనే అతడు ఆలోచించివాడు.

ప్రతి ఒక్కరూ తనను ఇష్టపడాలని పౌలు కోరుకునేవాడు కాని అలా ఎప్పుడూ జరగదని అతడు తెలుసుకున్నాడు (మత్త 5: 11-12) వాస్తవముగా ప్రతి ఒక్కరూ తనతో ఏకీభవించినట్లయితే అతనిలో ఏదో తప్పిదం ఉండాలి, అతడు దేవుని సత్యము పక్షముగా నిలబడేవాడుగా ఉండలేడు (లూకా 6: 26).

నేటి దినములలో క్రైస్తవులుగా ఉండుటకు ప్రయత్నిస్తున్నారు కాని ప్రజలను నొప్పించే మాటలు చెప్పుటలేదు, ఎందుకంటే వారు విమర్శలు మరియు తిరస్కారమును కోరుకొనుటలేదు. మన గురించి ఇతరులు ఏమి చెబుతున్నారో లేదా ఆలోచిస్తున్నారో అలాగున ఉండటం చాలా సులభం. ఇతరులకు భయపడుట గొప్ప సమస్యగా మారుతుంది. మనము మనుష్యులకు మరియు దేవునికి భయపడలేము కాని ఎవరికో ఒకరికి భయపడగలము.

మన చుట్టూ ఉన్న అనేక మందిని చూచినట్లయితే వారు ప్రతి ఒక్కరి చేత ఆదరణ పొందాలని ఆకర్షితులు కావాలని ప్రయత్నిస్తుంటా రు. యేసును విడిచిపెట్టి ప్రజాదరణ పొందుటకు ప్రయత్నిస్తున్నావా? నీవు ఆయన సత్యమై యున్నాడని నమ్మినట్లయితే ఆ సత్యమును ఇతరులతో పంచుకోవడం అవసరము. ఇతరుల యొక్క సమస్యలకు పరిష్కారము ఇవ్వడం నిలిపి వేసినట్లయితే అది ఒక శాస్త్రవేత్త తనను ప్రజలు హేళన చేస్తున్నారని క్యాన్సర్ వ్యాధిని బాగు చేయకుండా నిలిపి

వేసినట్లు అవుతుంది. ప్రతి ఒక్కరి అవసరత తీర్చుటకు సమాధానము మన దగ్గర ఉంది. దానిని మన యొద్దనే ఉంచుకోవద్దు. ఇతరులు ఎలా స్పందిస్తారోనని భయపడవద్దు. పౌలు వలే మనుష్యులను కాక దేవుని సంతోషపెట్టుము.

### పౌలు సలహా

ఇతరులు ఏమి అనుకున్నప్పటికి పూర్తిగా దేవుని సేవించుము నేను మనుష్యుల దయను సంపాదించుకొన దలచుచున్నానా? దేవుని దయను సంపాదించుకొన చూచుచున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్టగోరుచున్నానా? నేనిప్పటికీని మనుష్యులను సంతోషపెట్టు వాడనైతే క్రీస్తుదాసుడను కాకయేపోవుదును (గలతీ 1:10).
లూకా 6:26 నందు చెప్పబడినట్లు మనుష్యులందరూ మిమ్మును కొనియాడునప్పుడు మీకు శ్రమబీ వారి పితరులు అబద్ధ ప్రవక్తలకు అదే విధంగా చేసిరి.

నీవు ఎవరిని సంతోష పెట్టుటకు జీవిస్తున్నావు? ఎవరి అభిప్రాయమును ఎక్కువగా తెలుసుకోవాలనుకొంటున్నావు ప్రజలదా? లేదా దేవునిదా? శోధనను ఎదుర్కొంటున్నప్పుడు దానిని ఎదిరించుటకు దేవుని వాక్యసత్యము కొరకు నిలవబడుచున్నావా? ఎందుకు?ఈలాంటి అవసరతను ఎదుర్కొనుటకు ధైర్యాన్ని ఇమ్మని దేవున్ని అడుగు.

## 5. ఓడ మునిగిపోవు సమయమున పౌలు నాయకత్వ లక్షణముల నుండి నేర్పబడు పాఠాలు (అ.కా. 27: 1, 28:10)

సంఘ చరిత్రలోని గొప్ప నాయకులలో పౌలు కూడా ఒకడు. సంఘములను స్థాపించుటకు మరియు బైబిల్ నందు ఇతరుల కంటే ఎక్కువ పుస్తకములను వ్రాయుటకు దేవుడు అతనిని వాడుకున్నాడు.

పౌలు జీవితము నుండి గొప్ప అద్భుతమైన నాయకత్వపు పాఠములు మనము సేకరించగలము. కాని అపోస్తలుల కార్యములు చివరి అధ్యాయముల నుండి పౌలు ప్రసంగము, ఓడ తుఫాను వల్ల మునిగిపోయిన సంఘటన యందు ఆయన నిర్వహించిన నాయకత్వ స్థితిని చూడగలము.

పౌలు దమస్కు మార్గము నందు మార్పు చెందినాడు (అపో 9). ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకొని బలపడుటకు అరేబియా ప్రాంతమునకు వెళ్ళినాడు. మూడు మిషనరీ ప్రయాణముల ద్వారా సంఘములను స్థాపించుటకు మరియు సంఘములకు పత్రికలు వ్రాయుటలో తన పరిచర్యను జరిగించినాడు (అపో 13-20).

తన పరిచర్యలో 30 సంవత్సరాల అనంతరం యెరుషలేమునందు ఖైదిగా అరెస్టు చేయబడినాడు, ఆ పిదప తన మీద మోపబడిన నేరారోపణలను విచారణ నిమిత్తమై రోమునకు పంపబడినాడు (అపో 21 :26). తన ప్రయాణములో సంకెళ్లతో బంధింపబడిన ఖైదీగా ఉన్నాడు. ఈ ప్రయాణమునందు పౌలు ఎన్నో విధాలుగా తనలోని నాయకత్వ నైపుణ్యతలను ప్రదర్శించినాడు. వాటి యందలి కొన్ని ప్రాముఖ్యమైన పాఠాలు తెలుసుకొందాం.

## a. దైవభక్తి గల నాయకుడు నమ్మబడగలడు

రోమా చక్రవర్తి కైసరు ద్వారా నియమింపబడిన శతాధిపతి యూలి అధికారి చేత పౌలు ఖైదిగా చేయబడి రోమునకు తీసుకొని పోబడినాడు (అపో 27: 1). పౌలు సంకెళ్లతో ఉన్నాడు. పౌలు యొక్క విశ్వాసనీయ స్నేహితుడు లూకా కూడా తన స్వంత వ్యయముతో పౌలుతో ప్రయాణించినాడు. పౌలుతో కలిసి సహ ప్రయాణికునిగా

ఉండుటకు అతడు పౌలు యొక్క దాసునిగా పత్రికలపై సంతకం చేసినాడు. ఎందుకనగా అతడు పౌలుతో వెళ్ళుటకు అది ఒకటే మార్గము. వైద్యుడిగా లూకా తనతో కలిసి ప్రయాణం చేయకపోతే అవసరము బట్టి వైద్య సేవలు మరియు సహాయము అందించకపోతే పౌలుకు అది చాల కష్టముగా ఉంటుంది. నేను కూడా నా జీవితంలో ఎంతో మంది ద్వారా ఆశీర్వదించబడినాను. భారతదేశంలో వివిధ సమావేశాలు నిర్వహించుటలో మరియు పుస్తకములు ముద్రించుటలో P.K. మోజెస్ గారు కూడా ఒకరు, అతడు మంచి దైవజనుడు మరియు గొప్ప దేవుని సేవకుడు నేను అన్ని పనులు చేయుటకు సాధ్యమయ్యే విధముగా సహాయము చేసినవాడు.

ఓడ మొదటిసారి రేవులో ఆగినప్పుడు పౌలు సహాయము పొందునట్లు తన స్నేహితుల యొద్దకు వెళ్ళుటకు అనుమతి ఇచ్చినాడు. అయితే ఖైదీలలో ఎవరైనా పారిపోయినట్లయితే అతనికి మరణశిక్ష విధించబడుతుంది. అయితే యూలి పౌలును నమ్మినాడు. కొత్తగా పరిచయమైన వ్యక్తి పౌలును  ఎలా నమ్మి ఉండవచ్చును.పౌలు చేత మార్పు పొందిన వారందరి విషయంలో పౌలు శ్రద్ధ తీసుకొని వారికి చేయదగిన మంచిని చేస్తున్నాడు (మత్త 20: 25-28). పౌలు తనతో ఉన్న ప్రజల విషయమై ఎలాంటి తారతమ్యము లేకుండా స్త్రీ మరియు పురుషుడు, స్వతంత్రుడు, బానిస, పెద్దలు మరియు పిల్లలు అను భేదము లేకుండా అందరిని సమానముగా సేవించినాడు. పౌలు ఇతరులకు సేవ చేసినాడు గాని ఇతరులు తనకు సేవ చేయాలని ఆశించలేదు. నేటి దినములలో ఇది ఎంతో వాస్తవము ఎవరైనను మన మాటను నమ్మినట్లయితే మనమును వారికి సరియైనవి చేయ వలయును. ఒక దైవభక్తి గల నాయకుడు నమ్మబడాలి.

**పౌలు సలహా**

ఇతరులు నిన్ను నమ్మగలిగే వానిగా ఉండుము.

ప్రజలు నిన్నునమ్ముతున్నారా? నిన్ను బాగా ఎరుగని వ్యక్తులు మధ్య కూడా నీకు ఖ్యాతి ఉందా? వారు నీ మాటలను బట్టి గౌరవం ఇవ్వగలరా? నీవు పని చేయు ప్రాంతంలో నీకు తెలిసిన వారి అవసరతలు తెలుసుకొని నీవు సహాయపడుతున్నావా? వారి సామాజిక స్థితిగతులను బట్టిగాక అందరి పట్ల సమాన వైఖరి కలిగి యుంటున్నావా?

## b. దైవభక్తి గల నాయకుడు చొరవ తీసుకుంటాడు

పౌలు మరియు లూకా కొన్ని దినములు ప్రయాణించి మరొక్క రేవుకు చేరుకున్నారు. అక్కడ ఈజిప్ట నుండి రోమాకు వెళ్ళుచున్న ఓఅతి పెద్ద ఓడలోనికి శతాధిపతి వారిని ఎక్కించినాడు. ఆ ఓడయందు 276 మంది ప్రయాణికులు ఉన్నారు. వారు ప్రయాణి స్తున్న క్రొత్త ఓడకు గాలి ఎదురైనందున అతి కష్టం మీద వారు క్రేతు ప్రాంతమునకు చేరుకున్నారు (అపో 27:99). బలమైన గాలి మరియు తుఫాను కారణం చేత ఓడ ప్రయాణించుట చాలా కష్టతరమైనది. పౌలు ఖైదిగాఉన్నప్పటికీని ఓడ ముందుకు తీసుకొని పోయినట్లయితే ప్రమాదం అనిఓడ నాయకులను హెచ్చరించినాడు.

ఇలాంటి పరిస్థితులలో అది పౌలు మాట్లాడే స్థలం కాదు. ఓడ నాయకుడు మరియు ఓడ అధికారి  ఉన్నాడు. చివరిగా వారి నిర్ణయము  చెప్పారు, గాని  పౌలు ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. అలా చేయుట అనునది ధైర్యముతో కూడిన విషయము. పౌలు ఏమి చేయవలసిన  అవసరత ఉందో దానిని అతడు పంచుకోవాలి అనే బలమైన ఒప్పింపు కలిగి ఉంటాడు. అతడు సున్నితమైన స్వభావము

మర్యాదగల వ్యక్తిత్వము గలవాడు. కాని అతనిని ఒక నాయకుని స్థానములో ఉంచుకొంటాడు. అతడు ఇతరులను విమర్శించుట గాని లేదా కించపరచడం గాని చేయడం అతడు తన ఇష్టాన్ని బలవంతంగా చేయడానికి తన కోపాన్ని ఉపయోగించలేదు. అతడు ఏది అనుకుంటాడో దాన్ని చేస్తాడు. అవసరమయ్యే సమయములో నాయకత్వపు పాత్రను పోషిస్తాడు.

కాపరులు నాయకులుగా ఉండుటకు దేవుడు ఎదురు చూస్తున్నాడు (1 పేతు 5:1-4). కొందరికి ఇది సులభమై ఉండవచ్చు గాని ఇతరులకు ఇది చాలా కష్టము. ఒక నాయకుడుగా ఉండటం అనేది పేతురుకు స్వభావికముగా ఉన్న లక్షణము. అతడు మనుష్యుల చుట్టూఉండుటకు ఇష్టపడతాడు. కాని అతడు యేసునొద్ద నేర్చుకొనిన తర్వాత దైవభక్తి గల నాయకుడిగా మారినాడు. కాని పిరికి వారుగా సిగ్గుపడే మనస్తత్వం కలిగి ఇతరుల ఎదుట తమ నిర్ణయాలను చెప్పుటకు సంకోచించే వ్యక్తులు నాయకులుగా ఉండటం కష్టం. నేను ఆ కోవకుచెందినవాన్ని. ఇది ఆయా సమయములలో చొరవ తీసుకొని నడిపించుటకు కష్టంగా ఉంటుంది. కాబట్టి ఒక విషయాన్ని గూర్చి ఎక్కువ మంది ఎటువైపు చెప్తారో దాన్ని నేను అనుసరించమని చెప్తాను కాని అది సరైనది కాదని నాకు తెలుసు. అయినప్పటికీ దేవుడు నాకు ప్రజలపై నాయకత్వం వహించినట్లు మరియు పరిచర్య చేయునట్లు బాధ్యత ఇచ్చాడు. నేను వారిని నడిపించుటకు దేవుడు నాకు నడిపింపు ఇస్తాడు దేవుడు మనలను ఏమి  చెయ్యాలని కోరుకుంటున్నాడో అది వాస్తవమైనది, నేను దానిని అనుసరిస్తాను. ప్రత్యేకంగా కొన్నిసార్లు నా నాయకత్వమును కొందరు విమర్శించి, ఎదిరించినప్పుడు దానిని తట్టు కోవటం చాలా కష్టం. కాని నాయకుడిగా ఉండుట అనేది, ప్రజా

ధారణ పొందుట లేదా అందరిచేత ఇష్టపడే విధముగా జీవించేది కాదు ఇది ప్రజలను మెప్పించేది కాదు కాని దేవుని సంతోష పెట్టేది. పౌలు అదేవిధముగా చేశాడు. మనము కూడా అలాగే చేయాలి. ఏదైనా అవసరత ఎదుర్కొన్నప్పుడు నాయకుడు తప్పక దాని కొరకు నిలబడి వారిని నడిపించాలి.

### పౌలు సలహా

అవసరమైనప్పుడు ప్రజలను నడిపించుటకు చొరవ తీసుకొనుము.

పరిస్థితులను నడిపించుట అనునది నీకు కష్టమా లేదా సులభమా? ఒకవేళ అది సులభమనిపిస్తే అది నిజంగా దేవుడు కోరేదే చేస్తున్నావా లేదా నీ ఇష్టమైనది చేస్తున్నావా? ఒకవేళ అది కష్టతరమైన దైతే నీ భయమును జయించి దేవుడు ఆశించిన దాని కొరకు నిలబడుటకు ఏం చేస్తున్నావు? నీవు చొరవ తీసుకొని దేవుడు ఆశించినట్లు చేయగలిగే సమయము కొరకు ఆలోచించుము. అది ఎలా మన నుండి తొలగిపోతుంది? నువ్వు చొరవ తీసుకకోకుండా చిరాకుపడే సమయము గురించి ఆలోచించుము.

## c. దైవభక్తి గల నాయకుడు కష్టములలో దృఢముగా ఉంటాడు

ఇలాంటి పరిస్థితులలో ప్రయాణించటం క్షేమము కాదని పౌలు తలచినప్పటికీ ఓడ నాయకుడు మరియు ఓడ యజమాని ప్రయాణించుటకు నిర్ణయించుకున్నారు. వారు శీతాకాలము అనుకూల స్థలము చేరుకొనుటకు 40 మైళ్ళ దూరం ఉంది అయినను వారు ప్రయాణము ప్రారంభించిన కొంత సమయమునకే వాతావరణము పూర్తిగా మారిపోయినది. వారు తుఫానులో చిక్కుకున్నారు

(అపో 27: 14 –15) వారు తమ వస్తువులను పడవేసి ఓడను మునిగిపోకుండా ఉంచుటకు ప్రయత్నించినారు (అపో 27: 16– 19) అయినప్పటికీ తుఫాను చాలా దినములు కొనసాగినది ప్రతి ఒక్కరూ ఓడను తేలిక చేయుటకు ప్రయత్నించినారు. కాని అది సాధ్యం కాలేదు భోజనము చేయుటకు గాని, నిద్రపోవుటకు కూడా వీలు లేదు ఏ క్షణములోనైనా ఓడ బ్రద్దలై వారు మునిగిపోయే పరిస్థితుల్లో ఉన్నారు. శారీరకమైన, మానసికమైన ఒత్తిడికి లోనైనారు చాలా దినములైన తరువాత వారు జీవించగలమన్న ఆశలు కూడా కోల్పోయినారు.

ఇలాంటి పరిస్థితులలో పౌలు పోషించిన నాయకత్వ ప్రతిభ కనబడుతుంది. అతడు వారిమధ్యలో మొదట నిలువబడి వారు ఆయన మాటలు వినినట్లయితే ఇలా సంభవించేది కాదని జ్ఞాపకం చేసినాడు. దాన్నిబట్టి వారు తప్పు చేసినారా, తాను సరియైనది చేశానా అని వారిని నిందించుటలేదు కాని వారు తాను చెప్పిన దాని విషయమై ఆలోచించాలి అని చెప్పుతున్నాడు. అయితే పౌలు వారు ఆందోళనలో ఉన్నప్పుడు వారికి ఏమి జరగదని, దేవుడు ఆ నిశ్చయతను తనకు ఇచ్చినాడని చెప్పినాడు (అపో 27 :22– 24 ). దేవుడు తనతో చెప్పిన దానిని పౌలు నమ్మి దానిని నిరభ్యంతరముగా ఇతరులతో పంచుకునేవాడు.

ఇతరులు తనను అనుసరించాలనే పౌలు ఎదురుచూడక వారు దేవుని నమ్మి ఆయనను వెంబడించాలని చూచేనాడు.

దీనిని బట్టి మనము పౌలు చూపిన మాదిరిని అనుసరించ వలెను. కష్టమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు మనము ఒక అడుగు ముందుకు వేసి ఇతరులు మనలను అనుసరించునట్లు నాయకునిగా ఉండాలి. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబము కష్టముల గుండా వెళుతున్నప్పుడు వారికి ప్రేమతో నడిపింపును సహాయమును ఇవ్వవలయును. ఒకవేళ మీ సంఘము హింసను, శ్రమలను

ఎదుర్కొంటున్నప్పుడు మనము నిలబడి దేవుడు నీకిచ్చే నిర్దేశములను బట్టి వారిని నడిపించాలి. కాపరి ఒక నాయకుడు అతడు
కష్ట సమయములో యందు నాయకత్వమును అందించవలెను.

**పౌలు సలహా**

కష్ట సమయమునందు ధైర్యం గలనాయకునిగా నిలువబడుము కష్ట సమయముల యందు దేవుని సత్యమును ప్రకటించుటకు సామర్థ్యత కలిగి ఉన్నావా? దేవుని వెంబడించమని ఆయన వాక్యము నందువాగ్దానములయందు నమ్మిక ఉంచుమని ప్రజలకు పిలుపునిస్తున్నావా?ఆహ్వానిస్తున్నావా? దేవుని నడిపింపు నీకును నీ పరిచర్యకును ఉన్నదనేవివేకము కలిగి యుండి, దానిని ఇతరులకు అందించుటకు ప్రయత్నిస్తున్నావా? ఇలా చేయుట ద్వారా ఎంత క్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పటికీ దానికి కట్టుబడి స్థిరముగా ఉండగలవు (మత్తయి 7:28 -29)

## d. దైవభక్తి గల నాయకుడు ఇతరులను ప్రోత్సాహపరచును

దైవభక్తిగల నాయకుడు ప్రజలను ఎల్లప్పుడూ ప్రోత్సహించుటకు ప్రయత్నిస్తాడు. మరియు వారిని నడిపిస్తూ వారిని స్థిరపరుస్తాడు. వారిని విమర్శించుట లేదా భయపెట్టుట మరియు వారితో కోపముగా ప్రవర్తించుట చేయడు. ప్రతి ఒక్కరు విమర్శించు టకు బదులు ప్రోత్సాహపరచుటకు స్పందించవలెను. దేవుడు కూడా మన పట్ల ఎలా వ్యవహరిస్తున్నాడో అలాగే మనము ఇతరులతో వ్యవహరించవలయును. ఓడలో ఉన్నవారు తన సలహాను త్రోసివేసి నప్పటికీ పౌలు వారిని ప్రోత్సహించుటకు ఇష్టపడినాడు. దేవునియందు తనకు గల నమ్మకమును బట్టి పౌలు వారిని ప్రోత్సహించాడు

(అపో. 27:25-26). దీని ద్వార పరిస్థితులను బట్టి భయపడక దేవుని యందు ఆయన వాగ్దానములయందు విశ్వసించేవాడుగా పౌలు ఒక మాదిరి కనపరిచినాడు.

ప్రమాదకర పరిస్థితుల నుండి తప్పింపబడగలము అను నిరీక్షణను పౌలు ప్రజలకు ఇచ్చాడు. ప్రస్తుత పరిస్థితులకు అవతల దేవుడు ఏ వాగ్దానం చేసినాడో దానిని అతడు చూచినాడు. అతడు ప్రజలతో చాలా స్పష్టంగాను, యదార్ధముగాను ఉన్నాడు. కాబట్టి ప్రజలు అతనినినమ్మినారు. దాని అర్థము పౌలు ప్రజలను ఎప్పుడును సరిచేయలేదని వారి తప్పులను ఎప్పుడు ఎత్తిచూపలేదని కాదు గాని అతడు ప్రేమతో,సత్యమును మాట్లాడుట ద్వారా దానిని చేసినాడు (ఎఫె4:15). యేసుకూడా తప్పిదము చేసిన వ్యక్తి యొద్దకు అతడు ఒంటరిగా ఉన్నప్పుడు వెళ్లి దానిని సరిచేయాలి, అతడు పశ్చాతాప పడటకు తిరస్కరిస్తే మాత్రమే బహిరంగంగా దానిని గూర్చి మాట్లాడాలి

అయినప్పటికీ దీనంతటి యొక్క ఉద్దేశము ఆ వ్యక్తిని తిరిగి పునఃస్థితి లోనికి తేవటమే తప్ప ఖండించుటకు కాదు. దేవుడు కూడా మన పట్ల దానిని చేసినాడు (రోమా 8:1).

మన ప్రజలను ప్రోత్సహించుటకు వారి జీవితాలను నిర్మించుటకు మనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. మరి మంచిని గూర్చి ఎల్లప్పుడు మాట్లాడాలి. వారిని బట్టి గర్వపడుతున్నామని వారితో చెప్పాలి. వారి నమ్మకత్వమును బట్టి కృతజ్ఞత చెల్లించాలి. మనం మంచి క్రియలుచేయక పోయినప్పటికీ దేవుడు మనలను విమర్శించ లేదు కాని మనలను ప్రేమించి ప్రోత్సాహపరిచినాడు. మనము కూడా మన ప్రజల పట్ల తప్పక ఆలాగే చేయాలి.

**పౌలు సలహా**

ఎల్లప్పుడూ ఇతరులను ప్రోత్సహించుటకు వారి జీవితాలను నిర్మించుటకు అవకాశముల కొరకు చూస్తుండాలి.
కష్ట సమయాలలో ఉన్నప్పుడు ప్రజలు నీ యొద్దకు వస్తున్నారా? నీవు ప్రజలను ప్రోత్సహించుటలో సరియైన విధంగా ఉన్నావా? నీ సలహా తీసుకొనని వ్యక్తులకు కూడా నీవు సహాయం చేయగలుగుతున్నావా? నీవు ఇతరులను ప్రేమతో వారు ఒంటరిగా ఉన్నప్పుడు సరి చేయగలిగే సామర్థ్యము కలిగి ఉన్నావా? నీవు నీ కోపమును, అసహనమును అదుపులో ఉంచుకొనగలిగి దాని స్థానంలో దయను మరియు జాలిని కలిగి ఉండగలుగుతున్నావా?

## e. దైవభక్తి గల నాయకుడు పాపమునకు వ్యతిరేకముగా నిలుస్తాడు

బలమైన తుఫాను చేత కొట్టబడిన రెండు వారముల తర్వాత పౌలు ప్రయాణించే ఓడ చివరికి ఒడ్డునకు చేరుకున్నది (అపో. 27: 2 7-28). ఓడవారు ఉదయము వరకు ఎదురు చూడకుండా చిన్న పడవల సహాయముతో ఓడ విడిచి వెళ్ళుటకు ప్రయత్నిస్తుండగా పౌలు శతాధిపతితో వారు ఓడలో ఉంటేనే తప్ప తమ్మును తాము రక్షించు కొనలేరని చెప్పినాడు.

ఈ సమయములో శతాధిపతి పౌలు మాటను గౌరవించి నమ్మినాడు. పౌలు చెప్పినట్లు విని దాని ప్రకారముగా చేసినాడు (అపో. 27:32). వారు ఆయనను అనుసరించుటకు ఇష్టపడునట్లు పౌలు తన్నుతాను రుజువు చేసుకున్నాడు. రోమునందు క్రూరాతి క్రూరమైన హత్యకు గురి చేయబడుటకు కొనిపోబడుతున్న పౌలు అవకాశం ఉంటే తప్పించుకొనుటకు ప్రయత్నించాలి కాని దానికి

భిన్నంగా ఇతరులు తప్పించుకొని పోకుండా ఆపివేసి అందరి క్షేమమును గురించి ఆలోచించినాడు.

అతడు తన గురించి తాను ఆలోచించుకోవడం గాని, తన లాభం కొరకు చూచుకొనుట కాని చేయలేదు కాని ప్రతి ఒక్కరి క్షేమం కొరకు ఆలోచించినాడు. నావికులు పారిపోవుటకు ప్రయత్నిస్తున్నప్పుడు పౌలు వారిని ఎదుర్కొనుట చేయలేదు కాని, అతడు ఎవరి స్వాధీనంలో ఉన్నాడో ఆ అధికారికి తెలియపరిచినాడు. చాలాసార్లు ఇలాంటి సమయాలలో పరిస్థితులను మన చేతులలోకి తీసుకొని మనమే వాటిని వ్యవహరించుటకు ప్రయత్నిస్తాము కాని ప్రతి విషయాన్ని మనపై అధికారితో కలిసి పరిష్కరించుట మంచిది. అదేవిధంగా మన పరిచర్యలో, సంఘములో సంభవించిన విషయాలను కూడా ఈ పద్ధతిలోనే ఉపయోగించుట మంచిది. మనము ప్రజలను ప్రోత్సహించుట, వారి జీవితాలను పునర్నిర్మించుట చేయాలి ఇది ఎంతో వాస్తవము, అయితే వారిలో పాపం ఉన్నట్లయితే అది తప్పక చెప్పబడాలి. మనముపాపమును ఖండించాలి కాని పాపి పట్ల ప్రేమను మరియు ప్రోత్సాహంను కలిగి ఉండాలి. మనము వ్యక్తిపై ఎప్పుడు దాడి చేయవద్దు కాని పాపమును ఎత్తి చూపి దానికి పరిష్కారము చూపించాలి. పౌలు దీనినే చేసినాడు.

## పౌలు సలహా

ధైర్యముగా ఉండుము మరియు పాపమునకు వ్యతిరేకముగా నిలువబడుము.

నీవు పాపమునకు వ్యతిరేకముగా, ధైర్యముగా నిలువబడే సామర్థ్యం కలిగి ఉన్నావా? అది ఎవరి ద్వారా జరిగినప్పటికీ దానికి కారణాలు ఏమైనప్పటికీ దాన్ని వ్యతిరేకిస్తున్నావా? పాపమును నీవు

ప్రేమతో ఎత్తిచూపుతున్నావా? నేరం చేసిన వ్యక్తిని తిరిగి పునరుద్ధరించు క్రమంలో అతనితో వ్యక్తిగతముగా మొదట మాట్లాడు తున్నావా?

## f. దైవభక్తిగల నాయకుడు మంచి మాదిరి ఉంచుతాడు

పౌలు ప్రయాణిస్తున్న ఓడ తుఫాను చేత కొట్టబడి త్వరలోనే ముక్కలుగా చేయబడి మునిగిపోయే పరిస్థితుల్లో ఉన్నది. ప్రయాణికు లందరూ రేపటి పైన ఆశలు వదులుకున్నారు.

ఆ సమయములో పౌలు ప్రజలందరిని తమ్ముని తాము బలపరుచుకొనుటకు ఆహారం తీసుకోవాలని బ్రతిమిలాడినాడు. మొదట అతడు భోజనం చేసి అందరిని ప్రోత్సహించినాడు. ప్రతి ఒక్కరు ధైర్యం తెచ్చుకొనునట్లు పౌలు వారికి మాదిరిని చూపినాడు (అపో 27:35-36).

పౌలు వారిని ఏమి చేయాలో దానిని మాత్రమే చెప్పలేదు కాని వారికి మాదిరిగా ఉన్నాడు. మనము ఏమి చెప్తున్నామో దానిని మనము చేయాలి. మనము ఒకటి చెప్పి మరొకటి చేసినప్పుడు మనలను ఎరిగినవారికి మనము గొప్ప నష్టం చేసిన వారము అవుతాము. మనము స్వయం నియంత్రణ, సహనము, త్యాగము, విధేయత లేదా పరిచర్య గురించి మాట్లాడినప్పుడు అవి మన జీవితములో విశిష్ట లక్షణాలుగా ఉండుటకు మనలను బాధ్యులనుగా చేస్తాయి. మనము బోధించే దాన్నిబట్టి మనం ఇతరులను ప్రభావితులనుగా చేసే గొప్ప అవకాశం కలిగి ఉంటాము. కాని మనము బోధించేదాన్ని మనలో జరిగించినప్పుడు అది ఇతరులను మరిఎక్కువగా ప్రభావితం చేస్తుంది. పరిచర్యలో నాయకులముగా మన ప్రజలకు మరియు మన కుటుంబంలో మన పిల్లలకు మంచి మాదిరిని వారి కోసము తప్పక

ఏర్పరచాలి. మనము దేనిని చెబుతున్నామో దాన్ని చేయకపోతే వారు మనము చెప్పేదాన్ని చేస్తారని ఎదురు చూడలేము. మనం అనుకొనక పోయినప్పటికీ మనము ఎల్లప్పుడూ ఇతరుల చేత గమనించబడుతాము అవిశ్వాసుల మధ్య మంచి పేరు కలిగి ఉండాలి. మరియు విశ్వాసుల కొరకు మంచిప్రమాణములతో కూడిన స్థితిని ఏర్పరచాలి. మనము మంచి మాదిరినిచూపుట ద్వారా ఇతరులు యేసు కొరకు ఎలా జీవించాలో ఆయా పరిస్థితిలకు ఎలా స్పందించాలో చూపగలము. మనము ఏమి చెప్తున్నామోవాటి ప్రకారం చేయకపోతే మన పిల్లలు మరియు మన ప్రజలు మనము చెప్పిన వాటిని చేయాలని ఎలా ఎదురు చూడగలము.

**పౌలు సలహా**

నీవు చెప్పే వాటిని బట్టి చేసే వాటిని బట్టి యేసు కొరకు మంచి మాదిరిని ఉంచుము ఇతరులు మనలను గమనిస్తున్నారు.

నీ పిల్లల కొరకు ఎలాంటి మాదిరిని ఏర్పరచినావు? నీ పరిచర్యలోని ప్రజల గురించి ఏమిటి? నిన్ను అనుసరించుటను బట్టి వారు ఏమైనా తప్పుడు అలవాట్లు కలిగి ఉండటం నీవు గమనించావా? ఇతరుల కొరకు ఎప్పుడు మంచి మాదిరిని ఉంచియున్నావు? మరియు చెడ్డ మాదిరి ఉంచి ఉన్నావు? ఎవరి మాదిరిని గమనించి వారిని అనుసరిస్తున్నావు? ఎందుకు?

## 9. దైవభక్తి గల నాయకుడు పరిచర్య ఎప్పుడైనను చేయగలడు

పౌలు చెప్పిన ప్రకారం వారు ప్రయాణిస్తున్న ఓడ తుఫాను

చేత కృంగి పోయినది. దరికి చేరుకునేలోపు అది ఓడ అడుగు భాగము బ్రద్దలైపోయెను. కావున అందరూ ధరికి చేరుకొను ఏర్పాటు చేసినారు. ఖైదీలు పారిపోదురేమో అను అనుమానముతో సైనికులు వారిని చంపవలెనని ప్రయత్నించినారు. కాని శతాధిపతి యూలి పౌలుపై ఉన్న గౌరవమును బట్టి అతనిని రక్షింపవలెనని వారి ఆలోచనలను కొనసాగనివ్వలేదు (అపో 27:37-40). ప్రతి ఒక్కరూ కాపాడ బడినారు కాని కథ సుఖాంతము కాలేదు.

సముద్రం ఒడ్డున వారు నిప్పు రాజ పెట్టుటకు పౌలు కర్రలను ఏరి దానిపైన వేయు సమయములో వాటిలో నుండి ఒక విషసర్పము బయటకు వచ్చి అతని చేతిని చుట్టుకొనినది. అప్పుడు ప్రజలుఅతనిని నరహంతకునిగా భావించి ఈ రూపంలో అతనిని తీర్పు వెంటాడుతుందని తలంచినారు. అయితే అది పౌలునకు ఎలాంటి హాని తలపెట్టనందున ప్రజలలో అతని పట్ల మంచి భావం ఏర్పడినది.బహుశా ఈ ప్రత్యేక విధానముతో దేవుడు పౌలుతో ఉన్నాడు.

ఆ ద్వీప ముఖ్య నాయకుడు పౌలును అతని సహచరులను తన ఇంటికి ఆహ్వానించాడు. అతని తండ్రి రోగియై పడకలో ఉండగా పౌలు అతని కొరకు ప్రార్థించినప్పుడు అతడు స్వస్థత పొందినాడు. ఆ ద్వీపంలో ఉన్న ఇతర రోగులు కూడా పౌలు నొద్దకు వచ్చినప్పుడు వారి కొరకు ప్రార్థించినాడు వారును స్వస్థత పొందిరి. పౌలు వారికి పరిచర్య చేయుటకు మరియు సువార్త ప్రకటించుటకు సామర్థ్యత కలిగి యుండెను. (అపో 28:7-10).

అలసిపోయి, తుఫాను చేత తడిసిపోయి ఆకలితో ఉన్న పౌలు మరొకవైపు విష సర్పముచేత కొట్టబడిన స్థితిలో కూడా ఇతరుల అవసరతను గుర్తించి వారి కొరకు ప్రార్థించు అవకాశము కొరకు చూచినాడు. దాని ఫలితముగా ద్వీపములోనే ప్రతి ఒక్కరికి సువార్తను

ప్రకటించుటకు దేవుడు ద్వారాలు తెరిచినాడు. పౌలు జీవిత కాలము అంతటియందు దీనిని చూడగలము. అతడు ఎల్లప్పుడూ పరిచర్య చేయు అవకాశం కొరకు ఎదురుచూసేవాడు, దానిని తనకు అనుకూల ముగా మార్చుకొనేవాడు.

మనము కూడా ఎల్లప్పుడూ మాటల ద్వారా, క్రియల ద్వారా పరిచర్య చేయుటకు సిద్ధముగా ఉండాలని దేవుడు చెప్తున్నాడు (1పేతు 3:15). మన గొప్ప శ్రమలను, బాధను అనుభవించు సమయములు దేవుని పరిచర్య చేయుటకు అవకాశముగా ఉండగలవు. మనము చేయు పనులన్నింటిలో యేసుని ఎత్తిచూపుచూ మార్గము కొరకు ఎదురు చూడాలి.

## పౌలు సలహా

దేవునిని మరియు ఇతరులను సేవించు ఏ అవకాశం వచ్చినప్పటికి దాని కొరకు ఎల్లప్పుడూ ఆసక్తి కలిగి యుండుము.

ఏ పరిస్థితులలోనైనను చెడు లేదా కష్టము సంభవించిన సమయములోకూడా ఇతరులకు నీవు సేవ చేయుటకు సిద్ధంగా ఉన్నావా? నీవు పనుల ఒత్తిడిలో ఇతరులకు సహాయం చేయలేని స్థితిలో వారి పట్ల చిరాకుగా ఉంటున్నావా? ప్రతిరోజు దేవుని పరిచర్య చేయు అవకాశం కొరకు దేవుని అడుగుచున్నావా? లేదా నీవు ముందుగా ప్రణాళిక వేసుకున్న పనులలో నిమగ్నమై నీ చుట్టూ ఉన్న వారి అవసరతలను గుర్తించలేని స్థితిలో ఉన్నావా?

## B. తిమోతి

### 1. తిమోతి జీవితము - పరిచర్య

**పూర్వ రంగము:** అందరూ కాపరులు తమ వ్యక్తిత్వములో ఒకే విధంగా ఉండాలని కొందరు వ్యక్తులు అనుకొంటారు. కాపరులు స్వాభావికముగా నాయకులుగా ఉంటారని సులభముగా అందరితో స్నేహితుల వలే ఉంటారని, ఎవరితోనైనను ఏదైనా మాట్లాడగలరు అనుకుంటారు.కాని అందరు కాపరులు, నాయకులు అలాగే ఉంటారని కాదు, చాలామంది నాలాగా, దానికి భిన్నంగా ఉంటారు. నేను తిమోతి నుండి చాలా విషయాలు నేర్చుకున్నాను. నావలె తిమోతి కూడా చాలా బిడియము మరియు పిరికితనము గల వాని వలె ఉండెను.

### కుటుంబము

తిమోతి యొక్క తండ్రి గ్రీసు దేశస్థుడు. అతని యొక్క తల్లి యూనికే మరియు అతని అవ్వ అయిన లోయి దైవభక్తిగల యూదులు. వీరు తిమోతికి దేవుని వాక్యము బోధించి యూదా విశ్వాసమునందు పెంపొందింప చేసినారు (2 తిమో 1:5,3:14-17). తిమోతి అను పేరునకు "దేవుని యొక్క ఘనత". దైవభక్తి గల తండ్రి సహాయము లేకుండా ఒక దైవభక్తి గల వ్యక్తిగా ఎదుగుట తిమోతికి చాలా కష్టమైన విషయము అయినప్పటికీ లుస్త్రలో ఉన్న తిమోతి యొక్క ఇంటిలో పాత నిబంధన లేఖనము నేర్పబడినది (2తిమో 1 :3 -15).
తన బాల్య దినముల యందే యూదుల దేవుని యందు విశ్వాసము ఉంచినాడు (అపో 16:12 1 తిమో 1:5). మన పిల్లలు బాల్యములో ఉండగానే దేవుని గురించి బోధించుట చాలా అవసరం.

## రక్షణ అనుభవము

పౌలు యొక్క మొదటి మిషనరీ ప్రయాణము నందు తిమోతి యేసుని గూర్చి వినినాడు (అపొ 14:6-9). బహుశా అతని తల్లి మరియు అతని అవ్వ కూడా అదే సమయములో విశ్వాసులుగా మారి ఉండవచ్చును. పౌలు మరియు అతని సహచరులు ప్రయాణించు సమయములో తిమోతి ఇంటిలో ఉండుటకు ఆహ్వానింప బడేవారు. అప్పుడు వారితో మాట్లాడుటకు అవకాశం దొరికేది. తిమోతి యొక్క కుటుంబము కేవలము ఆతిథ్యం ఇచ్చే ఇల్లే కాకుండా పౌలు మరియు అతని స్నేహితులు ఉండే ఇల్లుగా కూడా పిలవబడినది పౌలు లుస్త్రలోరాళ్లతో కొట్టబడినప్పుడు పౌలు తిమోతి ఇంటిలోనే తిరిగి పరామర్శింపబడినాడని చెప్పగలము (అపో 14:19).

తిమోతి ఒక క్రైస్తవునిగా ఎదిగినాడు, లుస్త్రలో ఉన్న నూతన విశ్వాసుల మధ్య మంచి సాక్ష్యము కలిగి యుండగలిగినాడు. తిమోతి గ్రీకు మరియు యూదా సాంప్రదాయము ఉన్న కుటుంబంలో పెరిగినాడు కాబట్టి అతడు రెండు జాతులకు సంబంధించిన పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. కాబట్టి ఎప్పుడైతే అతడు క్రైస్తవుడుగా మారినాడో ఇద్దరికి పరిచర్య చేయగలిగే సామర్థ్యత కలిగియుండ గలిగినాడు.

## పౌలుతో గల సంబంధము

పౌలు తిమోతి యొక్క ఆధ్యాత్మిక తండ్రిగాను మరియు విశ్వాస పాత్రమైన సలహాదారుడు గాను ఉండెను (2 తిమో 1:6). తిమోతి పౌలునకు ఇంతకుముందు ఎప్పుడు లేని విధంగా

కుమారుడిగా ఉన్నాడు మరియు పౌలు తిమోతికి ఆధ్యాత్మిక తండ్రిగా కలిగి ఉండుట అవసరమై యున్నది. ఒకవ్యక్తి చేత ప్రోత్సాహము మరియు అంగీకారము పొంది మెచ్చుకోదగిన గౌరవముతో కూడిన సహాయము చేయుటకు తిమోతి ధైర్యము పొంది ఉండుటకు దేవుడు పౌలును ఏర్పరచినాడు. బాలురందరికీ అతనిని చూచి అనుసరించి నట్లు ఒక పరిపక్వమైన వ్యక్తి అవసరము. తాము పరిపక్వమైన మనుష్యులముగా మారగలము అను నిర్ధారణతో ప్రోత్సాహం పొందుటకు వారికి అవసరము.

## పౌలుతో కలిసి ప్రయాణించుట

పౌలు లుస్త్రను విడిచిన ఒక సంవత్సరము తర్వాత తన రెండవ మిషనరీ ప్రయాణమునందు తిమోతి అతనితో కలిసి పరిచర్యలో పాల్గొన్నారు. బహుశా అప్పుడు అతని వయసు 20 సంవత్సరములై ఉండవచ్చు. పౌలు 1 తిమోతి పత్రికను వ్రాసినప్పుడు అతడు 35 సంవత్సరముల గలవాడు. 2 తిమోతి పత్రికను తీసుకున్నప్పుడు 37 సంవత్సరములు.

## ఆధ్యాత్మిక వరములు

తిమోతి ఒక కాపరి మరియు సువార్తికుడు. అతడు చాలా సంఘములు స్థాపించి వాటి యొక్క అభివృద్ధి కొరకు సహాయపడినాడు అతడు జీవిత కాలమంతటి యందు నమ్మకమైన యేసు కొరకు లోతైన ఆధ్యాత్మిక అంకిత భావము గల వ్యక్తిగా ఉన్నాడు.

## వ్యక్తిత్వము

తిమోతి శారీరకముగా మరియు మానసిక భావోద్రేక

పరముగా బలహీనుడు మరియు పిరికివాడుగా ఉండెను. అతడు చాలా భయస్తుడు మరియు విమర్శ, తిరస్కారము విషయంలో చాలా సున్నితంగా స్పందించేవాడు(2 తిమో 1:6-7, 1కొరింథి 16:10-11) అతడు కేవలము సిగ్గుపడేవాడుగా మాత్రమే కాదు అతడు యౌవనస్తుడైనందున తాను నడిపించే వ్యక్తులు తనకంటే పెద్దవారై నందున అది చాలా కష్టతరమైందిగా ఉండెను (1తిమో 4:12). దీనినిబట్టి అతడు తరచు ఒత్తిడికి మరియు చింతకు లోనగుచూ కడుపు సంబంధమైన సమస్యలను ఎదుర్కొన్నాడు (1తిమో 5:23).

## పరిచర్య

తిమోతి, పౌలు మరియు సీలతో కలిసి యేసు యొక్క సువార్తను ప్రకటించినాడు. అతడు పౌలునకు నమ్మకమైన భాగస్వామి గామారినాడు. అతడు సంఘములలో సమస్యలను పరిష్కరించు వ్యక్తిగా పౌలు బృందంలో ఉన్నాడు. అతడు బెరయ నుండి థెస్సలోని కయకు పంపబడినాడు (అపో 17:14; 1 థెస్స 3:2). తర్వాత సీలతో కలిసి పౌలును కొరింథిలో కలుసుకున్నాడు (అపో 18:5; 1 థెస్స 3:6) వారితో కొంతకాలం అక్కడ ఉన్నాడు (1 థెస్స 1:1; 2థెస్స 1:1). ఆ తర్వాత కొరింథి యందు గల నమ్మకాలు, వాడుక చేసే పనులలో కొన్ని తప్పిదాలను సవరించుట కొరకు ఆ సంఘము నకు పంపబడినాడు (1 కొరింథి 4:15-16), కొరింథి సంఘంలో సమస్యలు కొనసాగుతూ ఉండగా తిమోతి మరలా అక్కడకు పంప బడినాడు (రోమా 16 :21). 2 కొరింథి1:19). పౌలు రోము నందు ఖైదుగా ఉన్నప్పుడు తిమోతి అతనితో ఉన్నాడు ( కొలస్సి 1:1; ఫిలి 1, ఫిలి 1:1). పౌలు తిమోతిని తన ప్రతినిధిగా ఫిలిప్పు సంఘమునకు పంపేవాడు (ఫిలి 2:19).

## ఎఫెసీ నందు తిమోతి

పౌలు చెరసాల నుండి బయటకు పంపబడిన తర్వాత తాను దర్శించవలసిన ప్రదేశములలో ఎఫెసీ కూడా ఉన్నది. అతడు ఎఫెసీని విడిచిన తర్వాత తిమోతిని అక్కడి బాధ్యతలు నిర్వహించుటకు ఏర్పరచినాడు. తిమోతి చాలా కాలం వరకు ఎఫెసీ సంఘం నందు ఉండి అక్కడ తప్పుడు బోధలను ఖండించి పరిస్థితులను సరిచేసినాడు. ఎఫెసీలో లోక సంబంధమైన విషయాలలో ఆసక్తి చూపే తప్పుడు బోధ కులు ఉండేవారు. వీరు తిమోతి నాయకత్వమును ఎదిరించినారు. అక్కడ అతడు ఎన్నో సమస్యలను ఎదుర్కొనుట ద్వారా నిరుత్సాహానికి లోనై అక్కడి నుండి బయటకు రావడానికి ఇష్టపడినాడు. కాబట్టి పౌలు అతనిని బలపరచుటకు 1 & 2 తిమోతి పత్రికలను వ్రాసినాడు.
1 తిమోతి పత్రికయందు అతడు ఎదుర్కొన్న సమస్యలను చూడగలము కొందరు స్త్రీలు సంఘములో అధికారము చేయుటకు ప్రయత్నించి నారు. కాబట్టి పౌలు సంఘ పరిపాలన విధానమును ప్రతిపాదించి నాడు (1తిమో 2:11-15,3:14-15). కొందరు స్త్రీలు పాపంలో జీవించినారు(4:6). తిమోతి తన యొక్క యౌవనమును బట్టి మరియు పిరికితనమును బట్టి చాలా రకములైన విమర్శలను ఎదుర్కొన్నాడు (4: 12-16). అతనిని గురించి ప్రజలు అధికారం లేని పుకార్లుచేసినారు (5:19). కొందరు ప్రజలు మధ్యలో అధికారం నిమిత్తమై ప్రయత్నించినారు (5:21-22). ఇలాంటి ప్రజల మధ్య ఉండటం ద్వారా అతడు కడుపు సంబంధమైన సమస్యలను ఎదుర్కొన్నాడంటే ఆశ్చర్యం లేదు(1 తిమో 5:23).

## ఎఫెసీ యొక్క ప్రాముఖ్యత

పౌలు రెండవసారి ఖైదుగా చేయబడినప్పుడు తిమోతి అతనిని కలుసుకున్నాడు. పౌలు మరణం తర్వాత ఎఫెసి నందు పరిచర్య కొనసాగించుటకు వెళ్ళినాడు. ఎఫెసీ సంఘం చాలా ప్రాముఖ్యమైన సంఘము. యెరుషలేము సంఘములో హింస ద్వారా క్రైస్తవులు చెదిరి పోయినప్పుడు అంతియొకయ సంఘము ప్రాముఖ్యమైన సంఘముగా ఉండెను. కొంతకాలము తర్వాత సంఘ కేంద్ర పరిపాలనా ఎఫెసీ పట్టణమునకు తరలించబడినది. చాలా సంవత్సరములైన తర్వాత రోమునకు తరలించబడింది. యేసు తల్లి అయిన మరియ అపొస్తలుడైన యోహాను ఎఫెసీలో నివసించినారు. ప్రాముఖ్యమైన సంఘ పితరులు ఇగ్నేషియస్ మరియు పాలికార్పు ఆ ప్రాంతం నుండే వచ్చినారు. ప్రాముఖ్యమైన సంఘ కౌన్సెల్ చర్చలు అక్కడ జరిగినవి. దురదృష్టవశాత్తుగా సంఘం విశ్వాసము నందు నిలిచి ఉండలేక పోయినది. సంఘము మొదటి ప్రేమను కోల్పోయినదని యేసు దానిపైన తప్పిదము మోపినాడు (ప్రక 2:1-7).

## తిమోతి మరణం

తిమోతి తన జీవితకాలమంతా నమ్మకమైన పరిచర్య చేసినాడు. క్రీ.శ. 97 నందు రోమా చక్రవర్తి డొమిషియన్ లేదా నెర్వా పరిపాలనలో హతసాక్షిగా మరణించినాడు. అతడు తనలో ఉన్న పిరికితనం మరియు భయమును జయించి విశ్వాసముతో నిలిచి యుండి మరణించినాడు.

## 2. తిమోతి నుండి నేర్పబడు పాఠాలు

### a. తిమోతి యొక్క మాదిరి

తిమోతి భయముతో, నిరుత్సాహముతో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాడు అయినను చివరి వరకు విశ్వాసము నందు నిలిచి ఉన్నాడు. అతని జీవితము నుండి మనము చాలా పాఠములు నేర్చుకో గలము.

### 1. సేవకుని హృదయము గలవాడు (అపో 19:22)

తిమోతి సేవ చేయించుకొనుటకు బదులు సేవ చేయుటకు ఇష్టపడేవాడు. నేటి కాలములో సంఘ నాయకులు సేవకులుగా ఉండాలనితెలిసి సంఘములోని ప్రజలు తమకు సేవ చేయాలని చూస్తున్నారునీవు ఒక సేవకునిగా నీకు నీవు ఎంత విలువ ఇచ్చుకో గలవు? నీ భార్య, నీ పిల్లలు నీకు ఎంత విలువ ఇస్తారు? దేవుడు ఎంత శాతం విలువ ఇస్తాడు? యేసువంటి సేవకుని మనస్సు కలిగి ఉండుటకు ఏమి చేయాలి? యేసువంటి సేవకుని మనసు కలిగి ఉండునట్లు ప్రతిరోజు ప్రార్థించుము.

### 2. అందుబాటులో ఉండేవాడు (అపో 20:4)

పౌలు తిమోతి యొక్క అవసరత నిమిత్తము అతని దగ్గరకు వచ్చినప్పుడు అతడు అందుబాటులో ఉండేవాడు. ఏదైనా ఒక సంఘమునందలి సమస్య విషయంలో శ్రద్ధ తీసుకొని పరిష్కరించ డానికి అతడు అందుబాటులో ఉండేవాడు. పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొనుటకు ప్రయత్నించేవాడు కాదు. ఏ పరిస్థితుల్లోనైనా అవసరతలలో ఉన్నవారికి సేవ చేయుటకు తాను

అందుబాటులో ఉండేవాడు. అలాంటి మనసు గల వ్యక్తులను దేవుడు వాడుకుంటాడు. దేవుడు నిన్ను వాడుకొనునట్లు నీవు అందుబాటులో ఉన్నావా? లేదా నీవు ఏమి చేయదలచుకుంటున్నావో వాటిని చేయుటకు నీ స్వంత ఆలోచనలు కలిగి యుంటున్నావా? నీవు ఏమి చేయాలని దేవుడు కోరుతున్నాడో వాటిని చూపించమని దేవుని అడుగుతున్నావా? లేదా నీ గమ్యాలను చేరుకొనుటకు ఆయన ఏమి కోరుతున్నాడో అడుగుతున్నావా?

## 3. బోధింపదగినవాడు (2తిమో 3:10-11)

తిమోతి పౌలు నుండి ఎంతవరకు నేర్చుకోగలడో అంత నేర్చుకొనుటకు ఇష్టపడినాడు. ఎప్పుడు దిద్దుబాటు అవసరమై యుండెనో దానిని ఇష్టపూర్వకముగా అంగీకరించేవాడు. అతడు అన్ని తెలుసని అనుకునే వాడు కాదు. అన్ని సమయములలో తాను బాగుగా ఉన్నానని అనుకునేవాడు కాదు. ఎవరినైనా నిన్ను సరిచేస్తున్నప్పుడు నీవు ఎలా స్పందిస్తున్నావు? నువ్వు తప్పిదములో ఉన్నప్పుడు ఎలా స్పందిస్తావు? ఇతరుల నుండి నేర్చుకొనుటకు నీవు ఎంతగా ఇష్టపడుతున్నావు?

## 4. ఇతరుల కొరకు నిజమైన శ్రద్ధ గలవాడు (ఫిలి 2:19-20)

పౌలు తిమోతిని ఫిలిప్పి సంఘమునకు పంపునప్పుడు మీ క్షేమ విషయమై నిజముగా చింతించువాడు అతని వంటి వాడు ఎవడెవడును నా యొద్ద లేడు (ఫిలి 1:19-20) అని చెప్పినాడు. “నిజమైన” అనగా యదార్ధమైన మరియు సున్నిత దృక్పథం గలవాడు. అతడు నిజముగా ఇతరులను గురించి శ్రద్ధ తీసుకొనువాడు. నీవు ఇతరులను ప్రభావితులను చేయుటకు దేవుడు నీకు అప్పగించిన

ప్రజలను గూర్చి శ్రద్ధ కలిగి ఉన్నావా? లేదా వారిపట్ల అసహనము లేదా చిరాకు చూపిస్తున్నావా? వారు నీ కొరకు ఏమి చేస్తారు అని ఆలోచిస్తున్నావా? లేదా వారి కొరకు ఏమి చేయగలనని ఆలోచిస్తున్నావా? అతనికి క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ వారి పట్ల కూడా తిమోతి శ్రద్ధ తీసుకోగలిగాడు.

## 5. నమ్మకమైన వాడు (1కొరింథీ 4:17)

తిమోతి తాను చేయూ పనులన్నింటిలో మంచి నమ్మకస్తుడు అని కీర్తి గడించినవాడు. పౌలు అతనిలో దానిని గుర్తించినాడు. తిమోతి కేవలము దేవుని వాక్య సత్యమును ఎరిగి ఉండువాడు మాత్రమే కాదు, దానిని తన జీవితములో ఆచరణలో ఉంచినవాడు. నీవు ఏమి బోధిస్తున్నావో? దానిని ఎల్లప్పుడూ ఆచరణలో ఉంచుతున్నావా? ఈ విషయంలో నీవు ఎక్కడ మార్పు చెందాలో నీకు తెలుసా? నువ్వు బోధిస్తున్న విషయాలు నీ శ్రోతలు తప్పక చెయ్యాలని బోధిస్తున్నావా? కాని వాటిని నీ స్వంత జీవితంలో కొనసాగించ లేకపోతున్నావా?

## 6. ఇతరులకు తర్ఫీదునిచ్చేవాడు (2 తిమో 2:2,1థెస్స 3:2)

పౌలు యొక్క నమూనాను తిమోతి తన జీవితములో మరియు ఇతరులు తన నమూనాను తమ జీవితాలలో చూపిస్తున్నట్లు శిక్షణ ఇచ్చినాడు. అతడు ఎరిగియున్నవన్నియు నేర్చుకున్నవన్నియు ఇతరులకు అందించి వారిని క్రమపరిచినాడు. సంఘ నాయకులకు సలహాదారుడుగా ఉన్నాడు. నీవు ఎవరికి మార్గదర్శిగా ఉన్నావు? నీవు యేసుని వెంబడించుటను బట్టి వారు కూడా ఆయనను వెంబడిస్తూ ఉండునట్లు ఎవరి జీవితాన్ని నీవు నిర్మిస్తున్నావు?

## 7. అతడు భయమును అధిగమించునట్లు నేర్చుకున్నాడు

**(1తిమో 1:7; ఫిలి 4:6-7, 13)**

తిమోతి మనుష్యుల వలన కలుగు భయము, తనకు ఎదురయ్యే విమర్శలు, తిరస్కారాలు, ఓటమి ద్వారా కలిగే భయాలు, బహుశ ఇతర భయాల ద్వారా తిమోతి ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. తిమోతికి కలిగే భయాల నుండి అతడు పారిపోకుండా వాటిని ఎదుర్కొనాలని పౌలు ప్రోత్సహించినాడు. వాటిపై విజయం పొందుటను గూర్చి నేర్చుకున్నాడు. నీ జీవితంలో అతి గొప్ప భయాలు ఏవి? అవి ఎలా నీ పరిచర్య పైన ప్రభావం చూపుతున్నాయి? వాటిపై విజయం పొందుటకు నీవు ఏమి చేస్తున్నావు? నీవు భయమును అధిగమించుటకు నీకు ఇక్కడ కొన్ని వాగ్దానములు ఇవ్వబడినవి. సామె 3:25, యెష 14:3, కీర్తన 34:4, యెహో 1:9,10:8,23:9-11, లేవి 26:8, నిర్గమ 14:13, 2సమూ 17:45-47, 2సమూ 22: 33-35, 40-41, ఫిలి 4:6-7, 14:13, 2 తిమో 1:7, సామె 26:8.

## b) నిరుత్సాహపరచుట - సాతాను ఆయుధము

క్రైస్తవ నాయకులపై సాతాను ఉపయోగించే గొప్ప ఆయుధాలలో నిరుత్సాహము ఒకటి. మనమందరము కూడా దీనిని ఎప్పటికప్పుడు ఎదుర్కొంటుంటాము. పరిచర్య చాలా కష్టముగా ఉంటుంది. తరచు మనము కోరుకున్న ఫలితాలను చూడలేము. అప్పుడు ప్రజలు మనలను కృంగుదలకు లోను చేస్తారు. మనలను ఏదీ కృంగుదలకులోను చేస్తుందో సాతానుకు తెలుసు కాబట్టి ప్రవక్తయైన ఏలియా మీద ప్రయోగించినట్లు దానిని మనపైన కూడా

ఉపయోగిస్తాడు (2 రాజు 19). తిమోతిపైన కూడా దీనిని ప్రయోగించి నాడు. సంఘము తిమోతి చెప్పే మాటలను అనుసరించకుండా చేయుటకు ప్రయత్నించాడు. కొందరు వ్యక్తులు తిమోతిని ఎదిరించి, సవాలు చేయుటవలన వారిని తన స్వాధీనములోనికి తీసుకొని రాలేక పోయినాడు. అది తిమోతిని నిరుత్సాహములోనికి నడిపించింది.

మనము ఎప్పుడైతే శారీరకంగాను మరియు మానసిక భావోద్రేక కృంగుదలకు లోనైనపుడు నిరుత్సాహము కలుగుతుంది. మన శరీరము అలసిపోయినపుడు మన శరీరము ధృఢముగా ఉండదు కాబట్టి దీనివలన సులభంగా నిరుత్సాహానికి లోనవుతారు. కాబట్టి మంచి పౌష్టికాహారము, విశ్రాంతి, వ్యాయమము కలిగియుండుట వలన నిరుత్సాహముతో పోరాడగలము. ఇవన్నియు ఏలియా మానసిక స్థితిని దేవుడు స్వస్థపరచుటలో భాగమై యున్నవి (1 రాజు 19:5-8). ఒత్తిడికి లోనవుట కూడా నిరుత్సాహానికి కారణము అవుతుంది. మనకు కలిగియున్న సమయము, సామర్థ్యము లేదా వనరుల కంటే ఎక్కువగా మనము పని చేయాలనుకొన్నపుడు దానిని వదులుకోవాలని అనిపిస్తుంది. అయితే ఒకటి గుర్తుంచుకోవాలి. యేసు చెప్పెను సంఘము ఆయనది, ఆయనే సంఘమును నిర్మించువాడు. మనము కేవలము మన పనిని మన శక్తివంచన లేకుండా చేయాలి. మిగిలిన విషయాలు ఆయన చూచుకొంటాడు.

పాపముతో మనము తీవ్రమైన పోరాటం ఎదుర్కొవటం కూడా నిరుత్సాహమునకు కారణము అవుతుంది. తిమోతి తరచుగా భయముతో స్వాధీనపరచబడేవాడు. మనము తరచు ఓటమి వైపు దృష్టి సారించినపుడు నిరుత్సాహానికి లోనవుతాము. పాపమును మన జీవితములో అనుమతించినపుడు ఆ దేవుని ఆత్మతో నింపబడి ఆత్మ ఫలమును అనుభవించకుండ నియంత్రించబడుతాము.

నీకు ఎప్పుడైతే నిరుత్సాహ అనుభూతి కలిగియుంటావో అప్పుడు జాగ్రత్త కలిగి ఉండాలి. నిరుత్సాహము దేవుని నుండి వచ్చినది కాదు. మనలను ఓడించి, నాశనము చేయుటకు ఇది సాతాను యొక్క సాధనము. జ్ఞాపకము ఉంచుకొందాము, దేవుడు మనము ఏమిసాధించాము అని చూడడు, మనము ఎంత నమ్మకముగా ఆయనను వెంబడించామో దానిని చూస్తాడు. మనము కేవలము విశ్వాసముతో ఆయనను సేవించుటలో బాధ్యులమై యున్నాము. మన పరిచర్యకు గొప్ప స్పందన కలిగినపుడు దానిని మన ఆధిక్యతగా భావించవద్దు లేదా మన పనికి తక్కువ స్పందన వచ్చినపుడు దానిని బట్టి మనలను మనము నిందించుకోవద్దు. దానిని దేవునికి విడిచిపెట్టుదాము. నిరుత్సాహముపై విజయము సాధించుటకు సరియైన మార్గము దేవుని వాగ్దానములను జ్ఞాపకము చేసుకొనుట. ఆయన ఎల్లపుడు మనతో ఉంటానని చెప్పాడు (యెహో 1:1-9). ఆయన ఎన్నడు ఎడబాయడు (హెబ్రీ 13:5), ఆయన సహాయముతో మనం చేయగలిగే వాటికంటే ఎక్కువగా ఏమి ఇవ్వడు (1 కొరింథి 12:9) మనకు ఏమి సంభవించినప్పటికీ దానిని మన ఆధ్యాత్మిక ఎదుగుదల నిమిత్తము ఆయన మహిమ కొరకు వాడు కొంటాడు (రోమా 8:28).

## పౌలు సలహా

మన జీవితములో పరిచర్యలో సాతానుడు నిరుత్సాహమును వాడుకొనునపుడు జాగ్రత్తగా ఉండాలి.

“ఇప్పుడు గృహనిర్వాహకులలో ప్రతివాడు నమ్మకమైనవాడై యుండుట ఆవశ్యకము”(1 కొరింథి 4:2).

“యెహోవా కత్తిచేతను ఈటెచేతను రక్షించువాడు కాడని యుద్ధము యెహోవాదే ఆయన మిమ్మును మా చేతికి అప్పగించును (1 సమూ17:47).

నీవు ఎప్పుడు నిరుత్సాహముతో ఇబ్బంది పడుతున్నావా? దానికి ఆపుటకు లేదా జయించుటకు ఏమి చేయుచున్నావు? నీవు నిరుత్సాహానికి లోనైనపుడు ఏ వాగ్ధానములను బైబిలు నుండి వాడుతున్నావు? ఎవరినైనా నిరుత్సాహపరచినట్లుగా తెలుసా? ఇప్పుడే వారువాటిని ఆపి వేయాలని ప్రార్థించు దేవుని సత్యముతో వారిని ఈరోజే కలుసుకొని ప్రోత్సాహపరచుము.

**C) బోధింపదగిన ఆత్మ**

ఎంతోమంది కాపరులు ఎలా పనిచేయాలని నేర్చుకొనే చాలామందికి మార్గదర్శిగా లేదా సలహాదారుడుగా ఉండుట నా ఆధిక్యతగా భావిస్తున్నాను. వారికి తర్బీతు ఇవ్వడంలో చాలా సంతోషించేవాన్ని, ఎందుకనగా వారిలో నేర్చుకోవాలనే మనస్తత్వము ఉండేది. వారు నేర్చుకొనుటకు చాలా ఇష్టపడేవారు. వారికి ఏది అవసరమో దాన్ని నేర్చుకోవలసిన అవసరములేదు. వారు చేసే వన్నియు సరైనవిగాఉన్నాయని తలంచినట్లైతే వారిని ఎంతమాత్రము సరిచేసేవన్ని కాదు. వారి గర్వము వారు నేర్చుకొనుటకు మరియు అభివృద్ధి చెందుటకు వారిని సిద్ధముగా ఉండనివ్వదు.
కాని అది సమస్యకాదు, కాబట్టి వారితో కలిసి పనిచేయుట ఆధిక్యతయై యున్నది.

తిమోతికి శిక్షణ ఇవ్వటంలో పౌలు చాలా సంతోషించేవాడు. ఎందుకనగా అతడు నేర్చుకొనుటకు ఎల్లపుడు ఇష్టపడేవాడు.
వారి మధ్యలో తండ్రి కుమారుడు మధ్యగల ప్రేమ, మరియు గౌరవము అభివృద్ధి చెందినది. 1 & 2 తిమోతి పత్రికలలో పౌలు తిమోతికి

ఇచ్చిన సలహాలు వ్రాయబడినాయి. ఎక్కడ అవసరమో అక్కడ దిద్దు బాటు చేసేవాడు, ఎక్కడ ప్రోత్సాహము అవసరమో దాని కొరకు నూతన విషయాలు నేర్పించేవాడు. ఈ పుస్తకములు నీవు చదివినపుడు ఎంతవరకు తిమోతి నేర్చుకొనుటకు  మరియు ఎదుగుటకు సిద్ధముగా ఉన్నాడో దానిని చూడగలము. అతడు అలా ఉండకపోయినట్లైతే పౌలునకు గానిమరియు దేవునికి గాని ప్రయోజనకారిగా ఉండేవాడు కాదు.

బోధింపబడుటకు సిద్ధపడని వారు బుద్ధిహీనులు అని బైబిలు తెలుపుతుంది (సామె 26:12,11:14). వారు ఎల్లపుడు సరైన వాటినే చేస్తామని అనుకొంటారు (సామె 16:12). వారు సలహాలను వ్యక్తిగత దిద్దుబాటును ఎల్లపుడు వారి వ్యక్తిగత విమర్శగా భావించి, మనస్తాపము చెందుతారు (సామె 12:1). వారిలో ఉన్న అభద్రతా భావము మరియు భయాందోళన స్థితిగతులు వారు బహుశా తప్పిదములో ఉన్నామని గుర్తించకుండా చేస్తాయి. వారి గర్వమును బట్టి వారు ఇతరుల కంటే బాగా ఉన్నామని, భిన్నముగా పని చేస్తున్నామని తలంచుతారు. ఈలాంటి మనస్తత్వము గలవారు చెప్పేవాటిని వింటున్నట్లుగా నటిస్తారు, గాని  తరువాత వాటిని తిరస్కరించి వారు చేయాలనుకున్న వాటికే కట్టుబడి ఉంటారు. మనందరికీ తెలుసు తాము చేయు పనులు ఎప్పుడు సరైనవిగా ఉంటాయని తలంచే ప్రజలు అలా అనుకొనుట వలన వారికి చెడు మరియు వారి చుట్టూ ఉన్న వారికి కూడా చెడు జరుగుతుంది. దేవుని నాయకులు ఇలా ఉండటం చాలా భయంకరము. వారు పరిపక్వత చెందుటకు దేవుడు వారికి చేరుకొనుటకు మరియు సహాయము చేయుటకు ప్రయత్నం చేసినపుడు వేరే వారి ద్వారా సలహాలు ఇవ్వటానికి చూచినప్పటికీ వాటిని స్వీకరించుటకు ఇష్టపడరు. దేవుడు నూతన విషయాలు ఇతరుల ద్వారా తెలియజేయుటకు ప్రయత్నించి

నప్పటికీ వాటిని స్వీకరించుటకు సిద్ధముగా ఉండరు. వారు వినకుండా తమ మనస్సును మూసివేసుకుంటారు. నీవు ఒకవేళ ఇలా ఉన్నట్లైతే నీవు బోధింపదగిని వ్యక్తివి కాదు కాబట్టి దేవుని ఎదుట నిన్ను నీవు తగ్గించుకొనుటకు ప్రయత్నించుము. నీలో ఉన్న గర్వము క్షమింప బడునట్లు ప్రార్థించి, దేవున్ని అడుగుము. ఆయనకు అప్పగించుకొని ఆయన దిద్దుబాటును మరియు బోధను అంగీకరించుము. నీవు నేర్చుకొనదగిన విషయాలు, దైవభక్తితో కూడిన సలహాలు మరియు సూచనలు ఇతరుల నుండి పొందుటకు దేవున్ని అడుగుము.

## పౌలు సలహా

నీవు ఎల్లపుడు నేర్చుకొని మరియు అభివృద్ధి చెందుటకు బోధింపదగిన ఆత్మకలిగి యుండునట్లు చూచుకొనుము.

సామె 26:12 ఎలాంటి బోధన లేకుండా మరియు తన దృష్టికి జ్ఞాని అనుకొను మనుష్యుని చూచితివా అతని మనస్సు స్వీయ అహంకారముతో నిండి యుంటుంది. ఇతని కంటే మూర్ఖుని సరిచే యుట సులువు.

సామెతలు 12:15లో చెప్పబడినట్లు మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది. జ్ఞానము గలవాడు ఆలోచన అంగీకరించును. నీవు విమర్శింపబడునపుడు నీ మొదటి స్పందన ఏది? ఎవరయినా ఒకరు నీకు మంచి మార్గములో నడవటానికి నీకు చూపించినపుడు నీ ప్రతిస్పందన ఏమి? నీవు తప్పుడు మార్గములో ఉన్నపుడు నీ ప్రతిస్పందన ఏమి? నీ పిల్లలు మరియు నీ భార్య, కొత్త సూచనలు తీసుకొనుటకు సిద్ధముగా ఉన్నావని చెప్పగలరా? నీ దేవుడు కూడా చెప్పగలడా?

## d) కష్ట సమయములలో అంటిపెట్టుకొని యుండుట

పౌలు ఆదిమ సంఘమునందు ఒక నాయకుడిగా గుర్తింపబడినాడు. గొప్ప వ్యతిరేకత మరియు హింస ఉన్నప్పటికీ అతడు నమ్మకముగా అంకితభావము గలవాడని మనకు తెలుసు. పాపము ఎక్కడ ఉంటుందో దానిని ఎత్తిచూపేవాడు. పేతురు జీవితములో కూడా అది జరిగినపుడు ఖండించాడు (గల 2:11-14).

ఎఫెసీ సంఘ నాయకులు తిమోతి యొక్క నాయకత్వమును విమర్శించినపుడు మరియు ఎగతాళి చేసినపుడు పౌలు అతనిని ప్రోత్సహించినాడు. పౌలు దీర్ఘకాలము చెరసాలలో కష్టాలను అనుభవించినపుడు తిమోతి అతనిని ప్రోత్సహించినాడు. వారు ఇరువురు సంఘమునకు మరియు ఒకరికొరకు  నిస్వార్థమైన రీతిగా సేవలందించుకున్నారు. ఈ రోజులలో పరిచర్య తరచు ఒక వ్యక్తి చుట్టే తిరుగుతుంది సంఘమునకు యేసు మాత్రమే శిరస్సు ఆయన ఎంత మాత్రము తన మహిమను ఇతరులకు రానివ్వడు.

తిమోతి తన జీవిత కాలమంతటి యందు మరియు పరిచర్యలో తెర వెనుక వ్యక్తివలె గడిపినాడు. అతడు తిమోతి తన రాజ్యమును స్థాపించుటకు ఎంతమాత్రము ఇష్టపడలేదు. అతడు యేసు యొక్క రాజ్యము స్థాపించాడు. అతడు తన జీవితాన్ని ఇతరుల కొరకు పెట్టుబడిగా పెట్టాడు. దానికి అతడు ఎంతమాత్రము విచారపడలేదు. ఎక్కడ అవసరము ఉన్నదో అక్కడ సేవలందించాడు.

నీ కంటే ఎక్కువగా పరిచర్య చేయు వారి విషయములో చాలా సహజముగా అసూయ కలుగుతుంది. వారికి కలిగే పేరు ప్రఖ్యాతులను బట్టి నీవు అసూయ పడగలవు. నీవు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నపుడు ఇతరులు దానిని చులకనగా తీసుకొంటు

న్నపుడు దేవుడు నీ విషయంలో యదార్థముగా లేడని అనుకొంటాము. పరిచర్య చాలా ఇబ్బందిగా ఉంటుంది. నీవు చేసే పని ఎవరిచేత గుర్తింపబడకపోవచ్చు. దానికి చాలా తక్కువ గుర్తింపు వస్తుంది. ఇది యిర్మియ, యెషయా మొదలగు ప్రవక్తల విషయములో వాస్తవము ఇది నీ విషయములో కూడా వాస్తవమై ఉండవచ్చును. గుర్తుంచుకోండి తిమోతికి ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ చాలా నమ్మకముగా సేవ చేసినాడు.

## పౌలు సలహా

పరిస్థితులు ఎంత కఠినముగా మారినప్పటికీ నీ పిలుపునకు నమ్మకముగా ఉండుము.

2 తిమోతి 4:1-2 దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు యెదుటను ఆయన ప్రత్యక్షత తోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టి చెప్పునదేమనగా వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము, దీర్ఘశాంతముతో ఉపదేశించుము, ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము. తిమోతివలె యేసును నమ్మకముగా సేవించేవారు ఎవరైనా నీకు తెలుసా? వారి జీవితాల నుండి నీవు ఏమి నేర్చుకొంటున్నావు. పౌలు మరియు ఇతరులు ఎప్పుడైనా నిన్ను చూచి నపుడు తిమోతిలో ఉన్నట్లు ప్రేమతో కూడిన పరిచర్య, విధేయత, యేసు కేంద్రితమైన అంకిత భావముతో కూడిన జీవితము నీలో చూడ గలుగుతున్నారా?

e) కష్టములను ఎదుర్కొను కాపరులకు ప్రోత్సాహముగా ఉండుట

నిన్ను విమర్శించే వారు ఎవరైనా నీ సంఘములో ఉన్నారా? నీ ప్రసంగములు మంచిగా ఉండవని ఎవరైనా అన్నారా? ఎవరైనా నీ పరచర్యకు కఠినముగా మారుతున్నారా? నీవు కాపరివైనందున ఆశ్చర్యంగా అనిపిస్తుందా? దానిని విడిచిపెట్టాలని ఎప్పుడైన తలంచినావా?

తిమోతి మాత్రమే కష్టములను ఎదుర్కొనే కాపరులలో ఉన్నట్లు కాదు. చాలామంది యౌవనస్థులు మరియు వృద్ధులైన కాపరులకు కూడా ఇవి సంభవిస్తాయి. తిమోతి ఎదుర్కొన్న అనేక కష్టములను నేను ఎదుర్కొన్నాను. ప్రజలు ఏమి చెప్పుకొంటున్నారో? ఏమి ఆలోచిస్తున్నారో? అని భయపడేవాన్ని, బలమైన చిత్తము ఉన్న చాలా మంది క్రైస్తవుల నుండి ఎదురయ్యే వ్యతిరేకత, విమర్శలు, పుకార్లు మొదలగు వాటిని ఎదుర్కొన్నాను. ఆ సమయంలో వీటిని స్పష్టంగా తెలుసుకోలేకపోయాను. అయితే వీటి వెనుక నాలో ఉన్న బలహీన తలను ఎదుర్కొంటూ విశ్వాసమందు ఎదగాలని దేవుడే వీటిని అనుమతించినాడని గ్రహించాను. ఇవి యేసుకు ఆనుకొని దగ్గరవటానికి మరియు క్రీస్తువలె జీవించుటకు ఆయన ప్రణాళికలో భారముగా గుర్తించినాను. అవినా పరిచర్యను వినాశనము చేయుటకు ఉన్నట్లు గుర్తించినప్పటికీ, నేను నా పరిచర్యను ముందుకు తీసుకొని వెళ్లుటకు నా శక్తి కొలది ప్రయత్నించినాను. సాతానుడు నన్ను నిరుత్సాహపరుచుటకు కొన్నిసార్లు నన్ను చురుకుగా ఉండకుండా చేయుటకు ప్రయత్నించినాడు.

కొన్నిసార్లు అది సంభవించినది, దేవుడు ఎప్పుడు పరిచర్య చాలా సులభతరమైనది, లేదా అన్ని వ్యతిరేకతలలో మౌనముగా ఉంటానని వాగ్ధానము చేయలేదు (మత్త 10:16) వీటిని మన ఎదుగుదల నిమిత్తము అనుమతిస్తాడు (కీర్తన 119:71). గుర్తుంచుకొనండి

మనము ప్రజల నుండి ధృవీకరించబడాలని దేవుడు కోరుటలేదు, అయితే ఆయన ద్వారానే నడిపించబడాలని కోరుకొంటున్నాడు (గల 1:16). మనము మనుష్యులను సంతోషపరచువారమైతే దేవుని ఎంత మాత్రము సంతోషపరచలేము. మనము ఎవరినైనా ఒకరినే సంతోషపరచగలము. ఇలా చేస్తున్నట్లైతే మన ప్రార్థనలయందు మనము దేవునికి దగ్గరగా ఉండగలము (లూకా 18:1). మనము నమ్మకమైన మంచి సేవకుడా నీవు బాగా చేశావు అని దేవుని యొక్క ధృవీకరణ పొందుటకు ఆశించాలి (మత్త 25:21,23). కాపరి పరిచర్య చేయుట చాలా సులభము మరియు హాస్యముతో కూడినది అయినట్లయితే అందరు కాపరి కావాలని అనుకుంటారు.

ఈ విషయంలో యిర్మియా మంచి మాదిరిగా ఉన్నాడు. "నేను గర్భములో నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని అని చెప్పెను. జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని అని చెప్పాడు" (యిర్మి 1:5).అయితే యిర్మియా "నేను బాలుడను, నీవు కోరువాటిని చేయుటకు శక్తిచాలదని దేవునికి స్పందించెను (1:6). దేవుడు యిర్మియాతో ఉంటాడని ధైర్యపరిచినాడు ప్రజలు తనను వెంబడించు వారుకారు గనుక యిర్మియాను తిరస్కరిస్తారని, విమర్శిస్తారని చెప్పాడు (యిర్మి 1:14-16). లోకము దృష్టిలో తన పరిచర్య ఓడిపోయినట్లుగా ఉన్నదని ప్రారంభము నుండి యిర్మియా చెప్పాడు, అయితే దేవుడు ప్రజలకు భయపడవద్దు నేను నీతో ఉన్నానని చెప్పాడు (యిర్మి 1:17-19). యిర్మియా యొక్క వర్తమానము తీర్పును ప్రకటించుట. అయితే ఇది ప్రజల దృష్టిలో తనను ప్రసిద్ధి చేసేది కాదు కాబట్టి అతడు అందరిచేతతిరస్కరించబడినాడు మరియు ద్వేషించ బడినాడు.

యిర్మీయా దేవుని చిత్తము నెరవేర్చే సేవకుడు. అతడు దేవుని సేవించాడు. మనము దేవున్ని సేవించుటకు ఒప్పందపడినట్లైతే ఆయన ఏమి కోరుతున్నాడో దానిని చేయాలి. అది ఎంత కష్టమైనప్పటికీ మనము చేయుటకు సిద్ధపడాలి. మనము మన పరిచర్య విజయాన్ని అంచనా వేయుటకు ప్రజల యొక్క స్పందన వైపు చూడవద్దు. మనము యిర్మీయా వలె నమ్మకముగా ఉండాలి. యిర్మీయా యొక్క 40 సంవత్సరముల పరిచర్య యందు ఇద్దరు మాత్రమే మార్పు చెందినారు (యిర్మీ 32:12; 36:1-4; 45:1-5; 38:7-13; 39:15-18), యెషయా కూడా చాలా కాలము పరిచర్య చేశాడు కాని కొంచిమంది మాత్రమే మార్పు చెందినారు (యెష 6). యిర్మీయా మరియు యెషయా వాక్యము ప్రకటించినపుడు ఎవరు పశ్చాత్తాపపడలేదు. నిజానికి యిర్మీయాను మరియు యెషయాను హతమార్చినారు. కాని దేవుని యొక్క దృష్టిలో వారిరువురు నమ్మకమైన ప్రవక్తలు. వారిని గుర్తు చేసుకొనన్నట్లైతే అది నీకు కష్టమే. ఇది నీ దృష్టికి ఎంత కష్టమైనదో అనే దానిని నీ నుండి తీసివేయుము. నీ దృష్టి యేసుపై ఉంచుము. ఆయన అందరిచేత తృణీకరించబడినపుడు ఆయనను వెంబడించు వారందరు తృణీకరించబడుతారు (యోహా 13:16).

దేవుడు యిర్మీయాతో "వారు నీతో యుద్ధము చేయుదురు గాని నిన్ను జయించలేరు, నేను నీతో ఉంటాను నిన్ను విడిపించెదను" అను వాగ్ధానము చేసినాడు. దాని సహాయముతో యిర్మీయా అన్నింటిని జయించినాడు (యిర్మీ 1:19). మనము కూడా దేవుని వాగ్ధానముల మీద ఆధారపడవలెను. మన అవసరతలు తీర్చునని (ఫిలి 4:19), ఆయన శాంతి అనుగ్రహింపబడునని దేవుడు వాగ్ధానము చేశాడు (ఫిలి4:6-7). మనలను ఏమి చేయాలని దేవుడు ఆశిస్తున్నాడో వాటిని చేయగలిగే శక్తి ఇస్తానని దేవుడు వాగ్ధానము చేశాడు (ఫిలి 4:13; యెష 40:31). ఆయన మనలను ఎన్నడు విడువడు లేదా

ఎడబాయడు (ద్వితీ 31:5-6; హెబ్రీ 13:5). ఆయన మనలను నడిపించును (సామె 3:5-6). మనము దేనిని ఎదుర్కొంటున్నామో వాటిన్నింటిని ఎదుర్కొనుటకు దేవుడు శక్తి ఇవ్వగలడు. (2 కొరింథి 12:9). అన్నింటిని ఆయన తన మహిమార్థమై మన ఆధ్యాత్మిక ఎదుగుదల కొరకు వాడుకోగలడు (రోమా 8:28). కాబట్టి మనము దేనిని బట్టి గానీ, లేదా ఎవరిని బట్టి గానీ భయపడకూడదు (కీర్తన 118:6; హెబ్రీ 13:6).

దేవుడిని వంద శాతం అనుసరించకపోతే, ఆయనను మాత్రమే సేవించకపోతే దేవున్ని సేవించుట సులభము అని తలంచవద్దు. ఇతరులు నిన్ను తిరస్కరించినపుడు నీవు బాధ పడవద్దు (1తిమో4:12). భయమును రానివ్వకు ( 2తిమో 1:7). కాని దేవుని కృపయందు స్థిరముగా ఉండుము (2 తిమో 2:1). "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను" (మత్త 10:16). "నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొంది యుండుట మేలు" అని కీర్తనకారుడు చెప్పాడు (కీర్తన 119:71). నీ పరిచర్యయందు అతి కఠినమైన భాగము ఏది? యేసువలె ఎదుగుటకు దేవుడు దానిని ఎలా వాడుకొంటున్నాడు? అలాంటి సమయాలలో నీవు ఆధారపడునట్లు ఏ వాగ్ధానములను దేవుడు ఇచ్చినాడు.

### 3) భయాలను నియంత్రించు అవగాహన

కొన్ని నెలల క్రిందట కొందరు వేటగాళ్లు గ్వామ్ అను ప్రాంతములో 1944 నుండి అడవిలో దాగి యున్న ఒక జపాను సైనికుని కనుగొన్నారు. అతని ఆరోగ్యము చాలా భయంకరముగా క్షీణించినది. 50 సంవత్సరముల వరకు యుద్ధమునకు భయపడి

అతడు దాగుకొన్నాడు. అతడు అక్కడ ఎలాంటి జీవితము జీవించాడో? ఇంకా మనలో ఎంతమంది భయానికి బంధీలుగా మారుతున్నారో వారి జీవితాలు అదే స్థితిలో అధ్వాన్నముగా ఉండవచ్చును.

ప్రతి ఒక్కరు భయాన్ని ఎదుర్కొంటారు. ఇది మొదటి మానవుడు పాపము చేసిన తర్వాత దేవున్ని ఎదుర్కొనుటకు  కలిగిన స్పందన.భయము భావోద్రేక పరముగా మరియు సామాజిక పరముగా అంగవైకల్యము కలుగజేయ గలదు. ఇది అనేక శారీరక అనారోగ్యము లకు కారణమై యుండవచ్చు. ఇది విశ్వాసమునకు వ్యతిరేకమైనది. ఇది అనేక రకములుగా పిలువబడవచ్చును. కాబట్టి అందరిలో భయము ఉంటుంది. కొన్నిసార్లు కృంగుదలకు లోనవుట, ఒంటరి తనము, పిరికితనము, న్యూనతాభావము, అహంకారము, విరమించు కొనుట, దూకుడు స్వభావము, సిగ్గు, నిర్ణయము తీసుకొనలేకపోవుట, అనుమానము, చింత, అత్యుత్సాహము ప్రదర్శించుట, బాధపడుట మొదలగునవన్నీ భయము నుండి ఉద్భవించినవి.

భయము పాప ఫలితము లేదా పాప రహితమై ఉండవచ్చును. పాపము వలన కలుగు భయము దేవుని నుండి కలిగినది కాదు (2 తిమో 1:7). దానికి భిన్నంగా అది దేవుని నుండి వేరుచేస్తుంది. పాపము నుండి భయము ఉండదు. సమాధానము ఆత్మ ఫలమై ఉన్నది (గల 5:22-23). పాపము లేని భయము మనము అనుకూల పనులు చేయుటకు ప్రేరేపిస్తుంది. నీలో ఉన్న భయము నిన్ను ప్రేరేపిస్తుందో దాన్ని అంచనా వేస్తూ నీవు ఎలా భిన్నముగా ఉన్నావో చెప్పగలవు. దేవునికి దగ్గరగా రావడానికి, ప్రమాదకర పరిస్థితుల నుండి జాగ్రత్త పడుటకు, అపాయము లేదా శాంతి కోల్పోతానని మరియు దేవుని యందు విశ్వాసముంచుట, దేని కొరకు భయపడుతున్నావో చెప్పగలవుయేసు ఏమి చేశాడో నిన్ను నీవు అడుగుకొనుము.

యేసునందు విశ్వాసముంచుట మాత్రమే పాప భయమునకు ఔషదము. పేతురు ఓడలో ఉన్నపుడు నశించిపోతామనే భయం కలిగినది, అతని కన్నులు యేసు మీద ఉంచినపుడు విశ్వాసము ద్వారా నీటిపై నడువగలిగెను. తర్వాత యేసు వైపు నుండి తన దృష్టి మరల్చినపుడు అతడు మునిపోసాగెను. అతడు తిరిగి తన దృష్టి యేసుపై ఉంచినపుడు యేసు అతనిని లేవనెత్తి, ఓడలోనికి నడిపించి నాడు. మనలో కూడా ఈ విశ్వాసము ద్వారా  ఇది సంభవిస్తుంది యెషయా 12:2, 41:10, 54:17, 2తిమోతి 1:7, ప్రకటన 1:17, 18, కీర్తన 56:3, మొదలగు వాక్యములను కంఠస్తము చేయుము. భయము ఎదురైనపుడు వీటిని ఎత్తి చూపుటకు అన్వయించుము.

భయము జీవితమును దయనీయముగా చేస్తుంది, కాని మన ప్రతి పరిస్థితి దేవుని స్వాధీనములో ఉన్నది అని గుర్తించినపుడు మనము దేనికి భయపడము. మనము దేనినైతే నియంత్రించితిమో దానికి భయపడుతాము. అది మనలో గొప్ప నొప్పిని కలిగిస్తుంది. దేవుడు సార్వభౌముడు, మరియు ప్రతిది ఆయన స్వాధీనములో ఉన్నాయి అని తెలిసికొనినట్లయితే మనము ఆయన యందు విశ్వాసముంచునట్లు చేస్తుంది. మనము విశ్వాసము లేదా భయమును ఏదో ఒక దానిని కలిగి యుండగలము. రెండు కూడా ఒకేసారి ఇమిడి ఉండవు. ఒకటి మరొకదానిని తరిమి వేస్తుంది. దేనిని నీ హృదయము అను సింహాసనముపై ఏలుబడి చేయుటకు అనుమతిస్తున్నావు? దేనిని నిర్ణయించుకోవాలి అనే ఎంపిక నీకే విడువబడినది. సరియైన దానిని ఎంచుకొనుము.

## పౌలు సలహా

భయము దేవుని సేవకులకు గొప్ప శత్రువు. మన జీవితంలో దీనిపై ఎలా విజయము పొందగలమో నేర్చుకోవాలి. భయముతో యుద్ధము చేయునపుడు వాడుకొనవలసిన బైబిలు వాగ్ధానాలు:

a.విశ్వాసులకు మరణ భయము పోయినది కీర్తన 23: 4, 49:15, 1 16: 15, యోహా 14: 1-3, 6-19, 27.

b. భయము, వాగ్ధానములు ఎత్తిచూపుటకు ఆధారము:
సామె 3:25, యెష 14:3, కీర్తన 34:4, యెహూ 1:9,10:8, 23:9-11, లేవీ 26:8, నిర్గమ 14:13, 1సమూ 17:45-47, 2 సమూ 22:33-35, 40:41, ఫిలి 4:6-7,4:13, 2తిమో 1:7.
భయము, విశ్వాసి దానికి భయపడడు: సామె 3:25, యెష 14:3, కీర్తన 34:4, యెహూ 1:9,10:8, 23:9-11, లేవీ 26:8, నిర్గమ 14:13, 1 సమూ 17:45-47, 2 సమూ 22:33-35, 40:41.

## C. తీతు

### 1. జీవితము మరియు పరిచర్య

చాలా విషయాలలో తీతు యొక్క జీవితము మరియు పరిచర్య తిమోతి యొక్క జీవితము పరిచర్యకు చాలా పోలికలున్నాయి. తిమోతి మరియు తీతు ఇద్దరు పౌలు శిక్షణ పొందినారు. పౌలు వారిని పరిచర్యలో ఎక్కడ అవసరములు ఉన్నాయో అక్కడికి పంపించేవాడు. తీతు యొక్క వ్యక్తిగత జీవితము  గురించి మనకు అంతగా సమాచారమివ్వ బడలేదు. కొన్ని పాఠ్యభాగముల యందు మాత్రమే అతని గురించి వ్రాయబడినది (గల 2:1-3, 2 కొరింథి 8:24).

తీతు పేరు లాటిన్‌కు సంబంధించినది, దాని ముఖ్య అర్థం "నేను ఘనపరుతును".కొందరు ఇతడు లూకా సహోదరుడని తలంచినారు ఎందుకనగా లూకా తన అపొస్తలుల కార్యమునందు తన పేరు గానీ, తీతు పేరుగానీ వాడలేదు.

ఇతని స్వస్థలం క్రేతు, ఇతని కుటుంబ పూర్వరంగము తెలియ జేయబడలేదు. ఇతడు యూదేతరుడు. మంచి విద్యావేత్తబీ ఇతని రక్షణ అనుభవమును గూర్చి కూడా ఎక్కడ తెలియజేయబడలేదు. బహుశా తీతు కూడా పౌలు ద్వార రక్షణ అనుభవములోనికి నడిపించబడి యుండవచ్చు (గల 2:3, తీతు 1:4).

అతని వ్యక్తిత్వాన్ని బట్టి తీతు తిమోతి కంటే మానసికంగా ధృడమైన శక్తిగలవాడు. తిమోతిలో ఉన్న భయము, పిరికితనుము తీతులో కనబడదు. ఇతడు కొరింథీ సంఘము పట్ల శ్రద్ధ గలవాడు. మరియు ఆప్యాయత గలవాడు, కాబట్టి అతనిలో ఉన్న ఆసక్తి, పట్టుదలను చూచి పౌలు ఆయా సంఘములలో ఉన్న సమస్యలను తీర్చుటకు అతనిని వాడుకున్నాడు. తీతు అంతియొకు ప్రాంతములో పౌలుతో పరిచర్య చేసినాడు, మరియుపౌలుతో కలిసి యెరూషలేములో జరిగిన, కౌన్సిల్ కు వెళ్లినాడు (అపొ1:15). ఆ సమయములో తీతు అన్యజనులలో నుండి రక్షింపబడిన వారికి ప్రతినిధిగా వెళ్లినాడు. పౌలునకు ఎన్నో విషయాలలో సహాయము చేసిన వాడిగా అతనిని చూడగలము. తీతు క్రేతు పట్టణములో పరిచర్య చేసినాడు. మరియు దల్మతీయ ప్రాంతములో సువార్తికునిగా ఉన్నాడు. అతడు యెరూషలేము సంఘమునకు చందా పోగు చేయు నిమిత్తము ఎఫెసు నుండి కొరింథికి పంపబడినాడు (2 కొరింథి 12), తర్వాత అతడు మాసిదోనియాలో (2 కొరింథి 7:6)మరియు పౌలు పత్రికను కొరింథికి తీసుకొని వెళ్లినాడు (2 కొరింథి), పౌలు పరిచర్య కాలమంతటి యందు పౌలుతో కలిసి పరిచర్య చేసినాడు.

పౌలు మరణించుటకు కొంతకాలము ముందు తీతు పత్రికను వ్రాసినాడు. పౌలు రోమాలో ఖైదుగా ఉన్నపుడు అతనితో ఉండి ఉండవచ్చును. పౌలు మరణం తర్వాత అతడు క్రేతు పట్టణములో చాలా కాలం పరిచర్య చేసినాడు. సంఘ సాంప్రదాయము ప్రకారము తీతు 93వ సంవత్సరం వయసులో మరణించాడు.

## 2. తీతు నుండి నేర్పబడు పాఠాలు - అవి అన్నియు నా గురించి కాదు, ఇవి ఏవియు నా గురించి కావు

తీతు కూడా అన్ని విధాలుగా తిమోతి వంటివాడే. తిమోతి పౌలునకు సహాయము చేసినట్లు ఇతడు కూడా చేసినాడు. తీతు కూడా తెర వెనుక పని చేసిన వ్యక్తి. ఇతడు సమస్యలను పరిష్కరించు వ్యక్తులలో అంత ప్రాముఖ్యమైన వ్యక్తిగా గుర్తించబడలేదు. తిమోతి వలె తీతు పౌలు చేత ప్రశంప దగిన వ్యక్తి కాదు. పౌలునకు మరియు ఇతని మధ్య గల సంబందము తండ్రి, కుమారుల మధ్య గల సంబంధముగా పేర్కొనబడలేదు. పౌలు చేత ఒక చిన్న పత్రికను పొందియున్నాడు. ఇతని యొక్క కృపావరములను గూర్చి పేర్కొనబడ లేదు. తీతు ఒక సామాన్యమైన వ్యక్తివలె తాను చేయగలిగే పనులు తన శక్తి కొలది చేసియున్నాడు.

మనలో చాలామంది పేరుప్రఖ్యాతులు గాంచిన వారముకాము మనలో ప్రత్యేకమైన వరములు లేదా నైపుణ్యతలు ఉండకపోవచ్చును. మనము పెద్ద సంఘములలో కాపరులముగా ఉండకపోవచ్చు. మనము మరణించిన తరువాత కూడా చాలా తక్కువ మందిమనలను గుర్తుంచుకొంటారు. మనలను మనము పౌలుతో పోల్చుకోవటం చాలా కష్టము. కొన్నిసార్లు తిమోతితో కూడా పోల్చుకోలేక పోవచ్చును. అయితే తీతుతో మనలను మనము పోల్చుకోగలము.

తీతు మనవలె చాలా సామాన్యమైన వ్యక్తి. అయినను అతడు తన జీవిత కాలమంతయు నమ్మకముగా దేవున్ని సేవించినాడు.

భూసంబంధమైన గుర్తింపు మరియు బహుమానము లేనపుడు అతడు ఎలా చేయగలిగినాడు? తన జీవితకాలమంతటి యొక్క శ్రమకు అతడు ఏమి పొందగలిగాడు? తీతుకు ఇదంతయు దేవుని కొరకు చేశాడు. మరియు యేసుపైఉన్న భక్తి మరియు ప్రేమను బట్టి చేశాడు. తీతు తన కొరకు ఏదీ చేయలేదు. తాను యేసుకొరకు అన్నిటిని చేశాడు. అతడు పరలోకమునకు వెళ్లిన తరువాత అతనికి బహుమాను ఇవ్వబడుతుంది.

మన నమ్మకత్వమును బట్టి మనము నిత్యత్వములో మన బహుమానములు, ప్రశంసను పొందగలము తప్ప మనం ఏమి చేశాము, ఏమి సాధించాము అనేదాన్ని బట్టి కాదు (1 కొరింథి 3:10-15). ఈ లోకము మనము ఎంత చేశాము అని చూస్తుంది, కానీ దేవుడు మన హృదయపూర్వకముగా ఎలా నాణ్యతతో చేశాము అని చూస్తాడు (1 కొరింథి 4:5). ఎవరు ఎక్కువగా పని చేశాడు, పెద్ద పెద్ద పరిచర్యలు జరిగిస్తున్నారు అనే దాన్ని బట్టి వారు మనకంటే విజయవంతముగా పరిచర్య చేస్తున్నారని మనము అనుకొంటాము కాని దేవుడు ఆ విధానములో చూడదు (కీర్తన 147:10; 44:21; 1రాజు 8:39; 1దిన 28:9). దేవుడు బాహ్య సంబంధముగా కనబడు వాటిని బట్టి అంచనా వేయడు (1 సమూ 16:7, యెష 55:8).

మనము నిజముగా దేవున్ని సంతోషపెట్టాలి అని ఆశిస్తే ఆయన కొరకే మనము సేవ చేయాలి. గాని దాని నుండి మనము పొందుతాము అని ఆశించవద్దు. మనము ఆయనను ప్రేమించుటయే మన ప్రేరణగా ఉండాలి. ఎఫెసిలో ఉన్న సంఘము చాలా మంచి కార్యములను జరిగించినది. దేవున్ని ఆకట్టుకొనడానికి ఎన్నో పనులు చేసినది (ప్రక 2: 2-3, 6). కాని ఇవన్నియు యేసుపట్ల ప్రేమతో

చేసినవి కావు (2:4). ప్రేమతో కొనసాగింపకపోతే వారి పరిచర్య అంతరిస్తుందని చెప్పాడు (ప్రక 2:5) అది  సంబంధించినది. కాని నీ పరిచర్యకు మరియు నీకు అది సంభవించుటకు వీలులేదు.

**పౌలు సలహా**

యేసును సేవించుటయే మన గురి. ఎలా చేస్తాము, మన నైపుణ్యతతో లేదా విజయాలతో అని కాదు.

"కాబట్టి సమయము రాకమునుపు, అనగా ప్రభువు వచ్చువరకు దేనిని గూర్చియు తీర్పు తీర్చకుడి. ఆయన అంధకారము నందలి రహస్యములను బయలుపరచునపుడు ప్రతిదానికి తగిన మెప్పు దేవుని వలన కలుగును." (1 కొరింథి 4:5). మనుష్యుడు లక్ష్యపెట్టు వారిని యెహోవా లక్ష్యపెట్టడు. మనుష్యుడు పై రూపమును లక్ష్య పెట్టును యెహోవా హృదయమును లక్ష్యపెట్టును.(1సమూ 16:7)

ఆయన కొరకు ఏమి చేయాలని యేసు చెప్పుతున్నాడు? నీవు నిజంగా ఆయన కొరకు చేస్తున్నావా? నీ పరిచర్య కొరకు, నీ కొరకు నీవు ఎక్కువగా చేస్తున్నావా? ఆయన కొరకు చేయు పరిచర్య యందు ఎలాంటి తప్పుడు ఉద్దేశ్యాలు లేదా స్వార్థపూరితమైన కోరికలు ఉన్నా యోమో దేవున్ని చూపించమని అడుగుము (కీర్తన 139:23-24). "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము నన్ను పరీక్షించిన ఆలోచనను తెలియజేయుము. నీకాయసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము".

# II. 1 తిమోతి

## A. 1 తిమోతి పూర్వరంగము

శీర్షిక: గ్రహిత పేరు, తిమోతి
గ్రంథకర్త: పౌలు
అంశము: సంఘ క్రమము
రచనా కాలము: క్రీ.శ. 62
రచనా స్థలము: మాసిదోనియా

గ్రహీత: తిమోతి, ఒక యౌవనస్తుడైన స్నేహిత కాపరి.

**ముఖ్యవచనము:** అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియజేయవలెనని...సంఘము సత్యమునకు స్తంభము, ఆధారము...సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధకము..దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి, నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వీకమును సంపాదించు కొనుటకు ప్రయాసపడుము. నిత్యజీవము చేపట్టుము. దాని పొందుటకు నీవు పిలువబడి అనేక సాక్ష్యుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి. ఓ తిమోతి, నీకు అప్పగింపబడిన దానిని కాపాడి, అపవిత్రమైన వట్టి మాటలకును, జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకును దూరముగా ఉండుము (1తిమో 3:15, 6:6; 11;13;20).

**ముఖ్యపదములు:** మంచి (22 సార్లు), దైవభక్తి (8 సార్లు), సిద్ధాంతము (8 సార్లు), బోధకుడు మరియు బోధ (7 సార్లు).

**ఉద్దేశ్యము:** పౌలు తన యొద్దగల యౌవన కాపరికి శిక్షణ కొరకైన మార్గదర్శకములు అందించుటకు ఈ పత్రిక వ్రాసినాడు. అతడు తప్పుడు బోధకులను హెచ్చరించుటకు మరియు సంఘమును ఎలా నడిపించాలో ఆ విషయాలు వివరించినాడు.

**అంశము: సంఘ క్రమమును సరిచేయుట.**

ఒక శిశువు జన్మించుటకు ముందు ఒక క్రైస్తవ తల్లిదండ్రులు బహుశా అతనికి పేరు పెట్టాలని ఆలోచిస్తే వారి మనస్సులో తిమోతి అని పెట్టాలని ఉంటుంది. ఎందుకనగా తిమోతి దేవుని సేవకుడు. ప్రతి ఒక్కరు అనుకరించుటకు తిమోతి మనకు మంచి ఉదాహారణగా ఉంటాడు. అతడు పౌలు యొక్క మొదటి మిషనరీ ప్రయాణములో రక్షింపబడినాడు. అతని తల్లి యూనికే మరియు అతని అవ్వ లోయి ఇద్దరు కూడా అతనిపై మంచి దైవభక్తిగల జీవితముతో ప్రభావము చూపించినాడు. తిమోతితో ఉన్న అధ్యాత్మిక కృపావరములు మరియు తలాంతులు మరియు అతనిలో ఉన్న పరిపక్వతను బట్టి పౌలు అతనిని తన పరిచర్యలో సహాయకునిగా ఉండాలని నిర్ణయించినాడు. తిమోతి ఫిలిప్పి, థెస్సలోనిక, బెరయా మరియు కోరింథి సంఘములు స్థాపింప బడుటకు సహాయము చేసినాడు. పౌలు ఎక్కడికైనప్పటికీ, ఎప్పుడై నప్పటికీ అధికారిక సమస్యల పరిష్కారిగా పంపేవాడు. తిమోతి మరియు పౌలు తమ జీవితకాల చివరి దశవరకు చాలా సన్నిహితులుగా ఉన్నారు. బహుశా పౌలు రెండవసారి రోమునందు చెరసాలలో బంధీగా ఉన్నపుడు తిమోతి అతనితో ఉన్నాడు. ఆ సమయములోనే పౌలు మరణశిక్ష అమలు చేయబడినది.

తిమోతి కూడా రోమా ప్రభుత్వము చేత చంపబడి హతసాక్షిగా మరణించినాడు.

**పూర్వరంగము:** పౌలు మరణమునకు 3 సంవత్సరములకు ముందు 1తిమోతి పత్రిక వ్రాయబడినది. పౌలు వేరే చోట్ల పరిచర్యలో ఉన్నపుడు తిమోతి ఎఫెసి సంఘములో ఉన్న సమస్యలను పరిష్క రించుటకు పంపబడినాడు. ఆ సమయములో పౌలు తిమోతిని ప్రత్యక్షముగా కలుసుకొనుటకు ఆలస్యము చేయబడుట ద్వారా తిమోతికి కొన్ని సూచనలు ఇవ్వటానికి ఈ పత్రికను వ్రాసినాడు. దీని ద్వారా సంఘమును ఎలా నడిపించాలో పౌలు యొక్క అంత దృష్టిని మనము తెలుసుకోగలము.

## I. తిమోతి యొక్క ప్రేషిత పరిచర్య (1:3-20)

ఎఫెసి సంఘములో ఉన్న తప్పుడు బోధకులు, ఆధిపత్యము నకు తాపత్రయపడు స్త్రీలు మరియు కలహములతో ఉన్న ప్రజలు వారిమధ్య వాటిని ఎదుర్కొంటూ పరిచర్య చేయుట అంత సులభమైన పనికాదు. ఇది చాలా కష్టమైన విషయము దాని కారణముగా కడుపు సంబంధమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నాడు. అయినను పౌలుతిమోతి ఆ పనిని చేపట్టుటకు దృఢసంకల్పము కలిగి యుండెను. దానిని బట్టి పౌలు అతనిని ప్రోత్సహించి, బలపరచుచు సలహాలను అందించినాడు. సంఘము క్రమపరచబడవలసిన అవసరత యుండెను. తిమోతి దానిని అందించినాడు.

## II. సంఘ వ్యవస్థ విధానము (2:1-3:16)

పౌలు సంఘములో పురుషుల ద్వారా నడిపించబడే ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను గూర్చి మాట్లాడినాడు. క్రైస్తవ స్త్రీలు బాహ్య సంబంధమైన అలంకరణను కాక అంతరంగములో సత్ క్రియలతో తమ్మును తాము అలంకరించు కొనవలెను. పురుషులు నాయకులుగా ఉండాలి, స్త్రీలు వారికి మద్ధతుదారులుగా ఉండాలి. కాని ఈలాంటి పరిస్థితి ఎఫెసీ సంఘములో లేదు.

కాబట్టి పౌలు సంఘ పెద్దలకు మరియు పరిచారకులకు ఉండవలసిన లక్షణాలు తిమోతికి తెలియజేసినాడు. ఎవరిని సంఘ నాయకులుగా నియమించాలి అనేది ఎపుడు ఒక ప్రాముఖ్యమైన విషయము. పౌలు ఎఫెసీ సంఘమును దర్శించకపోయినప్పటికి తిమోతికి తగిన సూచనలు తెలియజేసి నాయకులను ఏర్పరచాలని పేర్కొన్నాడు.

## III. తిమోతి యొక్క విధులు (4:1-6:19)

ఈ చివరి భాగమునందు తిమోతి యొక్క వ్యక్తిగత నడవడిక మరియు సంఘములో ఆయన పనిని గూర్చి వ్రాసినాడు. అబద్ధ బోధకుల విషయములో పౌలు తిమోతిని హెచ్చరిస్తూ, మంచి బోధకునిగా ఉండుట తన విధి అని గుర్తు చేసినాడు. పౌలు సంఘము అనునది కుటుంబము వంటిది కాబట్టి కుటుంబములోని ప్రతి వ్యక్తితో ప్రవర్తించునట్లు సభ్యుల పట్ల గౌరవముతో మెలగవలయునని తిమోతిని ప్రోత్సహించినాడు.

1 తిమోతి యందు సంఘ నాయకుల ఉండవలసిన లక్షణాల ప్రకారము నీ సంఘములోని సభ్యులు ఏ స్థాయికి చేరుకోగలిగారు? ఆ స్థాయికి చేరకపోతే సంఘములో ఏదో ఒక తప్పిదము ఉంది. తిమోతి వలె ఉండి నీ సంఘమునకు క్రమము ఏర్పరచుము.

## B. 1తిమోతి పత్రిక రూపురేఖలు

శుభములు 1:1-2

I తిమోతి చేపట్టవలసిన పని

A. పౌలు తప్పుడు బోధకులకు వ్యతిరేకముగా హెచ్చరించుట. (1:3-11)

B. దేవుని కృపను గూర్చి పౌలు సాక్ష్యమిచ్చుట (1:12-17)

C. పరిచారకుని బాధ్యతను పౌలు తిమోతికి అప్పగించుట

II సంఘ వ్యవస్థ విధానము (2:1-3:16)

A. ప్రార్థన యొక్క ప్రాముఖ్యత (2:18)

B. స్త్రీల కొరకు మార్గదర్శకాలు (2:9-15)

C. నాయకుల కొరకు మార్గదర్శకాలు (3:1-16)

1. అధ్యక్షుడు (3:1-7)
2. పరిచారకులు (3:8-10, 12)
3. పరిచారకుల సహాయకులు (3:11)
4. తిమోతి (3:14-16)

### III తిమోతి యొక్క విధులు (4:1-6:19)

A. బాధ్యతల సంగ్రహము (4:1-16)

1. శత్రువు: తప్పుడు బోధకులు (4:1-5)
2. కర్తవ్యము: నమ్మకమైన పరిచర్య (4:6-11)
3. కర్తవ్యము: దైవభక్తిగల జీవితము (4:12-16)

B. ఇతరులకు సేవ చేయుట (5:1-6:2)

1. పురుషులు & స్త్రీలు (5:1-2)
2. వృద్ధ విధవరాండ్రు (5:3-10)

3. యౌవన విధవరాండ్రు (5:11-16)

4. సంఘ నాయకులు (5:17-25)

5. యజమానులు %ు% దాసులు (6:1-2)

C. దైవభక్తి యొక్క శ్రేష్టత (6:3-19)

1. తప్పుడు బోధలు పైన (6:3-5)

2. భౌతికవాదము విషయములు (6:6-19)

ముగింపు 6:20-21.

## C. కాపరుల కొరకు ఇవ్వబడు సలహాలు

### 1. ప్రతి ఒక్కరికి ఒక పౌలు అవసరము

దేవుడు ఎవరినైన తనను సేవించుటకు పిలిచినపుడు వారిని ఆ పని కొరకు సిద్ధపరచుతాడు. మరియు వారికి కృపావరములు అనుగ్రహించి ఎవరెవరికి శిక్షణనిచ్చి నడిపించవలెనో వారిని గూర్చి తన మనస్సులో భారము ఉంచుతాడు. వారు ఎదిగి మరియు పరిపక్వత చెందుతున్నపుడు యౌవనస్తులైన విశ్వాసుల జీవితాలను నిర్మిస్తాడు. బర్నబా పౌలును శిష్యత్వములోనికి నడిపించాడు. తరువాత పౌలు తిమోతికి శిక్షణ ఇచ్చాడు. తిమోతి తల్లి యూనికే మరియు అతని అవ్వ లోయి మంచి దైవభక్తిగల యూదులు. అతని తండ్రి యూదేతరుడు అయినను అతడు తన కుమారునికి “తిమోతి” అనగా దేవున్ని ఘనపరచు అని అర్ధమిచ్చు పేరు పెట్టుటకు ఆటంకము చేయలేదు. తిమోతి బాల్యమందే పాత నిబంధనను లేఖనాలను నేర్చుకొన్నాడు (2తిమో 1:5; 3:15). మరియు పౌలు తన మొదటి మిషనరీ ప్రయాణము నందు లుస్త్రలో ఉన్నపుడు తిమోతి ఇంటిలో ఉండి ఆతిథ్యము పొందినాడు. అతడు రాళ్లతో కొట్టబడినపుడు బాగుపడేంతవరకు తిమోతి ఇంటిలో ఉన్నాడు (లూకా 14:19).

పౌలునకు తిమోతి కుటుంబముతో దగ్గర సంబంధము ఏర్పడినది. ప్రత్యేకముగా తిమోతితో ఉన్న దగ్గర సంబంధాన్ని బట్టి అతనిని రక్షణలోనికి నడిపించి అతనికి తండ్రిగా మరియు సలహా దారుడుగా ఉన్నాడు (ఫిలి 2:22). తిమోతి యౌవనస్తుడు, చాలా పిరికిగా మరియు అభద్రత భావము కలిగి యుండేవాడు. పౌలు తిరిగి తన రెండవ మిషనరీ ప్రయాణములో వచ్చినపుడు తిమోతిని చూచిన అతడు యేసును వెంబడించి, ఆయనను సేవించుట పౌలు అతనిలో కనుగొన్నాడు. లుస్త్రలో యున్న క్రైస్తవుల మధ్య తిమోతికి మంచి పేరు ఉండెను (అపో 16:2). తిమోతి పౌలుతో ప్రయాణించు సమయములో అతనికి శిక్షణ ఇచ్చినాడు.

తిమోతి పౌలుతో కలసి 15 సంవత్సరములు ప్రయాణించి పరిచర్యలో పాల్గొనిన తరువాత అతడు సంఘ కార్యక్రమములు నిర్వహించి ఆధ్యాత్మిక ఎదుగుదల కొరకు సహాయము చేసినాడు. ఆదిమ సంఘ చరిత్రలో ఎఫెసీ ప్రాముఖ్యమైన కేంద్ర పట్టణము. పౌలు అన్ని స్థలాల కంటే కూడా ఇక్కడ ఎక్కువ కాలము ఉన్నాడు. ఇది సాతాను ప్రభావము క్రింద ఉన్న, చెడుతో నిండి యున్న పట్టణము. ఇక్కడ దేవుడు పౌలు ద్వారా అద్భుతాలను జరిగించి. తనలో ఉన్న శక్తి సాతాను శక్తి కంటే గొప్పదని చూపించినాడు.

ఎఫెసీ నందు చాలా ప్రాముఖ్యమైన సంఘటనలు సంభ వించినవి. ఇక్కడనే అపొల్లో రక్షణలోనికి నడిపించబడినాడు. అపొస్తలుడైన యోహాను, మరియు యేసు తల్లియైన మరియ నివసించి చాలామంది ప్రముఖులైన సంఘనాయకులను తర్ఫీదు చేసినారు. మార్కు తన సువార్తను ఎఫెసినందు వ్రాసినాడు. యోహాను తన 3 పత్రికలను ఇక్కడనే వ్రాసినాడు.

ఎఫెసిలో ఉన్న సంఘము చాలా ప్రాముఖ్యమైనది కాబట్టి తిమోతి దానిని నడిపించుటలో గొప్ప బాధ్యత కలిగి యుండుటకు పౌలు

చేత నియమించబడినాడు. ఆ బాధ్యత నిర్వర్తించుట కొరకు పౌలు తిమోతికి శిక్షణ ఇచ్చాడు. కాబట్టి ప్రతి ఒక్కరికి ఒక విశ్వాసనీయ సలహాదారుడు అవసరము.

పౌలు తిమోతి యొక్క సలహాదారుడు మరియు గురువు మరియు తిమోతి పౌలు యొక్క విద్యార్థి. పౌలు తిమోతికి ఇచ్చినట్లు ప్రతి సంఘ నాయకుడు కొందరికి శిక్షణ ఇవ్వవలసిన అవసరత ఉన్నది. ప్రతి నాయకుడు కొందరు ఆధ్యాత్మికముగా ఎదుగు నిమిత్తము వారికి సలహాదారులుగా ఉండాలి. వారు ఆధ్యాత్మిక పరిపక్వత చెందిన కొలది కొందరికి శిక్షణ ఇవ్వడానికి చూడాలి. మన మందరము యౌవనులైన నాయకులు భవిష్యత్తులో సంఘ నాయకత్వ పాత్ర పోషించుట కొరకు వారిని సిద్ధపరచుటకు ఆశ కలిగి యుండాలి.

పౌలు తన కంటే విశ్వాసములో పరిపక్వత చెందిన బర్నబా మరియు లూకా లాంటి సలహాదారులను కలిగి యున్నాడు మరియు కొందరు యౌవనస్తులకు తర్ఫీదు ఇవ్వటానికి సలహాదారుడుగా ఉన్నాడు. మరియు తాను ఎదుర్కొను సమస్యలు, భారములను పంచు కొనుటకు తన సమకాళికుడైన సీలా వంటి మనుష్యులను కూడా కలిగి యున్నాడు. మనము కూడా మన భారములను పంచుకొని ప్రోత్సాహాన్ని పొందుటకు మంచి సన్నిహిత స్నేహితులను కలిగి యుండాలి.

## పౌలు సలహా

నీవు మార్గదర్శకత్వము వహించుటకు కొందరు వ్యక్తులను కలిగి యుండాలి మరియు నీవు కూడా మార్గదర్శక నిర్దేశము చేయబడుటకు కొందరిని కలిగి యుండాలి.

2తిమోతి 2:2 నీవు నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగించుము."

నీ మార్గదర్శి, సలహాదారుడు ఎవరు? నీవు ఎవరికి మార్గదర్శ కత్వము చేస్తున్నావు? నీవు నీ విజయాలను, సమస్యలను పంచుకొను నట్లు నీ పరిచర్యలో సన్నిహితమైన స్నేహితులు ఎవరు? ప్రతి కాపరి, నాయకుడు ఈ విధానమున యుండునట్లైతే నీవు ఈ వ్రాతలను పోషించునట్టు వ్యక్తులను చూపించమని దేవున్ని అడుగుము.

**2. పిరికివాడైన తిమోతి (1 తిమో 1:1-3, 18-19)**

మీరు ప్రతిదానికి, ప్రతిసారి భయపడుతున్నారా? కొందరు సంఘనాయకులు చాలా సిగ్గుపడుతూ మౌనముగా ఉంటారు. ఏమీ జరుగుతుందో అనే భయము ఉంటుంది. నేను క్రైస్తవునిగా మారిన తొలి దశలో దానిని ఎదుర్కొన్నాను. తిమోతి కూడ ఆ సమస్యను ఎదర్కొన్నాడు. 1 తిమోతిలో పేర్కొన్నట్లు ఎఫెసిలో నిలిచి యుండాలని అనుటను బట్టి అతడు చాలా భయపడి యుండవచ్చును. కొన్నిసార్లు తిమోతి ఎఫెసిలో విషయాలు ఎదుర్కొవటం, కష్టతరమైనదిగా ఎంచి పనిని విడిచిపెట్టాలని భావించాడు.

పౌలు తిమోతితో ఒక స్నేహితునిగా, ఆధ్యాత్మిక తండ్రిగా ఉన్నప్పటికీ ఒక అపొస్తలుడుగా సంఘము ఎందుర్కొంటున్న సమస్యలను సరిచేయుట కొరకు ఎఫెసీలో నిలిచి యుండాలని ఆజ్ఞాపించినాడు. పౌలు తన పత్రికను ప్రారంభిస్తూ క్రీస్తుయేసు యెక్కయు ఆజ్ఞ ప్రకారము క్రీస్తు యేసు యొక్క అపొస్తలుడైన పౌలు అని చెప్పాడు (1:1). పౌలు ఎవరైనది తిమోతికి తెలుసు. కాని దేవుడు పౌలును, సంఘాలపైన మరియు వారి నాయకులపైన

పర్యవేక్షకునిగా ఉండుటకు ఏర్పరచినాడని తిమోతికి గుర్తు చేస్తున్నాడు.

తప్పుడు బోధలను లక్ష్యపెట్టవద్దని కొందరికి అజ్ఞాపించుటకు తిమోతిని ఎఫెసులో నిలిచియుండాలని కోరుతున్నాడు (1:3). పౌలు ఈ విషయాన్ని తిమోతికి వ్యక్తిగతముగా చెప్పాడు. కాని అతడు ఇప్పటికీ అక్కడి పరిస్థితులను బట్టి తిమోతి ఒత్తడికి లోనై ఆ స్థలము విడిచి వెళ్లుటకు ప్రయత్నించాడు. పరిస్థితులను బట్టి తిమోతి చాలా నిరుత్సాహానికి, భయానికి లోనయినాడు.

సంఘము ఎదుర్కొనే సమస్యలు ఏమిటి? సంఘమునందు తప్పడు సిద్ధాంతాలు బోధించు నాయకులు, ఇతరులు ఉన్నారు. వారి తప్పుడు బోధలలోనికి నెట్టబడిన కొందరు దృఢమైన సంకల్పము గల స్త్రీలు ఉన్నారు (1 తిమో 11-15). ప్రజల మధ్య అనైక్యత, గందరగోళ స్థితి ఉన్నది (3:14-15). నాయకత్వ అధికారము కొరకు ప్రాకులాడుట (5:21-22) దైవ భక్తిగల నాయకుల విషయమై పుకార్లు పుట్టించుట, విమర్శించుట జరుగుతుంది (5:19). తిమోతి వీటన్నింటి విషయమై ఏ నిర్ణయము చేయలేకపోయాడు. కొందరు తిమోతి చాలా చిన్నవాడు, యౌవనస్తుడు అని విమర్శించినారు (4:12-16: 6:11-14). ఇంకా చాలా విషయాలు సంఘములో ఉన్నాయి. ఇలాంటి సమస్యలు సంఘములో కొనసాగినాయి, 30 సంవత్సరముల తర్వాత ఎఫెసి సంఘము మొదటి ప్రేమను కోల్పోయినదని యోహాను వ్రాసినాడు (ప్రక 2:1-7).

ఇలాంటి కఠినమైన పరిస్థితులలో మార్పును తీసుకొని రావడానికి తిమోతి చాలా కష్టపడినాడు. దీని యొక్క ప్రభావము తన యొక్క ఆరోగ్యముపైన ప్రభావము చూపించినది. ఆ సంఘమును తప్పుతోవ తప్పించు ప్రజలను ఎదుర్కొనుటకు చాలా భయపడినాడు. ఈలాగున ప్రతి ఒక్కరు ఆయా సమయాలలో ఈలాంటి భయాన్ని ఎదుర్కొంటారు చాలామంది సంఘనాయకులు ఈ విషయములో

విఫలము చెందుతారు. నేను కూడా దీనికి లోనయినాను. బహుశా మీరు కూడ అయి ఉండవచ్చును. అయితే మనము గుర్తు ఉంచు కోవలెను. ఈ భయము దేవుని నుంచి కలుగునది కాదు (2 తిమో 1:7). దేవుడు సార్వభౌముడుగా అన్నింటిని తన స్వాధీనమున ఉంచుకోగలడు అని నమ్మినపుడు మనము భయపడము. మనము భయాన్ని వదిలి వేయనైనవచ్చు లేదా దాని చేత ప్రేరేపితు లమైన కావచ్చు. మనము రెండింటిని అనుసరించలేము. ఒకటి ఉంటే మరొకటి ఉండదు. నీవుఎప్పుడైన భయము లేదా నిరుత్సాహానికి లోనయినవాడివైతే దానిని జయించుటకు నీవు ఏమి చేశావు.

తిమోతి వలె పరిచర్య చాలా కష్టతరముగా ఉన్నపుడు దానిని విడిచి పెట్టాలనుకొన్నావా? మనము మన వివాహ విషయము కలిగే సమస్యలు లేదా పిల్లల ద్వారా ఎదుర్కొనే సమస్యలు మనలను నిరుత్సాహ పరచవచ్చును.

పాపము చేత ఓడిపోయినపుడు మన జీవితాలను కొనసాగించటం చాలా కష్టము. అయితే పౌలు తిమోతికి మంచి సలహా ఇచ్చియున్నాడు. మనకు కూడా అది వర్తింపబడుతుంది. నిన్ను గూర్చి ముందుగా చెప్పబడిన ప్రవచనము చొప్పున ఈ మంచి పోరాటం పోరాడుము...విశ్వాసము మంచి మనస్సాక్షి కలిగి యుండుము. (1తిమో 1:18:19). యుద్దములో పోరాడుట అనునది ఒక ఆజ్ఞగాని ఒక ఎంపిక మాత్రము కాదు. మనము మనలో ఉన్న పాప స్వభావముతో యుద్ధము చేస్తున్నాము. మనము దానికి విడిచి వెనుదిరుగుట విజయముకాదు. మనము కేవలము దానితో యుద్దము చేసి జయించాలి. విశ్వాసములో మన భయము, నిరుత్సాహము, మరియు కోరిక నుంచి భయటకు రాగలము. మంచి మనస్సాక్షి మరియు విశ్వాసముతో మనము విజయము పొందగలము. మనము దేవుని వాక్యముఎగిరినపుడు మరియు ఆయన

వాగ్దానములను నమ్మినపుడు మన దేవునికి ఇష్టమైన జీవితము జీవించ గలము. లేనట్లయితే దేవుని ఆత్మ మన మనస్సాక్షి ద్వారా మనలను ఒప్పిస్తాడు. అప్పుడు పశ్చాత్తాపపడి దేవుని వైపునకు తిరుగవలెను. యేసును సేవించుట చాలా కష్టము. ఆ సమయములో పోరాడటము చాలా కష్టముగా ఉంటుంది. దేవుని వెలుగునకు, సత్యమునకు ఎల్లప్పుడూ వ్యతిరేకత ఉంటుంది. మన నేత్రదృష్టి ఎల్లప్పుడూ దేవుని వైపు ఉంచినపుడు మరియు అయన యందు విశ్వాసము ఉంచినపుడు మన భయముపై విజయము పొందగలము.

## పాలు సలహా

భయము అనునది మన శత్రువు దానిని ఎలాగైనా ఓడించాలి. 2తిమో 1:7 "దేవుడు మనకు శక్తియు ప్రేమయు ఇంద్రియ నిగ్రహము గల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మ నియ్యలేదు."

నీవు క్రమముగా దేవుని వాక్యము ధ్యానించుచున్నావా? కాబట్టి నీవు విశ్వాసము మరియు విధేయతతో ఎదుగుచున్నావా? దేవుడు నీకిచ్చిన పని నుంచి నిరుత్సహము మరియు భయము చెంది దానిని వదలుకొనుటకు కోరుకుంటున్నావా?

నీ యుద్ధములో పోరాడుచున్నావా? లేదా దానిని వదలు కొంటున్నావా మరియు నిరుత్సాహాన్ని గెలువనిస్తున్నావా? దేవుని వాగ్దానములయందు నమ్మకయుంచుము, అవి నిన్ను బలపరుస్తాయి. దేవునిసహయముతో పోరాడుతూ ఉండుము.

## 3. మన మధ్య గల మత భ్రష్టత్వము (1తిమో 1: 4-20)

నేను యౌవన క్రైస్తవునిగా ఉన్నపుడు చాలా అనుభవజ్ఞులైన పెద్దవారిని కలిసినపుడు ఒక మంచి క్రైస్తవునిగా ఉండుటకు ఏమీ

చేయాలి? ఏమీ చేయవద్దు అనే విషయాలు చెప్పేవారు. నా ప్రతి పరిస్థితి విషయములో నేనేమీ చేయాలో అవి అన్నియు వారికి తెలుసు అనుకొనేవారు. నేను ఎలా మాట్లాడాలి, నడుచుకోవాలి, బట్టలు ధరించుకోవాలి అను విషయాలు అన్ని నాతో చెప్పేవారు. వారు చెప్పిన వాటన్నింటి విషయములో నేను నడుచుకొన్నపుడు వారి గుంపులో అంగీకరించబడేవాన్ని ఎక్కడైన నేను ఓడిపోయినపుడు వారు నన్ను తిరస్కరించేవారు. నేను వారి అంచనాలకు దగ్గరగా ఉన్నపుడు ఇతర విశ్వాసులకంటే గొప్పవాన్నని అనుకునేవాన్ని ఈ ఆలోచన నాలో స్వార్థకేంద్రితమైన జీవితము మరియు గర్వమును కలిగించినవి. అదృష్టవశాత్తు దేవుడు ఆయన కృప ద్వారా నన్ను ఈ బంధకముల నుంచి విడిపించినాడు.

ఎఫెసి నందు కూడా ఇదే బంధకాలలో చిక్కియున్న ప్రజలు విడిపించబడుటకు వారిని సరిచేయాలని పౌలు తిమోతిని కోరినాడు. ఆ సంఘములో ఉన్నవారిని ఈ మత భ్రష్టత్వములో ఉన్నవారిని విడిపించాలని కోరినాడు. ఒకసారి విశ్వాసులై సత్యమును అనుసరించి దాని నుంచి తొలిగిపోయినవారు. మత భ్రష్టులుగా పరిగణించ బడుతారు. వారు క్రైస్తవులుగా ఉంటూనే సంఘములో కొనసాగుతూ తప్పుడు బోధలను వ్యాప్తి చేస్తారు (1:11). ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశ్యం రక్షణను కలుగజేయుట కాదు. పాపము అనగా ఎట్టిదో చూపించుట మాత్రమే (1:9 –20). సువార్త అనునది రక్షణ వర్తమానమని పౌలు తిమోతికి గుర్తుచేశాడు. రక్షణ కొరకు ధర్మశాస్త్ర చట్టాన్ని పాటించాలని బోధించుట చెడు వార్త, దేవుని కృపను బోధించుట సువార్త (1:11).

పౌలు తప్పుడు బోధకులకు, బోధకు తాను వ్యతిరేకినని చూపించబడినాడు (1:12–14). అతడు దేవుని కృపకు ఉదాహారణగా

ఉన్నాడు. కృపలేని ఎడల అతడు ఏమీ కాదు. అతడు పాత నిబంధన ధర్మములను పాటించుటకు ప్రయత్నించాడు. కాని అవి అతనిని పాపము మరియు శిక్షలోనికి నడిపించాయి. అతడు పాపములో ఉన్నప్పటికీ దేవుడు పౌలు పట్ల తన కృపను చూపించి అతనికి రక్షణనిచ్చి అతనిని తన సేవకునిగా నియమించినాడు.

పౌలు తనపట్ల దేవుడు చూపిన కృపకు కృతజ్ఞుడై యేసును స్తుతించినాడు (1:15-17). అతడు పాపులందరిలో ప్రధానుడు. దేవుడు తాను సృజించిన మనుష్యుల పట్ల ఆయన చూపే సహనము మరియు ప్రేమ పౌలు జీవితమునందు చూపబడినది. మనపట్ల దేవుడు చూపే ప్రేమ మరియు సహనము విషయములో ఆయనకు కృతజ్ఞత కలిగి ఉండాలి. సకల యుగములలో రాజైయుండి అక్షయుడు, అదృశ్యుడు, అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగ యుగములు కలుగును గాక ఆమెన్ (1తిమో 1: 17).

తప్పుడు బోధకులైన హుమెనైయు, మరియు అలెక్సెంద్రు పౌలు వంటి వారు కారు. వారు దేవుని సత్యము నుంచి తొలగిపోయి ఇతరులను కూడా ఆ విధంగా చేయుటకు ప్రేరేపిస్తారు. పౌలు తన జీవితకాలమంతటి యందు దేవుని కృపకు కృతజ్ఞుడు యున్నాడు (1:1 9-20). పౌలు మంచి పోరాటం పోరాడినాడు (1:18). తప్పుడు బోధకులకు ఏమీలేదు. ఈ హెచ్చరిక పౌలు వలె నమ్మకముగా పని చేసే తిమోతికి కాదు కాని హుమెనైను మరియు అలెక్సెంద్రుల యొక్క మార్గములలో పడిపోయేవారికి వర్తిస్తాయి. ఈ రోజులలో మనకు కూడా ఇది బలమైన హెచ్చరిక. దేవుని వాక్యము ఎరిగి ఉండూ. మరియు దానిలో నుండి బోధింపబడని దానికి దూరముగా ఉండుము.

**పాలు సలహా**

యేసు సత్యము సంపూర్ణముగా బోధించని వారి విషయమై జాగ్రత్తగా ఉండు మరియు వారి నుండి దూరముగా ఉండుము.

పౌలు తన భావములను 1:15-16 నందు క్లుప్తపరిచినాడు. "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకములోనికి వచ్చెనను వాక్యము నమ్మదగినది... అట్టివారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవితము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన ధీర్ఘకాంతమును ఆ ప్రధాన పాపియైన నాయందు కనపరచునట్లు నేను కనకరింపబడితిని." పౌలు చెప్పిన ఈ మాటలు నీవు చెప్పగలవా? వాటిని మరలా చదువుము. వాటిని దేవునితో చెప్పుము. దేవుడు పరిపూర్ణులుగా ఉండాలని మనలను కోరుకొనుట లేదు. కాని మనము నమ్మకముగా ఉండాలని మరియు మంచి పోరాటము పోరాడాలని కోరుతున్నాడు. నీవు అలా చేయడానికి నీవంతు ప్రయత్నము చేస్తున్నావా?

## 4. పౌలు వలె ప్రార్థించుట (1 తిమో 2:1-8)

పౌలు యొక్క బోధలు వినుటకు చాలా అద్భుతముగా ఉండెను. అయన ప్రార్థన గూర్చి వినుటకూడా చాలా ఆకర్షణీయంగా ఉండెను. పౌలు ఎలా ప్రార్థించినాడు 1 తిమోతి 2:1-8 భాగము నందు పౌలు తిమోతికి దానిని వివరించినాడు. దీనియందు పౌలు ప్రార్థన జీవితము నందలి పరిజ్ఞానము అర్థము చేసుకోగలరు. ఇది మనము ఎలా ప్రార్థించాలి అనే విషయానికి సహాయపడుతుంది. "మనుష్యులందరి కొరకు...విజ్ఞాపనలు ప్రార్థనలను యాచనలను, కృతజ్ఞతాస్తులను చేయవలయునని హెచ్చరించుచున్నాము.

(1 తిమో 2:1) పౌలు దేనికొరకు ప్రార్థించాలని పౌలు జాబితాను చూపించినాడు"యాచకులు" వ్యక్తిగత అవసరతల నిమిత్తం ప్రార్థనలు దేవునితో వ్యక్తిగతముగా దేవునితో కలిగియుండు గౌరవముతో కూడిన సంబంధమును సూచిస్తుంది. మరియు మన హృదయమంతటితో మన ఉద్దేశ్యాలు మరియు మన కోరికలు పంచుకొనుట 'విజ్ఞాపణలు' ఇతరుల అవసరతలను దృష్టిలో పెట్టునవి. "కృతజ్ఞతస్తులు మనము ఎల్లపుడు దేవుని ఎదుట వెల్లడించు కృతజ్ఞతా భావమును తెలుపు తుంది. ప్రార్థన అనగా దేవునితో మాట్లాడుట. మరియు ఆయనతో లోతైన అనుభవములోనికి అనుసంధానము చేయబడుట. ఇది మన అవసరతలను సంతోషాన్ని సమస్యలను ప్రశ్నలను పంచుకొనునది. ప్రార్థన మన కొరకు చేయునది మరియు ఇతరుల కొరకు కూడా. పౌలు తిమోతితో ఎవరి కొరకు ప్రార్థించాలి అని చెప్పాడు. మనుష్యు లందరి కొరకు ప్రత్యేకముగా అధికారుల కొరకు (1:2), ఎందుకు ప్రార్థించాలి పౌలు 3 కారణములు చూపినాడు. 1. ప్రతి ఒక్కరు సంపూర్ణ భక్తితో మరియు నెమ్మదిగాను, సుఖముగాను బ్రతుకుట కొరకు (2:2). 2. ప్రతి విశ్వాసి దైవభక్తి మరియు పవిత్రత కలిగి యుండుటకు (2:2). 3. ప్రతి అధికారులు సమాధాము మరియు శాంతి యుతముగా దేవున్ని సంతోషపెట్టునట్లు నడుచుకోనుటకు ప్రార్థించాలి. ఇది దేవుని దృష్టికి అనుకూలమైనది (2:3). దేవుడు ఆయనను అందరు ఎరిగి యుండాలని మరియు వెంబడించాలని కోరుకుంటున్నాడు. మానవాళిని సృష్టించుటలో దేవుని ఉద్దేశ్యము వారు ఆయనతో సహవాసము కలిగి యుండాలని, పాపము మనలను ఆయన నుంచి వేరు చేసినపుడు ఆయన మనకొరకు చనిపోయినాడు. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు. కాబట్టి మనము ఆయనతో ఉండాలని కోరుతున్నాడు.

పౌలు తిమోతితో మనము దేవునికి మన మధ్యవర్తియైన యేసుద్వారా ప్రార్థించాలని తెలిపినాడు. యేసు దేవుడై యుండి ఆయన మానవునిగా మారినాడు. ఆయన మనలను విమోచించుటకు వెలను చెల్లించి దేవునితో మనలను సమాధాన పరిచాడు (2:5-6). పౌలు ఇతరులకు సాక్ష్యమిచ్చుటకు సువార్తను ప్రకటించుటకు కలిగియున్న ఆధిక్యతను బట్టి దేవునికి కృతజ్ఞతలు చెల్లించుచున్నాడు (2:7). నీవు ఇతరులకు సువార్తను పంచుకొనుటకు కలిగి యున్నదానిని బట్టి కృతజ్ఞత కలిగిఉన్నావా?

చివరిగా పౌలు ఎలా ప్రార్థించాలని తెలియజేయుచున్నాడు. పురుషులు కోపమును, సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెను (2:8). ప్రార్థన ఎప్పుడైనను అన్ని సమయము లందు ప్రార్థించాలి. పురుషులు వారి కుటుంబములను, సంఘమును, మరియు దేశమును నడిపించుటలో చొరవ తీసుకొనవలెను.

ప్రార్థించునపుడు మనము ఏ స్థలములో ఉన్నామని కాదు. మన హృదయ వైఖరి ప్రాముఖ్యమైనదిగా ఉండాలి. పురుషులు చేతులెత్తి ప్రార్థించాలి. బైబిల్లో ఎన్నో రకాల భంగిమలలో ఉండి ప్రార్థించాలని వ్రాసియున్నది. చేతులెత్తి ముఖము నేలతట్టు తిప్పి, మోకరించి, కూర్చుండి, నిలువబడి మొదలగునవి. అయితే ఇందులో ఏది ఇతర వాటికి భిన్నమైనది కాదు. అయితే హృదయము పరిశుద్ధ ముగా ఉండుట అవసరము. పాపము దేవుని నుంచి మనలను వేరు చేస్తుంది.అది మన ప్రార్థనకు అడ్డుగా ఉంటుంది. మనము పాపము వలన ఆయనపై తిరగుబాటు చేసినపుడు ఎలా దేవునితో దగ్గరి సంబంధము కలిగి ఉండగలము. పాపము మానవ సంబంధాలను, కుటుంబము, వివాహము, మరియు స్నేహితుల మధ్యసంబంధాన్ని విడగొడుతుంది.

పౌలు ప్రత్యేకముగా కోపము మరియు వివాదముల విషయమై సంఘమును హెచ్చరించినాడు (2:8). ఎఫెసిలో ఉన్న సంఘము విషయమై దేవుడు వారి ప్రార్థనలు ఎందుకు వినుటలేదు అని తెలియజేస్తున్నాడు. తిమోతి ఈ వివాదములను పరిష్కరించ దైవభక్తిగల నాయకత్వము అందించాలని తద్వారా వారి ప్రార్థనలు ఎంతమాత్రము ఆటంకముగా ఉండవని తెలిజేసినాడు.

పౌలు ఇతరుల కొరకు ఎలా ప్రార్థించినాడు అనుటకు ఇవి కొన్ని తలంపులు మనకు ఇవ్వబడినవి. ఆదిమ సంఘము ప్రార్థించే స్వభావము కలిగియున్నది. వారు ప్రార్థన యందు ఎక్కువ సమయము గడిపినది. ఈ రోజులలో మంచి వాతవరణము గలిగిన సంఘము తప్పక దీనిని చేయవలయును.

### పౌలు సలహా

దైవజనులైన వారు ప్రార్థించు మనుష్యులుగా కూడా ఉంటారు. యాకో 5: 16 నీతిమంతుని విజ్ఞాపణ మనఃపూర్వకమైనది బహు బలముగలదై యుండును.

ప్రార్థన ప్రాముఖ్యమైనదని అది పరిస్థితులలో గొప్ప మార్పు తీసుకొని వస్తుందని నమ్ముతావా? ప్రతిరోజు ఎంత సమయము నీవు ప్రార్థనలో గడుపుచున్నావు? కోపముతో నీవు ఇబ్బంది పడుతున్నావా? నీవు ఇతరులతో కలిసిపోలేకపోతున్నావా? పాపము విషయమై పశ్చాత్తపపడి ఇప్పుడే దాని నుండి తిరుగుము.

## 5. స్త్రీల యొక్క పాత్ర (1తిమో 2:9-15)

నీ సంఘములో ఏమైనా సమస్యలను కలిగియున్నావా? వాటిని ఎలా పరిష్కరించాలో అర్థము కావటంలేదా? తిమోతి కూడా

అలాంటి సమస్యను ఎదుర్కొన్నాడు. ఎఫేసి సంఘములో ఉన్న పరిస్థితులను ఎలా పరిష్కరించవలయునో 1 తిమోతి పత్రిక యందు పౌలు వివరించినాడు. ప్రార్థన యందు పురుషులు నాయకత్వ బాధ్యత కలిగి యుండాలని కోరినాడు. అతడు స్త్రీలకు కొన్ని సూచనలు ఇచ్చినాడు (2:9-15). సంఘములో కొన్ని క్లిష్ట పరిస్థితులు స్త్రీల ద్వారా ఏర్పడినవి. స్త్రీలు మర్యాదకరమైన దుస్తులు ధరించాలని తెలిపినాడు(2:9-10).

వారు అణకువగా, మర్యాదగా, పవిత్రముగా కనబడవలెను. వారి యొక్క దృష్టి అంతయు అంతరంగ అలంకరణమై యుండవలెను, బాహ్య అలంకరణ యందు దృష్టి ఉంచరాదు. పేతురు కూడా ఇదే విషయాన్ని ఇంకా విపులముగా వ్రాసినాడు. కొందరు స్త్రీలు వారి సంపదను చూపించుకొనుటకు వారి దృష్టిని పెట్టుటకు ప్రయత్నించి నాడు. దేవుని ప్రజలు వారి స్వభావము నందు గర్వముగా ఉండకూడదు. మర్యాదగానూ, విధేయతతోనూ మెలుగవలయును. స్త్రీలు కేవలము వారి వస్త్రధారణ యందు మాత్రమే మర్యాదగా ఉండుటకాదు. వారి క్రియల యందు కూడా దానిని చూపించ వలయును (2:11-15). "స్త్రీలు" మౌనముగా ఉండి, సంపూర్ణ విధేయతతో నేర్చుకోవలెను. ఉపధేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయటకైనను ఆమెకు సెలవియ్యను"
(1తిమో 1: 11-12).

"స్త్రీ నేర్చుకొనవలెను" అనగా వారికి ఉపదేశించుటకు యేసు స్త్రీల పట్ల మర్యాదగా ప్రవర్తించి, వారిని బోధించినట్లు దైవ భక్తిగల స్త్రీ పురుషులు అవసరమైయున్నది. స్త్రీ ఒక వ్యక్తిగా పురుషునితో సమానమే. కాని ఆమె కేవలము బాధ్యత విషయమై పని విషయమై పురుషుని స్వాధీనములో ఉంటుంది. పురుషుడు అన్నింటికి పైగా ఉండి అన్నింటికి నిర్వహిస్తాడు.

పౌలు స్త్రీలు మౌనముగా ఉండి నేర్చుకొనవలెను అని వ్రాసినపుడు, మౌనముగా అను మాటకు వాడిన గ్రీకు పదమునందు వారు ఏమి మాట్లాడవద్దు అను అర్థము వచ్చునట్లు వ్రాయబడలేదు. వారు మాట్లాడే విషయాలలో హద్దులలో ఉండాలని చెప్పుటకు వాడబడినది. వారు తప్పక దేవుని యొక్క క్రమమును తెలుసుకొన వలెను. సంఘమునందు మరియు కుటుంబములో పురుషుడు బాధ్యత తీసుకొనవలెను. స్త్రీ తనపైన భర్త లేదా కాపరి పురుషుడు బాధ్యత తీసుకొనుటవలన తాను తక్కువ స్థితిలో ఉన్నట్లు అనుకొనకూడదు.

ఎఫేసిలోని గృహ సంఘముల యందు కలహము కలిగించు స్త్రీలు పూర్తిగా పురుషునికి లోబడాలి అని వ్రాసినాడు. స్త్రీ ఎపుడైతే దేవుని యందు నమ్మకముంచి ఆయనకు తనను తాను అప్పగించు కొంటుందో, అపుడే తప్పక ఆయన అధికారమునకు మరియు క్రమముకు లోబడవలెను. బైబిల్ నందు స్త్రీలు పురుషులందరికీ లోబడవలెను అని చెప్పబడలేదు, ఆమె తన భర్తకు (ఎఫె 5: 2-33, 1పేతు 3:1) మరియు వారి సంఘ నాయకులకు లోబడవలెను (1తిమో 2: 11: 15). దాని అర్థము స్త్రీలు స్త్రీలను, పిల్లలను, వారి సాక్ష్యము ద్వారా, పాటల ద్వారా, పరిచర్యలో నడిపించకూడదని కాదు గాని ఇది కేవలము పురుషునిపై అధికారము చేయుటను నిషేందించ బడుటకు బైబిల్ నందు అసాధారణమైన పరిచర్య చేసిన స్త్రీలు చాలా మంది యున్నారు. మిర్యాము, దెబోరా, ఎస్తేరు, మేరీ, మార్తా, ఫీబే, అన్న, అభిగయీలు మొదలగువారు.

స్త్రీలు దేవుడు ఏమి కోరుతున్నాడో వాటిని తమ భర్తలతో చెప్పవద్దని పౌలు అనుటలేదు. వారు తమ అభిప్రాయాలను, తలంపులను పంచుకొనవద్దని పౌలు కోరుటలేదు. దైవ భక్తిగల భార్య ఏదయినను పంచుకొన్నపుడు భర్త కూడా దానిని స్వీకరించకుండా

ఉండదు. పురుషులకు కొదువగా ఉన్నవాటిని స్త్రీలు అందించుట అవసరము. కాని అంతిమ నిర్ణయం తీసుకొను బాధ్యత పురుషునిదై ఉండాలి. స్త్రీలు సంఘములో ఎన్నో రకాలైన పరిచర్యలు కార్య కలాపాలు చేయవచ్చును గాని కాపరిగా గాని నాయకులుగా గాని ఉండకూడదు.

అయినప్పటికీ బైబిల్ చాలా స్పష్టముగా తెలియజేస్తుంది. మంచి కాపరి పరిచర్య జరిగించిన స్త్రీలను నేను ఎరుగుదును. ఇశ్రాయేలు సమాజములో నాయకత్వము తీసుకొని వారిని ముందుకు నడిపించుటకు ఏ మనిషి ముందు రాని సమయములో దెబోరా అను స్త్రీ నాయకత్వము వహించి, న్యాయాధిపతిగాను, ప్రవక్తగాను, మంచి సైన్యాధిపతిగానూ పాత్ర పోషించినది. ఆ సమయములలో బారాకు అను సైన్యాధిపతి నాయకత్వము తీసుకొనుటకు సాహసం చేయలేక పోయాడు. అయితే ఇక్కడ మనమొక విషయము గ్రహించాలి. దెబోరా తన భర్త యొక్క అధికారము క్రింద ఉండి వారిని నడిపించినది. ఈ రోజులలో కూడా చాలామంది స్త్రీలు తమ భర్త తదనంతరము సంఘమును సమర్థవంతముగా నడిపించువారు కలరు. అలా వారు నిర్ణుము తీసుకొనుట ద్వార సంఘము ఎక్కడకు పోవాలసిన అవసరములేదు. దేవునిచేత పరిచర్య కొరకు పిలువబడిన స్త్రీల విషయములో మనము ఎంత మాత్రము తీర్పు తీర్చకూడదు. అది దేవునికి మరియు వారికి మధ్యలో ఉండే విషయము వారి పని దేవుని వాక్యము చేత అంచనా వేయబడుతుంది. అయితే స్త్రీలు పురుషులను నడిపించకూడదని పౌలు స్పష్టముగా తెలియజేయుచున్నాడు.

ఒక బలమైన ప్రకటన చేయుటకు పౌలు లేఖనములను ఆధారము చేసికొన్నాడు (2:13-15). పురుషులు సంఘములోని

మరియు కుటుంబములోని నాయకులుగా ఉండుట అనునది స్త్రీలను నియంత్రించుట కొరకు కాదు, కాని దేవుడు వారిని సృష్టించినపుడు ఏ పాత్ర పోషించుటకు ఏర్పరచినాడో, దానిని సమవర్థంతముగా చేయుటకు, తద్వారా అందరికీ మేలు కలుగుటకు ఉద్దేశించినాడు. స్త్రీలు స్వాభావికముగా ఇతరులపట్ల శ్రద్ధ తీసుకొంటారు, ప్రేమ మరియు దయగా నడుచుకొంటారు, అయితే కొన్నిసార్లు వారు చేస్తున్నది వాస్తవమైనదే అని నమ్ముతారు అది దేవునికి వ్యతిరేకమైనది అయినప్పటికీ హవ్వ పండు తీసుకొని ఆదామునకు ఎలా ఇచ్చినదో అలాగున చేస్తారు (ఆది 3).

పౌలు ఏదేనులో జరిగిన పాపము విషయమై ఆదాము బాధ్యుడని చూపించినాడు. ఆదాము అవ్వ కంటే ఎక్కువగా తెలిసిన వాడు. స్వేచ్ఛా పూర్వకముగా పాపము చేయుటలో అవిధేయుడుగా ఉండుటలో ఆదాముదే ఎక్కువ బాధ్యత ఉంటుంది (ఆది 2: 14). దైవ భక్తిగల మనుష్యులు ప్రేమతో మరియు యేసు చూపించిన మాదిరిని అనుసరించి నడుచుకొన్నట్లయితే స్త్రీలు వారిని నమ్మి తమ్మునుతాము సమర్పించుకొంటారు. వారు యేసునకు ఎలా అప్పగించుకుంటారో తాను తమ భర్తలకు కూడా అప్పగించుకొంటారు. కొంతమంది స్త్రీలు ఎల్లప్పుడు దేవుడు తమ కిచ్చిన అధికృత కంటే ఎక్కువగా ఉండాలని కోరుకుంటారు. కాని చాలామంది స్త్రీలు తమను ప్రేమతో, సున్నితముగా నడిపించే పురుషుల నాయకత్వమునకు లోబడాలని చూస్తారు. మన దృష్టి స్త్రీలను ఎలా నియంత్రించాలి అని కాకుండా పురుషులు క్రీస్తువంటి నాయత్వము వహించువారిగా ఉండుటకు వారికి తర్ఫీదు ఇవ్వాలి. దానినే తిమోతి చేయాలని పౌలు చెప్తున్నాడు, దానినే మనముకూడా ఈ రోజులలో చేయాల్సిన అవసరత ఉంది.

**పౌలు సలహా**

స్త్రీలు సంఘములో గొప్ప సహకారాన్ని అందించగలరు. కాబట్టి వారిని పరిచర్య చేయుటకు అనుమతించుము. కాని పురుషులు మాత్రమే ఇతర పురుషులపై అధికారమును చేయవలెను.

**పురుషులు**

యేసు తన జీవితకాలములో స్త్రీల పట్ల ప్రవర్తించినట్లు నీవు కూడా వారిపట్ల ప్రవర్తిస్తున్నావా? స్త్రీలతో నడుచుకొను విషయములో క్రీస్తువంటి మనస్సు కలిగియుండుటకు నీకు ఏది అవసరమైయున్నది?

**స్త్రీలు**

నీపైని అధికారులుగా ఉన్న మనుష్యుల పట్ల గౌరమును, మరియు మర్యాదను చూపగలుగుతున్నావా? యేసును ఎలా నమ్మి యున్నావో అలాగే వారిని కూడా అలాగే నమ్ముము. నీవు యేసునకు సమర్పించుకొన్నట్లయితే, నీ భర్త ద్వారా మరియు నాయకుల ద్వారా నీవు నడిపించబడుతున్నావని నమ్ముము. వారితో ఏకీభవించక పోయినప్పటికీ వారి నాయకత్వమును అంగీకరించుము. వారిని నమ్మలేక పోయినప్పటికీ యేసును నమ్మగలవు.

## 6. కాపరి చేయవలసినవి (1 తిమో 3: 1-3)

దేవుని ప్రజల నాయకునిగా ఉండుట గొప్ప అధిక్యత కాని అది గొప్ప బాధ్యత కూడా. దేవుడు మనము ఏమి చేయాలని చూస్తున్నాడు అని తెలుసుకొనుట ప్రాముఖ్యమైనది. పౌలు దీనిని తిమోతికి మరియు మనకు కూడా తెలియజేసినాడు.

'ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల అతడు దొడ్డ

పనిని అపేక్షిస్తున్నాడు... (3:1).
అధ్యక్షుడు అను మాట "ఎపిస్కాపాస్" అను గ్రీకు పదమునుంచి తీసుకోనబడినది. దీనికి పలు విధములైన పేర్లు వాడినారు. నేటి దినములలో ఇది కాపరికి కూడా అపాదించబడినది. అధ్యక్షుడు అను బిరుదు అన్యజనుల నుండి రక్షింపబడినది సంఘములపైన పర్యవేక్షకుడిగా, కాపరిగా, ఉండువారికి ఇవ్వబడినది.

దీని యొక్క వాస్తవ అర్ధము "సంరక్షుడు" లేదా అన్యజనుల సంఘములపైన ఆధ్యాత్మిక నాయకుడు ( 1తిమో 3: 1-7) తీతు 1: 7-9: 1 పేతు 5: 1-4).

యూదుల సంఘములపైన నాయుకునిగా ఉండు వ్యక్తికి 'అధికారి' లేదా పెద్ద అను పదము వాడబడినది. ఈపదము 'ప్రెసూటెరోన్' అను గ్రీకు పదము నుంచి ఇవ్వబడినది. దీనినే మనము నేడు ప్రెస్బిటర్ అని పిలుస్తాము. యూదుల సమజమందిరము నందు పర్యవేక్షణ చేయు అధికారికి ఈ పదము వాడబడినది. సమాజ మందిరములు తరువాత సంఘములుగా మారినపుడు వారు అదే బిరుదులతో పిలవబడినారు (1 పేతు 5: 1-4 1 తిమో 5:1,17, 19: తీతు 1: 5-6).

'కాపరి' అను పదము 'పోయ్మెన్' అను గ్రీకు పదము నుంచి వచ్చినది. దీని యొక్క అర్ధము "కాపరి". కాపరి అనగా మార్గము చూపువాడు, నాయకుడు, గొర్రెలను మేపువాడు (1 పేతు 5:1-4 ఎఫె 4:11). ఈ పత్రికలో వాడబడిన 'పరిచారకుడు' అను పదము 'డైకోనోస్' అను గ్రీకు పదము నుంచి వచ్చినది. ఈ పదము యొక్క వాస్తవ అర్ధము ఒక బల్ల యొద్ద నిలిచి సేవ చేయుటకు ఎదురు చూసేవాడు. పరిచారకులు సంఘములో కార్యాలయమునకు సంబంధించినవారు అయినప్పటికీ ఈ పదము సంఘకాపరికి కూడా వర్తిస్తుంది.

పైన పేర్కొనబడిన ఈ పదములన్నియు, కాపరి లేదా ఆధ్యాత్మిక నాయకుడు మరియు విశ్వాసుల సమూహమునకు నాయుకులుగా ఉన్నారు. కాపరి ఏమి చేస్తాడో వివరిస్తున్నాయి. కాపరి మరియు పర్యవేక్షకుడు సంఘమును నిర్వహించు మరియు పర్య వేక్షించు వానిని సూచిస్తుంది. పెద్దగా పేర్కొనబడిన వ్యక్తి కూడా దీనికి దగ్గరగా చూపబడినది. కాని, బిషప్పు లేదా అధ్యక్షుడు అను వ్యక్తి అన్యజనుల సమాజముపైన పర్యవేక్షకుని సూచించుచున్నది. ఎఫె 4: 12- 16 భాగమునందు కాపరులు పరిశుద్ధులు సంపూర్ణలగునట్లు, పరిచర్య ధర్మము నిర్వర్తించుటకు కాపరులు నియమించబడినారు. మనము అన్నియు చేయగలమని పౌలు చెప్పుటలేదు. కాని వీటన్నిటిని చేయటకు బాధ్యత కలిగియున్నాము. ప్రతి విశ్వాసికి దేవుడు వేర్వేరు వరములను ఇచ్చియున్నాడు. ఏ వ్యక్తి కూడా ప్రతి దానిని చేయలేదు. దేవుడు మనకిచ్చిన వరములను, ఇతరులకు అనుగ్రహించిన వరములతో కలసి ఉపయోగించవలెను. ఎందుకనగా సంఘములో ఉన్న సభ్యులందరు కలిసి సహకరించుకొంటూ పనిచేయవలయును (1 కొరింథి 12).

సంఘ నాయకులు యేసును మాదిరిగా కలిగి యుండి సంఘమును నడిపించవలెను. పరిచారకుడు దేవుని సేవకుడు. మనము ఆయన ప్రజలకు సేవ చేస్తున్నాము దానియొక్క అర్థము మనము ప్రతిది వారు కోరినది లేదా ఆశించునది కాదు దేవుడు మన నుండి ఏమి కోరుతున్నాడో దానిన మనము వారికి చేయాలి. మంచి తల్లిదండ్రులు తమ పిల్లలు కోరే వాటన్నింటని చేయరు కాని వారికి ఏది మంచిదో దానిని వారు చేస్తారు. పిల్లలకు దానిని గూర్చి తెలియక పోయినప్పటికీ దానిని వారు చేస్తారు. మనము దానికి లోబడుట ద్వారా మరియు ఆయనను నమ్ముట ద్వారా ఆయనను సేవిస్తుంటాము కాపరి (పాస్టర్) అను పదము వీటన్నింటిని సంగ్రహిస్తుంది.

మనము మన గొర్రెలను ప్రమాదము నుండి, తప్పుడు బోధకుల నుండి పాపము నుండి మరియు వారిని తప్పుతోవ పట్టించు పరిస్థితులన్నింటి నుండి కాపాడుతుంది. వారు విశ్వాసము నందు ఎదుగుటకొరకు వారికి మార్గదర్శకము చూపాలి. దేవుని వాక్యము మరియు కొన్ని సాదృశ్యములతో వారిని నడిపించాలి. దేవుని వాక్యము వారికి బోధించుట ద్వారా వారిని పోషించవలెను. ఇది గొర్రెల కాపరి మరియు సేవకుని యొక్క ప్రాముఖ్యమైన బాధ్యత.

"ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల వాడు దొడ్డ పనిని ఆశించినాడు" (1 తిమో 3:1). ఒక సంఘ నాయకుడుగా ఉండుట ప్రత్యేకమైన, గౌరవప్రదమైన, ప్రశస్తమైన, ఆధిక్యతతో కూడిన బాధ్యతయైయున్నది. దేవుని సేవ చేయుటకంటే ఈ లోకములో మరొకటి లేదు. ఆయన పద్ధతిలో దీనిని చేయవలయును.

### పౌలు సలహా

కాపరులు దేవుని వాక్యమును ప్రజలకు బోధించుటవలన వారిని కాపాడుతూ మరియు సిద్ధపరచవలయును.

దేవుడు చెప్పిన విధముగా ఆయనను నమ్మకముగా సేవిస్తున్నావా? నీ గొర్రెలను సేవిస్తున్నావా? వారిని కాపాడుతూ, నడిపిస్తూ మార్గము చూపుతూ మరియు పోషిస్తూ ఉన్నావా?

## 7. నాయకుని యందు దేవుడు చూచునవి (1 తిమో 3: 1-3)

నేడు కొన్ని సంఘములయందు సామర్థ్యత గల విజయ వంతమైన వ్యాపారవేత్తలు, లేదా ప్రాముఖ్యమైన విద్యావంతులైన వారిని నాయకులుగా చేయుటకు ప్రయత్నిస్తారు. వారు దైవ భక్తిగల జీవితములేని వారైనప్పటికీ వారిని సంఘ నాయకులుగా చేయుటకు

ప్రయత్నిస్తారు. లోకములో ఉండే వారి స్థాయిని బట్టి, హోదాను బట్టి, పురషులను సంఘ నాయకులుగా ఎన్నుకొన్నట్లయితే సంఘములో సమస్యలు తలెత్తుతాయి.

ఎఫేసి నందలి ఉన్న గృహ సంఘములు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంఘ నాయకులకు ఉండవలసిన లక్షణముల జాబితాను పౌలు 1 తిమోతి 3 నందు వ్రాసినాడు. "మరియు అధ్యక్షుడు నిందారహితుడు, తన భార్యపట్ల నమ్మకస్తుడు లేదా మరియు ఏకపత్ని పురుషుడు, మితానుభవముగలవాడు, స్వస్థబుద్ధిగలవాడు, మర్యాదస్తుడు, అతిథిప్రియుడు, బోధింప తగినవాడు, మద్యపాని కొట్టువాడును కాక, సాత్వికుడు, జగడ మాడనివాడు, ధనాపేక్షలేనివాడై యుండవలెను... (1 తిమో 3:2-3).

కాపరికి ఇవి ఉండటము అనునది ఒక సలహా ఇచ్చినట్లుగాక ఆజ్ఞగా చూపిస్తున్నాడు. ఎఫెసీ నందలి నాయకులు తప్పక ఆయన చెప్పినట్లుగా పురుషులై ఉండాలి. పౌలు నాయకులలో ఉండావలసిన తలాంతులు, విద్య, నైపుణ్యతలు మరియు శిక్షణ గూర్చి చెప్పుట లేదు. వారు ఎలాంటి వారై ఉండాలి అనునది వ్రాస్తున్నాడు.

సంఘ సభ్యులు "నిందారహితుగా" ఉండాలి. వారి జీవితమును బట్టి ఎలాంటి విమర్శలకు లేదా నిందకు అవకాశము లేనివారై ఉండాలి. వారు తప్పుచేసినపుడు క్షమాపణ కోరాలి, వారు ఎప్పుడైన పాపము చేసినపుడు ఒప్పుకొనవలెను, వారు పరిపూర్ణులై ఉండలేకపోవచ్చు కాని యేసువలే ప్రవర్తించుటకు నిరంతరము కష్టపడవలెను.

నిందారహితుడై ఉండాలి అని చెప్పిన తరువాత, వ్యక్తి వివాహ జీవితముతో ప్రారంభిస్తాడు. అతడు తన భార్య పట్ల నమ్మకస్తుడై ఉండాలి. దీని అర్థము తన భార్య పట్ల దైవభక్తిగల భర్తగా ఉండాలి. ఏకపత్ని పురుషుడై ఉండాలి. అంటే వివాహము కాని వాడు కాని,

భార్య చనిపోయిన గాని,  సంఘనాయకుడుగా ఉండకూడదని కాదు, పురుషుడు యేసు తనపట్ల ప్రవర్తించినట్లు తాను తన భార్య పట్ల ప్రవర్తించవలెను. అతడు ఆమె అవసరాలను తీర్చునపుడు ఆమెను ప్రేమతో, సున్నితమైన రీతిగా నడుచుకొనవలెను. ఒక పురుషుడు తన భార్యతో సరియైన సంబంధాన్ని కలిగియుండకపోతే అతడు కాపరిగా ఉండలేడు. పేతురు దీనికి కొంత కలుపుతూ అతడు తన భార్యపట్ల సరియైన విధానములో ప్రవర్తించకపోతే అతని ప్రార్థనలు ఎంత మాత్రము సమాధానము ఇవ్వబడదు (1 పేతు 3:7).

పౌలు ఈ మనుష్యులకు ఉండవలసిన లక్షణము వివరణ వ్రాస్తున్నాడు. “మితానుభవుడు” అనుమాటకు అశానిగ్రహము కలవాడు. దీని అర్థము అక్షరాల “స్వస్థ చిత్తము” గలవాడు లేదా మంచి మనస్సుగలవాడు అని అర్థము. అతడు మంచి నిర్ణయాది కారము గలవాడు. మర్యాదస్తుడు అనగా ఇతరులను గౌరవించువాడు మరియు మెచ్చుకొనువాడు. “అతిధి ప్రియుడు” అనగా యధార్థ హృదయముతో,దాతృత్వముతో అవసరములో ఉన్న వ్యక్తికి సహాయము చేయువాడు. పాస్టరు దేవుని వాక్యమును బోధించు సామర్థ్యం కలిగి యుండుట ముఖ్యమైన బాధ్యతయై యున్నది. అతడు దేవుని వాక్యము చదివే వ్యక్తికి తనకు దేవుడు ఇచ్చిన సామర్థ్యము వలన సత్యమును అందించవలయును.

ఇంకా కొన్ని స్వభావ లక్షణాలు కాపరిలో ఉన్నట్లయితే అతడు ఎంతమాత్రము దేవుని ప్రజలను నడిపించలేడు. “మద్యపానియు” మొదట వాడబడినది ద్రాక్షరసము త్రాగుట బైబిల్ యందు నిషేధించ బడలేదు. కానీ ఇది మితిమీరకూడదు.” కొట్టువాడు గాక సాత్వీకుడై సంఘ కాపరి వాదనలు పెట్టుకొనువాడుగా ఉండకూడదు. అతడు లోభిగాగాని, ధనాపేక్షపరుడుగా ఉండకూడదు.

పౌలు తన జాబితాలో ఇచ్చిన మొదటి స్వాభావిక లక్షణమును వివరిస్తున్నాడు. కాపరి తన ఇంటివారిని స్వాధీనములో ఉంచువాడై యుండాలి. ఎందుకనగా అతడు తన కుటుంబము పట్ల శ్రద్ధ తీసుకొనుటలో శ్రద్ధ లేనట్లయితే తన కుటుంబము పట్ల కూడా శ్రద్ధ తీసుకోలేడు. సంఘములో కుటుంబంలో తలెత్తిన ప్రతి పరిస్థితులు, వివాదములను, ప్రేమతో సున్నితముగా పరిష్కరించవలెను యేసు తనతో వ్యవహరించినట్లు తాను ఇతరులతో వ్యవహరించవలెను

పౌలు నాయకుడు ఎంత మాత్రము క్రొత్తగా రక్షింపబడిన వ్యక్తి కాకూడదు. అను హెచ్చరికతో ముగిస్తున్నాడు. అతడు పరిపక్వత చెందిన వ్యక్తిగా ఉండాలి. అతడు యేసుతో వ్యక్తిగత సంబంధమును కలిగియుంటూ, శోధనలను జయించువాడుగా యుండాలి. కొన్నిసార్లు గర్వము మరియు స్వార్థ కేంద్రితమైన వ్యక్తిత్వము గలవాడు ఇతరులు అతనిని సరిచేయునపుడు దానిని స్వీకరించుటకు ఇష్టపడడు.

నాయకుడు సంఘము వెలుపలి వారితో మంచి సాక్ష్యము కలిగి యుండాలి అను సాధారణమైన ప్రకటనతో పౌలు ముగించు చున్నాడు. ఈ లక్షణములన్నియు నిజమైన దైవజనునికి ఉండవలెను. ఎందుకనగా వారు యేసును, నిజమైన మనిషిగా ఉన్న దేవుని గూర్చి వివరించవలెను. మనము ఆయనకు ప్రాతినిధ్యము వహిస్తూ, ఆయన వలె ఉండవలెను.

## పౌలు యొక్క సలహా

కాపరులు తమ చుట్టు ఉన్న వారికి యేసుకు సాదృశ్యముగా ఉండాలి.

ఈ గుణలక్షణాల విషయములో నీకు నీవు ఎంత విలువను ఇవ్వగలవు? నీవు ఏ గుణ లక్షణము విషయములో దృఢంగా ఉన్నావు?ఏ గుణలక్షణము విషయములో బలహీనముగా ఉన్నావు?

నీ బలహీనమైన స్థితి విషయములో దానిని బలపరుచుకొనుటకు నీవు ఏమీ చేస్తున్నావు?

## 8. సంఘ పరిచారకుల యందు దేవుడు చూచునవి (1 తిమో 3: 8–16)

క్రైస్తవ సమాజమును నడిపించే నాయకుడు ఈ దైవ స్వభావముగల లక్షణములను కలిగియుండుట ఎంతో అవసరమై యున్నది. ఎఫెసీలో ఉన్న సంఘములో దీనిని కలిగి యుండకపోవుట వలన చాలా కష్టాలను ఎదుర్కొన్నది. ఈ లక్షణాలు లేని నాయకులు సంఘమును సరిదిద్దుటగు అర్హులుగా ఉండలేకపోయారు. కాబట్టి సంఘమునందు భక్తిగల నాయకులు అవసరమైయున్నది. ఇది సంఘ నాయకత్వ పాత్రను పోషించు నాయకులకైనను వర్తిస్తుంది.

ఆదిమ సంఘమునందు యెరుషలేములో ఉన్న అపోస్తలులు ప్రజలయొక్క శారీరక అవసరాలు తీర్చుటలో సమయము ఇవ్వటం ద్వారా వారు వాక్యము చదువుట యందును, ప్రార్థించుట యందును సమయము గడపలేక పోయారు. కాబట్ట ప్రజల భౌతిక అవసరతలు తీర్చుటలో మరియు ప్రజల ఆస్తుల విషయములలో శ్రద్ధ తీసుకొను టకు పరిచారకులను నియమించినారు. (అపో. 6)

1 తిమో 3:8–10 నందు పౌలు వివరించినట్లు 'అలాగుననే' పరిచారకులు మాన్యులై యుండి ద్విమనస్కులును, మిగులు మద్య పానాసక్తులును, దుర్లాభము నపేక్షించువారునై యుండక విశ్వాసము మర్మమును, పవిత్రమైన మనస్సాక్షితో గైకొనువారై యుండవలెను. మరియు వారు మొదట పరీక్షింపబడవలెను. తరువాత వారు అనింద్యులైతే పరిచారకులుగా ఉండవచ్చును.సంఘ నాయకులకు గల దైవభక్తిగల లక్షణములు (3:17)

సంఘ పరిచారకులకు కూడా ఇవ్వబడినవి (3:8-12). 'అలాగుననే' అనగా వారు కూడా దైవభక్తిగల పురుషులై యుండాలి. వారు వేరు వేరు కృపావరములు కలిగి యుండవచ్చును. గాని వారు కూడా యేసు యొక్క మాదిరి కలిగి యుండాలి. పౌలు తిమోతికి ఆజ్ఞాపిస్తూ మొదట వారు పరీక్షించపబడవలెను తరువాత అనింద్యులైతే పరిచారకులుగా ఉండవచ్చు. వారు గౌరవింప తగినవారుగా ఉండి ప్రజలలో మంచి పేరు పొందిన వారై యుండాలి. వారు నమ్మకమైన వారై ఉండాలి. వేషధారణ మోసము లేని వారుగా, యధార్థవంతులుగా ఉండాలి. మద్యపానాసక్తులుగా ఉండకూడదు. మరియు వారు ధనాపేక్ష, లోభత్వము లేనివారై యుండాలి. వారు నమ్మకస్తులై ఉండాలి (3:9) వారు సమర్థులుగానూ మరియు ఆధారపడదగిన వారుగా ఉండాలి. (3:10)

పౌలు పరిచారకులు దైవభక్తిగల భర్తగానూ, మంచి తండ్రిగాను ఉండాలి అని నొక్కి చెప్పినాడు (3:12). వీరు మొదట ఇంటివారి యొక్క అవసరతలను తీర్చి వారిని సరియైన మార్గము నందు నడపి, సంఘనాయకులకు సహాయకులుగా ఉన్నట్లయితే వారు ఇప్పుడు దీవింపబడి నిత్యత్వములో బహుమానము పొందగలరు (3: 13).

పురుషులైన పరిచారకులను గూర్చి మాట్లాడుతూ స్త్రీ పరిచార కులుగా ఉండవలసిన లక్షణాలు వ్రాసినాడు. స్త్రీ పరిచారకులు స్త్రీలుగాను మరియు పిల్లలకును సమర్థమతముగాను మరియు సులభముగాను సేవచేయగలరు.

వీరు సంఘనాయకులకు సహాయకులుగా పనిచేయు అధికృతను కలిగి యున్నారు. అటువలే పరిచర్య చేయు స్త్రీలు మాన్యులై, కొండెము చెప్పనివారును, మితానుభవము గలవారై అన్ని విషయములలో నమ్మకమైన వారై యుండవలెను (1 తిమో 3:11)

దైవ భక్తిగల స్త్రీలు యేసుకొరకు మంచి నిదర్శనముగా ఉండాలి.పరిచర్య చేయు స్త్రీలు మాన్యులై ఉండాలి. కొండెములు చెప్పు వారిగా ఫిర్యాదులు చేయువారుగా ఉండకూడదు. వారువారి భావోద్రేక ములను తమ స్వాధీనములో ఉంచుకొంటూ మితానుభవము గలవారుగా ఉండాలి. మద్యపానాసక్తులుగా ఉండదారు (3:11). వారు పరిపక్వత లేని వారైతే సంఘములో గొప్ప నష్టము మరియు ఇతరులు బాధపడుటకు ప్రమాదముగా మారుతుంది.

దీనంతటిని సంఘములో జనులెలాగు నడుచుకొనవలెనో తిమోతి తెలుసుకొని, వారి ప్రవర్తన విషయమై సరిదిద్దవలెనని తెలియ జేయుచున్నాడు. మరియు పౌలు తాను వ్యక్తిగతముగా ఎఫెసీ సంఘమును దర్శించి వ్యక్తిగతముగా కలుసుకొంటానని తిమోతిని ప్రోత్సహిస్తున్నాడు. సంఘమును జీవముగల దేవుని సంఘముగా అభివర్ణిస్తూ క్రీస్తు యొక్క దైవత్వము మరియు మానవత్వ లక్షణాలను తెలియజేసి ఆదిమ సంఘ స్తుతి కీర్తనను వివరించినాడు (3: 16).

## పౌలు సలహా

సంఘములో పరిచర్య చేయుటకు పరిపక్వమైన నమ్మకమైన మరియు దైవభక్తిగల క్రైస్తవుల కొరకు ఎదరుచూడుము.

నీ సంఘమును గూర్చి పౌలు పత్రిక నీకు వ్రాసినట్లయితే అతడు ఏమని చెప్తాడు? అతడు ఏ సమస్యలను ఎత్తి చూపిస్తాడు? వాటి గురించి ఏమీ చేయాలని చెప్తాడు? నీ సంఘములో ఉన్న నాయకులకు మరియు పరిచారకులకు ఏమని చెప్తాడు?

## 9. అబద్ధ బోధకుని ఎలా గుర్తించుట. (1 తిమో 4: 1-5)

నేను ఒక యౌవన కాపరిగా ఉన్నపుడు ఒక తప్పుడు బోధను బోధించు వ్యక్తి మా సంఘమునుకు వచ్చినాడు. అయితే చాలాకాలము వరకు అతడు తప్పుడు బోధకుడు అని తెలియలేదు. అతడు అందరితో చాలా స్నేహ భావముతో మెలిగినాడు. అతనికి బైబిలు బాగా తెలుసు మరియు అతడు అంకితభావముగల క్రైస్తవునిగా మెలిగినాడు. చాలా కాలము తర్వాత సంఘములో సమస్యలు తలెత్తినాయి. అతడు బైబిలులో లేని విషయాలను బోధిస్తున్నాడడని గుర్తించినాను. అప్పటికే చాలామంది అతని బోధను నమ్మి ఆయనను అనుసరించినారు. ఎందు కనగా అతని మాటలు చాలా ఒప్పించేవిగా ఉన్నాయి. ఆ తరువాత అతనిని సంఘమునుంచి తొలగించటం చాలా కష్టమైనది. కొందరు వ్యక్తులు సంఘమును విడిచి ఎన్నడు తిరిగి రాలేదు. చాలా కాలము తరువాత ఇదే సంఘటన మరలా సంభవించినది. అయితే ఈసారి అది ఒక స్త్రీ ద్వారా కలిగినది. ఆమె చాలా ఆధ్యాత్మిక వ్యక్తిగాను, ఇతరులను ఆకర్షించే వ్యక్తిత్వము కలిగియుంగుట ద్వారా ఆమెను చాలామంది అనుసరించినారు. ఆమె దేవుని వాక్యమందు లేని విషయాలు బోధించినది. నాయకులు సత్యముకొరకు నిలువబడినపుడు తప్పుడు బోధ చేయువారిని సంఘమునుంచి తొలగించనప్పుడు వారిద్వారా సంఘములో గొప్ప నష్టము కలుగుతుంది. సంఘములో తప్పుడు బోధకులు చూపిన ప్రభావము ఎంత మాత్రము తొలగించలేక పోయాను. తిమోతికి కూడా ఇది చాలా కష్టమైనది. కాని తిమోతి దానిని చేయగలినాడు.

దైవభక్తిగల నాయకులు మరియు పరిచారకులు ఎలా ఉండాలో పౌలు మొదట వివరించినాడు.
తరువాత సంఘమునకు వినాశకులుగా ఉండే భక్తి హీనులైన

బోధకులు ఎలా ఉంటారు అను విషయమును వివరించినాడు. సాతానుడు చాలాసార్లు సంఘముపై ఎలా దాడి చేస్తాడో వివరించి నాడు. కొన్నిసార్లు సంఘములోపల వ్యక్తుల ద్వారా లేదా సంఘము బయట నుండి కూడా దానిపైబడి ఎదుర్కొంటాడు.

కాబట్టి మనము సంఘములోని దేవుని ప్రజలను ఎలా కాపాడాలో మరియు వారిని తప్పుడు త్రోవకు నడిపించు వ్యక్తుల నుంచి ఎలావిడిపించగలమో తెలుసుకొని యుండాలి. “అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికులు వేషధారణవలన మోసపరుచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు ( I తిమో 4:1). “కొందరు” అనుమాట చాలా పెద్ద సంఖ్యను తెలియజేస్తుంది. యేసు తిరిగి వచ్చేనాటికి సత్యము నుంచి తొలగిపోవువారి సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఇది కేవలము పౌలు యొక్క భావనకాదు. దేవుని యొక్క ఆత్మదానిని తెలియజేయుచున్నాడు.

“విడిచిపెట్టుట” అనుమాట మతభ్రష్టత్వము అను అర్థమిచ్చు గ్రీకు పదము నుండి వచ్చినది. దీని యొక్క అర్థము “దూరముగా తొలగిపోవుట” లేదా “వెడలిపోవుట”. సంఘములో క్రైస్తవులుగా ఉన్న వారు బైబిల్ యొక్క సత్యము నుండి తొలగిపోయి దాని యందలి కొన్ని ప్రాథమిక సూత్రములను తిరస్కరిస్తారు. కానీ వారు దేవుని సంఘమును విడిచిపెట్టరు. లేదా వారిని వారు క్రైస్తవులుగా పిలచు కోవడం మానరు. వీరు సంఘ సహవాసములో ఉంటూనే ఎవరిని సత్యమునుంచి త్రోవ తప్పించగలరో వారిని తప్పిస్తారు. సాధారణ ముగా సంఘము  విశ్వాసములో బలముగా లేనపుడు మరియు క్రైస్తవులు వారికి వ్యతిరేకంగా నిలబడనంత వరకు వారు ప్రజలను మోస పరుస్తూనే ఉంటారు. ఇది దేవుని ఆత్మవలన కలుగునది కాదు.

ఇది సాతాను నుంచి మరియు మోసపరుచు ఆత్మలనుంచి మరియు దయ్యముల బోధ నుండియు సంభవిస్తాయి. సాతాను మొదట దీనిని ఏదెను వనము నందు హవ్వ యొద్ద చేసినది (ఆది 3). అది నేటి వరకూ జరిగిస్తూనే ఉంది.

ఇలాంటి తప్పుడు బోధించు సాదృశ్యములను ఎన్నిటినో నేడు మనము చూడగలము. కొందరు క్రైస్తవులు, సంఘములు మరియు కొన్ని సంస్థలు యేసు కన్యకు జన్మించుట మరియు ఆయన మానవుడు దేవుడు అను సత్యమును నిరాకరిస్తారు. మన సంఘములలో చాలా మంది బైబిల్ దైవావేశము వలన వ్రాయబడినదని నమ్మరు. దేవుడు ప్రేమగలవాడు కాబట్టి ఆయన నరకమునకు పంపడు కాబట్టి నిత్య శిక్షను తిరస్కరిస్తారు. కొందరు వారికి ప్రత్యేకమైన జ్ఞానము దేవుని యొద్దనుండి కలిగినది కావున వారిని వారు ప్రవక్తలుగాను మరియు ప్రవక్తినిలుగానూ పిలుచుకొంటారు. కొందరు దేవుడు అందరిని ఆరోగ్యవంతులుగాను, మరియు ఐశ్వర్యవంతులుగాను ఉండాలని కోరుకొంటున్నారని బోధిస్తారు. కొందరు ఇప్పటికీ మనము రక్షించ బడుటకు కొన్ని మంచి కార్యములు చేయాలని చెబుతారు. కొందరు పాపమును గూర్చి తక్కువగా మాట్లాడుతూ చట్టబద్ధమైన విషయము లను మరియు మానవీయతను గూర్చి చర్చిస్తారు. మనము ఆధ్యాత్మిక వ్యక్తులుగా ఉండాలి అంటే వివాహము నిషేధించాలని మరియు కొన్ని ఆహారపదార్థాలు తినుట మానాలని బోధిస్తారు. (4: 3-5). వారు జ్ఞానానుభవము గల అధికారముతోను మరియు ధైర్యముగా మాట్లాడతారు. అయితే వారు సాతాను సంబంధమైన అబద్దములను వ్యాప్తి చేస్తున్నారు తిమోతి దీనికి ఎదుర్కొన్నాడు. నేటి దినములలో మనము కూడా వీటినిఎదుర్కొంటున్నాము.

పౌలు వీరిని “అబద్దికుల వేషధారణ” అని పిలుస్తున్నాడు. “ఆ బోధలు అబద్దికులైన వేషదారుల నుండియు ఎవరి మనస్సాక్షి

వాత వేయబడుతుందో వారి నుండియు కలుగుతుంది" (4:2). వారు దేనిని నమ్ముచున్నారో అది సరియైనదని తమకు తాము ఒప్పించ బడతారు. ఎందుకనగా వారి మనస్సాక్షి వాత వేయబడి చచ్చినదై వారికి వ్యతిరేకముగా హెచ్చరించు ఆత్మ యొక్క హెచ్చరికను గ్రహించలేరు (4: 2).

పౌలు అలాంటి తప్పుడు బోధకులు అంత్య దినముల యందు ప్రజలలోనికి వస్తారని తిమోతికి గుర్తు చేస్తున్నాడు. అయితే వారు దేవుని వాక్యము నందు సరియైన జ్ఞానము లేనటువంటి వారిని మోసపరిచి, తప్పు త్రోవలో నడిపిస్తారు. వారి వ్యతిరేకతకు భయపడకుము, సత్యము కొరకు నిలువబడుము. దేవుని కృపను బోధించుము. చట్టపరమైన పారంపర్యాచారములను బోధించకుము. దేవుని వాక్యమును బాగుగా ఎరిగి యుండుము. దాని యందలి సత్యము కొరకు నిలువబడుము.

**పౌలు సలహా**

దేవుని వాక్యమును, సత్యమును అంగీకరించని చాలామంది తమ్మును తాము దేవుని ప్రతినిధులుగా ప్రకటించుకొంటారు. జాగ్రత్తగా ఉండుము. వారిని మరియు వారి బోధచేత సంఘమును ప్రభావితము చేసిన విషయాలను తొలగించుము.

నీవు ఎప్పుడు తప్పుడు బోధకులతో వ్యవహరించినావు? ఏమి సంభవించినది? దేవుని వాక్యమునకు భిన్నముగా బోధిస్తున్నారని నీవు తెలుసుకొన్న వెంటనే ఏమీ చేశావు? నీవు ఏదయినా సత్యము కాని దానిని బోధిస్తున్నట్లయితే నీవు దేవుని అడుగుము.

## 10. ఆజ్ఞాపించుము మరియు బోధించుము
## (1 తిమో 4: 6-11)

పౌలు కేవలము తప్పుడు బోధకులను ఎలా గుర్తించాలి అని వివరించి మరియు వారి విషయములో ఏమి చేయాలి అని తెలియ పరిచినాడు. "ఈ సంగతులను సహోదరులకు వివరించిన యెడల నీవు అనుసరించుచు వచ్చిన విశ్వాస బోధ సంబంధమైన వాక్యముచేత పెంపొందుచు క్రీస్తు యేసునకు మంచి పరిచారకుడవై యుందువు (1తిమో 4:6). తప్పుడు బోధకుల బోధను సవాలు చేస్తూ దానిని సరి చేయాల్సిన బాధ్యత తిమోతిపై యున్నది. తిమోతి సత్యమును బోధించి నప్పుడు విశ్వాసులు తప్పుత్రోవకు నడిపించబడరు. దీనిని చేసే ప్రక్రియలో తిమోతి దేవుని వాక్యమును బాగా తెలుసుకుని యుండాలి. అతడు దానిని క్రమముగా చదువుతూ బోధించవలయును.

తిమోతి పౌలు చేత బోధించపడిన వన్నియు అతడు ఆచరణలో ఉంచి వాటిని అవసరతలలో ఉన్న వారికి బోధించ వలయును. తిమోతి వాటిని బోధిస్తున్నపుడు ఎదుర్కొనే సవాళ్లను బట్టి భయపడి వాటిని బోధించకుండా ఉండవద్దు. అతడు విశ్వాస, సత్యములచేత పెంపొందించబడినవాడు, కాబట్టి వాటిచేత ఇతరులు విశ్వాసమందు ఎదిగి మంచి నాయకులుగాను దైవభక్తిగల క్రైస్తవులుగా పెంపొందుటకు బోధించవలెను. మనము కూడా వాక్య సిద్ధాంతములు సత్యములు బోధకుల ద్వారా నేర్చుకొన్నాము. వాటిని మనము ఇతరు లకు బోధించవలెను.

నకిలి సత్యము వ్యాప్తి చెందకుండా ఉండుటకు మనము సత్యమును బోధించవలెను. నకిలీ సత్యమును గుర్తించుటకు వాస్తవ సత్యమును తెలుసుకొనవలెను.
నకిలీ నగలు మరియు డబ్బు ఉన్నట్లుగానే నకిలీ సూత్రము కూడా

ఉంటుంది. ఏదయితే లేఖనముల ప్రకారము బోధింపబడదో దానిని తిరస్కరించవలయును (4: 7a)

"అపవిత్రములైన ముసలమ్మ ముచ్చట్లు" మరియు భక్తి హీనమైన కల్పితములు బైబిలు చేత బోధింపబడనివి ఆ రోజులలో ప్రసిద్ధమైనవి. అసలైన సుబోధ ఎరుగని వారు వాటిపైన తమ దృష్టిని ఉంచుతారు. వీటిని గూర్చి చాలాసార్లు వాదనలు, చర్చలు నిర్వహి స్తారు. కాని అవి సత్యమైనవి కావు. ఇతరులు కనుగొనని రహస్య సత్యములను కనిపెట్టుతున్నామని అనుకొంటారు. కొందరు దురద చెవులుగలవారై వాటిని వినుటకు ఇష్టపడతారు (2 తిమో 4:2). వారు దగ్గరి మార్గముల ద్వారా ఆధ్యాత్మిక పరిపక్వత చెందుటకు ప్రయత్నిస్తారు. మరియు జీవితములో వాక్యము వినకుండా, ఎదుగకుండా విజయము సాధించాలని చూస్తారు. వారు దేవుని వాక్యసత్యముల విషయమై విసుగుచెంది కొంత భిన్నమైన మరియు కొత్త విషయాలు వినుటకు ప్రయత్నిస్తారు.

స్వీయ క్రమశిక్షణ కలిగియుండుటకు దేవుని వాక్యమును ఖచ్చితముగామరియు పూర్తిగా అధ్యయనము చేయవలయును. ఒక క్రీడాకారుడు శిక్షణ ద్వారా తన శరీరమును శక్తితో నింపుకోగలడు (4:7b). శారీరక రక్షణ మన శరీరమును ఎలా ఆరోగ్యముగా మరియు పౌష్టికముగాను ఉంచగలదో, అలాగే ఆధ్యాత్మిక శిక్షణ మన హృదయమును మరియు మన మనస్సును విశ్వాసమందు బలపరుస్తుంది (4: 8). ఇది కేవలముసలహా మాత్రమే కాదు ఇది ప్రతి క్రైస్తవునికి అవసరమై ఉంటుంది. "ఈ సంగతులు బోధించి, ఆజ్ఞాపించుము" (4: 11). ప్రజలు బైబిలును ఎరిగినట్లయితే వారు తప్పిదములను గుర్తించి వాటిని తిరస్కరించగలరు. వారు సత్యమును ఎరిగియుండక పోయినట్లయితే అబద్ధములను శత్రువు వ్యాప్తి చేయుటకు ద్వారా తెరువబడుతాయి.

తిమోతి ఒక సేవకుడు (డైకోనోస్) కాని పౌలు మంచి సేవకునిగా ఉండాలని చెప్తున్నాడు. ఎవరయినను ఒక కాపరి, సంఘ నాయకుడు లేదా పరిచారకుడు అయి యుండవచ్చు. అయితే దేవుడు మనకిచ్చిన పరిచర్య బాధ్యతను ముందుకు తీసుకుని వెళ్లుటకు "మంచి" వారిగా ఉండాలి.

### పౌలు సలహా

దేవుని వాక్య సత్యమును ఇతరులకు బోధించుటకు దేవుని వాక్యమును క్షుణ్ణముగా నేర్చుకొనుట చాలా ప్రాముఖ్యము.

నీవు పరిచర్య సిద్ధపాటు కొరకు నీకు ఎవరు బోధించి మరియు శిక్షణ ఇచ్చియున్నారు? నీవు దేవుని వాక్యమును నేర్చుకునే విద్యార్థివా? కొన్ని నెలల క్రిందటి కంటే నీవు ఇప్పుడు మెరుగుగా ఉన్నావా? నీవు ఎవరిని శిష్యత్వములోనికి నడిపించుచున్నావు?

నీవు దేవుని వాక్యమును తెలుసుకొని, దానిని అన్వయించు కోవాలనే లోతైన కోరిక కలిగి యున్నావా? తప్పుడు బోధ ద్వారా సత్యమునుండి తొలగిపోకుండా ఇతరులకు వాక్యమును బోధించుటలో నమ్మకముగా ఉన్నావా? నీవు మంచి సేవకునివని లేదా కాపరివని దేవుడు చెప్పగలవా? నీవు దేవుని నమ్మకముగా సేవించుటలో నీవు ఎదుర్కొనే కష్టమైన సంఘర్షణ ఏది?

## 11. నేటి కాపరులకు పౌలు ఆజ్ఞాపించునవి (1 తిమో 4: 12-16)

నేటి కాలములో పౌలు క్రైస్తవ సమావేశాలలో మాట్లాడి నట్లయితే అతడు దేనిని తెలియజేస్తాడు? ఆయన ఏసలహాను ఇస్తాడు? అది నీకు ఎంతో సహాయకరముగా ఉంటుంది. 1 తిమోతి పత్రిక

యందు కాపరి పరిచర్యను గూర్చి ఏమి వ్రాసినాడో మనము చదువగలము. బహుశా నేడు కూడా పౌలు వాటిని తెలియజేస్తాడు. దైవభక్తిగల నాయకుని లక్షణాలను పౌలు తిమోతికి తెలియజేసినాడు. తప్పుడుబోధకులు మరియు బోధను వ్యతిరేకించాలని హెచ్చరించినాడు (4:1–5). మరియు తిమోతి దేవుని వాక్యమును బోధించాలని ఆజ్ఞాపించినాడు (4:6–11). దానిని బట్టి వారి మధ్యలో ఏర్పడిన తప్పుడు బోధ నుంచి ప్రజలను కాపాడగలడని తెలిపినాడు. అతడు తిమోతికి ప్రాముఖ్యమైన ఆదేశాలు ఇచ్చాడు.

1. నీవు యౌవనస్తుడవైనందున ఎవరు నిన్ను తక్కువగా చూడనివ్వకు (4:12a)

తిమోతి యౌవనుడైనందున మరియు అనుభవము లేనివాడై నందున ప్రజలు తిమోతి పట్ల గౌరవము కనపరిచేవారు కాదు. ఎందుకనగా తిమోతి తనకు ఎదురయ్యే తిరస్కారము మరియు విమర్శనుబట్టి, తనను ఎదురించేవారికి ఎదురుగా ధైర్యముగా నిలవ బడేవాడుకాదు.

ఎపుడైతే మనము దేవుని కొరకు మాట్లాడుతున్నామో మనము దేవుని అధికారము కలిగి యున్నాము, కాబట్టి మనము భయపడాల్సిన అవసరం లేదు. ఏ కారణమును బట్టి కూడా మనలను ఇతరులు తక్కువగా చూడటానికి అవకాశము ఇవ్వకు. నీ ఎత్తునుబట్టి నీ ఆదాయమును బట్టి, నీ వయస్సును బట్టి నీ విద్యను బట్టి నీవు అవకాశము ఇవ్వవద్దు. యేసు ఆయనను సేవించుటకు నిన్ను పిలిచినాడు. మరియు ఆయన నీ వెనుక ఉన్నట్లయితే ఎవరు ఏమనుకొన్నా అది పట్టించుకోవద్దు.

2. "నీ మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా ఉండుము" (4:12b). ఇతరులు ఏమనుకుంటున్నారో అని ఆలోచించకు దేవుని కొరకు నమ్మకముగా జీవించుము. అది ఇతరులకు మంచి మాదిరిని ఇస్తుంది.

3. "నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చిరించుట యందును, బోధించుట యందును జాగ్రత్తగా ఉండుము" (4:13). "నిన్ను నీవు భక్తితో అప్పగించుకొనుము" అనగా పరిచర్యలో కాపరి లేదా నాయకుడు బాధ్యతతో కూడిన మొదటి ప్రాధాన్యతను ఇచ్చుట. మన ప్రజలకు మనము వాక్యమును బోధిస్తున్నపుడు మనము వాక్యమును ఎరిగి యుండాలి. దానిని బోధించి మరియు అన్వయించు కోవాలి. అది మన మొదటి ప్రాధాన్యతయై యుండాలి.

4. పెద్దలు హస్త నిక్షేపణము చేయగా ప్రవచన మూలమున నీకు అనుగ్రహింపబడి నీలో వున్న వరమును అలక్ష్యము చేయకుము (4:14). దేవుడు ప్రతి కాపరికి వివిధ రీతులుగా వరములను ఇస్తాడు. మనలో ఏ ఇద్దరు కూడా ఒకే రకముగా ఉండరు. నిన్ను నీవు ఇతరులతో పోల్చకొనుటకు లేదా ఇతరుల వలే ఉండటానికి ప్రయత్నించవద్దు. అది నిన్ను నిరుత్సాహములోనికి తీసుకుని వెళ్తుంది. నీవలె నీవు ఉండు. దేవుడు నిన్ను ఎలా చేశాడో ఏ వరములను నీకు ఇచ్చాడో అలాగే నీవు ఉండు. దేవుడు నీకు ఇచ్చిన వరములను వాడుకొంటారు.

5. ఈ విషయాలను మనస్కరించుము (4: 15b) "మనస్కరించుము" అనగా దేవుని వాక్యము బోధించుట యందు శ్రద్ధ వహించుము. మరియు దేవుని వరములను వాడుము.

6. నీ అభివృద్ధి అందరికి తేటగా కనబడనిమ్ము (4:15a). వాక్యమును బోధించుటకు పరిచర్య చేయుట నీ జీవితములో ప్రాథమిక స్థానములోఉండనిమ్ము. దానిని బట్టి ఇతరులు నీ అభివృద్దిని చూచి ప్రోత్సహింపబడతారు. అది ఇతరులకు ఒక మాదిరిని ఏర్పరుస్తుంది.

7. నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగియుండుము (4: 16a).

దేవుని వాక్యమును ఎరిగియుండుట చాలా ప్రాముఖ్యము. కాని అది కేవలము మన మేధస్సుకు సంబంధించినదై ఉంటే మన జీవితము మీద ప్రభావము చూపదు. కాబట్టి ప్రార్థించుట యందు స్తుతించుట యందు మరియు వాక్యము ధ్యానించుటయందు ప్రతి దినము సమయము గడుపుము. కేవలము జ్ఞానమందు మాత్రమే ఎదిగినట్లియితే సరిపోదు. కాని దేవునితో సంబంధము ఏర్పరచు కొనుటలో ఎదుగవలయును, నీవు ఏమి చెప్తున్నావో దాని ప్రకారము జీవిస్తున్నావో లేదో దానిని ప్రజలు గమనిస్తారు.

8. వీటిలో నిలకడగా ఉండము. నీవీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు. (4: 15b)

మన పరిస్థితులు కష్టతరమైనపుడు మరియు మనము నిరుత్సాహనానికి లోనయినపుడు నిలుకడగా ఉండుట చాలా అవసరము. ఒక స్నేహితునిగా తల్లిదండ్రులుగా మరియు కాపరిగా ఇలా ఉండుట అంత సులభమైనది కాదు. తిమోతి పరిస్థితులనుంచి వైదొలగాలని చూశాడు కానీ పౌలు దానిలో నిలుకడగా ఉండాలని చెప్పాడు. కష్టములు ఎదురయినప్పటికీ శ్రమలు ఎదురయినప్పటికి

మనము ముందుకు కొనసాగవలయును ఈ రోజులలో పౌలు ఒక సమావేశమును ఏర్పాటు చేసినట్లయితే ఈ విషయాలను తప్పక కాపరులకు అజ్ఞాపిస్తాడు.

**పౌలు సలహా**

ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికి ఒక కాపరి నమ్మకముగా యేసును సత్యముతో సేవించవలయును.

ఈ ఆజ్ఞలలో ఏవి నీకు ఎక్కువగా అన్వయింపబడుతాయి? నీవు అనుసరించుటకు ఏవి కష్టముగా భావిస్తావు? ఎందుకు నీ జీవితానికి ఎలా సరియైన విధముగా వాటిని అన్వయింపగలవు? నీ యొక్క ఆధ్యాత్మిక వరములను నీవు ఎరిగి యున్నావా? నీవు వాటిని వాడుతున్నావా? లేదా నీవు అంతగా చేయలేని వాటిని చేయుటకు సమయమును గడుపుతున్నావా?

## 12. నీ గొర్రెలతో (సంఘ సభ్యులు) ఎలా మసలుకోవాలి (1 తిమోతి 5:1-16)

సంఘములో ప్రజలు లేనట్లయితే కాపరిగా పనిచేయుట చాలా సులభము అని ఒక కాపరి చెప్పటం నేను విన్నాను. ఇది చాలా వాస్తవము, గర్వము, స్వయం కేంద్రిత, కఠినత్వము, తిరుగుబాటు మరియు పాపము కలిగియున్న ప్రజలకు కాపరిగా ఉండుట చాలా కష్టము. బైబిలు అధ్యయనము చేయుటకు మరియు బోధించుటకు నేను చాలా ఇష్టపడతాను. కాని, పరిచర్యలో ప్రజలతో సవాళ్లను ఎదుర్కొన్నపుడు అతి కష్టముగా భావిస్తాను. తిమోతి కూడా తిరుగుబాటు చేయు సమస్యలను తెచ్చిపెట్టు, ప్రజలను ఎదుర్కోవడము చాలా కష్టముగా భావించాడు.

అయినను వారితో ఎలా ప్రవర్తించాలో పౌలు సలహా ఇచ్చాడు. “వృద్ధుని గద్దింపక తండ్రిగా భావించి అతనిని హెచ్చరించుము, అన్నదమ్ములని యౌవనులను, తల్లులని వృద్ధ స్త్రీలను, అక్కచెల్లెండ్లని పూర్ణ పవిత్రతతో యౌవన స్త్రీలను హెచ్చరించుము” (1 తిమో 5:1).

పౌలు ఇచ్చిన సలహా చాలా సులభమైనది. ప్రతి ఒక్కరిని కుటుంబములో వారివలె పరిగణించాలి. మనకంటే పెద్దవారిని దయతో మరియు గౌరవ భావముతో చూడాలి. వారిలో పాపము ఉన్నప్పటికీ వారితో అలాగే మెలగాలి. మన స్వంత తల్లిదండ్రులవలే భావించాలి. మనకంటే చిన్నవారి పట్ల కూడా సున్నితముగా, గౌరవముతో వ్యవహరించాలి. మన సహోదరులను మరియు సహోదరీలను ప్రేమించినట్లు వారిని ప్రేమించాలి.

ఎఫెసీ సంఘమునందు పౌలు ఎదుర్కొన్న పరిస్థితులపట్ల పౌలు దృష్టి నిలిపినాడు. ఎఫెసీ సంఘములో విధవరాండ్రకు ఆహారము మరియు వస్త్రములను ఇచ్చి వారికి సహాయము చేయవలసిన అవసరత ఉన్నది. అయితే ఎవరు దీనికి అర్హులు అను విషయమును పౌలు వివరించినాడు. ఉచితముగా ఆహారము వస్త్రములు పంపిణీ చేయబడినపుడు కొన్నిసార్లు అంతగా అవసరతలో లేనివారు కూడా దానిని పొందుకొనుటకు ప్రయత్నిస్తారు. అందుకే పౌలు విధవరాండ్ర ఈ ఆర్థిక సహాయము అవసరమైనవారికి ఉండ వలసిన లక్షణాలను పౌలు తెలుపుతున్నాడు (5:3-10). వారికి కుటుంబము నుండి ఎలాంటి సహాయము లేనప్పుడు (5:4), “ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన ఇంటివారిని, సంరక్షింప కపోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును” (5:8).

ఇది మొదటి షరతు. ఇది మూడుసార్లు తిరిగి ప్రస్తావించ బడిన (5:4,8,16) ఈ బలమైన మాటలు ప్రతి కుటుంబములో

వ్యక్తులు ఒకరిపట్ల ఒకరు ఎలా వ్యవహరించాలో, ఎలా శ్రద్ధ తీసుకోవాలో తెలుపుతున్నవి. ఎఫెసీలో ఉన్న సంఘ ప్రజలతో ప్రతి ఒక్కరూ వారి కుటుంబ సభ్యుల బాధ్యతను తీసుకోవాలని తిమోతికి చెప్పాడు. కాబట్టి ప్రతి కాపరి కూడా దానిని బోధించాలి.

విధవరాండ్ర అవసరతను సంఘము తీర్చుటకు వారు మరొక అర్హత కలిగియుండాలి. వారు దేవునితో సన్నిహిత సంబంధము కలిగి యుండాలి (5:5). స్వయం-కేంద్రిత జీవితము జీవించవద్దు (5:6). వారు 60 సంవత్సరాల పై వయస్సు గల వృద్ధులుగా ఉండి పనిచేసే శక్తిలేని వారై ఉండాలి (5: 9a). వారి జీవిత భాగస్వాములతో నమ్మకముగా ఉన్నవారై ఉండాలి (5:9b). వారు దైవభక్తి గలవారిగా పేరును కలిగియుండాలి (5: 10). వారి పిల్లలకు మంచి తల్లిగా ఉండాలి (5: 10). ఆమె పరదేశులకు ఆతిథ్యము ఇచ్చేదిగా ఉండాలి (5:10). అవసరత ఉన్నవారికి సహాయము చేయునదై ఉండాలి (5:10). పరిశుద్ధుల పట్ల భక్తి కలిగి యుండాలి (5:10). సంఘము అవసరతలలో ఉన్న విధవరాండ్ర విషయమై ఆర్థిక సహయము చేయాలనుకొన్నప్పుడు ఈ విషయాలన్నింటిని పరిగణలోనికి తీసుకో వలయును. దేవుడు మనకు ఇచ్చిన వనరులపట్ల మనము మంచి గృహనిర్వాహకులుగా ఉండాలి. మనము వాటిని ఎలా వాడుతున్నామో అనువిషయములో జాగ్రత్తగా ఉండాలి.

అవసరతలలో ఉన్న వృద్ధ విధవరాండ్రకు సహయముచేసే విషయాలగురించి మాట్లాడిన తరువాత యౌవనస్థులైన విధవరాండ్రను గూర్చి పౌలు మాట్లాడుతున్నాడు (5:11-15). వారు కూడా ఆర్థిక సహయము పొందవచ్చునా? వారు పనిచేయని ఎడల వారికి ఎంత మాత్రము సహాయము చేయరాదు. వారు వారి సమయమును అజ్ఞానముగా వాడుకొంటున్నారు.

వారు క్రీస్తుకు విరోధమును ఇతర పురుషులతో అక్రమ సంబంధము కలిగి యుంటారు(5:11). వారు ఇతరుల మీద పుకార్లను పుట్టిస్తు, సమయమును వృధా చేస్తూ, పరుల జోలికి పోవువారు అవుదురు (5:13). కాబట్టి యౌవనస్తులైన విధవరాండ్రు కుటుంబ జీవితమును కలిగి యుంటూ, ఆధ్యాత్మిక పరిపక్వతలో ఎదుగుతూ యుండాలి (5: 14).

ఈ భాగమును పౌలు ముగిస్తూ, మనము ఇతరులను మన కుటుంబ సభ్యులను చూచినట్లు చూడాలి. మనము ప్రేమించే మన కుటుంబ సభ్యుల పట్ల వ్యవరించినట్లు ఇతరులలో వ్యవహరించాలి. మత్తయి 7:12 లో ఉన్న సువర్ణ సూత్రము “ఇతరులు ఎలా నీతో వ్యవహరించాలని చూస్తున్నావో నీవు వారిలో అలా వ్యవహరించుము”. నిజముగా అవసరతలలో ఉన్నవారికి మనము సహాయము చేయవలసిన అవసరత ఉంటుంది. కాని ఎవరి కుటుంబమైన వారికి సహాయం చేస్తున్నపుడు లేదా ఎవరికి వారు వారి అవసరాలు తీర్చుకోగలిగనపుడు మనము సహాయము చేయవలసిన అవసరము ఉండదు. విధవరాండ్రకు ప్రభత్వము నుండి ఏదయినా సహాయము దొరుకుతున్నట్లయితే సంఘము సహాయము చేయవలసిన అవసరము లేదు. నిజముగా వారికి సహాయము చేయాల్సిన అవసరం లేనట్లయితే సంఘము యొక్క వనరులను ఎంత మాత్రము వ్యర్ధము చేయవద్దు.

## పౌలు సలహా

ఇతరుల పట్ల గౌరవ భావముతో వ్యవహరించు. నిజముగా అవసరతలో ఉన్నవారికి సహాయము చేయుము కాని తమకు తాముగా పరిస్థితులను, సమకూర్చుకోగలవారికి సహాయము చేయవలసిన అవసరము లేదు.

నీ కుటుంబములో మరియు సంఘములో ఈ మార్గదర్శ కాలను అనుసరిస్తున్నావా? తిమోతి ప్రజల పట్ల వ్యవహరించవలసిన పౌలు సలహాలను నీవు పాటించవలసిన అవసరం ఉన్నదా? మన ప్రజలను యేసు వారిపట్ల ఎలా వ్యవహరించినాడో అలాగే వ్యవహరించాలి. అది అలా సులభం కానప్పటికీ అలా చేయాలి. ఇతరులలో సహనము, ప్రేమ, జ్ఞానము, దయతో మొదలగు వాటితో వ్యవహరించునట్లు నీవు వ్యవహరించుము.

## 13. దైవభక్తిగల కాపరుల ఎంపిక మరియు సన్మానము (1 తిమో 5: 17, 25)

1 తిమోతి 5 నందు ప్రజలతో ఎలా వ్యవహరించాలి అను విషయాలను పౌలు తిమోతికి వ్రాసినాడు. అవసరతలలో ఉన్న విధవ రాండ్రకు సహాయము చేసే విషయమును పౌలు వ్రాసినాడు. దీని వెంటనే కాపరులకు చేయు అర్థిక సహాయము గురించిన ప్రశ్నను గుర్తు చేస్తుంది. వారు అవసరతల నిమిత్తము సంఘము నుండి ద్రవ్యము తీసుకోకుండా పని చేసి తమ జీతము తామే సమకూర్చు కోవాలా?గుడారములను తయారు చేసి ద్రవ్యాన్ని సంపాదించుకొన్న పౌలు తిమోతి పత్రికలో సంఘము కాపరులకు సహాయము చేయాలని వ్రాసినాడు. "పాలన చేయు పెద్దలను, విశేషముగా వాక్యమందు, ఉపదేశమందును ప్రయాసపడువారిని, రెట్టింపు సన్మానమునకు పాత్రులను ఎంచవలెను.

"పెద్ద" అను పదము యూదుల సమాజ మందిరములలోని నాయకులను సూచిస్తుంది. మరియు 'అధ్యక్షుడు' అను పదము, అన్యజనుల సమాజము యొక్క నాయకుడికి వాడబడదినది.
ఈ రెండు పదములు మనము ప్రస్తుతము పిలుస్తున్నా

“కాపరి”ని సూచిస్తుంది. కాపరిపైన రెండు ప్రాముఖ్యమైన బాధ్యతలు ఉన్నట్లుగా పౌలు వ్రాస్తున్నాడు. మొదటిది, వారు సంఘములో జరిగే విషయాలకు సూచనలు ఇవ్వవలెను, వారికి వారుగా అన్ని చేయాలని చూడకూడదు. అయితే అవి జరుగునట్లు చూడవలెను. వారు ఒక పాఠశాలకు ప్రిన్సిపాల్ లాంటి వారు. లేదా సమాజ మందిరము యొక్క నాయకుడు (ఎఫె 4:12-13) పౌలు చెప్పినట్లు కాపరి “పరిశుద్ధులు” సంపూర్ణులుగుటకు పరిచర్య ధర్మము జరపుటకు నియమించబడినాడు. కాపరులు వారంతటవారు అన్ని పనులు చేసుకోలేరు.వారు ఇతరులకు పరిచర్య మరియు సేవ చేయునట్లు శిక్షణ ఇవ్వాలి.

కాపరుల రెండవ బాధ్యత, బోధించుట మరియు ప్రసంగించుట. “కాపరి ఆయన గొర్రెలను మేపవలెను లేదా అవి ఎదుగలేవు మరియు పరిపక్వత చెందలేవు”. ఇది కాపరుల విషయములో కూడా ఇదెంతో వాస్తవము. మనము వేరే ఇతరుల పనులలో నిమగ్నపోయి బైబిలును అధ్యయనము చేయుటలో మరియు మంచి వర్తమానములు బోధించుటలో నిర్లక్ష్యము వహిస్తాము. ఇది ఎంతో తప్పు (అపొ 6:4). సంఘమునుకు వాక్యమును ప్రకటించే మరియు దాన్ని మార్గదర్శకాలు అందించే కాపరి రెట్టింపు సన్మానమునకు పాత్రుడు. కాపరి ఎవరికి పరిచర్య చేస్తాడో వారి నుండి సన్మానము మరియు గౌరవము పొందుతాడు. కాపరి వాక్యపఠన యందు, ప్రార్థనయందు మరియు పరిచర్యయందు సమయమును గడిపినపుడు అతడు ఆర్థిక సహాయము కూడాపొందుతాడు. అతడు జీతము కొరకే పనిచేయువాడైతే తక్కువ సమయము పరిచర్య చేస్తాడు. పౌలు ఇక్కడ ప్రజలు తప్పక కాపరికి ఆర్థిక సహాయము చేయాలని రుజువులు చూపుటకు రెండు పాత నిబంధన లేఖనాలను చూపినాడు (ద్వితి 25:4 & 24:15). కాపరులు జీవించుటకు మరియు పరిచర్య చేయుటకు డబ్బు అవసరం

మాత్రమని కాదు. ప్రజలు కూడా ద్రవ్యమును సమర్పణతో కూడిన సహకారముతో పరిచర్యలో పంచుకోవడం నేర్చుకొనవలయును. దేవుడు తన ప్రజలకు అదనపు ఆర్థిక వనరులు సమాకూర్చినపుడు దానిని కాపరులతో పంచుకొనవలయును. కాని తరచుగా ప్రజలులో భత్వము కలిగి యుండుట ద్వారా దానినంతటిని వారితో ఉంచు కోనుటకు ప్రయత్నిస్తున్నారు. కానిపరిచర్య సరియైన విధముగా చేయు కాపరి గౌరవింపబడవలెను. మరియు ఆర్థిక సహాయము పొందవలెను కాపరి సరియైన విధముగా పరిచర్య చేయని యెడల అతడిపై ఫిర్యాదులు చేస్తారు. ఎప్పుడైతే కాపరిపై విమర్శ ఉంటుందో, అది ఇద్దరు ముగ్గురు వ్యక్తులచేత నిరూపించబడవలయును (5:19). ఎప్పుడైతే అది నిరూపించబడుతుందో నిందితుడైన కాపరి తప్పక సరిచేయ బడుతాడు (5:20).

పాపము బహిరంగముగా తెలిసిపోయినట్లయితే దానిని సరిచేయుట మరియు అతడు పశ్చాత్తాపపడుట రెండు బహిరంగముగా జరుగవలయును. పక్షపాత ధోరణితో చేయబడిన తీర్పులు తిరిగి పరిశీలించ బడవలెను. నీవు ఎలా ఇతరులచేత వ్యవరింపబడుటకు కోరుకుంటావోఅలాగే ఇతరులను అలాగే పరిగణించుము.

కాపరుల ద్వారా ఏర్పడు ఎన్నో సమస్యలు తప్పక దైవభక్తిగల, పరిపక్వత చెందిన కాపరులచేత పరిష్కరించబడవలెను (5:22, 24-25). భావోద్రేకముతో వాగ్ధానములు చేసిన యౌవనస్తులను త్వరపడి అభిషేకించకూడదు (5:22). వారు పరిపక్వత చెందుటకు సమయుము ఇవ్వాలి. మనము తప్పక వారిని ఎరిగియుండాలి, వారి జీవితాలను కనిపెట్టాలి. ఒకవేళ అనర్హుడైన వ్యక్తిని బాధ్యత గల స్థలములో ఉంచినట్లయితే అక్కడ ఏదయిన తప్పిదము జరిగినపుడు దానికి నీవు కూడా బాధ్యుడవే.

విమర్శలను మరియు భయంకరమైన ఘర్షణలలో ఉండే తిమోతికి ఇవన్నియు కూడా చాలా కష్టముగా ఉన్నవి. చాలా ఒత్తిడికి మరియు చింతకు లోనగుటద్వారా  అతడు దానిని విడిచి పెట్టాలని కోరుకున్నాడు. ఒత్తిడి మరియు చింత అతని ఆరోగ్యముపై ప్రభావము చూపినది కాబట్టి పౌలు కొంచెము ద్రాక్షారసము తీసుకొనవలెనని సలహా ఇచ్చినాడు. మద్యము తక్కువ శాతము ఉండే ద్రాక్షారసము తీసుకోవలయునని పౌలు సలహా ఇచ్చినాడు, కాని తన భయము, చింత వీటన్నింటి నుండి విడిపింపబడుటకు తిమోతి దేవుని యందు విశ్వాసము ఉంచినాడు. మనము కూడా అలాగే చేయవలెను.

సంఘమునకు మార్గదర్శకాలను మరియు బోధను చేయుచున్న కాపరులను ప్రజలు సన్మానించి, వారు జీవించుటకు జీతము కూడా ఇవ్వవలెను. ఇద్దరు వ్యక్తుల సాక్ష్యములను బట్టియే తప్ప కాపరులను విమర్శించవద్దు. కాని ఒకవేళ వారిపై మోపబడిన నేరము వాస్తవము అయినట్లయితే వారిని ప్రేమతో, సున్నితముగా వారి తప్పిదములను సరిచేయవలయును. ఇలాంటి సమస్యలను అడ్డుకొనుటగాను దైవ భక్తిగల, పరిపక్వతగల పురుషులను అధికార హోదాలో నియమింపవలయును.

## పౌలు సలహా

కాపరిచేత కాపు చేయబడుతున్న ప్రజలు తప్పక వారికి కావలసిన మంచి సహాయము అందించవలయును అప్పుడు వారి కాపరి వాక్య అధ్యయనము చేయుటకు మరియు ప్రార్థించుటకు, పరిచర్య చేయుటకు సామర్థ్యత కలిగియుంటాడు.

నీవు జీవించుటకు అవసరమైన జీతము ఇవ్వటానికి ప్రజల జీవిత ప్రమాణాలకు ప్రాముఖ్యమైన వాటిని బోధిస్తున్నావా? పౌలు

తిమోతికి ఇచ్చిన సలహాల ప్రకారము నీ సంఘ నాయుకులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తున్నావా? నీవు అందులో అభివృద్ధి చెందుటకు ఏమి చేయగలవు? నీ పరిచర్యలో ఏది నిన్ను ఒత్తిడికి మరియు విచారమునకు లోను చేస్తుంది? దానిని నీవు ఎలా వ్యవహరిస్తున్నావు?

## 14. తప్పుడు బోధకులను ఎలా గుర్తించాలి

### (Iతిమోతి 6: 1-5)

వృద్ధులైన వారు ఒక విషయాన్ని పదే పదే చెపుతుంటారు. పౌలు తన చివరి దశయందు 1 తిమోతి పత్రిక వ్రాసినపుడు ఒకే విషయాన్ని గూర్చి 3 సార్లు వ్రాసినాడు. అతడు ఏమి చెప్పినాడో దానిని మరిచిపోయి ఇలా చెప్పలేదు. అయితే ఇది చాలా అవసరమైన అంశము కాబట్టి దీనిని చెప్తున్నాడు. ఎఫెసీలో ఉండే గృహ సంఘాలలో తప్పుడు బోధలు వ్యాప్తి చెందుటను బట్టి వాటిని రూపుమాపుటకు దీనిని ప్రస్తావిస్తున్నాడు (1: 4-7: 4:1-5,6: 1-5).

మొదట పౌలు క్రైస్తవ యజమానులకు మరియు క్రైస్తవ బానిసలకు మధ్య గల సమస్యలను స్పష్టముగా తెలుపుతున్నాడు (6:1-2). బానిసలు తమ యజమానులు వారిపై చూపించే ప్రేమను తమకు అనుకూలముగా తీసుకోరాదు. అది వారికి ఒక చెడు మాదిరిని ఇస్తుంది, క్రీస్తునకు మహిమను తీసుకొనిరాదు. ఇది క్రైస్తవ ఉద్యోగస్తులకు కూడా వర్తిస్తుంది. వారు ఉత్తమమైన పనివారుగా ఉండాలి. తమయజమానులు తమపై చూపు ప్రేమను తమకు అనుకూలముగా తీసుకోరాదు. అన్ని విషయాలలో వారు చేయ గలిగేంత పనిని వారు చేయాలి.

ఈ విషయాలను తెలియజేసిన తర్వాత పౌలు ఎఫెసీ సంఘములో చాలా కష్టములను సృష్టిస్తున్న సమస్యలను గూర్చి మరలా

వ్రాస్తున్నాడు. అబద్ధమును, బైబిలుకు వ్యతిరేకమైన బోధను వ్యాప్తి చేసే వ్యక్తుల యొక్క లక్షణములను తెలియజేయుచున్నాడు. వారు తప్పుడు బోధలను మాత్రమే ప్రజలకు బోధించుటలేదు కాని వారు అబద్ధికులుగా పిలువబడుచున్నారు. బయటకు ఈ వ్యక్తులు దైవభక్తిగల వారివలె మరియు స్నేహముగా కనబడతారు. కాని అంతరంగికముగా పాపము మరియు మోసముతో నిండియుంటారు (6:4-5). పౌలు వారిని గర్వాంధులు మరియు స్వార్థ కేంద్రితమైన జీవితముగలవారు అని చెప్తాడు. వారు ఇతరలకంటే ఎంతో ఎక్కువగా తెలుసని అనుకొంటారు. కాని వారికి ఏమియు తెలియదు. కాబట్టి వారు దేవుని సత్యమును నిరాకరిస్తారు, వారు చెడిపోయిన మనసు గలవారు కాబట్టి తర్కములను, వివాదములు బోధిస్తారు. వారు అంత ప్రాధాన్యత లేని విషయాలను, చిన్న విషయాలను దీర్ఘకాలము చర్చిస్తూ ఆనందిస్తారు. వారు పూర్తిగా అసూయతో నిండియుంటారు. ఇతర నాయకులను ద్వేషించి తమపై తాము దృష్టిపెడతారు, వారు దూషణలు దురను మానములను ఇతరులపై ప్రయోగించి ఇతరులను తక్కువచేసి మరియు వారిని విమర్శిస్తుంటారు.

ఈలాగు చేయుట ద్వారా ప్రజల మధ్య నిరంతర ఘర్షణలు, విభజనలు చెలరేగుతాయి. వారి బోధ విశ్వాసుల మధ్య అనైక్యత మరియు వైషమ్యాలకు దారితీసినది. ఎందుకనగా వారు చెడిపోయిన మనస్సుగలవారు, అవి స్పష్టమైనవి కాక ప్రజలలో అపార్థము కలుగు జేస్తాయి. మరియు వారు లోభులుగా, దురాశపరులుగా మారి పరిచర్య నుండి లాభమును అపేక్షిస్తారు. వారు దైవభక్తి అనగా ఆర్థిక లాభ సాధనము అనుకొంటారు. క్రైస్తవ్యమును ముందుకు తీసుకెళ్లే సాధన ముగా వాడుకొంటారు. వారు ఇతరులను ప్రభావితులుగా చేయుటకు, మరియు తమ స్థానము ద్వారా ఆర్థికముగా అభివృద్ధి చెందుటకు వాడుకొంటారు. యేసు కూడా ఇలాంటి వారిని గూర్చి హెచ్చరించి

నాడు. "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగత్తతపడుడి. వారు గొర్రెల చర్మము వేసుకొని మీ యొద్దకు వత్తురు. కాని లోపల వారు కరమైన తోడేళ్లు" (మత్త 7:15). కొందరు నిజమైన విశ్వాసులు కూడ వారిని వెంబడించుటకు తమ్మును తాము అనుమతించుకొంటారు. మరియు సత్యమునుంచి తొలగిపోతారు. ఉదా: బిలాము (సంఖ్యా 22–24). కొందరువిశ్వాసులవలె కనబడతారు. కాని వారు ఎంతమాత్రము రక్షణ పొందే సత్యమును గూర్చిన జ్ఞానము పొందలేరు. వారు రాతినేలను పడిన విత్తనము వలె ఉంటారు (మత్త 13: 1–23). వారు క్రైస్తవ్య మును తృణీకరించరు కాని అతి ప్రాముఖ్యమైన విషయాలలో నమ్మిక ఉంచరువారు చేసే తప్పిదాలు పెరిగిపోయి మరియు వ్యాప్తిచెంది చివరికి గొప్పనష్టాన్ని కలిగిస్తాయి. మోసగాడు మరియు అబద్ధికుడు అయిన సాతానుకు దాసులుగా మారుతాయి (యోహ 8: 44).

దీనిని పౌలు భయంకరమైన సమస్యగా చూశాడు. కాబట్టి మనము కూడా అలాగే చూడాలి. మనము దేవుని వాక్యానుగుణముగా ఎరిగి యుండాలి అప్పుడు మనము ప్రతి తప్పిదమును పట్టివేయ గలము. ధైర్యముతో వీటిని ఎదురించి దాని స్థానములో దేవుని సత్యమైన వాక్యమును స్థాపించాలి. మనము వీటిని అనుమతించి నట్లయితే మన సంఘములు అసత్యముతో నిండిపోతాయి. ప్రసిద్ధి చెందిన, ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులను ఎదురించుట చాలా కష్టము. మమ్ములను విమర్శిస్తారు మరియు మాపైదాడి చేస్తారు అని నమ్ముట వలన మనము సత్యము కొరకు నిలువబడలేము. కాబట్టి ఎంత వెల చెల్లింపబడవలసి వచ్చినప్పటికీ సత్యము కొరకు నిలువబడవలెను.

**పౌలు సలహా**

తప్పుడు బోధన మొదట నిజమేనని అనిపించవచ్చు, కాని

దేవుని వాక్యము మాత్రమే ప్రజలకు బోధింపబడుటకు జాగ్రత్త వహించుము.

తప్పుడు ప్రవక్తలకు మరియు బోధకులకు పౌలు ఉపయోగించిన పదజాలములు ఏమైన వర్తిస్తాయా? నా గురించి ఇతరులు ఏమని చెప్పుతారు. కాబట్టి వాటిగురించి నీవు ఏమి చేస్తావు?

## 15. దైవజనుని కొరకు ఇవ్వబడు ఆజ్ఞలు (1 తిమో6:6-21)

పౌలు ఈ పత్రికను అతని కుమారుడైన తిమోతికి ఎనిమిది ఆదేశాలను ముగింపులో వ్రాసినాడు. పౌలు వీటిని దురాశ, లోభత్వమునకు ప్రేరేపించబడుటను గూర్చి తెలుపుతు క్లుప్త పరిచినాడు పౌలు తిమోతిని అబద్ధ బోధకులు తమ పలుకుబడులను ధనము సంపాదించుటకు వాడుకుంటారని హెచ్చరించినాడు (6:5). ఇప్పుడు పౌలు క్రీస్తును పోలిన జీవితము ఈ లోక లాభ సంపాదన కంటే గొప్పదని గుర్తు చేస్తున్నాడు (6:6-8). దురాశ ఎంత ప్రమాదకరమో అది నాశనమునకు గొప్ప కీడులకు మూలమని తెలిపినాడు(6:9-10). డబ్బు అనునది  పాపముకాదు, ధనాపేక్ష పాపమై ఉన్నది (6:10). మనము దీనిని జ్ఞాపకం చేయవలసిన అవసరం ఉన్నది.

పౌలు యొక్క మొదటి ఆజ్ఞ ఈ సత్యమును ఆధారం చేసుకుని ఉన్నది. “కాబట్టి దైవజనుడా నీవైతే వీటిని విసర్జించుము” (6:11). అబద్ధ బోధకులు చేసే దురాశ లోభత్వమునకు అనుకూలమైన బోధకు దూరముగా ఉండుము. మనము కూడా డబ్బు మరియు సంపాదన

కొరకై ప్రేరేపించే శోధనల నుండి పారిపోవలయును ఇతరులు లోభత్వము మరియు దురాశకు లోనగుచున్నారని గుర్తించుట చాలా సులభము, కాని మన గురించి మనం తెలుసుకొనుట చాలా కష్టము. నీ హృదయమందు ఇలాంటి దురాశ ఉన్నదేమో దానిని దేవుడు చూపునట్లు ప్రార్థించుము.

రెండవది: పౌలు తిమోతికి వీటికి బదులుగా "నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వికమును" సంపాదించుకొనుటకు ప్రయాస పడుమని తెలియజేశాడు (6:11). అబద్ధ బోధకులు దేని వెంట పరిగెడుతున్నారో దానికి భిన్నముగా నీతి (పరిశుద్ధ జీవితము) దైవభక్తి (క్రీస్తు వంటి పరిపక్వత), విశ్వాసము (క్రియలతో కూడిన సత్యము), ప్రేమ (అందరి పట్ల షరతులు లేని ప్రేమ), ఓర్పు (పట్టుదలదృఢత్వం), మరియు సామర్థ్యత (నీవు ఇతరుల పట్ల మెలిగే విధానములో నీవు చూపించే విధేయత) అనువాటి వైపు తన గురి ఉండాలి.

మూడవ ఆదేశము: ఎలాంటి శ్రమలు ఎదుర్కొంటున్నప్పటికీ ఓపికతో ముందుకు సాగవలెను. "విశ్వాస సంబంధమైన మంచి పోరాటం పోరాటము" (6:12). యేసు కొరకు జీవించుట యుద్ధం వంటిది,దేవుని యొక్క ఆయుధములను ఉపయోగించినప్పుడే, (ఎఫె 6: 10-18), మరియు యేసును వెంబడించినప్పుడే (యెహూ 1) విజయం పొందగలము. దేవుడు నీ మార్గమును సులువుగాను లేదా మృదువుగాను చేస్తాడని ఎదురు చూడకు ఎందుకనగా నీవు ఆయనను సేవిస్తున్నావు. అది కష్టమవుతుంది కాబట్టి మీరు ఆయనను వెంబడించుట మరియు ఆయన యందు నమ్మిక ఉంచుట జరుగుతుంది.

నాలుగవది : మనము నమ్మకముగా నిలిచి ఉండాలి. ఎందుకనగా విజయం పొందుటకు అది ఒకటే మార్గము, "నిత్యజీవము చేపట్టుము,దాని పొందుటకు నీవు అనేక సాక్షులు ఎదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి" (6:12). ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వాటితో పనిలేకుండా తిమోతి అంకిత భావముతో సేవించాడు, మనము కూడా అలాగే ఉండాలి. పరిస్థితుల వైపు చూడకూడదు, యేసు వైపు చూడుము, ఆయనను సేవించుటకు నీవు చేసిన ప్రమాణము గుర్తు చేసుకొనుము.

ఐదవది: పౌలు తిమోతికి తిరిగి ఆదేశిస్తూ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ దానిని వదులుకోవద్దు, కానీ దీర్ఘకాలం పనిచేయి, పట్టుదలగా ఉండుము (6:13-16). "మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రత్యక్షమగు వరకు నీవు నిష్కళంకముగాను అనింద్యముగాను ఈ ఆజ్ఞను గైకొనుము" (14). అనగా తిమోతి నిష్క్రమించుటకు బదులు ముందుకు కొనసాగవలెను.

ఆరవది: పౌలు తిమోతికి మరియు మనకు కూడా వర్తింప చేస్తూ ఎఫెసీ నందలి గృహ సంఘములయందలి తప్పుడు బోధకుల కఠినత్వమును సరిచేయాలని ఆదేశిస్తున్నాడు (6: 17-19). ముఖ్యముగా ధనవంతులు, గర్విష్టులు మరియు దురాశపరులైన ప్రజలను సరిచేయవలెను అయితే వీరు చాలా శక్తివంతులైన ప్రజలు కాబట్టి వారు అతనిని విమర్శిస్తారు, మరియు తక్కువగా చూస్తారని వారికి భయపడినాడు. దైవభక్తి గల జీవితము డబ్బు మరియు ఆస్తుల కంటే ఎంత ప్రాముఖ్యమైనదని బోధించాలి. ఈ లోక ఐశ్వర్యము తాత్కాలికమైనవి, నిత్యత్వము శాశ్వతమైనది.

పౌలు తన పత్రికను రెండు ఆదేశాలతో ముగించినాడు. "నీకు అప్పగించిన దానిని కాపాడుము" (6: 20). "కాపాడుము" అనే పదము ఒక సైనికుడు ప్రశస్తమైన సంపదను భద్రం చేయుటను

చూపిస్తుంది. “అప్పగించిన” అను పదం ఒక బ్యాంకుకు సంబంధించిన పదము, అందులో ఉంచబడిన పెట్టుబడిని కాపాడుటను సూచిస్తుంది. ఈ పదము తిమోతి విషయములో మరియు మన విషయములో కూడా మనకు అప్పగించబడిన సువార్త జ్ఞానమును సూచిస్తుంది. దానిని తిమోతి కాపాడి ఇతరులకు అందించవలెను. మనకు అప్పగించబడిన దేవుని వాక్యమును కాపాడి భద్రం చేసి ఇతరులకు అందించుట గొప్ప భాగ్యము మరియు అద్భుతమైన బాధ్యత.

8వ ఆదేశము: మన చుట్టూ జరుగుచున్న తప్పుడు బోధతో ఎలాంటి సంబంధం లేనట్టుగా ఉండవద్దు. పౌలు ప్రారంభం నుండి తప్పుడు బోధగల విషయమై హెచ్చరిస్తున్నాడు. చిన్న తప్పు కూడా ఎంతో ప్రభావం చూపుతుంది. ఎలుక విషము కొంచెమైనప్పటికీ మన మంచి నీటిలో పడితే అది వినాశనంగా మారుతుందో అలాగే దేవుని వాక్య విషయములో కూడా తప్పుడు బోధ కొమ్చెమైనను సత్యముతో కలిసిన యెడల గొప్ప హాని సంభవించును.

“దేవుని కృప మీకు తోడై ఉండును గాక” అను మాటతో ముగిస్తున్నాడు. ఎఫెసీలో ఉన్న సమస్యలను సరి చేయుటకు, శక్తివంతులైన నాయకులను ఎదుర్కొనుటకు తిమోతికి దేవుని కృప అవసరమైఉన్నది

పౌలు మనకు కూడా ఇవే విషయాలు తెలియజేయుచున్నాడు. పరిచర్యను విడిచిపెట్టుట గానీ, దాని నుండి తొలగిపోవటం గాని చేయక పట్టుదల కలిగి ఉండుము. సంఘంలోనికి తప్పుడు బోధలు ప్రవేశించునట్లు చూడకు, సరియైన  మనుష్యులు కానీ వారు సంఘము నడిపించునట్లు చూడకు.

**పౌలు సలహా**

దేవుని సేవించుటకు నమ్మకత్వం, పట్టుదల, పరిశుద్ధత మరియు ధైర్యము గల వారిని వాడుకుంటాడు.

1 తిమోతి నుండి దేవుడు ఏమి నీకు బోధిస్తున్నాడు? ఏమి ముఖ్యమైన పాఠాలు దేవుడు నేర్చుకోవాలని కోరుతున్నాడు? నీ జీవితంలో ఏమైనామార్పులు ఉన్నాయా? వాటిని వ్రాసి ఉంచుకొనుము ఆ విధము నీవు వాటిని మరచిపోవు.

# III. 2 తిమోతి

## A. 2 తిమోతి పూర్వ రంగము

శీర్షిక: ఈ పత్రిక గ్రహిత పేరు
రచయిత: పౌలు
నేపథ్యము: నమ్మకమైన పరిచర్య
రచన కాలము: క్రీ.శ. 64
పత్రిక వ్రాసిన స్థలము: రోమా చెరసాల
పత్రిక గ్రహీత: తిమోతి ఒక యౌవనుడైన కాపరి

**ముఖ్య వచనము:** "వాక్యం ప్రకటించుముబీ సమయమందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు, ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము ఎందుకనగా జనులు హిత బోధను సహింపక, దురద చెవులు గలవారై తమస్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని సత్యమునకు చెవినీయక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును. అయితే నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము, శ్రమ పడుము, సువార్తికుని పనిచేయము, నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము. (2 తిమోతి 4:2-5).
ముఖ్య పదము: 'మంచి' (ఐదు సార్లు)
**ఉద్దేశ్యము:** పౌలు సంఘములలో శిక్షణ పొందుచున్న యౌవనస్తునికి మార్గదర్శకాలు ఇస్తున్నాడు. మత భ్రష్టత్వము సంభవించినప్పుడు ఎలా జీవించాలో తెలియజేస్తున్నాడు. పౌలుకు మరణశిక్ష అమలు చేయబడినది గనుక త్వరగా రావాలని అడుగుట కొరకు రాస్తున్నాడు.

**అంశము:** పౌలు యొక్క చివరి మాటలు నమ్మకముగా దేవుని సేవించుము.

పౌలు 30 సంవత్సరములు నమ్మకంగా దేవుని సేవించినాడు. అతడు చాలా శ్రమలు అనుభవించినాడు. అతని యొక్క బలమైన వ్యక్తిత్వమును బట్టి మరియు జ్ఞానము, ప్రజ్ఞ గల మనుష్యులను బట్టి ఆదిమ సంఘమును నడిపించినాడు. అయితే తప్పుడు బోధకులు మరియు అసూయతో నిండిన చెడిన మనసు గల రాజకీయ నాయకులు సంఘమును నాశనం చేయుటకు ప్రయత్నించినారు. అతడు రెండోతిమోతి పత్రిక వ్రాస్తున్నప్పుడు రోమా చెరసాల యందు తిరిగి ఉంచబడినాడు. ప్రస్తుతము తన అంతిమ కాలము సమీపించి నది అని పౌలు గ్రహించినాడు. సంఘములను నడిపించుటకు దేవుడు తరమును లేవనెత్తినాడు. పౌలు శారీరకముగా అలసిపోయినాడు. అతడు ఒక పత్రికనులూకా కాకుండా తనకు నమ్మకమైన విశ్వాస మందు కుమారుని వంటి వాడైన తిమోతికి వ్రాస్తున్నాడు. రెండవ తిమోతి నందు పౌలు మరణమును ఎదుర్కొంటున్న సమయంలో తన చివరి మాటలను వ్రాసినాడు.ఎవరైనా పత్రిక విలేకరి వచ్చి అతనితో ముఖాముఖి సమావేశం ఏర్పరిచి నీ జీవితమును ఎలా గడిపినావు? అది విలువైనదిగా ఉన్నదా? అంటే పౌలు కచ్చితంగా అది విలువైనదిగా ఉంది అంటాడు. నీ అనుచరులకు నీవు చివరి మాటలు ఏవి? ఈ పత్రికలో ప్రభావము చూపించే మాట "నమ్మకముగా ఉండు'

**పూర్వ రంగము:** విశ్వాసులకు శ్రమ మరియు హింస దారుణముగా మారుతుంది. కొన్ని వేల మంది హతసాక్షులుగా మరణించినారు. వారు రోమీయులకు శత్రువులుగా పరిగణింపబడినారు. నీరో రోమా పట్టణమును తగులబెట్టి ఆ నిందా క్రైస్తవులపైన వేసినాడు అది చాలా భయంకరంగా మారినది. అన్నింటికీ ప్రతి ఒక్కరూ వారినే నిందిస్తున్నారు. పేతురు చెరసాలలో వేయబడినాడు, త్వరలో అతడు

తల క్రిందులుగా సిలువ వేయబడుతాడు. పౌలు ప్రజల శత్రువులలో ప్రథముడు. అతడు గృహ నిర్బంధనంలో ఉంచబడలేదు. త్వరలో చెరసాలలో తీర్పునిమిత్తం ఉంచబడి మరణమును ఎదుర్కొన బోతున్నాడు. ఈ పరిస్థితులను రెండవ తిమోతి పత్రిక బయలు పరుస్తున్నది.

**1. దేవునికి నమ్మకస్తుడు (2 తిమో 1: 3– 8)**

తిమోతి దేవునికి నమ్మకముగా ఉండి కృపావరమును, బోధనా వరమును దేవుని మహిమ కొరకు వాడవలయునని పౌలు ప్రోత్సహిస్తున్నాడు. అనేక రకాలుగా జరుగుతూ ఉన్నా అణచివేతలతో తిమోతి నిరాశతో పోరాడుతున్నట్లు అనిపించింది. మరియు పౌలు తనకు సాధ్యమైనంత వరకు అతని ప్రోత్సహిస్తూ మరియు దేవునికి నమ్మకముగా ఉండాలని పురికొల్పి, సువార్త విషయంలో సిగ్గు పడకూడదు అని తెలియజేసినాడు. పౌలు ఎదుర్కొంటున్న శ్రమ, హింసను బట్టి బాధపడవద్దని తిమోతిని కోరినాడు. దేవుని సువార్త కొరకు శ్రమపడటం నిజమైన ఆధిక్యత అని భావించినాడు. చాలా మంది ఒత్తిడి క్రింద ఓటమి పాలైనారు, కాని యేసు నందలి విశ్వాసము ద్వారా తాను ఇంకా మిగిలి ఉన్నానని పౌలు తిమోతికి తెలియజేసినాడు.

**2. స్వీయ విశ్వాస్యత (2:1–6)**

విశ్వాస్యతను గూర్చి ఏడు రకములైన సాదృశ్యముల ద్వారా తిమోతికి తెలియజేయాలని పౌలు ఆశించినాడు. ఒక ఉపాధ్యాయుడు, సైనికుడు, క్రీడాకారుడు, వ్యవసాయదారుడు, పనివాడు, పాత్ర మరియు బానిస, ఈ విషయాలన్ని తిమోతిని ఇంకా కృంగ చేస్తాయని పౌలుకు బాగా తెలిసినప్పటికీ తిమోతిని తప్పక నిజాయితీగా ఉండాలని కోరినాడు.

**3. ఇతరులకు విశ్వాస పాత్రుడు (3:1, 4:15)**

పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నప్పటికీ దేవునికి మరియు ఆయన పరిచర్యకు నమ్మకముగా ఉండాలని పౌలు తిమోతి తెలియ జేయుచున్నాడు. అతడు దేవుని చిత్తములో ఉన్నాడని హామీ ఇస్తున్నాడు పౌలు తన మరణము తర్వాత ఎంత మాత్రము బాధ చెందవద్దని తిమోతికి చెప్తున్నాడు. నిత్యత్వమును దృక్పథములో పరిస్థితులు ఉంచబడాలని పౌలు సహాయము చేస్తున్నాడు. తన పట్ల నమ్మకముగా ఉన్న వారికి తన శుభములను తెలుపుతూ ముగించినాడు. సాధ్యమైతే తన మరణమునకు ముందు మరొకసారి తిమోతిని చూడాలని ఆశించినాడు ఆ సమయమునకు అతడు చేరుకున్నాడో లేదో మనకు తెలియదు. తిమోతి పౌలును చూడటానికి వెళ్ళినపుడు అతడు నిర్బంధించబడి నాడని కొందరు అంటారు. అదే జరిగినట్లయితే తిమోతి చెరసాల నుండి విడుదల పొంది యోహానుతో ఎఫెసీలో కొంతకాలం పరిచర్య చేసి తన విశ్వాసమును బట్టి హతసాక్షిగా మరణించినాడు. "నమ్మకముగా ఉండు" అనే విషయమును నేడు పౌలు మనకు కూడా తెలియజేస్తున్నాడు. ఏదైతే యేసు తన శిష్యులను కోరినాడో దానినే దేవుడు మన నుండి ఆశిస్తున్నాడు.

దీని విషయములో నీ పరిస్థితి ఏమిటి? నువ్వు నమ్మకముగా ఉన్నావా? నీవు ఎదుర్కొనే పరీక్షల యందు ఉత్తీర్ణుడవు అవుతున్నావా?

## b. 2 తిమోతి పత్రిక రూపురేఖలు

శుభములు 1:1–2

కృతజ్ఞతను వ్యక్తిపరచుట 1:3–5

**1. నమ్మకమైన కాపరి యొక్క లక్షణములు (1:18)**

A. పట్టుదల 1:6–7

B. ధైర్యము 1:8-12

C. విశ్వాస్యత 1:13-18

1. విన్నవింపు 1:13-18
2. ప్రోత్సాహము 1:15-18

**2. నమ్మకమైన కాపరి యొక్క విధులు 2:1-4:8**

A. వ్యక్తిగత బలోపేతము 2:1

B. సత్యమును సంక్రమింపచేయు 2:2

C. ఓర్పు లేదా సహనము 2:3-13

1. ఒక సైనికునిగా 2:3-4
2. ఒక క్రీడాకారునిగా 2:5
3. ఒక వ్యవసాయదారునిగా 2:6-7
4. ఓర్పు కలిగి ఉండుటకు ప్రేరణ 2:8-15

D. పాపం గురించి హెచ్చరిక 2:14

E. దేవుని కొరకు జీవించు 2:15

F. దైవికమైన చర్చ 2:16-19

G. పరిశుద్ధత 2:20-26

H. ప్రత్యేకింపబడుట 3:1-6

I. హింసయందు నమ్మకత్వం 3:10-13

J. దేవుని వాక్యము ప్రకటించు 3:14-4:5

K. దీర్ఘ పరిధి లక్ష్యాలు 4:6-8

L. వ్యక్తిగతమైన అర్థింపు 4:9-22

## C) కాపరులకు ఇవ్వబడు సూచనలు

**1. పౌలు మరణ వాంగ్మూల మాటలు (2 తిమో:1-5)**

వ్యక్తి మాట్లాడే చివరి దశయందలి మాటలు చాలా

ప్రాముఖ్యమైనవి. అవి ఆ వ్యక్తి అంతరంగములోని విషయాలను ప్రతిబింబిస్తాయి. రెండవ తిమోతి తనకు అత్యంత ప్రియమైన తన కుమారుడైన తిమోతికి తెలియజేసే పౌలు చివరి మాటలు, బహుశా ఇది పౌలు తిమోతికి సలహా ఇవ్వటానికి చివరి అవకాశం. బహుశా క్రీ.శ. 64 నందు పౌలు తిమోతిని బలపరుచుటకు ఇది చివరి అవకాశమై ఉండవచ్చును.

తిమోతిని సంభోదిస్తూ పౌలు తన్ను తాను అపోస్తలునిగా పరిచయం చేసుకుంటున్నాడు (2 తిమో 1:1). అపోస్తలుడు అనగా దేవునిచేత పరిచర్య కొరకు పంపబడినవాడు. పౌలు ఎల్లప్పుడు తాను దేవుని కృప ద్వారా దేవుని సేవకుడను అని గుర్తించుకుంటాడు. అతడు తిమోతిని "ప్రియమైన కుమారుడా" అని పిలవడం ద్వారా వారు ఎంత దగ్గరి సంబంధం కలిగి ఉన్నారో చూపిస్తున్నది. తిమోతి అప్పుడు ఎఫెసులో ఉన్నాడు. ఈ పత్రికను తిమోతి తీసుకొని చాలా ప్రోత్సహించబడినాడు. కాని పౌలు యొక్క మరణము సమీపంగా ఉందని తెలుసుకొని చాలా బాధపడి ఉండవచ్చును. సాంప్రదాయము ప్రకారము తిమోతి పౌలుని చూడ్డానికి త్వరగా రోమాకు చేరుకున్నాడు. అయితే ఆ సమయంలో అతడు పౌలుతో ఉండటం చాలా ప్రమాదకరంగా ఉండెను.

తిమోతి పౌలు ద్వారా శిక్షణ పొందగలిగినాడు. మరియు పౌలు తిమోతి ద్వారా ప్రోత్సాహాన్ని పొంది ఉన్నాడు. పౌలు చెరసాలలో ఉండిత్వరలోనే మరణమును ఎదుర్కోబోతూ ఉండగా తిమోతిని బట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాడు (1:3). అతడు తిమోతి కొరకు ప్రార్థిస్తున్నట్లు హామీ ఇస్తున్నాడు. నీవు నీ కంటే చిన్నవారికి శిక్షణనిస్తూ వారికి సలహాదారుడవుగా  ఉండగలుగుతున్నావా? వారి కొరకు ప్రతిరోజు ప్రార్థిస్తున్నావా?

నీవు చాలాకాలం క్రితం శిక్షణ ఇచ్చిన వారికొరకు కూడా ప్రార్థిస్తున్నావా? పౌలు అలా ప్రార్థించగలిగినాడు.

పౌలు మరణమును సమీపిస్తుండగా తాను మంచి మనస్సాక్షితో దేవుని సేవించానని చెప్పగలిగినాడా? అతడు క్రైస్తవులను హింసించినప్పటికీ, అతడు క్షమింపబడగలిగానని, మరియు తన శక్తి కొలది పని చేయగలిగినానని గుర్తించినాడు. పరిచర్య అంతమునందు మంచి మనస్సాక్షికలిగి ఉన్నాననేది ఎంత సంతోషాన్నిస్తుంది. చాలామంది సంఘ నాయకులుగా చెప్పుకొనే వారు పాపములోనికి నడిపింపబడుతున్నారు. నీ మనస్సాక్షి నిర్దోషంగా ఉండునట్లుగా జీవించుము.

తిమోతికి తన పట్ల గల ప్రేమను గుర్తుచేసుకొన్నపుడు పౌలు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి ప్రోత్సాహం పొందినాడు. నీవు నీ చివరి దశకు చేరుకున్నపుడు ఎవరిని చూడటం ద్వారా ప్రోత్సాహాన్ని పొందుతావు? ఎవరి విశ్వాస జీవితము నిన్ను సంతోషపరుస్తుందని పౌలు తిమోతికి శిక్షణనిచ్చి, ఆధ్యాత్మికముగా బలపరచినట్లు నీవు ఇతరులకు శిక్షణనిస్తున్నావా? లేదా ఇతర విషయములో నిమగ్నమై ఉంటున్నావా?

## పౌలు సలహా

విశ్వాసమందు ఎదుగున్నట్లు ఇతరులకు సహాయము చేయుము. వారి నమ్మకమైన జీవితము ద్వారా ప్రోత్సాహాన్ని పొందుము.

“పరలోకమందు మీ కొరకు ఉంచబడిన నిరీక్షణను బట్టి క్రీస్తు యేసు నందు మీకు కలిగి ఉన్న విశ్వాసమును గూర్చియు, మేము విని ఎల్లప్పుడూ మీ నిమిత్తము ప్రార్థన చేయుచు, మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రి అయిన దేవునికి

కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" (కొల 1:3-4). "ఈ హేతువు చేత, ప్రభువైన యేసునందలిమీ విశ్వాసమును గూర్చియు పరిశుద్ధు లందరి యెడల మీరు చూపుచున్న విశ్వాసమును గూర్చియు వినినప్పటి నుండిమీ విషయమై మానకదేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను (ఎఫె 1:15-16). ఆధ్యాత్మికముగా ఎదుగుదల కొరకు నీ ద్వారా సహాయం పొందిన వారిని బట్టి దేవునికి కృతజ్ఞతలు. వారి కొరకు ప్రార్ధించుము.

## 2. నమ్మకమైన సంఘకాపరి లక్షణములు 1: పట్టుదల & ధైర్యము (2 తిమో 1:6-12)

చాలా కాలం క్రిందట తాను ప్రేమించిన మరియు శిక్షణ ఇచ్చిన వ్యక్తికి తన చివరి పత్రికను పంపుచున్నాడు. అతని యొక్క జీవితాన్ని గుర్తు చేసుకుంటూ పౌలు ఒక మంచి దేవుని సేవకునిగా కాపరికి ఉండవలసిన తప్పనిసరి అయిన విషయాలు తిమోతికి రాస్తున్నాడు. అతడు తన పత్రికను ప్రారంభిస్తూ, పట్టుదల లేదా ఆసక్తి, ధైర్యము మరియు నమ్మకత్వం ఉండాలని తిమోతికి గుర్తు చేస్తున్నాడు. పట్టుదల: పౌలు తన పరిచర్యయందు ఒకప్పుడు ఎంతో పట్టుదలగా ఆసక్తి కనపరిచిన వ్యక్తులు నెమ్మదిగా కొంత కాలమునకు విశ్వాసము నుండి తొలగిపోయిన వారిని చూచి ఉండవచ్చును. ఈ రోజులలో కూడా ఇది సంభవిస్తుంది (2 తిమో1:6) నందు పౌలు తిమోతిని తనలో ఉన్న "దేవుని వరమును ప్రజ్వలింపచేయాలి" అని ప్రోత్సహిస్తున్నాడు. చాలా సంవత్సరములు ఈ లోకము, సాతాను మరియు శరీరేచ్ఛలతో పోరాడిన తర్వాత ఒక వ్యక్తి అలసిపోయి నిరుత్సాహం చెందవచ్చును, పిరికితనము మరియు భయము సాతాని యొక్క ఆయుధాలు మనము వాటికి వ్యతిరేకంగా మనలను మనము కాపాడుకొనవలెను ( 2తిమో 1:7), ప్రకారం "దేవుడు మనకు శక్తియు

ప్రేమయు, ఇంద్రియ నిగ్రహము గల ఆత్మనే ఇచ్చెను గాని పరికి తనము గల ఆత్మనీయలేదు". మనము భయాన్ని ఎదుర్కొన్నప్పుడు ఈ వాక్యమును మనము ఎత్తి మాట్లాడవలెను. తిమోతికి తనలో తాను నమ్మకము లేని వాడుగా ఉండేవాడు (1 కోరింథి 6:10-11, 1 తిమో4:12). మరియు అతడు దేవుని శక్తి, ప్రేమ, ఆశ నిగ్రహము పై ఆధారపడవలయును. మనము కూడా ఇది చేయాలి. ఈ వచనము నేను కష్టాల్లో మరియు భయముతో ఉన్నప్పుడు సహాయము చేసినది. నీకు కూడా ఇది సహాయపడుతుంది. పౌలు తిమోతికి ఇచ్చిన మొదటి ప్రబోధనం (1:8-12, 1:13-14, 2:1). పౌలు తిమోతికి "సిగ్గు పడకూడదు" అని ఆదేశిస్తున్నాడు (2 తిమో 1:8). తిమోతి దేవుని యందలి తన విశ్వాసమును బట్టి అవిశ్వాసుల చేత మరియు పౌలు యొక్క విశ్వాస్యతను బట్టి తప్పుడు బోధకుల చేతవిమర్శింపబడినాడు. యేసు చెప్పాడు "మనుషులందరూ మిమ్మును కొనియాడునప్పుడు నీకు శ్రమ" (లూకా 6:26). క్రీస్తునందు సద్భక్తితో బ్రతుక నిర్దేశించు వారందరూ హింస పొందుదురు (2 తిమో 3:12) అని పౌలు చెప్పాడు. పౌలు తిమోతికి "తాను ఏదైనా సాధించాడంటే తన శక్తితో చేసినది కాదు అది దేవుని శక్తి ద్వారా కలిగినదని గుర్తు చేస్తున్నాడు (1:9) అది ఎంతో మర్యాదపూర్వకమైన మరియు విధేయతతో కూడిన తలంపు. మనము అందరము ఆయన షరతులు లేని ప్రేమ మరియు కృప నుండి వచ్చి ఉన్నాము. దేవుడు తన యొద్దకు వచ్చిన వారిలో కొందరిని తన పరిచర్య చేయుటకు ఏర్పరచుకొన్నాడు. ఇది చాలా గొప్ప ఆధిక్యత, చార్లెస్ స్పర్జన్ మాట్లాడుతూ "ఒకవేళ దేవుడు నిన్ను తన సేవకునిగా ఉండుటకు పిలిచినట్లయితే ఒక రాజుగా ఉండుటకు చూడవద్దు" రాజుల రాజును సేవించే ఆధిక్యతను నీవు కలిగి ఉన్నావు.

నేను పెద్దవాడనవుతున్నకొలది ఆయనను సేవించే ఆధిక్యత ద్వారా ఆయన ఇచ్చిన అద్భుతమైన గౌరవమును చూడగలుగుతున్నాను నా యొక్క ఓటమి మరియు అనర్హతలు నాలో ఇంకా ఉన్నప్పటికీ ఆయన యొక్క కృప మరియు బలపరిచే శక్తి ద్వారా అన్నింటిని జయించ గలుగుతున్నాను.

2 తిమో 1:12 నందు పౌలు తన సొంత సాక్ష్యమును పంచు కుంటున్నాడు. తన విశ్వాసమును బట్టి మరణమును ఎదుర్కో బోతున్నప్పటికీ "నేను నమ్మిన వాని ఎరుగుదును గనుక నేను సిగ్గు పడను; నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినం వరకు ఆయన కాపాడగలడని రూఢీగా నమ్ముకొనుచున్నాను". ఇది మన విషయంలో కూడా వాస్తవం. మనం యేసువైపు చూచినప్పుడు ఆయనయొద్ద నుండియే ధైర్యము కలిగి యుంటున్నాము.

నీవు ఒకవేళ ఒక కాపరిగా లేదా నాయకునిగా ఉన్నట్లయితే నీవు నీ పట్టుదలను లేదా ధైర్యమును కలిగి ఉండవలెను. ఎందుకనగా నీవు విశ్వాసుల నుండియు, అవిశ్వాసుల నుండియు వ్యతిరేకతను ఎదుర్కొనవలెను. ఇది యేసు ద్వారా గాని పౌలు మరియు తిమోతి ద్వారా కాని నిలిపివేయబడదు. చివరికి మనము కూడా దీనిని ఆపలేము.

## పౌలు సలహా

నీ పరిచర్య పట్ల ఆసక్తిని, ధైర్యమును మసకబార నీయకుము.

"యొక్కక్కడు కృపావరము పొందిన కొలది, యొకనినొకడు ఉపచారము చేయుడి" 1 పేతు 4:10. దేవుడు మనకు శక్తియు, ప్రేమయు ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే ఇచ్చెను గాని పిరికితనము గల ఆత్మను ఇవ్వలేదు (1 తిమో 1:7).

నీ పట్టుదల ఆసక్తి ఎలా ఉన్నది? ఇది చాలాకాలము నుండి చల్లగా ఉన్నదా? లేదా నీవు రక్షణ పొంది ప్రభువు నొద్దకు వచ్చిన రోజులలో ఉన్నట్టుగానే బలమైనదిగా ఉన్నదా? ఏది నిన్ను భయము లోనికి లాగుతుంది. ఆ విషయాలను దేవుని శక్తితో ఎదుర్కొనుటకు ఏమి చేస్తున్నావు.

## 3. నమ్మకమైన సంఘకాపరి లక్షణములు 1: నమ్మకత్వము (2 తిమో 1:13-18)

పౌలు తిమోతికి ఇచ్చిన సందేశాలలో ప్రాముఖ్యమైన లక్షణాలు పట్టుదల మరియు ధైర్యము అనునవి ఉండాలని గుర్తు చేస్తున్నారు. వాటికి మరొక లక్షణము విశ్వాసము కూడా ఉండాలని తెలియజేస్తున్నారు. మొదట ధైర్యము కలిగి ఉండాలని ప్రభోధించినాడు (2 తిమో1:8-12). మరియు ఇప్పుడు సువార్తను భద్రపరుచుటలో నమ్మకంగా ఉండాలని ప్రభోదిస్తున్నాడు (2తిమో 1:13-18). నీకు అప్పగింపబడిన మంచి పదార్థమును మనలో నివసించుచున్న పరిశుద్ధాత్మ వలనకాపాడుము (2 తిమో 1:14). "కాపాడుము" అను పదము బ్యాంకులలో వాడే పదము. తిమోతి నివసించే ఎఫెసీ పట్టణమునందు అర్తమీ దేవీ గుడిలో చాలా ధనము దేవతకు సమర్పించబడుతుంది.

ఆడబ్బు సురక్షితముగా కాపాడు బాధ్యత అధికారిపై ఉంటుంది. ఈ సందర్భమును సాదృశ్యముగా చూపుతూ, పౌలు తిమోతికి అప్పగించిన సువార్త అను మంచి పదార్థము మిగుల విలువైనది. కాబట్టి దీనిని కాపాడవలెనని తిమోతిని కోరుతున్నాడు. అనుకొనని విధముగా సువార్తను చాలా మంది వ్యాప్తి చేయలేకపోతున్నారు. ఒనేసిఫోరు ఇంటివారు పౌలుతోను, ఆయన పరిచర్యతో ఉండ

గలిగినారు. ఇలాంటివ్యక్తి ప్రతి పరిచర్యలో అవసరమై ఉన్నది. నీవు కూడా నీ చుట్టు ఉన్న వ్యక్తుల పట్ల అలా ఉండవలెను.

**పౌలు సలహా**

దేవుని యందు నమ్మకముగా ఉండుము మరియు ఆయనను సేవించువారి పట్ల కూడా నమ్మకముగా ఉండుము.

సామె 18:24 "బహుమంది చెలికాండ్రు గల వాడు నష్టపడును, సహోదరుని కంటే ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు" (రోమా 12:10). "సహోదర ప్రేమ విషయంలో ఒకని యందొకడు అనురాగము గలవారై ఘనత విషయంలో ఒకనినొక్కడు ఘనతగా ఎంచుకొనుడి". పరిస్థితులతో ఎలాంటి సంబంధము లేకుండా నీవు  ఎవరినైన అంగీకరించగలుగుతున్నావా? ఏదీ సంభవించినప్పటికీ ఎవరు నీకు సహాయము చేస్తున్నారు. పరిచర్యలో కష్టాలను ఎదుర్కొనునపుడు ఎవరు నీకు ఆధారముగా ఉంటున్నారు? ఎవరైన కష్టాలను ఎదుర్కొనే వారున్నారా? ఈ రోజే వారిని కలుసుకొనుము మరియు ప్రోత్సహించుము.

**4. కర్తవ్యము 1: ధృడముగా ఉండు (2:1)**

తిమోతి పరిచర్యలో కలిగి ఉండవలసిన ప్రాముఖ్యమైన లక్షణాలు పట్టుదల, ధైర్యము మరియు విశ్వాసము మొదలగు వాటి ప్రాముఖ్యతను గుర్తు చేసిన తర్వాత పౌలు ఒక దైవభక్తిగల కాపరిగా మరియు నాయకునిగా ఉండుటకు 11 విధులను తెలియజేస్తున్నాడు. మొదటి విధి "బలవంతుడవై యుండు". "నా కుమారుడా క్రీస్తుయేసు కృపచేత బలవంతుడవు కమ్ము" (2 తిమో 2:1). బలవంతుడవై ఉండు అనునది ఒక ఆజ్ఞ ప్రతి కాపరి దీనిని కలిగి ఉండాలి. ఈ పదము

యొక్క గ్రీకులో వాడబడిన కాలమును బట్టి మనము దీనిని తీసుకొనునది తప్ప ఇది మనకు మనముగా పొందుకునేది కాదు. బలమనేది మనలో నుండి వచ్చేది కాదు. ఇది మనము దేవుని యందు విశ్వాసము ఉంచినపుడు ఇవ్వబడేది. ఈ ఆజ్ఞ ప్రస్తుత కాలమునకు సంబంధించినది. కాబట్టి మనము ఎల్లపుడు దేవుని శక్తిని మనలో పనిచెయ్యనివ్వాలి. నేను స్వాభావికముగా భయస్తుడను మరియు బలహీనుడను. ఆయన కొరకు నిలువబడుటకు, ఇతరుల తప్పులను సరిదిద్దుటకు, విమర్శకు లోనైనపుడు, ప్రయాణములలో కష్టాలు ఎదురైనపుడు దేవునిశక్తి అవసరమై ఉంటుంది. నేను ఆధ్యాత్మిక పరిచర్యలో 40 సంవత్సములు పాల్గొని ఉన్నాను. సాతాను బంధకాల నుండి ప్రజలను విడిపించుటకు దేవుని శక్తి అవసరమై ఉంటుంది. నేను పౌలు నుండి కలిసి నేర్చుకొంటున్నాను. నేను బలహీనుడను అయితే దేవుని శక్తి నాయందు పనిచేయుట స్పష్టంగా చూస్తున్నాను (2 కొరింథి 12:9-11).

పౌలు మనము కేవలము బలవంతులముగా ఉండాలని చెప్పుట లేదు. మనము మన మాటలలో, క్రియలలో సామర్థ్యతలో బలవంతులుగా ఉండాలని చెప్పుట లేదు. "కృపచేత బలవంతుడవై ఉండు" అని చెప్తున్నాడు. మనము బలవంతులముగా ఉండుటకు మూలము కృప. మనము ఆధ్యాత్మికముగా ఎదుగుతున్నపుడు దేవుని కృప యొక్క అవసరతను గుర్తించగలము. మనము ఆయన పరిశుద్ధాత్మకు మనలను మనము అప్పగించుకొని ఆయన చిత్తములో జీవిస్తున్నపుడు ఆయన కృప మనలను అన్ని విధములైన జ్ఞానము, శక్తి మరియు నడిపింపులో నింపుతుంది.

ఎదుగుట అనునది జీవితకాలమంత జరుగవలసిన ప్రక్రియ. కాపరులు మరియు నాయకులు ఎదుగవలసిన అవసరత ఉన్నది. కొందరు తాము నాయకులుగా ఉండుటకు ఆధ్యాత్మిక పరిపక్వత

చెందాము అని అంటారు. కాని ఇది వాస్తవము కాదు, ఇతరులు ఎదుర్కొంటున్న శోధనలు, శ్రమలను ఎదుర్కొనుటలో కాపరులు మినహాయింపు కాదు, వాస్తవముగా ఆయనను సేవిస్తున్నాము, కాబట్టి మనమే ఎక్కువగా ఎదుర్కొంటున్నాము.  మన కాపరి పరిచర్యలో మనము ఎదుర్కొను కష్టాలను మరియు సమస్యలను ఆయన మీద ఆధారపడునట్లు మరియు విశ్వాసముంచునట్లు నేర్చుకొనుటకు దేవుడు వాటిని వాడుకుంటాడు. చిన్న విషయాలలో ఆయన కృప అవసరతను తెలుసుకొనునట్లు చేస్తాడు. దేవుడు మనము ఎదుర్కొనే సవాళ్లను మరియు కఠిన విషయాలను తొలగించాడు. కాని వాటిని మనలో అనుమతించి, మనము పూర్తిగా ఆయనను నమ్మునట్లు చేస్తాడు. మనమందరము పౌలు వలె ఉండాలని కోరుతున్నాడు. “నాకృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణ మగుచున్నది” (2 కొరింథి 12:9).

దేవుడు మన చేత ఆయన పనిని చేయించుకోవలసిన అవసరము లేదు. మనలో లేకుండా కూడా వాటిని చేయగలడు కాని ఆయన ఏమి కోరుతున్నాడో దానిని పూర్తిగా తెలుసుకొనవలసిన అవసరము ఉన్నది. మనతో కలిసి మన ద్వారా ఆయన తన పనిని ఎలా చేస్తున్నాడో, దానిని గమనించే ఆధిక్యతను మనము కలిగి యున్నాము. మన సమర్పణను మరియు సేవలను ప్రేమతో చేయాలని ఆయన మన నుండి కోరుతున్నాడు. మనము ఆయనతో వ్యక్తిగతమైన, సాన్నిహిత్యమైన సంబంధమును కలిగి ఉండాలని కోరుతున్నాడు తప్ప మనము ఆయన కొరకు పనిచేసే సమయములోనే కలిగి యుండాలని కాదు మనము ఆయనతో ఎల్లప్పుడు సమయము గడపాలని కోరుతున్నాడు. మనము ఆయనను ప్రేమించాలి, అనుభవించాలి, సంబంధాన్ని కలిగి ఉండాలని కోరుతున్నాడు.

మనము ఆయన వాక్యమును ధ్యానించుట వలన, ఆయన

మనతో మాట్లాడుతున్నపుడు వినుట వలన, మనము ఆయనతో మాట్లాడుట వలన, ఆయనను ఆరాధించుట వలన, ఆయన కొరకు జీవించుట వలన ఆయన కృప యందు ఎదుగగలము. నీవు దీనిని చేయుచున్నావా? ఆయనలో కృప నీలో ఎదుగునట్లు నీవు ఆయనలో ఎదుగుతున్నావా?

**పౌలు సలహా**

ఆయన కృప ద్వారా దేవుడు నీలో పని చేయునట్లు, నీ ద్వారా పనిచేయునట్లు అవకాశమివ్వు, అలాగున నీవు స్వశక్తితో కాక ఆయన శక్తితో పరిచర్య చేయగలవు.

నాకు కలిగిన ప్రత్యేకతలు బహు విశేషముగా ఉన్నందున నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నాకు శరీరములో ఒక ముల్లు, నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నన్ను నలుగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచబడెను. అది నా యొద్ద నుండి తొలగిపోవలెనని దాని విషయమై ప్రభువును ముమ్మారు వేడుకొంటిని, అందుకు నా కృప నీకు చాలును, బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని నాతో చెప్పును.
కాగా క్రీస్తు శక్తి నా మీద నిలిచి యుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతయందే బహు సంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను గనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, హింసలలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నాను (2 కొరింథి 12:7-10). నీ జీవితములో మరియు పరిచర్యలో సంభవించేవన్ని దేవుని నుండి వస్తున్నవని అవన్నియు మంచి కొరకు జరుగుతున్నవని నీవు గుర్తిస్తున్నావా? ఆయనకు కృతజ్ఞతాస్తుతులు

చెల్లించుటకు ఆయనతో కొంత సమయము గడుపుము. మరియు వాటన్నింటిని బట్టి ఆయనను ఘనపరుచుము.

**5. కర్తవ్యము 2: సత్యము మరొక తరమునకు అందించుట (2: 2)**

నా జీవితములో జరిగించిన పనులన్నింటిని బట్టి, దేవుని కృపకు నేను ఋణస్థుడనై యున్నాను. వీటన్నింటిని బట్టి దేవుడు దైవభక్తిగల మనుష్యులను నాకు సలహాదారులుగా ఉంచి, వారి ద్వారా శిక్షణ ఇప్పించినాడు. వారు వారి జ్ఞానమును మరియు అనుభవమును నాకు సంక్రమింప జేసినారు. నేను దానిని ఇతరులకు అందించ వలయును భవిష్యత్తు నందు వారు తర్వాత తరము కాపరులతో వాటిని పంచుకొనవలయును. ఒలియంపిక్ క్రీడల యందు ఒక పందెగాడు మరొక పందెగాడికి అందించే కాగడా వంటిది. ప్రతి తరమునందలి కాపరులు వారు దేనిని పొందియున్నారో దానిని ఇతరులకు అందించవలయును. యౌవన కాపరులను తర్ఫీదు చేయుట మరియు సలహాదారులుగా ఉండుట మన అందరి కర్తవ్యము పౌలు దీనిని తిమోతికి ఆజ్ఞాపించినాడు. నీవు అనేక సాక్షుల యెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము (2తిమో 2:2).

తిమోతి ఏమి నేర్చుకొన్నాడో వాటన్నింటిని నమ్మకమైన మనుష్యులకు అందించవలెనని పౌలు చెబుతున్నాడు. వీరు నమ్మకముగా నేర్చుకొని, ఆయనను సేవించే పురుషులు, మనము నమ్మదగిన వారమని దేవుడు మనలను చూచి ఎంపిక చేసుకున్నాడు. నా పరిచర్య ప్రారంభ దినాలలో ఎల్లపుడు నమ్మకముగా ఉండలేక పోయాను. నేనుతరచుగా చాలా విషయాలలో ఓటమి పాలయ్యేవాణ్ణి, ఇప్పటికీ అవి జరుగుతూ ఉంటాయి. కాని దేవుడు దయగలవాడు. ఆయన క్షమించి,మరియు నన్ను పున:స్థాపితము చేసినాడు. మనకు

ఇతరులు బోధించినవి ఈ నమ్మకమైన మనుష్యులకు మనము బోధించాలి. పౌలు తిమోతికి బోధించినాడు, అతడు " నమ్మకమైన మనుష్యులకు", ఇతరులకు బోధింపగల సమర్థులైన వారికి బోధించాలి ఇది ప్రతి క్రైస్తవుని యొక్క పని యేసు మన యొక్క మాదిరి. ఆయన తన శిష్యులకు బోధించినాడు వారు ఇతరులను తర్ఫీదు చేసినారు మనము కూడా ఈమాదిరిని పాటించాలి.

కొన్ని సంవత్సరముల క్రిందట దేవుడు యౌవన కాపరులకు శిక్షణ ఇవ్వడానికి సలహాదారునిగా ఉండుటకు నాలో దృఢమైన ఆశను కలిగించినాడు. ఇది అంత సులభమైన పని కాదు, కాని యౌవన కాపరులను ప్రోత్సహించుట మరియు సహాయము చేయుట సంతోష కరమైనది మరియు దీవెనకరమైనది. ఆయన సంఘమును మరియు ఆయనను సేవించుటకు దేవుడు సహనముతో నాకు బోధించినాడు. ఇతరులకు ఆ జ్ఞానమును సంక్రమింపచేయుట నా ఆధిక్యత మరియు బాధ్యతయై ఉన్నది. సత్యమును, సంక్రమింపచేయుట ఒక తీవ్రమైన విషయము కాబట్టి బాధ్యతలను నెరవేర్చుకోవాలి.

ఈ పనిని సరియైన విధముగా జరిగించుటకు యేసు యొక్క మాదిరిని అనుసరించవలెను. యేసు ఆయన శిష్యులతో సమయము గడిపినాడు.

ఆయన అనుదిన పరిచర్యలో వారిని తనతో తీసుకెళ్లినాడు. వారికి తర్ఫీదు ఇచ్చి వారి యొక్క అనుభవాలను నేర్చుకున్న విషయాలను పరిచర్యలో వాడుటకు అవకాశం ఇచ్చాడు. పౌలు కూడాదీనినే అనుసరించి తిమోతి, తీతు మరియు ఇతరులను తన వెంటఉంచుకొని శిక్షణ ఇచ్చినాడు. అతడు సత్యమును సహనముతో వారికి అందించి, అవసరమును బట్టి, వారిని సరిదిద్ది, ప్రోత్సహించి, క్రమముగా వారి కొరకు ప్రార్థించినాడు. మనము కూడా దీనిని చేయవలెను.

**పౌలు సలహా**

బైబిలు సత్యము మరియు పరిచర్య నైపుణ్యతలను మరొక తరము కాపరులకు అందించవలెను. వారు ఆ పనిని చేయగలిగే సామర్థ్యమున్నంత వరకు దానిని కొనసాగిస్తారు.

"పరిచర్య ధర్మం జరుగుటకు, ఆయన కొందరిని అపోస్తలుల నుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులను గాను, కొందరిని ఉపదేశకులనుగాను నియమించెను" (ఎఫె 4:13).

"నా కుమారుడా, క్రీస్తుయేసునందున్న కృప చేత బలవంతుడవు కమ్ము.నీవు అనేక సాక్షులు ఎదుట నా వలన వినిన సంగతులనుఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగించుము" (2 తిమో 2:1-2).

నీ జీవితములో ఎవరు నీకు సలహాదారులుగా ఉన్నారు? వారి నుండి నీవు ఏమి నేర్చుకొన్నావు? వారిని బట్టి దేవుని పట్ల కృతజ్ఞత కలిగి ఉంటున్నావా? మరియు వారికి కృతజ్ఞుడవై ఉంటున్నావా?. నీవు ఎవరిసలహాదారుడవుగా ప్రస్తుతము ఉన్నావు? నీ ప్రోత్సాహము లేదా శిక్షణను బట్టి ఎవరు మేలు పొందుతున్నారని తెలుసుకుంటున్నావు.

**6. కర్తవ్యము 3: శ్రమలను సహించుట (2:3-7)**

పౌలు ఈ పత్రికయందు తిమోతి ఇంకా మంచి పరిచర్య చేయుటకు ప్రాముఖ్యమైన సలహాలను ఇచ్చి యున్నాడు. అతడు పట్టుదల, ధైర్యము, నమ్మకత్వము కలిగి ఉండాలని తెలిపినాడు (2 తిమో 1:6-8). తర్వాత కొన్ని ప్రాముఖ్యమైన విధులను పౌలు

గుర్తు చేస్తున్నాడు. తిమోతి దేవుని కృప చేత బలవంతుడిగా ఉండాలని గుర్తు చేసినాడు (2 తిమో 2:1) కాపరత్వమును గూర్చి అతడు ఏమి తెలుసుకొని యున్నాడో ఇతరులు లబ్ధి పొందునట్లు వాటిని అందించాలని తెలిపినాడు. ప్రస్తుతము కష్టములను ఓర్పు లేదా సహనముతో ఎదురుకోవాలని తెలుపుతున్నాడు (2 తిమో 2:3-7). పౌలు "శ్రమను అనుభవించుట" అను ఆజ్ఞను తిమోతికి తెలియ పరుస్తూ మూడు సాదృశ్యములు చూపించాడు.

మొదటిది, సైనికుని ఉదాహరణను ఉపయోగించినాడు. "క్రీస్తు యేసు యొక్క మంచి సైనికుని వలె నాతో కూడా శ్రమను అనుభవించుము". సైనికుడు ఎవడును యుద్ధమునకు పోవునప్పుడు, తన్ను దండులో చేర్చుకొని వానిని సంతోష పెట్టవలెనని ఈ జీవన వ్యాపారములలో చిక్కుకొనుడు (2 తిమో 2:3-5). నేను అమెరికన్ ఆర్మీలో ఉన్నప్పుడు వారు నాకు ఏదైనా ఒక పని అప్పగించి పంపినప్పుడు అక్కడికి వెళ్లి దాన్ని చేసేవాన్ని. నేను ఎల్లప్పుడూ సేవ చేయుటకు సిద్ధంగా ఉండేవాన్నిబీ ఇదే విషయము యేసును సేవించుటలో కూడా వర్తిస్తుంది. మనము ప్రప్రథమముగా ఆయనను సేవించవలయును. ఒక సైనికుడు తప్పక మొదటి ప్రాధాన్యతను కలిగి ఉండాలి మరియు దేవుని సేవించుట మొదట ఉండాలి.

రెండవది, పౌలు క్రీడాకారుడు (అథ్లెట్) సాదృశ్యమును వాడుచున్నాడు. మరియు జెట్టి అయినవాడు పోరాడునప్పుడు నియమ ప్రకారం పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు" (2 తిమో 2:5). క్రీడాకారుడు విజయం పొందాలంటే ఈ నియమములకు లోబడవలెను గ్రీకు క్రీడాకారులు సిద్ధపడునప్పుడు స్వీయ క్రమశిక్షణ మరియు కఠిన సాధన చేస్తారు. మనము కూడా దేవుని యొద్ద నుండి బహుమానము పొందాలంటే నమ్మకమైన పరిచర్య చేయాలి మరియు అన్ని విషయము లయందు స్వీయ నియంత్రణ లేదా ఆశానిగ్రహము సాధకము

చేసుకోవలయును. ఆయన వాక్యము మనలను ఎలా నడిపిస్తే అలాగే మనము ఆయనను సేవించవలెను.

చివరిగా, పౌలు వ్యవసాయదారుని సాదృశ్యమును చూపిస్తున్నాడు. పాటుపడిన వ్యవసాయకుడే మొదట ఫలములలో పాలుపుచ్చుకొనవలసిన వాడు (2 తిమో 2:6). వ్యవసాయము అనునది చాలా కఠినమైన పని. ఇది ఆకర్షణీయమైనా లేదా సున్నిత మైనది కాదు. దీనికి ప్రజలు బాగా తినవలయును దీనికి చాలా సహనము మరియు పట్టుదల కావలెను. మనము అనుకున్న విధంగా ఫలితాలు ఉండవు. కాపరి పనిచేసే వారందరి విషయములలో ఇది వాస్తవం. దేవుని ప్రజలను నడిపించుటకు కఠినసాధన మరియు పట్టుదల అవసరము. మనము ఎప్పుడూ ఫలితాలను వెంటనే చూడలేము గాని, అవి తగిన సమయంలో దొరుకుతాయి.

ఈ సాదృశ్యాలను ధ్యానించాలని మరియు వాటిని తన జీవితమునకు అన్వయించుకోవలెనని తిమోతిని ప్రోత్సహిస్తున్నాడు, ఎందుకనగా వాటి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోగలమని పౌలు అంటున్నాడు (2 తిమో 2:7). మనము కూడా వారి నుండి నేర్చు కోగలము. వాటి నుండి నేర్చుకొనుటలో దేవుడు సహాయము కొరకు ప్రార్థించుము.

## పౌలు సలహా

దేవుని సేవించుటలో శ్రమను అనుభవించుము (ఒక సైనికునివలె) దేవుని విధానములో పనులు చేయుము (ఒక క్రీడాకారుని వలె), సహనముతో కష్టపడి పనిచేయాలి (ఒక వ్యవసాయదారునివలె) “విశ్వాస సంబంధమైన మంచి పోరాటం పోరాడము”.

1 తిమో 6:12 ఏ సాదృశ్యము ఎక్కువగా నీతో మాట్లాడు తుంది; ఒక సైనికుడు, క్రీడాకారుడు లేదా వ్యవసాయదారుడు? ఎందుకు? ఈపాఠ్యభాగము ద్వారా దేవుడు ఏం మాట్లాడినాడు?

**7. శ్రమలను సహించుటలో యేసు మన మాదిరి (2:8-13)**

2 తిమోతి రెండవ అధ్యాయమునందు యేసు కొరకు తాను చేయు పరిచర్యను గుర్తు చేస్తున్నాడు. అతడు సైనికుడు, క్రీడాకారుడు, మరియు వ్యవసాయదారుని జీవితాలు సాదృశ్యముగా వాడినాడు. వారి జీవితాల ద్వారా కఠినమైన శ్రమ, మరియు పట్టుదల యొక్క అవస రతను గుర్తు చేసినాడు. మరియు దేవుని పరిచర్యను సహనముతో చేయాలి అను విషయాలను తెలుపుటకు రెండు సాదృశ్యములను వాడినాడు "తన్నుతాను సాదృశ్యముగా చెప్పినాడు"(9-10) మరియు యేసు (8,11-13) ను సాదృశ్యముగా చూపినాడు.

పౌలు చెరసాలలో ఖైదీగా ఉన్నప్పుడు అతనిలో ఉన్న పట్టుదలను సాదృశ్యముగా చూపుతూ, ఇతరులతో రక్షించబడు నిమిత్తము సమస్తమును ఓర్చుకున్నాను అని తిమోతికి తన్నుతాను ఉదాహరణగా చూపుతున్నాడు (9-10). పామరులముగా మనము బోధించవలెను, దేవుడు నమ్మదగినవాడుగా ఉంటాడు, ఆయన వాగ్దానములను మనతోఉంచుతాడు.

కొన్ని పర్యాయములు మన జీవితాలకు వాటిని అన్వయించు కోవాలి. మరియు మనము బోధిస్తున్నవి ఆచరణలో ఉంచవలయును. మనము ఎదుర్కొనే కష్టాలు, శోధనలను మనము నిరోధించలేము. ఎందుకనగామనము కాపరులమై ఉన్నాము కొన్నిసార్లు మనము ఇతరుల కంటే ఎక్కువగా వాటిని ఎదుర్కొంటాము. దేవుడు వాటిని అనుమతించి నప్పుడు మన అనుభవాల నుండి మనము నేర్చుకుంటాము. ఆయన నమ్మదగినవాడు కాబట్టి మన జీవితాల

ద్వారా మనము ఎదుర్కొను శ్రమానుభావం మరియు బాధ ద్వారా ఆయన మహిమ పరచబడతాడు.

యేసు తనకు తాను సహనముతో శ్రమానుభవమునకు సాదృశ్యముగా ఉన్నాడు (8,11-13). మంచి ఉద్దేశ్యం కొరకు శ్రమలను పొందుటకుఆయన గొప్ప ఉదాహరణగా ఉన్నాడు. ఆయన దేవుడు "(క్రీస్తు దేవుడుఆయనను మృతులలో నుండి లేపినాడు)" మరియు ఆయన మానవుడు(యేసు; దావీదు సంతానమందు పుట్టినవాడు. పౌలు తర్వాత ఆదిమ సంఘమునందు పాడు కీర్తనతో యేసు ఉదాహరణగా కలిగి ఉండి ఆయనను వెంబడించినప్పుడు ఏమి సంభవించిన పరవాలేదు అంటున్నాడు.

ఆదిమ సంఘము వారి ఆరాధనలో పాడునటువంటి క్రైస్తవ పద్యములోని మనము క్రీస్తుతో మరణించినాము అను భావముతో ఏదైతే మన రక్షణ కార్యములో నిశ్చయతను కలిగిస్తుందో దానితో ప్రారంభించినాడు. మనము ఆయనతో మరణించినాము గనుక నిత్యత్వములో ఆయనతో ఉన్నాము. మనము సహించినట్లయితే నిత్యత్వములో బహుమానము పొందగలము (12a).
మనము క్రీస్తుతో చనిపోయినాము గనుక నిత్యత్వమును గూర్చి నిశ్చయతను పొందియున్నాము. మనము వ్యతిరేకతను మరియు శోధనకు ఎదురుగా  నిలువబడినట్లయితే బహుమానము పొందుతాము. మనము నమ్మకముగా నిలబడకపోతే బహుమానము పొందలేము(12b). మనము చనిపోయిన తర్వాత పరలోకం వెళ్తాము. రక్షణ అనునది సమస్య కాదు కాని ప్రత్యేకమైన బహుమానము పొందగలమా లేదా అనేది ముఖ్యము.

ఈ భాగమునందు కష్టములను సహించుట పర్వాలేదు అని గుర్తు చేస్తున్నాడు. మరియు తన్నుతాను మరియు యేసును

ఉదాహరణగా వాడుకుంటున్నాడు. నీ కష్ట సమయంలో ఓర్పుతో శ్రమను అనుభవించిన వారిని నీవు మాదిరిగా ఉంచుకొని ఉండ వచ్చును అయితే నీవు కూడా ఇతరులకు మాదిరిగా ఉండగలుగు తున్నావా?.

**పౌలు సలహా**

యేసు చేసినట్లు నమ్మకముగా శ్రమను ఓర్చుకొనుము. నీవు అలాగు చేసినట్లయితే నిత్యత్వములో బహుమానము పొందగలవు

1 పేతు 4: 2 "మిగిలిన కాలము ఇకమీదట మనుజాశలను అనుసరించి నడుచుకొనక, దేవుని ఇష్టానుసారంగా నడుచుకొనుడి..." నీవుఇప్పుడు ఏ కష్టమును ఎదుర్కొంటున్నావు? దేవుడు ఏదైనను మంచిది చేయగలడని నీవు నమ్ముతున్నావా?

**8. కర్తవ్యము 4: తప్పుడు బోధను ఎదిరించుట (2:14, 16-19)**

కొన్నిసార్లు సంఘమును నడిపించుటలో అవసరమైనవన్నియు చేయుటకు పనిలో నిమగ్నమైపోతారు.

అయితే ప్రాముఖ్యమైన విషయాలను చేయలేకపోతారు. ముఖ్యమైన విషయాలు అంత ప్రాముఖ్యమైనదిగా చూడకపోవుట, నిర్లక్ష్యం చేయబడుట జరుగుతాయి. దేవుడు అత్యంత ప్రధానంగా చూచేవి నిర్లక్ష్యం చేయబడుతాయి. తిమోతి విషయములో ఇది జరగక పోవచ్చు, ఎందుకనగా పౌలు తాను మరణించటానికి ముందు వీటన్నిటిని వ్రాసి గుర్తు చేస్తున్నాడు. తిమోతి ముఖ్యంగా చేయవలసిన అతిప్రాముఖ్యమైన విధి పౌలు తెలియజేస్తున్నాడు. అదేమనగా తప్పుడు బోధన విషయములలో వాదన పెట్టుకొనవద్దని ప్రజలకు తెలియజేయుట వలనేనని జ్ఞాకపము చేయుచున్నాడు (2:14,16,19)

ఇది నేటి దినములలో మనము కూడా పాటించవలసిన విధి. చాలామంది క్రైస్తవులు చిన్న విషయాల పట్ల పెద్ద వాదనలు, చర్చలు పెట్టుకుంటారు.

బైబిలు ఆధారితము కాని బోధలకు దూరముగా ఉండాలని ప్రజలకు గుర్తు చేస్తూ ఉండటము తిమోతి యొక్క విధి (14,16). వాటినే మన బోధన, మరియు వ్యక్తిగతమైన సంభాషణల ద్వారా తెలియజేయాలి. తప్పుడు బోధకులు మరియు సాతాను అబద్ధమును ప్రచారం చేస్తారు, కాబట్టి మనము ప్రాథమిక సత్యములను ప్రప్రథముగా తెలియజేయాలి. వ్యర్థమైన మాటలను బట్టి వాదన పెట్టుకొనుట సరియైనది కాదు, ఎందుకనగా, (1) మనము వాదన పెట్టక పరిపక్వమైన మాటలతో విషయమును చర్చించాలి, మరియు (2) మనము దృష్టి పెట్టవలసినవి మరియు సమయము వెచ్చించ వలసిన ప్రాముఖ్యమైన విషయాలు ఉన్నాయి.

కాబట్టి చిన్న విషయాల పట్ల మన సమయము వృధా చేయరాదు. వాటి ప్రభావం వలన విశ్వాసుల మధ్య విభజనలు వస్తాయి, మరియు యేసు యొక్క సాక్ష్యము దెబ్బతింటుంది.

వాదనలతోతాము గెలిచాము అనే ఆలోచన వారిలో గర్వమును మరియు ఏమి చేసినప్పటికీ గెలవగలము అనే ఆలోచనను కలిగిస్తుంది

కాబట్టి అపవిత్రమైన లేదా  దైవ కేంద్రీతము కాని మాటలను తిరస్కరించాలని పౌలు తిమోతికి తెలియజేస్తున్నాడు (16).”దైవ కేంద్రీతము కాని” అనగా అసత్యమైన దేవుని మహిమ పరచని సంభాషణ ఇలాంటి కబుర్లు వట్టి మాటలుగా, బుద్ధిహీనమైన మాటలుగా పేర్కొనబడినాయి. ఇవి ఇతరుల జీవితాలకు అభివృద్ధిని ఇవ్వవు మరియు క్షేమము కలుగజేయవు. వీటికి లేఖనములలో ఎలాంటి ఆధారాలు ఉండవు. తప్పుడు బోధలు ప్రజలను ప్రాముఖ్య

మైన విషయాల నుండి దృష్టి మరల్చి, విభజనలకు కారణమవుతాయి. మరియు విభజనలకు వాదనలకు దారితీస్తాయి. తప్పుడు బోధకులు విషపూరితమైన, వినాశనము కలిగించు కొరకుడు పుండు వంటివి వారు. వారు సంఘములో ఆధ్యాత్మిక రోగమును కలిగించి మరియు భ్రష్టత్వములోనికి క్షీణదశకు తీసుకొని వస్తారు.

కొన్ని తప్పుడు బోధలకు పౌలు ఉదాహరణ చూపుతున్నాడు. వాటిలో కొందరు పునరుత్థానాన్ని గతించెనని బోధించుట (18). నేటి దినములలో కూడా కొందరు పునరుత్థానము భౌతికంగా జరగదు ఇది కేవలం ఆధ్యాత్మిక సాదృశ్యముగా మాత్రమే ఇవ్వబడినది అని వాదిస్తారు. నీవు ఊహించగలవు, ఇది గందరగోళ పరిస్థితులకు మరియు నిరీక్షణను కోల్పోవుటకు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితులు ఎఫెసీ సంఘములో తిమోతికి ఒక సవాలుగా ఉన్నాయి, నేటి పరిస్థితులలో మనకు కూడా ఒక సవాలుగా మారినాయి. వాటిని వెంటనే ఖండించి సరిచేయవలసిన బాధ్యత మనపై ఉన్నది.

అయినప్పటికీ పరిస్థితులు ఇంకా దేవుని స్వాధీనములోనే ఉన్నాయి. పౌలు పాత నిబంధన వాక్యమును చూపిస్తూ ఈ విషయాన్ని స్థిరపరుస్తున్నాడు. “ప్రభువు తన వారిని ఎరుగును” (2 తిమో 2:19, సంఖ్యా 16:25, 26). ఎవరైతే తన వారై ఉన్నారో వారు తప్పుడు బోధల నుండియు తొలగిపోవలెను (2 తిమో 2:19, యెష 52:11, యోవే 3:5)

ఎవరైనా మన సంఘమునకు వచ్చి బైబిలునందలి సత్యమును తృణీకరించి, యేసు యొక్క దైవత్వమును, ఒప్పుకొనరో వారు తప్పుడు బోధకులని గుర్తించారు. దానిని తప్పుడుగా భావించి, వారిని ఎదిరించ వలెను. కొందరు తమ క్రైస్తవ్యమును అనుసరిస్తున్నామని చెప్పుకుంటూ బైబిలు ఆధారితము కాని వాటిని బోధిస్తూ ఉంటే వారిని ఎదుర్కోవటం చాలా కష్టం, అయితే వారిని మనము గౌరవించి వారి మాటలను

నమ్మనట్లయితే వారి సంఘములో స్థిరపడి దానిని వినాశనం చేస్తారు. ప్రజలు చాలాసార్లు హవ్వ మరియు ఆదాములవలె మోసగింప బడతారు. కొందరు, నూతన విషయాల కొరకు వెదుకుతారు, క్రైస్తవ్యంలో ఉండే విలువతో జీవించుట కష్టముగా భావించి, సులభమార్గాల వైపుకు మొగ్గు చూపుతారు. ఇలాంటివారు తప్పుడు బోధకుల చేత ఆకర్షింపబడుతారు కాబట్టి కాపరిగా నీవు నీ ప్రజలు దేవుని వాక్య సత్యములో ఉండాలని తెలియజేయి. నీవు మంచి ప్రసంగాలను సిద్ధపరచి, ఒకే విషయాన్ని పదే పదే తెలియజేయకుండ అన్ని విషయాలు తెలియజేయబడునట్లు, బైబిలు లోని విషయాలన్నింటి నీ ప్రజలకు తెలియజేయుము మరియు జ్ఞానము మరియు ధైర్యము కలిగి యుండుట కొరకు ప్రార్థించుము. అప్పుడు సత్యము కొరకు నిలువబడగలవు.

**పౌలు సలహా**

లేఖనముల ఆధారితము కాని ఎలాంటి బోధలనైనను ఎదిరించుటకు సిద్ధముగా ఉండుము.

1 తిమో 6:3-5 "ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హిత వాక్యములను దైవభక్తికి అనుగుణ్యములైన బోధలు అంగీకరింపక భిన్నమైన బోధ ఉపదేశించిన యెడల, వాడు ఏమియు ఎరుగక తర్కములను గూర్చియు వాగ్వాదములను గూర్చియు వ్యర్థముగా ప్రయాసపడుచు గర్వాంధుడగును. వీటి మూలముగా అసూయ, కలహము, దూషణలను, దురానుమానము, చెడిపోయిన మనసు కలిగి సత్యహీనులై దైవభక్తి లాభసాధనమునుకొను మనుష్యుల వ్యర్థ వివాదములును కలుగుచున్నవి". నీ సంఘములోనికి ఎవరైనా తప్పుడు బోధలను తీసుకొని వచ్చినప్పుడు నీవు దానికి వ్యతిరేకముగా

ప్రతిఘటించినావా? ఏమి జరిగినది? కొందరు ముఖ్యమైన ప్రజలు సంఘము నుండి దూరమైపోతున్నారని నీవు తప్పుడు బోధలతో రాజీ పడుటకు శోధింపబడినవా?

## 9. కర్తవ్యము 5: దేవుని ఆమోదము మాత్రము వెదుకుట (2:15)

మంచి తల్లిదండ్రులు తమ పిల్లలు మంచివారుగా ఉండాలని తలంచుతారు. ప్రతి పిల్లవాని యొక్క బలము మరియు బలహీనతలు సామర్థ్యాలు మరియు పరిమితులు వారికి తెలుస్తాయి. ఒకవేళ పిల్లవాడు తనకు కష్టమైన వాటిని చేయుటకు ప్రయత్నిస్తుంటే వారి తల్లిదండ్రులు సంతృప్తి పడతారు. అదేవిధముగా తన పిల్లల పట్ల పరలోకపు తండ్రి కూడా ఆలోచిస్తాడు. ఆయన ఎంత మాత్రము మనలను ఇతరులతో పోల్చి చూడడు. మనము పరిపూర్ణులముగా ఉండాలని ఎదురు చూడడు, అనుకొనడు. “మనము మంటివారమని ఆయనకు తెలుసు” (కీర్తన 104:13). కాని పాప విషయమై నిర్లక్ష్యంగా ఉండాలని కోరుకొనడు. తలాంతుల ఉపమానము నందు బోధింపబడినట్లు ఆయన మనలను ఇతరులతో పోల్చి చూడటానికి ప్ర యత్నించడు కానీ ఆయన మనకు ఇచ్చిన వనరులను మరియు వరములను, తలాంతులను మన శక్తికొలది ఉపయోగించాలని కోరుకుంటాడు (మత్త 25:14-30).

పౌలు తిమోతి నుండి కూడా అదేవిధంగా ఆశిస్తున్నట్లు (2 తిమో 2:15) నందు చూడగలము “దేవుని ఎదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పని వానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించువానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము”. దేవుడు ఒక్కడే మనము ఆశించే వాటిని మరియు మనకు అవసరమైన వాటిని ఆమోదించేవాడు. మనము ఎప్పుడు ప్రజలను ప్రీతిపరచుటకు గాని, సంతోష పెట్టుటకు గాని, ప్రలోభ పెట్టుటకు

గాని ప్రయత్నించవద్దు, ఈ విషయములో చాలామంది కాపరులు శోధింపబడుతారు. కాని జనాదరణ కొరకు మనము సత్యాన్ని రాజీచేయలేము. నిజానికి, వాస్తవముగా మనము విశ్వాసముతో నమ్మకముగా దేవుని సేవించినప్పుడు ఏదో ఒక వ్యతిరేకతను ఎదుర్కొంటాము. యేసు కూడా చాలా మంది చేత ఇష్టపడలేదు కాబట్టి (లూకా 6:26) నందు ఆయన మనలను హెచ్చరించినాడు. "మనుష్యులందరూ మిమ్మును కొనియాడునప్పుడు మీకు శ్రమ" మరియు (మత్త 5:11) నందు "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి, మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకు నప్పుడు మీరు ధన్యులు" అని తెలిపినాడు.

ఒక కాపరిగా ఉండుట అనేది ప్రజాదారణ పొందే పోటీ వంటిది కాదు. దేవుడు ఒక్కడు మాత్రము తప్ప మనం ఇంకా ఎవరిని గూర్చి ఎందుకు ఆలోచించాలి. దేవుడు మనలను "భలా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు కొంచెములో నమ్మకముగా ఉంటివి" (మత్త 25: 23). అను ప్రశంస దేవుని నుండి పొందవలెను, తప్ప మనుష్యుల నుండి పొందవలసిన అవసరం ఉండదు…దీని అర్థము మనము దేవుని మెప్పించుట కొరకు ఒకవేళ ఇతరులు దానిని అంగీకరించిన లేదా అంగీకరించకపోయినప్పటికి మనం వాటిని తప్పక చెయ్యాలి. "దేవుని వాక్యసత్యమే" మన ఆయుధము. ప్రతి పనివాడు డాక్టర్లు, రైతులు, సైనికులు వారి వారి పనిముట్లను, పరికరములను కలిగి ఉంటారు. బైబిలు ఒక కాపరి యొక్క పరికరము, దానిని అతడు జీవితాలను మార్చి, దేవుని మహిమపరచునట్లు వాడుకొంటాడు. మన ఆయుధము మనలను ఆయనకు మంచి కాపరులుగా ఉండుటకు సమర్థులనుగా చేస్తుంది. కాబట్టి మన వాక్యపరిచర్యలో, వర్తమానములు సిద్దపడుటలో దగ్గర దారులను వెదకవద్దు. ప్రతి ఒక్కటి కూడా జాగ్రత్తగాను, పూర్తిగాను చేయబడాలి. మనము అలా

చేయనట్లైతే మనపరిచర్యను దేవుడు ఆమోదించడు.

దేవుని వాక్యము "ఆత్మ ఖడ్గముగా" పిలవబడినది (ఎఫె 6:17). ఇది పదునైన రెండు అంచులుగల ఖడ్గము, అది నైపుణ్యత గల ఖడ్గవీరుని చేతిలో క్రియాశీలకముగా వాడబడేది అని చెప్పబడినది. కాని ఒక వ్యక్తి దానిని ఎలా ఉపయోగించవలెనో తెలియకపోతే దానివలన అతనికి హాని జరుగుతుంది. కాపరులు వాక్యమును ఉపయోగించుటలో నైపుణ్యత మరియు జ్ఞానము కలిగి ఉండాలి. దాని ద్వారానే మనము విజయము పొందగలము. మనము దీనిని ఉపయోగించుటలో ప్రావీణ్యత గలవారుగా ఉండాలని కోరుతున్నాడు? మనము దేవుని వలన ఆమోదము పొందినట్లయితే మనము సిగ్గు పడవలసిన అవసరం ఉండదు. నీవు నీ బైబిలును వాడుటలో నైపుణ్యత కలిగిఉన్నావా? ఆయన వాక్యమును ఉపయోగించినట్లు నీ జ్ఞానమును దేవుడు ఆమోదిస్తాడా?

మత్తయి 25:22-23 "అలాగే రెండు తలాంతులు తీసుకొన్న వాడు వచ్చి "అయ్యా నీవు నాకు రెండు తలాంతుల నప్పగించితివే అనియు గాక మరి రెండు తలాంతులు సంపాదించితినని చెప్పెను. అతని యజమానుడు-భలా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటి మీద నియమించెదను, నీ యజమానుని సంతోషములో పాలు పొందుమని అతనితో చెప్పెను".

నీవు జ్ఞానమందు ఎదుగుతున్నావా? మరియు దేవుని వాక్యమును సరియైన విధముగా వాడుతున్నావా? బైబిలు ప్రకారంగా నీవు జీవిస్తున్నావా? పరిచర్య చేస్తున్నావా?

## 10. కర్తవ్యము 6: పరిశుద్ధత కలిగి యుండు (2: 20-26)

క్రైస్తవ జీవితము మరియు పరిచర్యలను అర్థం చేసుకొనుటకు పౌలు ఎన్నో సాదృశ్యాలను 2 తిమోతి నందు వాడినాడు అతడు సైనికునిగాను (2:3-4), క్రీడాకారుడు (2:5), వ్యవసాయదారుడు (2:6), పనివాడు (2:13), పాత్ర (2:20-21) మరియు సేవకుడు (2:24:26). దీని ఇతర విషయాలలోను సమాంతరంగా చెప్పినాడు. యేసు కొరకు జీవించుట అనగా గృహ నిర్వాహకునిగా (1 కొరింథి 4: 1-2), రాయబారి (5:20)గా ఉండుట. పేతురు విశ్వాసులను సజీవమైన రాళ్లు (Iపేతు 2:5), యాజకులు (1 పేతు 2:5,9,10) మరియుయాత్రికులు (1 పేతు 2:5-11) అనువాటికి దృష్టాంత ములుగా వాడినాడు. యేసు మనలను జాలరులు (మత్త 4:19), ఉప్పు (మత్త 5:13)వెలుగు (మత్త 5:14-16), ద్రాక్ష తీగల (యోహా 15:5) సాదృశ్యములను వాడినాడు.

ఆరవ విధియైన పవిత్రుడవై యుండుము అను విషయము లను పౌలు తిమోతికి జ్ఞాపకము చేస్తూ, ప్రజలను కర్ర మరియు మట్టితో చేయబడిన పాత్రలతో పోల్చినాడు (2 తిమో 2:20-21). కొన్ని పవిత్రమైనవిగాను మరియు చాలా ఉద్దేశ్యాల కొరకు వాడుకొను నట్లుగాను, మరికొన్ని అపవిత్రమైనవిగాను, ఎప్పటికీ వాడుకొనుటకు వీలుకాని విధముగాను ఉన్నాయి. ఇవి ఎఫెసీలో ఉన్న విశ్వాసుల విషయములో వాస్తవము. మనము పరిచర్య నిమిత్తమే వాడబడుటకు సిద్ధంగా ఉండునట్లు అంతరంగమందును మరియు బాహ్యముగాను పరిశుద్ధత కలిగి ఉండాలి. ఎప్పుడు మన అవసరత ఉన్నప్పటికీ మనము సిద్ధంగా ఉండాలి.

పౌలు అపవిత్రులుగా చేయబడుటకు గల ప్రత్యేకమైన కారణాలను జాబితాగా చూపి, వాటిని విసర్జించాలని చెప్పాడు.

యౌవనేచ్ఛల నుండి పారిపొమ్ము (22) అనగా నేర్పులేని మూఢుల వితర్కములకు (23) జగడములకు (24) సూచనలు ఇవ్వడానికి సిద్ధమనస్సు లేకుండుట (25,26).

"యౌవనేచ్ఛల నుండి పారిపొమ్ము" (2 తిమో 2:22). యౌవనస్థులు తరచుగా లైంగిక సంబంధమైన పాపములో ఉంటారని, మరియు ఇతర పాపములైన, వాదనలు, గర్వము, అందరికంటే ఎక్కువగా తెలుసు అనే ఆలోచనలు ఉంటాయి. అయితే వీటినుండి పారిపోతూ నీతి, విశ్వాసము, ప్రేమ మరియు సమాధానములను వెంటాడవలెను.

"నేర్పులేని వితర్కములను, వాదనలను కలిగియుండవద్దు" (2 తిమో 2:23). తప్పుడు బోధను, బోధకులను నివారించాలి, వారు తప్పుడు బోధను వ్యాప్తి చేయడము మాత్రమేకాదు, విశ్వాసుల మధ్య వాదనలను, విభజనలను సృష్టిస్తారు. ఈ రోజులలో కృప వలన మాత్రమే కాదు మంచి క్రియలు కూడా చేయాలి. మంచి పనులు చేయవలసిన అవసరత లేదు, కృప ఉంటే సరిపోతుంది అనే తప్పుడు బోధలు చేయబడుతున్నాయి. కాబట్టి ఇవన్నియు ఖండించబడ వలయును.

"దేవుని సేవకుడు జగడమాడరాదు" (2 తిమో 2:24). కొందరు నీవు తప్పుడు బోధకులకు దూరముగా ఉండుము అప్పుడు చాలా వాదముల నుండి దూరముగా ఉంటావు అంటారు. కాని పౌలు దీనికి బదులుగా మనము ప్రతి వారి పట్ల మరియు తప్పుడు బోధకులపట్ల కూడా, దయగా, మర్యాదగా, ప్రేమపూర్వకముగా మెలగాలని తెల్పుతున్నాడు. మనము దేవుని సత్యమును ఇతరులకు అందించుటకుఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి (1పేతు 3:15). మనము పగతో కాక ఇతరుల పట్ల క్షమాపణ భావముతో వ్యవహరించాలి.

"ప్రత్యర్థులకు సున్నితముగా బోధించాలి" (2 తిమో 2:25-26) వారు తప్పుడు విశ్వాసముల వైపు ఆకర్షితులై సత్యము నుండి తొలగిపోయినారు. వారు తప్పుడు బోధకుల యొక్క మాయా జాలములో పడి ఉన్నారు. మరియు సాతాను యొక్క వలలో ఉన్నారు. దాని ప్రభావం నుండి విడిపించబడవలయును.

నేటి కాపరులకు ఈ మాటలు అన్వయింపబడతాయి, మనము పవిత్రమైన పాత్రలుగా ఉండవలసిన అవసరం ఉన్నది. అప్పుడు దేవుడు మనలను ఏ పనికైనను లేదా బాధ్యత కొరకైనను జరిగించుటకు వాడుకుంటాడు. మనము తప్పుడు బోధను నివారించి సత్యమును దేవుని వాక్యమును అనుసరించుట మాత్రమే కాదు కాని మన సంఘములయందు వ్యాప్తి చెందే ఎలాంటి అబద్ధములనైనను ఖండించవలెను, మరియు వారిని చేరుకొని సత్యములోనికి నడిపించ వలెను. తప్పుడు బోధ అనగా దేవుని వాక్యమునకు విరుద్ధమైన బోద. మనము అడిగినవన్నీ దేవుడు ఇస్తాడు, మనము ఎప్పుడు రోగపీడితులము కాలేము, కష్టములచేత బాధను అనుభవించము, మన జీవితము సుఖాంతము చెందుటకు ఆయన ఏదైన అద్భుతాలు చేయగలడు అని బోధిస్తారు. ఇలాంటి బోధలు పాపము యొక్క తీవ్రత మరియు  అవిధేయత గూర్చి తక్కువగా చేసి చూపిస్తాయి. కాబట్టి ఆయన వాక్యమును ఎరిగియుండి ఆయన నడిపింపును కోరుకొనుము

**పౌలు సలహా**

పరిశుద్ధముగా జీవించు, పాపము నుండి వెనుదిరుగుము మరియు తప్పుడు బోధలను వ్యతిరేకించుము.

మత్త 5:8 "హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని కుమారులు అనబడుదురు" కీర్తన 51:10 "దేవా, నా యందు శుద్ధ

హృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము”. పవిత్రత విషయములో నీవు ఎక్కడ పోరాటం ఎదుర్కొంటున్నావు? విజయం పొందుటకు నీవు తప్పక చేయవలసినదేది?

## 11. కర్తవ్యము 7: లోకవ్యతిరేకతకు అప్రమత్తంగా ఉండుట (3:1-9)

ప్రతితరము లోకము చెత్తగా ఉన్నదని తలంచుతారు. మనము కూడా నేడు అలాగే ఆలోచిస్తున్నాము. పౌలు కూడా మన వలే ఆలోచించాడు. ఆయన ఆలోచించుట మాత్రమే కాదు ఆయన దానిని నిరూపించినాడుమనము అంత్య దినములలోనికి ప్రవేశించిన కొలది లోకములో చెడుతనము వ్యాప్తి చెందుతుంది, పెరిగిపోతుంది. ఈ భాగమునందు పౌలు లోకము నుండి ఎదురయ్యే చెడు నుండి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు .

“అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలుసుకొనుము” (2 తిమో 3:1-9). “అంత్య దినములు” అనునది యేసు యొక్క రెండవ రాకడకు ముందు సంభవించే విషయాలు అయితే ఆయన రాకడ ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు. అందువలన ఆ దినములు ఇప్పటికే ప్రారంభమైనట్లు పౌలు తలంచి నాడు మరియు వారి మధ్యలో జీవించిన తిమోతికి వారు ఎలా ఉంటారో వివరించినాడు.

2 తిమో 3:2-5 నందు ప్రజలు ఇలా ఉంటారని పౌలు పేర్కొంటాడు,వారు తమ్ముసుతామే ప్రేమించుకుంటారు, స్వార్థ ప్రియులు (తమను తాము పొగడుకొనువారు), ధనాపేక్షులు, లోభత్వము, బింకములాడువారు (అతిశయపడువారు), గర్విష్టులు, దూషించేవారు (ఇతరుల పట్లకఠినంగా వ్యవహరించేవారు, గౌరవం లేనివారు), వారి తల్లిదండ్రులకుఅవిధేయులు (తిరుగుబాటు ధోరణి

గలవారు), కృతజ్ఞత లేని వారు (ఎవరిని గుర్తించలేని మనస్తత్వము), అపవిత్రమైన (మంచి అనేది లేకపోవడం, నీతి, నైతిక విలువలు లోపించుట), అనురాగరహితులు (దయలేని వారు, హృదయ కాఠిన్యము గలవారు, నిష్కాపటులు, ఇతరులను పట్టించుకోకుండా తమ గురించి మాత్రము ఆలోచించేవారు), అతిద్వేషులు (ఇది సాతాను సంబంధమైన పైశాచిక పదము యొక్క మూలము నుండి వచ్చినది, క్షమించలేక ప్రతికారము తీర్చుకొను మనసుగలవారు), అపవాదకులు (క్రూరముగా బాధించేవారు, అసాధ్యమైన మాటలు చేత ఇతరులను కృంగదీసేవారు) అజితేంద్రియులు (స్వీయ నిగ్రహము లేని వారు, వారు ఏమి చేయాలనుకుంటారో దానినే చేసేవారు) క్రూరులు (ప్రజల చేత మచ్చిక చేయబడని వారు, నాగరికత లేని వారు, క్రూరమైన జంతు స్వభావము కలవారు), సజ్జనద్వేషులు (ఎందుకనగా మంచిది ఏదైనను దానిని ద్వేషిస్తారు, విధ్వంసము చేయువారు బాధించేవారు), ద్రోహులు విశ్వాస పాత్రులుగా ఉండే వారికి (ద్రోహం చేయువారు), మూర్ఖులు (తమ తలంపుల ద్వారా, క్రియల ద్వారా నిర్లక్ష్యంగా ఉండేవారు), గర్వాంధులు (వారిస్వయం ప్రాముఖ్యమైన విషయాలను ఎత్తి చూపించే వారు), దేవుని కంటే సుఖానుభవమున ఎక్కువగా ప్రేమించువారు (సుఖప్రదమైన, అనైతికమైన, స్వీయ జీవితములో మంచి కలదని తలంచి దాని పట్ల భక్తి కలిగి యుండుట, సొంత ఆనందాన్ని మాత్రమే దేవునిగా తలంచేవారు), పైకి భక్తుగల వారి వలె యుండియు దాని శక్తిని ఆశ్రయించినవారు (వేషదారులు, మనస్సాక్షి గలవాని వలె నటించువారు, చూపించే వాటిలో వాస్తవిక లేనివారు), ఎల్లప్పుడూ నేర్చుకొనుచున్నను సత్య విషయమైన అనుభవజ్ఞానము పొందలేని వారు (వారు అబద్ధములను నమ్మువారు, వారు బైబిలు దేవుని యొక్క అంతిమ సంపూర్ణ అధికార పూర్వకమైన గ్రంథముగా నేడు మనకు ఇవ్వబడినదని గ్రహించలేనివారు).

"అలాంటి ప్రజలతో సంబంధము లేదు" అను ఒక బలమైన వ్యాఖ్యానముతో తిమోతి యొక్క ప్రతిస్పందన వారిపట్ల ఎలా ఉండాలో తెలియజేస్తూ పౌలు ముగిస్తున్నాడు. అబద్ధ బోధకులు మంచి వాక్‌శక్తిని ఉపయోగించి వీటిని బోధించి ప్రజల జీవితాలను నాశనం చేస్తారు అని పౌలు హెచ్చరించినాడు. యన్నే, యంబ్రే అనువారు ఫరో ఆస్థానములో మోషేను ఎదిరించినవారు వీరికి ఉదాహరణగా ఉన్నారు. ఈ అబద్ధ బోధకులు చెడిన మనస్సు గలవారు మరియు దేవుని తీర్పు క్రింద ఉన్నవారు (8వ).

మోషను ఎదిరించిన ప్రత్యర్థులుతిమోతి కాలంలో ఉన్న అబద్ధ ప్రవక్తల వంటివారే. వారు మోషే యొక్క దేవునిశక్తి తమ దగ్గర ఉన్న మాంత్రిక, భూతములశక్తి కంటే గొప్పదని తెలుసుకున్నప్పటికీ వారు ఎలా పశ్చాతాప పడలేదో? వీరు కూడా తమ చెడుక్రియలను బట్టి పశ్చాతాపపడరు (9వ).

కొన్నిసార్లు ఎవరు తప్పుడు బోధకులు అని చెప్పుట కష్టం. అయితే వారు చెప్పిన వాటి ద్వారా కాకుండా వారి తలంపులను కూడా పరిశీలించాలి. వారికి ప్రజలలో ఎలాంటి పేరు ఉన్నది చూడాలి మరియు వారికి కాపరుల పట్ల మరియు దేవుని వాక్యము పట్ల ఎలాంటి వైఖరి ఉన్నది గమనించాలి. వారు తమకిష్టమైన సొంత మార్గాలను పొందటానికి గర్వము, అధికారాన్ని వాడుతున్నారా? వారు క్రొత్త విషయాలు నేర్చుకొనుటకు సిద్ధంగా ఉన్నారా? వారు నీ యొక్క బైబిలు వివరణను శ్రద్ధతో వింటున్నారా? మొదలగు వాటిని వారికీ అన్వయించుట ద్వారానీవు నిర్ణయించవచ్చును. మరియు మనలో ఉన్న దేవుని ఆత్మ ద్వారా ఆయన ఇచ్చు నడిపింపు మరియు జ్ఞానము ద్వారా తెలుసుకోగలము.

**పౌలు సలహా**

దేవుని యొక్క విషయాలను ఎదిరించే గర్విష్టులైన, స్వీయ కేంద్రీతులైన, తిరస్కరించే ప్రజలకు దూరముగా ఉండుము. మరియు ఇతర ప్రజలను కూడా అలాగే నడిపించుటకు ప్రయత్నించుము.

ఇక్కడ వివరించబడిన విషయాలు ఎవరికి సరిపోతాయి? నిన్ను నీవు మరియు నీ సంఘమును జాగ్రత్తగా వారి నుండి రక్షించు కోగలుగుతున్నావా?

**12. కర్తవ్యము 8: హింసల యందు నమ్మకముగా ఉండు (3:10-13)**

పౌలు తిమోతితో ప్రజలు ఎవరైతే యేసును గూర్చి నీవు బోధిస్తున్నది ఖండించలేకపోతారో వారు దానికి బదులుగా వ్యక్తి గతముగా నిన్ను దాడి చేస్తారు. ఇది యేసును సేవించే వారందరి విషయములో సాధారణంగా జరుగుతుంది. ఇది యేసు విషయంలో జరిగినది మరియు పౌలు విషయంలో కూడా జరిగినది (2 తిమో 3: 10-13).

పౌలు హింసను ఎలా సహించినాడో తిమోతికి జ్ఞాపకం చేసినాడు కాబట్టి తిమోతి తాను శ్రమను, హింసను ఎదుర్కొన్నప్పుడు ఎంత మాత్రము ఆశ్చర్యపోలేదు. మనము చాలాసార్లు వ్యతిరేకత మరియు కష్టాలు మనము చేసే తప్పిదాలను బట్టి సంభవించాయని అనుకుంటాము కానీ మనము సరైన మార్గములో ఉంటూ దేవుడు ఆశించిన రీతిగా జీవిస్తున్నందున హింస పొందుతాము. దేవుని శత్రువులైన లోకము, శరీరము మరియు సాతాను దేవునికి మరియు ఆయన ప్రతినిధులకు వ్యతిరేకముగా పనిచేయటం వలన సంభవిస్తాయి.

విచారించదగిన సత్యము ఏంటంటే వ్యతిరేకత మరియు విమర్శ పౌలు ఎదుర్కొన్నవి సంఘములో నుండి వచ్చినదే తప్ప సంఘము వెలపట నుండి కలిగినది కాదు. అది ఆదిమసంఘ విషయములో మరియు ఇప్పటికిని వాస్తవమే. అయినప్పటికి దేవుడు ఇంకా తన నమ్మకత్వమును బట్టి తన పనిని మన ద్వార కొనసాగిస్తున్నాడు. పరిస్థితులన్నిటి మధ్యలో దేవుడు సహాయము చేస్తున్నాడు (2 తిమో 3:10-11).

పౌలు జీవితము తిమోతికిని మరియు ఇతరులకును, నేడు మనకు కూడా ఒక ఉదాహరణగా ఉండుటకు వీటన్నిటిని ఎదుర్కొనుటకు అనుమతించినాడు. నీవు ఎవరికి ఉదాహరణగా ఉండగలుగు తున్నావు? నీవు ఎరిగి ఉండకపోయినప్పటికీ నిన్ను ఎవరో చూస్తున్నారు. దేవుడు వీటిని మన జీవితములోనికి అనుమతించి మన ఆధ్యాత్మిక ఎదుగుదల కొరకు మరియు ఆయన మహిమ కొరకు వాడుకొంటాడు.

ఈ పాఠ్యభాగమునందు పౌలు ఒక అద్భుతమైన ప్రకటన చేస్తాడు. "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించు వారందరూ హింస పొందుదురు" (2 తిమో 2:12). మనము వ్యతిరేకతను మరియు హింసను వద్దని కోరుకుంటున్నట్లయితే మనము క్రీస్తు కొరకు జీవించుట నిలిపివేస్తే సరిపోతుంది. సాతానుడు కూడా మన మీద ఒత్తిడి పెట్టుట ఆపివేస్తాడు. జీవితములో శ్రమను అనుభవిస్తుంటే ఆశ్చర్యపోవద్దు లేదా నిరుత్సాహపడవద్దు. వీటన్నింటిని ప్రతి ఒక్కరు, నీవు మరియు నేను ఎదుర్కోవాలి.

13వ వచనము నందు దుర్జనులు, వంచకులు అంతకంతకు చెడిపోవుదురని వాగ్దానము చేయబడినది. సత్యము ఎప్పటికి విజయము పొందుతుంది. బహుశా దీనిని మన జీవిత దినములలో చూడకపోవచ్చు. యేసు పరిస్థితులన్నింటిని తిరిగి చక్కపెట్టగలడు.

దేవుని సేవించువారు కష్టాలగుండా వెళ్తాడు కానీ దేవుడు వారితో కూడా ఉంటాడు.

**పౌలు సలహా**

పరిచర్య చాలా కష్టతరమైనపుడు ఎంతమాత్రము ఆశ్చర్యపోవద్దు, కేవలము విశ్వాసముతో నిలిచియుండుము.

“నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి, మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునపుడు మీరు ధన్యులు, సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును, ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి” (మత్త 5:11-12)

ప్రజలు నిన్ను వ్యతిరేకించినపుడు, నీవు ఆశించనవి సంభవించి నపుడు నీ మొదటి స్పందన ఏది? తిరస్కారమునకు మరియు వ్యతిరేకతకు యేసు ఎలా స్పందించినాడు? అది మనము కూడా తప్పక చేయవలెను.

**13 కర్తవ్యము 9: వాక్యమందు జీవించుము (3:14-17)**

పౌలు తన తోటి ప్రయాణికుడైన తిమోతితో జరిగించిన ఉత్తర ప్రత్యుత్తరములో ఆనాటి పరిస్థితులలో తనకవసరమైన సలహాలను ఇచ్చియున్నాడు. తిమోతి విశ్వాసమందు నిలుకడగా ఉండాలని ప్రోత్సహించినాడు (1:1-5). దేవుని సేవించుటకు కావలసిన మూడు ప్రాముఖ్యమైన లక్షణాలను పేర్కొన్నాడు. 1. పట్టుదల, 2. ధైర్యము మరియు 3. నమ్మకత్వము (1:6-18). మరియు ప్రతీ కాపరికి మరియు నాయకులకు ఉండవలసిన లక్షణముల జాబితాను తిమోతి వారికి ఆజ్ఞాపించుటకు పౌలు వ్రాసినాడు (2:1-4:8). పౌలు

చెప్పాలనుకొనే విషయాలు పౌలు తిమోతికి ప్రత్యక్షముగా చెప్పుతున్నాడు (3:14-4:5) తిమోతి ఏమి నేర్చుకొన్నాడో వాటిలో నిలుకడగా ఉండాలని ఆజ్ఞాపిస్తున్నాడు (2 తిమో 3:14).

బైబిలులో ఉన్న విషయాలను మన జీవితములో ఆచరణలో ఉంచకపోయినట్లయితే దానిలోని మంచివి చేయలేము. తిమోతి సత్యమునందు నమ్మకమైన పట్టుదల కలిగి ఉండాలి, తప్పు తనను వ్యతిరేకిస్తే, విమర్శిస్తున్న తప్పుడు బోధలచేత తన దృష్టిని మరల్చవద్దు. దేవుని వాక్యము మాత్రమే ఖచ్చితమైన, తప్పుల నుండి మనలను కాపాడుటకు మరియు సత్యమును తెలుసుకొనుటకు ఏకైక మార్గము. మన క్రియలుమన విలువలచేత నిర్ధారింపబడుతాయి. మరియు మన జీవిత విలువలు మన విశ్వాసముపైన నిర్మింపబడుతాయి. తిమోతి దేవుని వాక్యమునందు విశ్వాసముంచియున్నాడు. కాబట్టి అతనిలో ఉన్న జీవిత విలువలు దేవుని విలువలతో సరిపోల్చియున్నాడు. అవి అతని క్రియలలో కనబడుతున్నాయి. ప్రజల యొక్క క్రియలు వారు దానిని నమ్ముతున్నారని చూపిస్తాయి. వారు ప్రజలతో ఎలా మెదులుతారో ఇతరుల విలువలను గూర్చి వారి నమ్మకాలను తెలియ జేస్తాయి. తిమోతి ఈ విషయాలను తన బాల్యమునందే నేర్చుకున్నాడు (15వ). మరియు పౌలు తాను నేర్చుకొన్నవన్నియు వాస్తవమని జ్ఞాపకము చేస్తున్నాడు.

చిన్నపిల్లలకు తమ బాల్యమునందే దేవుని వాక్యము బోధించుట ఎంతో ప్రాముఖ్యమైనది. ఆ వయసులో చిన్న చిన్న కథలు వినుట మరియు ఆటలాడుట చేస్తారు. కానీ వారు దేవుని వాక్యమందు బయలు పరచబడిన సత్యాలను నేర్చుకొనవలయును, చాలామంది కాపరులు సంఘములో పిల్లలు అంత ప్రాముఖ్యమైన కారు అనుకొని పెద్దవారి మీదనే దృష్టి ఉంచి వారికే పరిచర్య చేస్తుంటారు. నేను ప్రజలకు ఒక విషయము అర్ధమయ్యేలా చేయటానికి రెండు

పెన్సిల్‌లను ఒకటి సగం అయిపోయిన దానిని, మరొకటి పూర్తిగా ఉన్న పెన్సిల్ నుచూపించి ఈ రెండింటిని దేనిని కోరుకుంటారని అడిగినప్పుడు అందరూ పూర్తిగా ఉన్నదానిని కోరుకున్నారు. కారణం ఇది ఎక్కువ సేపు వాడుకోవచ్చని చెప్పారు. దానిని బట్టి నేను వారికి ఒక సత్యము చెప్పాను అలాగుననే దేవుడు తన పరిచర్యకు మనుషుల ను ఏర్పాటు చేసుకోవాలనుకున్నప్పుడు చిన్న వయసులో ఉన్న పిల్లలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు అని చెప్పాను. కాబట్టి చిన్న వయసులోనే దేవుని ఎరిగి యుండునట్లు వారికి వాక్యం బోధించవలెను. తిమోతి ఇంకా బాలుడుగా ఉన్నప్పుడే దేవుని లేఖనములను అభ్యసించినాడు. "పరిశుద్ధ లేఖనములను బాల్యము నుండి నీవు ఎరుగుదువు" (2 తిమో3:15). "దీని ద్వారా మాత్రమే నీవు రక్షణార్థమైన జ్ఞానము పొందియున్నావు" (15వ).

క్రైస్తవుని జీవితములో లేఖనముల యొక్క ప్రాముఖ్యతను చూపిస్తూ చాలా ప్రాముఖ్యమైన విషయాలు దేవుని వాక్యమును గూర్చి వివరించినాడు. "ప్రతి" (ప్రతి మాట). లేఖనము దైవావేశము (లేఖనములోని మాట వాస్తవము మరియు 100% సత్యమైనది) వలన కలిగినది. మరియు ఆ లేఖనము ఉపదేశించుటకు, ఖండించుటకు, తప్పు దిద్దుటకు, నీతియందు శిక్ష చేయుటకు ప్రయోజనకరమైనది (2 తిమో3:16-17).

"ఉపదేశము" అను మాట సత్యమందు శిక్షణ ఇవ్వటానికి సూచిస్తుంది. జ్ఞానాన్ని తెలియజేయుట ద్వారా ప్రజలు సత్యమును గ్రహిస్తారు. "తప్పుదిద్దుట" అనగా ఒక వ్యక్తిలో ఉన్న తప్పును మరి వాస్తవాన్ని చూపించి, అతనిని పునఃస్థాపితం చేయుట "నీతియందు శిక్ష చేయుట" అనగా చిన్న పిల్లలను సరి చేసినట్లు, అన్ని విషయాలలో ఎలా జీవించాలి మరియు దేవుని వాక్యమును ఎలా అన్వయించు కోవాలో తెలియజేయుట.

దేవుని వాక్యమును బోధించుట మరియు దానిని మన జీవితానికి అన్వయించుకొనుట యొక్క ఉద్దేశ్యము దైవజనుడు ప్రతి మంచి కార్యము చేయుటకు  సిద్ధపరచబడుటకు (2 తిమో 3:17). బైబిల్ మనము ఆయన కొరకు జీవించుటకు మరియు ఆయనను సేవించుటకు మనలను సిద్ధపరుస్తుంది. దైవజనులుగా ఉండుటకు ఒకే ఒక మార్గము దేవుని వాక్యమును ఎరిగి యుండుట మరియు దానిని అనుసరించుట. మనము దైవజనుడుగా ఉండుటకంటే ఇంకా ఎక్కువైనా ఉన్నతమైన కీర్తి ఏముంటుంది? దానిని నేను అలా గుర్తించు కోవాలనుకుంటున్నావా? నీ గురించి ఏమిటి?

**పౌలు సలహా**

నేటి మన కొరకు దేవుని వాక్యము ఆయన సత్యముతో నిండి యున్నది.

దైవజనుని గూర్చి నీవు ఆలోచిస్తున్నప్పుడు నీ మనసులో ఎవరు వస్తున్నారు? నీ కుటుంబములోని సభ్యులు నిన్ను దైవజనునిగా ఆలోచిస్తున్నారా? ఈ సంఘములోని ప్రజల గూర్చి ఏమిటి?

**14. కర్తవ్యము 10: వాక్యము బోధించుట (4:1-2)**

నేను ఎక్కడైతే నా వేదాంత విద్యను అభ్యసించినానో ఆ కళాశాల యొక్క “లక్ష్యము తెలిపే ప్రకటనము లేదా నినాదము” (2 తిమో4:2) “వాక్యము బోధించుము” అను పౌలు యొక్క మాటలు. అవి ఆ కళాశాల ప్రార్థన మందిరపు ముందు వైపు గోడ వ్రాయబడినది మేము ప్రతిరోజు అనేకసార్లు వాటిని చదివేవారము. ఇది నా మనసులో మరియు హృదయములో ముద్రించబడెను. ఇది దేవుని పట్ల మరియు ఇతరుల పట్ల మన బాధ్యత యొక్క సంగ్రహము. ఈ ఆజ్ఞను కలిగియుండుట మన యొక్క ఆధిక్యత. ఇది పౌలు తిమోతికి

అప్పగించిన పని యొక్క పరాకాష్ట.

ఈ చివరి బోధన (2 తిమో 4:1-5) భాగమునందు పౌలు తిమోతికి 11 ఆదేశాలను ఇస్తున్నాడు. అన్ని కూడా ఒకదానిపై ఒకటి కలిపి వాక్యమును బోధించుము అను దానిమీద నిర్మింపబడినది. దీనిని పౌలు తిమోతికి పరిచయము చేయుటలో గల గంభీరతను చూపుతున్నాడు.

"దేవుని ఎదుటను మరియు క్రీస్తు ఎదుటను" అనగా మనము ఆయన కొరకు చేయునవన్నియు ఆయన చూస్తున్నాడు గనుక మనము ఆయనకు లెక్క అప్పగించవలెను. దేవుడు "సజీవులకును" మరియు మృతులకును తీర్పు తీర్చువాడు. అనగా నమ్మకమైన సేవకుల ఫలం ఉంటుంది. ఆయన ప్రత్యక్షత తోడు, ఆయన రాజ్యముతోడు, అనగా యేసు ఎప్పుడైనా తిరిగి వస్తాడు కాబట్టి సిద్ధముగా ఉండుము. "నేను ఆనపెట్టి చెప్పుచున్నాను" అనగా పౌలు ఇక్కడ అపొస్తలునిగా తన అధికారమును వాడుతూ తిమోతికి బాధ్యతలను అప్పగిస్తున్నాడు, ఇది ఒక తండ్రి మరియు కుమారునికి మధ్య జరిగిన ఒప్పందానికి మించినదిగా ఉంది (2 తిమో 4:1-2).

"వాక్యము బోధించుము" బోధించుట అనగా బహిరంగముగా ప్రకటించుట. ఒక రాజు యొక్క రాయబారిగా వేరే ప్రాంతమునకు వెళ్లి అతని సందేశమును అధికారముతో ప్రకటించుట. ఒక రాజు యొక్క ప్రతినిధిగా పంపబడుట గొప్ప గౌరవం మరియు ఆధిక్యత. దేవుని వాక్యమును కొన్నిసార్లు బహిరంగంగా ప్రకటించవచ్చును లేదా బోధించవచ్చును మరియు మనము వ్యక్తిగతముగా సలహా ఇచ్చుట ద్వారా లేదా సంభాషణ ద్వారా కూడా దేవుని వాక్యము బోధించ వచ్చును.

మనము వాక్యము బోధించాలని పౌలు చెప్తున్నాడు. రాయబారి తన యొక్క సొంత వర్తమానమును లేదా సందేశమును

తెలియజేయడు కాని రాజు తనకు ఎలా  నిర్దేశిస్తే దానినే తెలియ జేస్తాడు. అతడు రాజు మాటలను అందిస్తాడు. అతడు ఆ మాటలకు ఏదైనా కలపడం కాని ఆ మాటలతో ఏవైనా తీసివేయటం కాని చేయడు వాటిని స్పష్టంగా మరియు అర్థమయ్యే విధంగా తెలియ చేయుటకు ప్రయత్నిస్తాడు. అతడు వారి దృష్టిని అతని వైపునకు మళ్లించు కొనుటకు గాని లేదా వారిని తృప్తిపరచుటకు గాని ప్రయత్నించక రాజుమాటలను ఉన్నవి ఉన్నట్లు వారికి తెలుపుతాడు. ఇక్కడ వివరించబడినట్లు కాపరులముగా మనము అలాగే చేయాలి. మనము మన వ్యక్తిగత అభిప్రాయాలను, భ్రాంతి కలిగించే  ఊహ జనితమైన కథలను, రాజకీయాల వైపునకు మళ్ళించే విషయాలను, వినేవారికి వినోదము, కాలక్షేపము కలిగించే మాటలను బోధించరాదు. మన వర్తమానములోని విషయాలు దేవుని వాక్యమై ఉండాలి. అనగా మనము బైబిలులోని పాఠ్యభాగములను బోధించి వివరించవలెను. ప్రతి వచనమును, ప్రతిపదమును విశ్లేషించవలెను, మరియు ప్రేక్షకులకు అర్థమవునట్లు, మూలభాష, భావములను, ఉద్దేశ్యములను తెలియజేయవలెను.
దానిని వారి పరిస్థితులకు మరియు అనుదిన జీవితమునకు అన్వయించవలెను.

మనము ఒక పాఠ్య భాగమును తీసుకొని అందులో నుండి ఒక పదమును తీసుకొని, ఆ పదమును వివిధ కారణాలలో చూపిస్తూ, దానిని మనము కోరిన విధముగా బోధించవద్దు, మనము తప్పక ప్రతి పాఠ్యభాగములోని ప్రతి పదమును మాటను వివరించవలెను. వర్తమానము సిద్ధపడుటకు వాక్యమును ఎంచుకొని, శ్రద్ధగా చదివి నేర్చుకుని, దానిని మన వ్యక్తిగత జీవితమునకు అన్వయించుకొని ప్రసంగించవలెను (2 తిమో 2:15). మరింత సమాచారము కొరకు నేను వ్రాసిన (How to study God’s Word) హౌటు స్టడీ

గాడ్స్‌వర్డ్ అనే పుస్తకము చదువుము. ప్రసంగముల సిద్ధపాటు కొరకు నా పుస్తకము (Preaching and Teaching God's Word) ప్రీచింగ్ అండ్ టీచింగ్ గాడ్స్ వర్డ్ చూడుము. అవి ఆన్లైన్ యందు కూడా అందుబాటులో ఉన్నాయి.

https://www.christian training online. org/our-minstries/books. ఇవి ఇంగ్లీష్, తెలుగు, స్పానిష్, మరియు హిందీ భాషలయందు అందుబాటులో ఉన్నాయి. గుర్తుంచుకోండి, దేవుడు మనలను సంఘము లేదా భవనమును నిర్మించుట కొరకు పిలవలేదు అది ఆయన పని (మత్త 16:18) వాక్యమును ప్రకటించుట నీ యొక్క పని.

## పౌలు సలహా

ఒక కాపరిగా దేవుని వాక్యమును అందించుట, ప్రకటించుట మనకు ఇవ్వబడిన గొప్ప బాధ్యత. ఒక రాయబారి తన రాజు పక్షముగా మాట్లాడినట్లు మనము దేవుని వాక్యములు ప్రకటించాలి, బోధించాలి.

దేవుని ఎదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివాని గాను, సత్య వాక్యము సరిగా ఉపదేశించు వానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము (2 తిమో 2:15).

నీవు వాక్యము బోధించునప్పుడు దేవుడు వింటున్నాడు. నీవు బాగా అర్థం చేసుకున్నటకు, మరి ఎక్కువగా బోధించుటకు నీ శక్తి కొలది ప్రయత్నిస్తున్నావని చెప్పగలడా? లేనట్లయితే నువ్వు ఎక్కడ దానిని మెరుగుపరచుకొనవలెను?

## 15. కర్తవ్యము 10: వాక్యము ప్రకటించుటకు సంసిద్ధత కలిగి యుండుట (4:1-2)

కాపరియైన పౌలు తిమోతికి కాపరి పరిచర్య కొరకు మంచి సలహాలను ఇచ్చియున్నాడు. అవి తన పత్రిక ముగింపునందు నొక్కిచెప్పబడెను. పౌలు 5 ఆదేశాలను ఇచ్చాడు. అవి "బోధించుము", "సిద్ధంగా ఉండుము", "తప్పు దిద్దుము", "ఖండించుము", మరియు "ప్రోత్సహించుము"(2 తిమో 4:1-5).

"సిద్ధముగా ఉండుము" అనగా కాపరులు ఎల్లప్పుడు వాక్యమును బోధించుటకు సిద్ధముగా ఉండాలి. పీటర్ హేమెండ్ అను సూడాన్ దేశమునకు చెందిన మిషనరీ ఒకసారి మాట్లాడుతూ "ఒక మిషనరీ బోధించడానికి మరియు ప్రార్థించుటకు లేదా ఆ క్షణములో చనిపోవడానికి కూడా సిద్ధంగా ఉండవలసిన అవసర ముంటుంది. అది ప్రతి కాపరి విషయములో వాస్తవము. అదే పౌలు తిమోతికి తెలియపరిచినాడు. మనము ప్రతికూల, అనుకూల పరిస్థితుల్లో ఎల్లప్పుడు దేవుని వాక్యము ప్రకటించుటకు సిద్ధముగా ఉండాలి. "మిమ్మల్నిహేతువడుగు ప్రతి వానికి సమాధానం చెప్పుటకు సిద్ధముగా ఉండుము" (1 పేతు 3:15). సిద్ధముగా ఉండుము అనగా అర్థము దేవుడు ఎలా ఉనికి కలిగి ఉన్నాడు, బైబిల్ ఎలా వాస్తవమైనది, యేసు దేవుడు అను సత్యములను జ్ఞాన యుక్తముగాను, మన ప్రజ్ఞను ఉపయోగించి ప్రజలు అడుగు మొదలగు ప్రశ్నలకు సమాధానము చెప్పుటకు సిద్ధముగా ఉండుట. మనము బైబిలు నుండి రక్షణ కేవలము కృప ద్వారా అనుగ్రహింపబడునది అని రుజువు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. వీటిని గూర్చి ఇంకా ఎక్కువ సమాచారము కొరకు "know why you believe" మరియు "topical index of bible verses" అనే నా పుస్తకము ఆన్లైన్లో అందుబాటులో ఉంది.

https://www.chriantraining online. org/our-ministries india/books. మనము తప్పక దేవుని వాక్యమును ఆధ్యాత్మికంగా పంచుకొనుటకు సిద్ధంగా ఉండాలి. మనము ఆధ్యాత్మికముగా ఎదుగు వలెను మరియు ఆరాధన యందు, ప్రార్థన మరియు ధ్యానము నందు సమయము గడపవలెను.

చివరగా మనము తప్పక దేవుని సత్యమును "సామాజికంగా మాట్లాడటకు కూడా సిద్ధంగా ఉండాలి". మనము మన చుట్టూవారితో మంచి పేరు సంపాదించుకొనవలెను, ఇతరుల ద్వారా గౌరవం పొందు వారుగా ఉండాలి. అప్పుడు వారు మనము చెప్పు దేవుని వాక్యం వినుటకు ఇష్టపడతారు. మనము వారి అవసరతలను మనతో పంచు కొనునప్పుడు దానిని విని, సున్నితమైన రీతిగా స్పందించవలెను.

ఎల్లప్పుడూ యేసును గురించి మాట్లాడే అవకాశము కొరకు ఎదురు చూడవలెను. బైబిలును బాగా తెలుసుకొని యుండుము, అప్పుడు వారు అడిగే ప్రశ్నలకు మరియు అభ్యంతరములకు తగిన సమాధానము చెప్పగలవు. నీకు సమాధానము తెలియనప్పుడు యదార్థంగా నాకు తెలియదు అని చెప్పు తర్వాత దానిని అధ్యయనము చేసి ఆ వ్యక్తియొద్దకు వెళ్లి అతనితో మాట్లాడి సమాధానము తెలియజేయము. నీకుతెలియనప్పుడు తెలిసినట్టు నటించకుము. ఈ విషయాలన్నిటిని దృష్టిలో ఉంచుకొని పౌలు బోధించుము అని ఆదేశించాడు. కేవలము మనము ఆదివారము ఉదయ ఆరాధనలోనే బోధించుటను గూర్చి మాత్రమే పౌలు మాట్లాడుట లేదు. ఇతరులు ఎలా స్పందిస్తారో అనే దానిని బట్టి కాకుండా ప్రతిరోజు అన్ని పరిస్థితులలోను, ఎల్లప్పుడు సిద్ధంగా ఉండుము.

### పౌలు సలహా

దేవుని వాక్యము బోధించే ఆ మంచి పని చేయుటకు నీవు తప్పక సిద్ధపడుము. సమయం తీసుకుని దానిపై పని చేయుము. "ప్రభు యొక్క దాసుడు అట్టి వారిని సాత్వీకముతో శిక్షించుచు జగడమాడక అందరి యెడల సాధువుగాను బోధింప సమర్థుడుగాను, కీడును సహించువాడుగాను ఉండవలెను".(2 తిమో 2:24-26)

నీ విశ్వాసమును గూర్చి ప్రశ్నలు మరియు అభ్యంతరాలు అడుగు వారికి సమాధానం ఇవ్వటానికి ఎంత బాగా సిద్ధపడు తున్నావు? నీ సంభాషణల యందు దేవుని సత్యమును తీసుకొని రాగలిగే అవకాశం కొరకు సిద్ధముగా ఉన్నావా? బైబిలును ఇతరులతో పంచుకొను అవకాశం కొరకు ఎదురు చూస్తున్నావా ?

## 16. కర్తవ్యము 10: దిద్దుబాటు చేయుము, ఖండించుము, ప్రోత్సహించు (4:1-2)

దేవుని వాక్యమును బోధించుము అను ఆదేశముతో మరో మూడు ఆదేశాలు ఇస్తున్నాడు. "వాక్యము ప్రకటించుముబీ సమయ మందును అసమయమందును ప్రయాసపడుము, ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము" (2 తిమో 4:2). తిమోతి మాత్రమే కాదు మనము కూడా సత్యము బోధించవలెను, మరియు తప్పును ఖండించ వలెను. మనము తప్పుడు బోధను ఖండించుట కొరకు సరిదిద్దుట కొరకు లేఖనములను గూర్చిన జ్ఞానము కావలెను. బైబిలులోని సత్యమును గ్రహించుటకు అందులో దాచబడిన సత్యమును జాగ్రత్తగా అర్థం చేసుకొనుటకు సమయము గడపవలెను. ఒక వ్యక్తి ఏదైనా నకిలీది ఆశించినప్పుడు దానిని వాస్తవమైన దానిలాగా చూపించుటకు ఇష్టపడతారు, అయినప్పటికి అది నకిలీదే. ఇది అబద్ధ బోధకుల

విషయములో, అబద్ద  బోధ విషయములో వాస్తవము. మనము వారిని చాలా సౌమ్యముతోను మరియు ప్రేమతోను తప్పక సరిచేయ వలెను. నకిలీ దానిని గుర్తించాలంటే వారికి అసలైన దానిని గూర్చి తెలిసి యుండాలి. అలాగే తప్పుడు బోధకులు ఎక్కడ తప్పిపోయారో తెలుసుకొనుటకు మనకు తప్పక లేఖనములను గూర్చిన పూర్తి జ్ఞానము ఉండాలి.

దురదృష్టవశాత్తు ప్రతి ఒక్కరూ తప్పును సరిదిద్దుటకు స్పందించడము లేదు. చాలామంది అబద్దాలను పట్టుకోవాలని నొక్కి చెప్తారు, దానిని నమ్ముతారు, దాని ఫలితముగా పాపము వారి జీవితములో ఉంటుంది.అలాంటి పరిస్థితులలో మన యొక్క బోధ దానిని ఖండించేదిగా ఉండాలి. మరియు వారి అవిధేయతను మరియు తిరుగుబాటును ఎత్తిచూపించవలెను.  వారు తప్పక హెచ్చరింపబడాలి అప్పుడు వారు తాము తప్పులో ఉన్నామని తెలుసుకొంటారు, మరియు ఇతరులు కూడా వారి పాపము విషయమే జాగ్రత్త పడతారు, దానిలో కొనసాగరు.

"ఖండించుము" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదము చాలా బలమైన అర్థము నిచ్చే "చురుకైన తీవ్రమైన మందలింపు" అను దానిని సూచిస్తుంది. ఇది ప్రేమ ద్వారా జరగవలెను. తల్లిదండ్రులు తమ పిల్లలు తమకు ప్రమాదకరమైన, తప్పుడు పనులు చేస్తున్నప్పుడు వారిని సున్నతముగా గద్దించి, సరిచేస్తారో దానితో  పోల్చవచ్చును, కాని  ఇది చాలా తీవ్రమైన రీతిగా ఎంత మాత్రము రాజీ పడకుండా జరిగించవలెను. ఇది ఎలా అంటే ఒక వ్యక్తి ఇల్లు కాలిపోతున్నప్పుడు ఆ విషయము ఆ ఇంటిలో ఉన్న వారికి తెలియక పొతే వారు పారిపోయి సురక్షితముగాఉండునట్లు వారికి తీవ్రమైన రీతిగా చెప్పినట్లు ఉంటుంది.

చివరిగా దేవుని వాక్యము బోధించుట అనేది ప్రోత్సాహముతో కూడినదిగా కూడా ఉండాలి. మనము ఖండించాలి, మరియు గద్దించాలి, కాని వారిని నిరుత్సాహపరచకూడదు, వారి జీవితాలను పునర్మించవలెను. మంచి తల్లిదండ్రులు ఎల్లప్పుడూ వారి పిల్లలను సరిచేయుటకు వారి జీవితాలను కట్టుటకు తగిన సమయం కొరకు చూస్తారు. వారిని విమర్శనా దృష్టితో మాత్రము కాక అనుకూల ధృక్పదముతో  చూచినప్పుడు వారికి నిజమైన సహాయము చేయగలము.

ప్రతి ఒక్కరూ వారి విశ్వాసమందు కొనసాగుటకు ప్రోత్సాహము అవసరమైనది. దేవుని వాగ్దానములను పంచుకొనుట ఇతరులను ఆదరించుటకు మరియు భరోసా కల్పించుటకు మంచి మార్గము. మనము దేవుని వాగ్దానములను ఎరిగి యుండి వాటిని ఉపయోగిస్తున్నట్లయితే వాటిని ఇతరులతో పంచుకొనగలము.

**పౌలు సలహా**

దేవుని వాక్యమును బోధించునప్పుడు తప్పులను సరిచేయుము, దేవుని సత్యము అంగీకరించని వారిని గద్దించుము. మరియు మనము మాట్లాడుటకు వారిని ప్రోత్సాహపరచుము.

## 17. కర్తవ్యము 10: వాక్యము ఎలా బోధించాలి (4:1-2)

పౌలు తిమోతిని మరియు మనందరిని దేవుని వాక్యము బోధించుటకు, ఎల్లప్పుడు ఖండించుటకు, సరిదిద్దుటకు, మరియు ప్రోత్సాహపరచుటకు సిద్ధముగా ఉండాలని ఆదేశించినాడు. తర్వాత పౌలు మనము వాక్యము ఎలా బోధించాలో తెలియజేయుచున్నాడు. మొదట మనము దేవుని వాక్యమును గొప్ప దీర్ఘశాంతముతో

బోధించాలి. "సంపూర్ణ దీర్ఘశాంతము" అనునది ఓపికతో పరిగెత్తుట వంటిది(హెబ్రీ 12:1). దీని యొక్క గ్రీకు అర్థము "దీర్ఘ శాంతముతో సహించుట" ఇది కొనసాగే చురుకైన కార్యము కాని దీనిని ఓర్పుతో కూడిన విశ్వాసముతో చేయాలి. మనము తరచుగా ఒకే విషయాన్ని పదే పదే బోధించాలి మరియు వివరించవలెను. ఓర్పు అనేది సహజముగా వచ్చేదికాదు. ఇది ఆత్మఫలము యొక్క లక్షణము, ఉత్పత్తి (గల 5:22-23) ఇది మనము నటించుట ద్వారా ప్రదర్శింపబడేది కాదు, మనము దేవునికి దగ్గరగా జీవిస్తున్నప్పుడు దేవుని ఆత్మ కేవలము ఉత్పత్తి చేస్తాడు. అప్పుడు మనలో ఎలాంటి పాపము ఉండదు. కాబట్టి పౌలు చెప్పినట్లు మనకు గొప్ప దీర్ఘశాంతము, ఓర్పు అవసరము.

దేవుని వాక్యమును బోధించునప్పుడు "జాగ్రత్తగా సూచనలు" ఇవ్వాలి. మనము బైబిలు  అంతటిని బోధించాలి, కొన్ని ఇష్టమైన వచనములనుమాత్రమే తీసుకొని బోధించరాదు. మనము దేవుని వాక్యమును ప్రజలునిజముగా అర్థం చేసుకునేంతవరకు దానిని పదే పదే బోధించవలెను. అది వారి జీవితాలకు అన్వయించుకొనునట్లు చూడవలెను. బైబిలు తప్పక ఒక క్రమమైన పద్ధతిలో మరియు నిర్వహణా బద్ధముగా బోధించాలి. నా పుస్తకము "Bible overview" వు బైబిలును అర్థం చేసుకొనుటకు మరియు నీ బోధను క్రమబద్ధీ కరించుకొనుటకు సహాయపడుతుంది.
ఇది ఆన్లైన్ ద్వారా అందుబాటులో ఉన్నది https://www.christiantrainingonline.org/ourministries/india/books/

ఒక మంచి బైబిలు ఉపాధ్యాయునిగా తయారవ్వడానికి మనము మన పిల్లలకు లేదా  మనవరాండ్రకు లేదా సంఘములోని పిల్లలకు బోధించవలెను. అది నీకు బైబిలు సత్యములను సులుభమైన రీతిగా, అర్థమయ్యే విధముగా ఎలా బోధించగలమో తెలుసు

కునేందుకు సహాయపడుతుంది. పిల్లలు వారికి అర్థం కానప్పుడు నీకు తెలియజేస్తారు. మనకు మాట్లాడటకు ముందు బాగా ఆలోచించి, మరియు ప్రణాళిక కలిగి యుండాలి. అది ఎంతో మంచిది.

నేటి లోకంలో ఎన్నో తప్పులు ఉన్నాయి. బైబిలు మాత్రమే ఖచ్చితమైనా అధికార పూర్వకమైన సత్యము. ప్రజలు, కాపరులు కూడా దేవుని వాక్యాన్ని పూర్తిగా తెలుసుకొనక పోయినట్లయితే సులభముగా తప్పు త్రోవ పట్టుతారు. కాబట్టి వాక్యమును దీర్ఘశాంతముతో, జాగ్రత్తతో కూడిన సూచనలను తెలుపుతూ బోధించుట ఎంతో ప్రాముఖ్యము.

## పౌలు సలహా

దేవుని యొక్క వాక్యమును సంపూర్ణ దీర్ఘశాంతముతో, జాగ్రతతో కూడిన సూచనలతో సంభాషించుము.

హెబ్రి 12:1-3 “ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడా ప్రతి భారమును, సులువుగా చిక్కులపెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు, మన ఎదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరిగెత్తుదము”. ఆయన తనఎదుట ఉంచబడిన ఆనందము కొరకే అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్యమున ఆసీనుడై ఉన్నాడు. “మీరు అలసటపడకయు, మీ ప్రాణములు విసుకకయుండునట్లు, పాపాత్ములు తమకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారము అంతయు ఓర్చుకొనిన ఆయనను తలచుకొనుడి”.

నీవు సహనముగల వ్యక్తివా? నీ కుటుంబము సహనము గల వ్యక్తివని చెప్పగలరా? నీవు మరింత సహనముగల వ్యక్తిగా ఉండుటకు ఏమి చేయాలి? ఎందుకనగా క్రీస్తును పోలిన వానిగా ఉండాలి.

## 18. కర్తవ్యము 10: వాక్యము ఎందుకు బోధించాలి (4:3-5)

పౌలు సహనముతో, సంపూర్ణంగా బైబిలును బోధించవలసిన ప్రాముఖ్యతను వివరించి యున్నాడు. ఇప్పుడు పౌలు ఇలా ఎందుకు బోధించవవలయునో దాని అవసరతను తెలియ జేయుచున్నాడు. మొదట మనము బోధించాలి, సిద్ధంగా ఉండాలి, సరిచేయాలి, ఖండించాలి, మరియు ప్రోత్సహించాలి (2 తిమో 4:29) అను విషయాలను తెలియజేసినాడు. తర్వాత ఎలా బోధించాలి  అను విషయము తెలియజేసినాడు. మనము గొప్ప ఓర్పుతో, దీర్ఘశాంత ముతో సహిస్తూ, జాగ్రత్తతో కూడిన సూచనలను ఇస్తూ బోధించవలెను (2 తిమో 4:b). ప్రజలు సత్యము వైపునకు మరల్చబడుటకు బోధించాలని తిమోతికి తెలియజేసినాడు (2 తిమో 4:3-5).

లోకము సత్యమును తిరస్కరించి అబద్ధమును నమ్ముతుందని మనకు తెలుసు అయితే మనము సత్యమును అనుసరించవలయును. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవుల గలవారనై తమ స్వకీయ దురాశలకు  అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకుని, సత్యమునకు చెవి నియ్యక కల్పనాకథలవైపునకు తిరుగు కాలం వచ్చును (2 తిమో 4:3,4). ఇలాంటి పరిస్థితులు నేడు సంభవించుచున్నవి. చాలామంది తమ్మును తాము క్రైస్తవులుగా పిలుచుకొనుటకు ఇష్టపడలేదు, సత్యము విషయమై చాలా ఉదాసీనముగా ఉంటున్నారు.

సత్యమును గూర్చి పౌలు తిమోతికి చాలా సార్లు చెప్పి యున్నాడు. మొదటి పత్రిక యందు 5 పర్యాయములు (2:4,7,3:15, 4:3,6:5) మరియు రెండవ పత్రికయందు ఆరు పర్యాయములు వ్రాసి నాడు(2:15,18,25,3:7,8) పౌలు తిమోతికి మరియు మనకు కూడా సత్యము ఎరిగి ఉండాలని దానిని వెంబడించి ప్రకటించవలెనని తెలియజేసి యున్నాడు. ఒక మంచి కాపరి దీనిని చేయవలెను. "సత్యమునకు చెవినియ్యక కల్పనాకథల వైపునకు తిరిగి ఉన్నారు" (2 తిమో 4:4). నాస్తికవాదము, మానవతావాదము, పరిణామవాదము ఊదారవాదము, తప్పుడు మతములు, పునర్జన్మ మొదలగునవి. కొందరు క్రైస్తవులుగా పిలవబడే వారు సత్యము నుండి తొలగిపోయి వీటి యందు ఆసక్తి చూపుతున్నారు. అయితే తిమోతి నమ్మకముగా ఉండాలని తెలియజేస్తున్నాడు. అయితే నీవు అన్ని విషయములలో మితముగాఉండుము, శ్రమ పడుము, సువార్తికుని పనిచేయుము, నీ పరిచర్యను సంపూర్ణంగా జరిగించుము (2 తిమో:4:5) అని పౌలు చెప్పుతున్నాడు.పౌలు ఇచ్చిన నాలుగవ ఆదేశము "నీ పరిచర్య సంపూర్ణముగా జరిగించుము" అనునది తప్పుడు బోధను మరియు బోధకులను ఎదుర్కొనుటకు మరియు అధిగమించుటకు సహాయ పడుతుంది.

"అన్ని విషయములలో మితముగా ఉండుము", దీని అర్థము అక్షరాల "హుందాగా ఉండుము" ఏది సత్యము కాదో దాని విషయమై అప్రమత్తముగా ఉండుము. నిగ్రహము కలిగి యుండుము. మరియు భావోద్రేకములకు లోనవ్వకుము ఇతరుల నుండి ఎదురయ్యే విమర్శలకు మరియు వత్తిడులకు భయపడకుము. అబద్ధ బోధకులు తోడేళ్ల లాంటివారు వారు గొర్రెలను నాశనం చేస్తారు (అపొ 20:28,2 9). సాతాను గర్జించు సింహమువలె ఉన్నాడు. మనలను నాశనం చేస్తాడు (1పేతు 5:8). నిజమైన తోడళ్లు మరియు సింహములు నీ

పిల్లల దగ్గరకు వచ్చినప్పుడు నీవు ఎంత అప్రమత్తముగా, మరియు జాగ్రత్తగాఉంటావు ఆలాగే మనము ఆధ్యాత్మికముగా అప్రమత్తత కలిగి ఉండాలి.

తరువాత పౌలు పదేపదే చెబుతున్న ఆదేశము "శ్రమను సహించుము"కాపరి జీవితము సులభమైనది కాదు యేసును అను సరించుట మరియు సేవించుట అంత సులభమైనది కాదు. ఎవరైతే వారిని వారు ప్రథమ స్థానములో ఉంచుకొని, తన అతిశయము చూపించుకొనుటకుపరిచర్యను చేసినట్లయితే వారు శ్రమానుభవము కలిగి ఉండలేరు. అయితే ఎవరైతే యేసు చేసినట్లుగా పరిచర్య చేస్తారో వారు ఆయన వలే విమర్శను, తిరస్కారమును పొందుతారు (2 తిమో 3:12). మనము ఒంటరితనం ఎదుర్కోనుట, ఒత్తిడి, కలవరము, నిరుత్సాహము, ఆర్థిక సమస్యలు, వివాహ మరియు కుటుంబ సమస్యలు, వ్యక్తిగత పాపము, అనారోగ్య సమస్యలు, తగినంత సమయం లేకపోవడం, ప్రజలు మనలను కోరుకొనుట, దేవుని వాక్యము అనుసరించనివారిని గూర్చిన దుఃఖము మరియు ఇంకా ఎన్నో విషయాలను దేవుడు మనలో అనుమతించి మనలను యేసు పోలికలోనికి మార్చుతాడు. ఏ కాపరి యేసును వెంబడించడో అతడు శ్రమల నుండి మినహాయించబడతాడు మరియు విశ్వాసములో ఎదగలేడు.

"సువార్తకుని పని చేయుము" పని పౌలు ఆదేశిస్తున్నాడు. సౌవార్తీకరణ తిమోతికి ఇవ్వబడిన కృపావరములో భాగముగా ఉన్నది. మన మందరము ఇతర క్రైస్తవులకు పరిచర్య చేయుటకు ప్రత్యేకమైన కృపావరములు మనలో మిళితము చేయబడినాయి. కాపరి పనిని జరిగించుట, నాయకత్వము, కనికరము, సహాయము, ఆతిథ్యము, ప్రోత్సాహము, విశ్వాసము, ప్రార్థన, ఇవ్వటం, త్యాగపూరిత జీవితము, వివేచన మొదలగు వాటిని దేవుడు మనలో కృపావరములుగా ఇచ్చాడు

కృపావరములను గూర్చి ఇంకా సమాచారం కొరకు "Duties of a Pastors" appendix 2 చూడుము మరియు ఆన్లైన్ యందు https://www, క్రిస్టియన్ ట్రైనింగ్ onlie. org/ourministries/ india/books/.

ఒకవేళ మనలో సౌవార్తీకరణ అను వరము లేనప్పటికి మనము ఎప్పుడైతే ప్రజలతో మాట్లాడుతూ ఉంటామో అక్కడ రక్షణ కార్యం జరుగుతుంది. మనము సువార్తను ప్రకటించవలసిన బాధ్యత కలిగి ఉన్నాము. యేసు మన జీవితాలలో ప్రదర్శింపబడాలి.

తిమోతికి ఇవ్వబడిన చివరి ఆజ్ఞ "నీ పరిచర్యను సంపూర్ణంగా జరిగించుము. మనము మనలోని కృపావరములను ఉపయోగించ వలెను కానీ పరిచర్యలో ఇతర విషయాలను నిర్లక్ష్యం చేయరాదు. కాపరుల నాయకుల యొక్క విధులు సమాచారము కొరకు Duties of Pastors and Leaders అనే నా పుస్తకము చూడుము మరింత సమాచారము కొరకు https://www.chriantrainingonlie.org /our-ministries/India/books/

ఒక కాపరిగా ఉండుట ఒక ఉద్యోగం కంటే ఎక్కువ. ఇది ఒక బిల్డరు,వైద్యుడు, వ్యవసాయదారుని వంటిది కాదు. ప్రజలు ఆ ఉద్యోగాలను ఎంపిక చేసుకుంటారు. కాని ఎవరైతే పరిచర్య చేయాలనుకుంటారో వారిని దేవుడు ఎన్నుకుంటాడు. ఇతర వృత్తులకు సామర్థ్యం ఉండాలి కాని కాపరి పని కొరకు అందుబాటులో ఉండాలి. ఇతర ఉద్యోగాలనుబట్టి భూసంబంధమైన గౌరవము వ్యక్తికి దొరుకుతుంది. మనము సేవచేస్తున్నప్పుడు యేసు ఘనపరచబడతాడు. మన బహుమానము పరలోకములో, నిత్యత్వములో ఉంటుంది.

**పౌలు సలహా**

మనము వాక్యం బోధించాలి, ఎందుకనగా చాలామంది ప్రజలు ప్రత్యేకంగా క్రైస్తవులుగా పిలవబడువారు సత్యము నుండి వైదొలిగి ఉన్నారు.

తిమోతికి పౌలు ఇచ్చిన నాలుగు ఆదేశాల విషయము ఎలా ఉన్నావు? నీవు అనుసరించుటకు ఏది సులభతరముగా ఉంది? ఏది కష్టతరముగా ఉంది? ఎందుకు? నీవు దీనిని మెరుగుపరుచుకొనుటకు ఏమి చేయగలవు?

**19. భార్యల పట్ల మన కర్తవ్యము**

పౌలు కాపరుల కొరకు 1 & 2 తిమోతి మరియు తీతు పత్రికలను వ్రాసి యున్నాడు. అయితే వారి భార్య గురించి ఏమిటి? కాపరుల భార్యలకు పౌలు ఇచ్చే సలహాలు ఏవి?

మనము మన విధుల యొక్క ప్రాధాన్యతలు ఏర్పరచు కొనినప్పుడు మన పరిచర్యకు ముందు మన కుటుంబాలు ముందుగా ఉంటాయి. (1 తిమో 3:4-5, తీతుకు 1:6). ఆదాము ఏదేను వనము నందు దేవునితో మాట్లాడుతూ, నడుస్తూ ఉన్నప్పుడు అతడు ఏదో కోల్పోయానని తలించినాడు. దేవుడు అవ్వను సృజించి, అతనికి భార్యగా ఇవ్వడము ద్వారా అతని అవసరము తీరినది (ఆది 2:18-24). దేవుడు అతని కొరకు పిల్లలను సృజించలేదు. అతనికి సహకారముగా తల్లిదండ్రులు, సంఘము ఉన్నది. దేవుని కొరకు అతడు నిర్వహించిన విధుల తరువాత అతడు తన భార్య మరియు పిల్లలపట్ల తనమొదట బాధ్యత నిర్వహించాలి ఆ తర్వాత పరిచర్య ఉంటుంది.

దేవుడు నన్ను అద్భుతమైన భార్యతో దీవించినాడు లేదా నేను ఒక వ్యక్తిగా ఉండేవాన్ని కాదు. నేను చాలా కాలం క్రిందట ఆమెను

పెళ్లి చేసుకున్నాను. ఆమె ఒక మంచి వ్యక్తి, ఆమెను నేను అభినందిస్తున్నాను. ఆమెను ఒక ప్రత్యేకమైన బహుమతిగా ఇచ్చి నందుకు నేను దేవున్ని స్తుతిస్తున్నాను. నా పరిచర్య కొరకు ఆమె తెర వెనుక చేసే పరిచర్య మరియు నమ్మకత్వమును విలువ కట్టలేనిది. ఆమె నమ్మకత్వము, లోతైన ప్రార్థనా జీవితము నా పరిచర్య ఆమె త్యాగముతో ఎన్నో విజయాలు సాధించుటకు సహాయపడినవి. ఆమె యొక్క గొప్ప ప్రార్థనల ద్వారా మద్దతు ఇచ్చిన వ్యక్తి.

ఆమె ద్వారా నా పట్ల దేవుడు చూపించే షరతులు లేని ప్రేమను నేర్చుకున్నాను ఎందుకంటే ఆమెకు కూడా నా పట్ల దానిని చూపించినది. నన్ను దేవుడు ఎలా ప్రేమించగలడు అని బాగా అర్థం చేసుకున్నాను, ఎందుకంటే ఆమె కూడా ఎన్నోసార్లు దానిని నా పట్ల చూపించినది.

కొన్నిసార్లు మనము జీవితములో మన కుటుంబ సభ్యులు, మరియు భాగస్వామి అవసరత తీర్చలేకపోయినప్పటికి ఎన్నో విషయాలు సాధించగలము అనుకుంటాము. వారు మన సమయము తీసుకున్నప్పుడు కోపపడతాము లేదా పగ పెట్టుకుంటాము. అయినప్పటికి నేను చాలా సార్లు నా కుటుంబము మరియు భార్య నాతో లేకుండానేపరిచర్యలో గడిపి యున్నాను, కానీ అది అంత ప్రభావవంతముగా అనిపించలేదు, నేను అనుకున్నంత నాణ్యత నా పరిచర్యలో కనబడలేదు. ఆమె సహాయము లేకుండా నేను ఓటమి చెందేవాన్ని అని తప్పక చెప్పగలను.

నా కొరకు మరియు నా సంఘము కొరకు పరిచర్య చేయుటకు ముందు ఆమెకు సేవ చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడు (ఎఫె 5:25-33). వాస్తవముగా నేను మొదట ఆమెకు సేవ చేయలేకపోతే ఒకమంచి కాపరిగా ఉండలేకపోదును. (1 పేతు 3:7). క్రైస్తవ వివాహమునకు సంబంధించిన ఎక్కువైనా సమాచారం కొరకు

“Marriage and Ministry” పుస్తకము ”Jerry Schmoyer” చేత వ్రాయబడినది చూడండి మరియు ఆన్లైన్ నందు

https://www. Christian trainingonline.org. /download/India/books/English translations/Marriage-and Ministry-book pdf

దేవుడు ఆయన నన్ను ఎలా ప్రేమిస్తున్నాడో నేను ఆమెను అలాగే ప్రేమించాలని కోరుతున్నాను (ఎఫె 5:25). ఆమె నాకు సేవ చేస్తుంది కాబట్టి నేను ఆమెకు సేవ చేయటం కాదు. నేను తప్పక ఎల్లప్పుడు దయతో, మరియు సౌమ్యతతో ఆమెకు సేవ చేయవలెను మరియు ఆమెను ప్రేమించవలెను.

ఆమె అవసరాలయందు చేరుకోవటం ద్వారా నా స్వంత విషయాలు నా పరిచర్య నుండి తీసివేయబడవు. దానికి బదులుగా అది నన్ను పరిపక్వత పరచడం ద్వారా సుసంపన్నం చేస్తుంది. ఒకరిని మన కంటే ముందుంచుట నేర్చుకొనుట అంత సులభమైన పని కాదు. కాని వివాహము నందు మరియు పరిచర్యలో ఇది చాలా అవసరము. ఇది యేసువలె నుండుటకు నాకు సహాయం చేస్తుంది. ఆయన కూడా ఇతరులను తనకు ముందు ఉంచినాడు.

నా జీవితములో ఆధ్యాత్మిక సత్యాలను నేర్చుకొని, పరిపక్వత చెందిన విషయాలు ఎక్కువ భాగము వివాహం ద్వారానే. పరిస్థితులు ఎల్లప్పుడు అంత సులభమైనవి కావు. కానీ మనలో ఉన్న అసంపూర్ణత, మరియు ప్రతిఘటనలు మనము అవిధేయతను, ఒకరిని ఒకరు సేవించుకొనుటను, క్షమాపణ కలిగి యుండుటను మరియు క్షమాపణను అంగీకరించుటను నేర్చుకొనుటకు దేవుడు వాడుకొంటున్నాడు. ఈ విషయములను ఈ పుస్తకము నుండి నేర్చుకొనలేము, కేవలం జీవితము నుండే నేర్చుకుంటాము.

నా జీవితంలో నేను పెట్టుకొన్న ప్రాధాన్యతల క్రమమును బట్టి గుణవతి అయిన మంచి భార్య ముత్యము, కెంపుల కంటే మిగుల విలువ గలదని గ్రహించాను (సామె 31:10-12,30-31). నీవు నీ భార్య పట్ల మంచి భర్తగా ఉండుటకు దీనిని చదువుము.

కొన్ని పర్యాయములు ఒక వ్యక్తి వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉండుట దేవుని చిత్తము. కాని ఎక్కువసార్లు వివాహం చేసుకుంటే మంచిది అని భావిస్తాడు. జీవిత భాగస్వామి లేనప్పుడు దేవుడే వారి అవసరాలు చేరుకొనునట్లు సహాయము చేస్తాడు. నీవు వివాహం చేసుకోకుండా ఉన్నందున ఎంత మాత్రము తప్పని భావించవద్దు.

**పౌలు సలహా**

నీ పరిచర్యకు ముందు నీ భార్య అవసరతలు తీర్చుము. మరియు షరతులు లేకుండా యేసు ఎలా నిన్ను ప్రేమించాడో అలాగే నీవు నీ భార్యను ప్రేమించి సేవించుము.

సామె31: 10, 30, 31 "ఒక గుణవతి అయిన భార్య లక్షణము ఎవరు గుర్తించగలరు? అట్టిది ముత్యము కంటే అమూల్య మైనది. అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము యెహోవా యందు భయభక్తులు గల స్త్రీ కొనియాడబడును.

పురుషులారా, మీరు దేవుని ఎదుట నిలబడినపుడు "నీ భార్య పట్ల నీవు నడుచుకున్న విధానము ఆమెను ప్రేమించావని, సేవించా వని "నీవు నమ్మకమైన మరియు ప్రేమ గల సేవకుడవని" అని ప్రశంసించబడగలవా?

నీ భార్య నీ పరిచర్య మరియు నీ పనులన్నిటి కంటే తానే నీకు ప్రాముఖ్యమైనదని చెప్తుతుందా? నీ అవసరములకు ముందు తన

అవసరాలు తీర్చినట్లు ఉదాహరణలు చూపిస్తుందా? నీవుక్రీస్తును పోలిన వానిగా మారుటకు నీవు ఈరోజు ఏమి చేయగలవు?

## 20. పిల్లల పట్ల మన కర్తవ్యము

పౌలు తిమోతికి దైవభక్తిగల కాపరి మరియు భర్తకు ఇచ్చిన సలహాలను చూచి యున్నాము. కానీ మంచి తండ్రిగా ఉండుటకు ఆయన ఏమి చెప్పి యున్నాడు. ఒక మంచి దైవభక్తి గల తండ్రిగా ఉండుటకు కావలసిన విషయాలను నేను తెలియజేస్తాను.

నేను నా జీవితము గతములోనికి చూచుకొన్నప్పుడు నాలో నేను అనేకమైన దృక్కోణాలు కలిగి యున్నాను, వయసులో చిన్న వారైనా మాలో అవి ఉండకపోవచ్చును. నా పిల్లలు ఎదిగి వివాహాలు చేసుకుని, వారి సొంత పిల్లలు ఎదుగుతున్నప్పుడు నా యొక్క ప్రభావము వారి జీవితముల మీద చాలా ఉండేది. నేను నా పరిచర్య ప్రారంభములోనే నా కుటుంబము నా సంఘ సభ్యులలో మొదటి వారుగా ఉంటారని దేవుని చేత ఒప్పింపబడినాను. ఇతరులు నా జీవితములోనికి వస్తుండేవారు మరియు విడిచి వెళ్లిపోయేవారుగా ఉంటారు కాని నా కుటుంబము ఎప్పటికి నాతో ఉంటుంది. నా భార్య మరియు నా పిల్లలు నన్ను ప్రభావితం చేసినట్లు ఎవరు నన్ను ఎప్పటికీ చేయలేకపోయారు.

యేసు యొక్క పరిచర్యలో ఆయన శిష్యులైన కుటుంబము అగ్రస్థానములో ఉన్నది. ఆయన క్రొత్త ప్రణాళికలకు, పనులకు లేదా జనసమూహమంతటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. శిష్యుల అవసరతలు తీర్చుటకు మొదట ప్రాధాన్యత ఇచ్చాడు. జన సమూహములు వెళ్ళిన తర్వాత లేదా ఇతరులను పంపివేసిన తర్వాత ఆయన తన శిష్యులతో సమయము గడిపినాడు (మత్త 8:18బీ14:13-15,15:39). ఆయన పద్ధతిని నేడు మనము అనుసరించవలెను. నీ పిల్లల జీవితాలను నీవు

పునరుత్పత్తి చేసినంతగా మరి ఎవరి జీవితాలను చేయలేవు. నీవు నీ పిల్లల జీవితాలను నీవు ప్రభావితం చేసిన విషయాలు నీవు మార్చలేవు. పిల్లలు మెత్తటి మట్టి ముద్ద వంటివారు నీవు ఏ రూపములో వారిని చేయగలవో అలానే వారిని మలచగలవు (సామె 22:6). నీవు వారితో గడపలేనంత పని ఒత్తిడిలో ఉంటే నీవు వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నావు లేదా వారిని తిరస్కరిస్తున్నట్లుగా భావిస్తున్నావు, నీవు దేవుని ప్రతినిధిగా వారి జీవితాలలో ఉన్నావు. నీవువారిని ఎలా చూస్తున్నావు? నీ పరిచర్యలో నీవు ఎవరిని రూపింపలేనంతగా నీ పిల్లల జీవితాలనునీవు రూపించగలవు.

నీ పిల్లలు అవిధేయులు మరియు తిరుగుబాటు దారులుగా ఉంటూ నీ పరిచర్యకు అపకీర్తి తీసుకొని వస్తున్నట్లయితే అది సిగ్గుపడ వలసిన విషయము. అది ఎవరి తప్పు? మనము మన పిల్లలను స్వాధీనములో ఉంచుకొనని వాడు ఆయన సంఘమును ఎలా స్వాధీనంలో ఉంచగలడు అని దేవుడు చెప్తున్నాడు (1 తిమో 3:4-5). నీ సంఘముకంటే ఎక్కువగా నీ పిల్లలు అవసరం కొన్ని సార్లు మనము ఎల్లప్పుడు పరిచర్యకే అంకితమై పోవుట మరియు ఇతరుల దృష్టిలో మన విజయము పొందినట్లు కనపడవచ్చు కానీ చాలా ప్రాముఖ్యమైన విషయములలోనే మనము తప్పిపోతాము. దేవుడు మన పిల్లలను ఆయన శిష్యులుగా ఉండుటకు మనపిల్లలను ఇచ్చాడు. మనము వారితో సమయము గడప లేనంతగా ఎక్కువ పనిని మనకు ఇవ్వడు. అది కేవలం మన తప్పుడు ప్రాధాన్యతల నుండి వస్తుంది.

నా జీవితములో గొప్ప సంతోషకరమైన విషయము నా పిల్లలు ప్రభువును సేవిస్తున్నారు మరియు ఆయనను వెంబడిస్తున్నారు. “నా పిల్లలు సత్యమును అనుసరించి, నడుచుకొనుచున్నారని వినుట కంటే నాకు ఎక్కువైన సంతోషము లేదు” (3 యోహా 4). నీ పిల్లలు నీ పరిచర్యలో ఉన్నతమైన ప్రాముఖ్యత గలవారిగా ఉండునట్లు చూడుము

**పౌలు సలహా**

నీ పిల్లలను నీ పరిచర్య కంటే ముందుగా ఉంచుము. కాని నీ భార్యను కాదు మరియు నీ పిల్లలు యేసు శిష్యులుగా ఉండునట్లు వారిని పెంచుము.

ద్వితి 11:18-22 కాబట్టి మీరు నా మాటలను మీ హృదయ ములలోనూ మీ మనసులలోను ఉంచుకొని వాటిని మీ చేతుల మీద సూచనలుగాను కట్టుకొనవలెను, అవి మీ కన్నుల నడుమ బాసికములుగా ఉండవలెను. నీవు నీ ఇంట కూర్చుండునపుడు, నీ త్రోవను నడుచునప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి మాట్లాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పి నీ ఇంటి ద్వారబంధ కముల మీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను. అలాగు చేసిన ఎడల యెహోవా మీ పితురులకిచ్చెదనని ప్రమాణము చేసిన దేశమున మీ దినములును మీ సంతతి వారి దినములును భూమికి పైగా ఆకాశము నిలిచినంత కాలము విస్తరించును." నీ కుటుంబము నీ జీవితములో మొట్టమొదటి ప్రాధాన్యత అని నీవు చెప్పగలవా? దానికి వారు ఒప్పుకుంటారా? నీ పనికి ముందు స్థానములో నీ భార్యా పిల్లలు ఉంచబడినారని ఏమైనా రుజువులు చూపగలవా? నీ పరిచర్య కంటే తమకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నావని చెప్పగలరా?

## 21. కాపరి భార్య యొక్క కర్తవ్యము

కాపరి భార్య ప్రప్రథమముగా దేవుని యొక్క కుమార్తె, ఆమె గుర్తింపు యేసు నందు ఉన్నది (2 కొరింథీ 5:17-18) తప్ప ఒక కాపరిని వివాహము చేసుకొన్నందుకు కాదు. దేవుడు ఆమెను సృష్టించిన క్రమములో అన్ని సక్రమముగా, ఉండుటకు ఆమె తన ఆరోగ్యము విషయములో శ్రద్ధ తీసుకొనవలెను. మంచి

పౌష్టికాహారము తగినంత విశ్రాంతి తీసుకొనవలెను గృహ నిర్వాహణ మరియు పరిచర్యను సమీకరించుకొనుటకు జాగ్రత్త పడవలెను. ఆమె తన భర్త ఆరోగ్య విషయములోను  మరియు ఆమె విషయములోను జాగ్రత్త తీసుకొనవలెను.

ఒక భార్యగా తన భర్త పరిచర్యలో సహాయపడుట మరియు ఆసరాగ ఉండుట తన ముఖ్య బాధ్యత (ఎఫె 5:22-24,33, కొల 3: 18, 1 పేతు 3:1-6). దేవుడు స్త్రీని తన భర్త యొక్క సహకారిగా ఉండుటకు సృజించినాడు (ఆది 2:18). స్త్రీ యొక్క పాత్ర కుటుంబములో ప్రాముఖ్యమైనది. అభిగయీలు ఒక మంచి ఉదాహరణ (1 సమూ25:39-42). భర్త నిరుత్సాహములో, ఓటమిలో ఉన్నప్పుడు భార్య అతనిని ప్రోత్సహించుట ద్వారా, ప్రార్థించుట ద్వారా, సలహాలు  ఇచ్చి అతనికి భద్రతగా ఉండుట వలన సహాయము చేయాలి. భార్య మరియు భర్త కలిసి సమిష్ఠగా పనిచేయాలి. సంఘములో భర్త యొక్క పరిచర్యలో కాపరి భార్య కూడా పాల్గొన వలయును. కొందరు కాపరి పని నిమిత్తము ఇతర ప్రాంతాలకు పంపబడినప్పుడు మరెవరు వారి భార్యలను పట్టించుకోరు. ఇది సరియైనది కాదు ఆమెలో కూడా తలాంతులు మరియు స్వంత భావజాలాలు ఉన్నాయి కాబట్టి ఆమెను కూడా వాటిని వాడుట కొరకు ప్రోత్సహించాలి.

దేవుడు మరియు తన భర్త తర్వాత కాపరి భార్య ఒక మంచి తల్లిగా ఉండాలి. ఆమె యొక్క ఒక కాపరిగా "సంఘమును, గృహమునకు పెద్దగా దానిని నడిపించవలసిన అవసరం ఉన్నది (1 తిమో3:4-5, తీతు 1:6). అనగా తన భార్య మరియు పిల్లలు దైవభక్తి గల జీవితము కలిగి యుండుట, ఇతరుల పట్ల ప్రేమతోను మరియు గౌరవములతోను నడుచుకొనునట్లు చేయవలెను. కాపరి భార్య యొక్క ప్రవర్తన కుటుంబంలో అందరిపై ప్రభావము

చూపుతుంది. ఒకవేళ తాను సంతోషముగా, నిరీక్షణ కలిగి యున్నట్లయితే అందరూ సంతోషంగా ఉంటారు. ఒకవేళ ఆమె కోపము, క్లిష్ట పరిస్థితులను కల్పిస్తే  అది అందరి మీద ప్రభావం చూపుతుంది. ఆమె తన భర్తతో కలిసి ప్రేమ పూర్వకమైన మరియు విశ్వాస సంబంధమైన కుటుంబముగా ఉండుటకు పని చేయవలెను. ఆమె తన కుటుంబ జీవితములోను మరియు పరిచర్యలో ఆయన భాగస్వామి. మరియు సహచరురాలు లేదా బృందములో సభ్యురాలు.

అందరు క్రైస్తవుల వలే కాపరి భార్య కూడా క్రీస్తు శరీరములో ఒక భాగముగా ప్రత్యేకమైన కృపావరములను కలిగియున్నది (రోమా 12:6-8). సంఘము యొక్క క్షేమాభివృద్ధి కొరకు ఆమె దేవుని యొక్క ప్రత్యేకమైన బహుమానము (ఎఫె 4:10-12). దేవుడు ఆమె వరములను వాడుట కొరకు ఎదురు చూస్తున్నాడు (1 పేతు 4:10-11). ఆమె ఇతర పనులు చేయుటలో నిమగ్నమైనట్లయితే దేవుడు ఆమెను ఏ పని చేయుటకైనను  సన్నద్ధము చేస్తాడు. లూకా 2:36-37 నందు అన్న, అపొ. 9:36 నందు దొర్కా, అపొ. 16:15 నందు లూదియా, అపొ. 18:26 నందు ప్రిస్కిల్లా మరియు అపొ. 21:9 నందు ఫిలిప్పు కుమార్తెలు, రోమా 16:1-2 నందు ఫిబే మరియు 1 తిమోతి 5:3-10 భాగము నందు విధవరాండ్రు మంచి ఉదాహరణలుగా ఉన్నారు.

నీవు ఏ విషయములో దేవుని వరమును కలిగి ఉన్నావో దానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. దేవుడు నిన్ను నడిపించినట్లు ఇతర విషయాలు దానితో జోడించుము.

నీవు కాపరి అయిన భర్తను కలిగి ఉండుట నీకు గొప్ప ఘనత; అతని కొరకు ప్రతి దినము ప్రార్థించుము. నీవు ప్రేమతో మరియు సమాధానకరమైన అంతరంగ స్వభావము కలిగియుండి, అతనికి మద్దతును, సహకారమును అందించుము (1 పేతు 3:4).

సమస్యలు సంఘములో తలెత్తినప్పుడు వాటిని జాగ్రత్తగా వినుము, అతనిని కాని, సంఘ విశ్వాసులను కాని విమర్శించుట మరియు నిందించుట చేయరాదు. అక్కడ సమస్య పరిష్కరింపబడుటలో భాగముగా ఉండుము తప్ప ఇతరులపై ఫిర్యాదులు చేయుట, పుకార్లు చేయుటమరియు విమర్శించుట ద్వారా సమస్యలు ఎక్కువగా చేయరాదు. నీ భర్త యొక్క విషయాలు, కుటుంబానికి సంబంధించిన విషయాలు నీ సహవాసముతో బహిరంగంగా మాట్లాడరాదు, నీకు ఏదైనా సలహాలు, ఇంకా ఏమైనా విషయాలు చర్చించవలసినవి ఉన్నట్లయితే నీ సంఘములో ఉన్న వివేకము గల స్త్రీ విశ్వాసురాంద్రను కలువవలెను. ఇంకా ఏమైనా శారీరకముగా లేదా మాటల ద్వారా నిన్ను నిందించి, దుర్వినియోగం చేసిన విషయాలైతే సంఘములోని పెద్దల ఎదుట ఉంచి వాటిని సరిచేయవలయును.

కాపరియైన నీ భర్త ఎల్లప్పుడు వాస్తవముగా ఆలోచిస్తాడని, లేదా దైవభక్తి పరంగానే స్పందిస్తారని ఆశించవద్దు. ఆయనను కూడా కృపతో, దయతో చూడటానికి ప్రయత్నించు. తీవ్రమైన విషయాలకు మూలమైన వాటిని త్వరితముగా నివారించడానికి ప్రయత్నించు, క్షమించుము, అతని అభినందించుము. ఆయనను ఏది ప్రోత్సాహ పరుస్తుందో దానిని చేయటానికి ప్రయత్నించుము. అతని యొక్క స్పందనను చురుకుగా వినుటకు ఇష్టపడము.

వాయిద్య బృందము (ఆర్కెస్ట్రా) నందు వయోలిన్ వాయించే మొదటి వ్యక్తి శ్రావ్యముగా వాయించి అందరి దృష్టిని, శ్రద్ధను తన వైపునకు మరల్చుతారు. వయోలిన్ వాయించే రెండవ వ్యక్తి బృందములో సామర్థ్యాన్ని నెలకొల్పి సంగీతములో మాధుర్యాన్ని సృష్టిస్తాడు, కాపరి యొక్క భార్య ఈ రెండవ కోవకు చెందినది. తాను ప్రజల యొక్క దృష్టిని తన వైపుగా ఆకర్షించుకొనలేదు కాని అందమైన సామరస్య భావాన్ని నెలకొల్పగలదు. సంతోషముగా ఉండుము

ఆశీర్వాదముగా ఉండుము అప్పుడు పరలోకపు బహుమానము పొందగలవు. మంచి క్రైస్తవ స్త్రీగా ఉండుము తద్వారా నీవు మంచి కాపరి భార్యగా ఉండగలవు.

**పౌలు సలహా**

నీ భర్తను షరతులు లేకుండా ప్రేమించు. ఆయన నాయ కత్వమును గౌరవించు మరియు నీవు ఏమి చేయగలవో ఆలాగు సహాయము చేయుము.

"అటువలె పరిచర్య చేయు స్త్రీలు మాన్యులై కొండములు చెప్పనివారును, మితానుభవముగలవారును, అన్ని విషయములలో నమ్మకమైనవారుననై యుండవలెను" (1 తిమో 3:11)

నీవు కాపరిని వివాహము చేసుకొన్నందుకు ఎంతవరకు సంతోషముగాఉండగలుగుతున్నావు? కాపరి భార్యగా ఉండుటలో నీకు కఠినమైన విషయము ఏది?

## 22. కర్తవ్యము 11: అంతమువరకు నమ్మకముగా ఉండు -1 (4:6-8)

పౌలు 2 తిమోతి పత్రిక యందు కాపరి యొక్క బాధ్యతలను జ్ఞాపకం చేసినాడు. అతడు విశ్వాసమునందు బలవంతుడై ఉండాలి (2:1). సత్యమును ప్రసారము చేయాలి (2:2) కష్టములను సహించాలి (2:3-13), తప్పుడు బోధలను వ్యతిరేకించాలి (2:14,16 -19),దేవుని యొక్క ఆమోదము కొరకు వెదకవలయును (2:15), పవిత్రముగా ఉండ వలెను (2:20-26), లోకములో నుండి ఎదురయ్యే వ్యతిరేకతలవిషయమై అప్రమత్తముగా ఉండవలెను (3:1-9), హింస యందునమ్మకముగా ఉండవలెను (3:10-13,)

వాక్యముతో జీవించవలెను (3:14–16), మరియు వాక్యమును బోధించవలెను (4:1–5), పౌలు తాను చెరసాలలో ఉన్నప్పుడు తెలియపరిచిన తన వ్యక్తిగత సాక్ష్యముతోముగించి ఉన్నాడు (4:6–8). పౌలు తిమోతికి ఎలాంటి సలహాలు గాని లేదా ఆజ్ఞనుగాని ఇవ్వటం లేదు కాని తన జీవితమును ఒక సవాలుగా చూపుతున్నాడు. “నేనిప్పుడే పానార్పణముగా పోయబడుచున్నాను” నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటం పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని, ఇకమీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధి పతియైన ప్రభువు అది  నాకును, నాకుమాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించు వారందరికిని  అనుగ్రహించును (2 తిమో 4: 6–8).

పౌలు ఒక గొప్ప విజయం యొక్క ఆనవాలు లేదా గుర్తులతో ముగిస్తున్నాడు. పౌలు తాను చెరలో ఉన్నప్పటికి త్వరలో ప్రాణ సమర్పణ చేయబడవలసిన పరిస్థితులు ఎదుర్కొనవలసినప్పటికి తన యొక్క దృష్టి యేసు వైపునకు ఉంచగలిగినాడు. అది తిమోతికి మరియు అనేక మందికి గొప్ప ప్రోత్సాహముగా ఉన్నది. అతడు పానార్పణముగా తన జీవితాన్ని సమర్పించినాడు. పానార్పణము అనునది ఒక యజమానుడు ద్రాక్షరస పాత్రను తీసుకొని అందులో ఉన్నదంతయు అయిపోవుమట్టుకు పారబోయబడుటను సూచిస్తుంది. పౌలు అలాతలంచి యున్నాడు. తాను ఎదుర్కొనబోయే తీవ్రమైన శ్రమలకు మరియు భరించలేని కష్టాలకు తన్నుతాను అప్పగించు కొంటున్నాడు. పౌలు కలిగి యున్న శారీరక మరియు భావోద్రేకాలకు సంబంధించిన శక్తి అంతటిని ఇచ్చి వేసినాడు. ఇంకా అతనికి ఇవ్వటానికి మిగిలియున్న దేదియు లేదు. అలాంటి పరిస్థితులయందు దేవుడు అతనికి సమీపముగా ఉన్నాడు.

పౌలు తన మరణము అలా సమీపముగా ఉన్నదని ఎరిగి యున్నాడు. అతడు తన జీవితాన్ని ఒక బలి అర్పణగా దేవునికి అర్పించుకొంటున్నాడు. "వెడలిపోవుట" అనే పదము ఒక ప్రయాణికుడు అతని దేశము విడిచిపెట్టుట, ఒక సైనికుడు తన శిబిరాన్ని వదిలి వెళ్ళుట, నావికుడు రేవు నుండి బయలుదేరుటను సూచిస్తుంది. పౌలు మరణమునకు ఒక సరియైన చిత్రమును ఇస్తున్నాడు. మరణముఅనునది అంతము కాదు. అది కేవలము ప్రధానమైన మార్పు. జీవితము అంతము కాదు, కాని అది ఈ లోకము నుండి నిత్యత్వములోనికి కదిలిపోవుట. పౌలు దానికొరకు ఎదురు చూస్తున్నాడు. మనము కూడా అది చేయవలయును.

పౌలు తన జీవితమును వెనుకకు చూసుకొని, తన పని తీరును అంచనా వేసుకొంటూ మూడు దశలుగా చూపించినాడు. మొదటిది "మంచి పోరాటం పోరాడితిని" దీని యొక్క గ్రీకు పదము యొక్క అసలు అర్థం "వేదన" ఒక మల్లయోధుడు (బాక్సర్) తీవ్రమైన కష్టముతో కూడిన పోరాటమును సూచిస్తూ వాడబడిన పదము. పౌలు తన పరిచర్య యందు జరిగించిన విషయాలను గూర్చి వ్రాస్తున్నాడు. యేసు సేవించుట అనునది యుద్ధముతో సమానము. అది ఒక కఠినమైన యుద్ధము లేదా పోరాటము. మనము లోకము, పాపము, సాతానునుండి ఎదురయ్యే శోధనలను ఎదిరించాలి. ఇదే శత్రువులతో యేసుకూడా పోరాడినాడు. ఆయనను వెంబడించే వ్యక్తులుగా వాటికి భిన్నమైన శోధనలు ఎందుకు తటస్థిస్తాయి. యేసు మన యుద్ధాన్ని తొలగించడు కాని వాటిని జయించుటకు సహాయము చేస్తాడు. తల్లిదండ్రులు వారి పిల్లలకు నష్టం చేసే స్వార్థకేంద్రితమైన అపరిపక్వమైన స్థితి కల్పించే పరిస్థితులను, ఆటంకములను ఎలా తొలగిస్తారో అదే రీతిగా దేవుడు తన పిల్లలపట్ల చేస్తాడు. ఆటంకములు మనలను బలవంతులనుగా చేస్తాయి.

నీవు నీ క్రైస్తవ జీవితము యొక్క గతాన్ని చూసుకోగలవా? మరియు నీవు మంచి పోరాటం పోరాడనని చెప్పగలవా? నీవు ఈ రోజు పోరాడవలసిన యుద్ధమందు స్థిరముగా నిలువబడగలవా? లేదా వారు మిమ్ములను ఓడించడానికి విడిచిపెట్టుతావా?

పౌలు జీవితములో రెండవ దశ “నా పరుగు తుద ముట్టించితిని” పౌలు కాలమునందు పరుగు పందెమునందు వేగము మాత్రమే లెక్కింపబడదు. కాని పరుగు ముగించినప్పటికిని కాగడా ఇంక కాలుతూనే ఉంటుంది. అలాగున పౌలు తన జీవిత చివరి దశమట్టుకుదేవునికి నమ్మకముగా ఉండగలిగాడు. పౌలు విశ్వాసం నుండి వెనుకకు తిరుగలేదు మరియు దేవుడు ఇచ్చిన బాధ్యతను విస్మరించలేదు. పౌలు పట్టుదలతో కష్టాలను మరియు ఇబ్బందులను ఎదుర్కొన్నాడు.

నీవు యేసును వెంబడించిన ప్రారంభములో ఎలాంటి విశ్వాసముతో ఆయనను సేవించినావో దానిని నీవు కొనసాగించ గలుగుతున్నావా?
నీ మిగిలిన జీవితములో దానిని కొనసాగించుటకు కష్టపడిఉన్నావా?

పౌలు యొక్క మూడవ దశ “విశ్వాసము కాపాడుకొంటిని” కాపాడుకొంటిని అనే పదము ఒక మిలటరీ పదము. ఒక కాపలా దారుడు తనకు అప్పగించిన దానిని కాపాడుటకు నిలువబడి ఉండుటను సూచిస్తుంది. ఇది పౌలు విషయములో క్రైస్తవ విశ్వాసాన్ని తెలియజేస్తుంది. అతడు నమ్మకమైన గృహ నిర్వాహకుడు, హింసలోను, అతని జీవితములో ఎదురయ్యే బెదిరింపులు అన్నిటి లోనూ దేవుని సత్యమునుండియు, దేవుని వాక్యమందును బయలు పరచబడిన వాటినుండియు వెనుతిరగలేదు.

దేవుని ఆజ్ఞలను మరియు దేవుని వాక్యము యొక్క సూచనలను నీవు ఎప్పుడైనా వదిలి వెళ్లినావా? లేదా రాజీ పడినావా? వాటిని నిర్లక్ష్యపెట్టినావా? వాటిలో నేడు 100% వెంబడించకుండా ఉన్నావా?

**పౌలు సలహా**

యేసు కొరకు చివరి వరకు జీవించు, నీవు మంచి పోరాటం పోరాడినవని చెప్పగలవు. నీ విశ్వాసమును కాపాడుకొని, నీ పరుగు తుద ముట్టించగలవు.

ఎవరైనా మంచి పోరాటం పోరాడి తన పరుగు తుద ముట్టించి, మరియు విశ్వాసము కాపాడుకొన్న వారిని నీవు ఎరిగి యున్నావా? దానికి ఉదాహరణగా ఎవరు యున్నారు? వారి నుండి యేసు కొరకు జీవించుటకు ఏమి నేర్చుకుంటున్నావు?

## 23. కర్తవ్యము 11: అంతము వరకు నమ్మకముగా ఉండు - 2 (4:6-8)

పౌలు తిమోతికి ఇచ్చే తన చివరి సలహాలతో కూడిన మాటలు, యేసు కొరకు అతడు జీవించిన జీవితములోని విషయాలను తెలియజేస్తున్నాడు. అతడు మంచి పోరాటం పోరాడానని చెప్పాడు. పరుగు తుద ముట్టించాడు, విశ్వాసము కాపాడుకొన్నాడు (2 తిమో 4: 6-8). అంతము వరకు నమ్మకముగా ఉండుట మన అందరి విధి. మనమందరము ఇలా ఉండాలని కోరుకొంటాము కాని అది చాలా కష్టము.

ఒకవేళ నీవు పౌలువలె నమ్మకముగా ఉండలేక పోయినట్ల యితే ఏదైనా పాపము, ఓటమి ఉన్నట్లయితే దానిని ఒప్పుకొని, దాని నుండి వైదొలగుము. దేవుడు నిన్ను క్షమించి, పునఃస్థాపితం

చేయగలడు, నీవు మరలా నీ జీవితాన్ని నూతనముగా ప్రారంభించ గలవు (1యోహా 1:9).

దేవుడు ఈ జీవిత కాలంలో సమాధానము, సంతోషము మరియు ఆయనతో సన్నిహిత సంబంధము కలిగి ఉండ గలుగునట్లు చేసి మరియు ఆయన నిత్యత్వములో బహుమానము కూడా ఇవ్వగలడు. "ఇకమీదట నా కొరకు నీతి కిరీటం ఉంచబడి యున్నది" కిరీటములు క్రీడల యందు విజయము పొందిన వారికి అందించ బడతాయి. నేడు మన క్రీడలలో మనకు ఇచ్చే పథకముల వంటివి. అయితే దేవుడు ఇచ్చే బహుమానము మనము ఇతరులను ఓడించి నందుకు కాదు, మన జీవిత పరుగును ముగించినందుకు ఇవ్వబడేది. వారు ఈ లోకములో బహుమానము పొందగలరు. మనము కేవలం యేసుతో నిత్యత్వములో నిరంతరము జీవించుట మాత్రమే కాదు గాని మనకు కొన్ని ఆధిక్యతలు మరియు ప్రత్యేకమైన ఆశీర్వాదములు ఇవ్వబడుతాయి. ఇవి ప్రతి విశ్వాసికి యేసు చేత ఇవ్వబడుతాయి (1కొరింథి 9:4-27). నమ్మకమైన కాపరి మహిమ కిరీటం పొందును, (1పేతు 5:4). క్రైస్తవులందరు (2 తిమో 4:8) మరియు కాపరులు కూడా వాడబారని కిరీటం పొందుదురు (1 కొరింథి 9:25). యేసు నొద్దకు ప్రజలను నడిపించి, వారు ఆయనలో ఎదుగునట్లు సహాయపడు వారికి ఆనంద కిరీటము ఇవ్వబడుతుంది. యేసు ప్రత్యక్షతను ఆశించు వారందరికి నీతి కిరీటము అనుగ్రహించబడును (2 తిమో 4:8). శ్రమలను సహించిన వారు జీవకిరీటము పొందుదురు (యాకో 1:12 ప్రక 2:10).

ఈ కిరీటములలో వేటిని నువ్వు పొందుదువని తలంచు చున్నావు? అది నీవు పరలోకము చేరుకోవాలని వాటిని యేసునుండి పొందాలని నీ తలంపులను తయారు చేస్తున్నాయి?

మనము ఈ లోకము నుండి దేనిని తీసుకొని పరలోకము వెళ్ళుట సాధ్యము కాదు. అక్కడ యేసు ఇచ్చే కిరీటాలను కలిగి యుంటాము. ఎప్పుడైతే మనము ఆయన సింహాసనము ఎదుట నిలిచి ఆరాధించినప్పుడు, ఆయన గొప్పతనాన్ని మరియు సౌందర్యమును చూచినప్పుడు మన కిరీటాలను ఆయన ఎదుట ఉంచుతాము. మనము ఆయన పాదముల యొద్ద వాటిని ఉంచి, ఆయన కృప మరియు శక్తి లేనట్లయితే వాటినికలిగి యుండలేమని ఒప్పు కొంటాము (ప్రక 4:10)

2 తిమోతి పత్రిక పౌలు హతసాక్షిగా మరణించుటకు ముందు వ్రాసియున్నాడు. కాబట్టి ఈ చివరి మాటలు ఎంతో విశిష్ట మైనవి మరియు అర్థవంతమైనవి. మనము కూడా ఒక రోజున మన చివరి మాటలు చెప్పవలెను. "మంచి పోరాటం పోరాడితిని నా పరుగు తుద ముట్టించితిని విశ్వాసము కాపాడుకొంటిని" (2 తిమో 4:7-8) అని చెప్పగలమా? పౌలు యొక్క జీవితము ముగించబడినది, మనము ఇంకా దేవుని కొరకు జీవించాలి మరియు ఆయనను సేవించాలి. నీవు దానిని ఇప్పుడు చేస్తున్నావా? నీవు ఏ పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికి నీ శేషజీవితమును ఇది చేయుట కొరకు కొనసాగించగలవా?

అయినప్పటికి మనము భూమిమీద పలికిన చివరి మాటల కంటే యేసు పరలోకములో పలికే మాటలు చాలా ప్రాముఖ్యమైనవి "భళా, నమ్మకమైన మంచి దాసుడా నీవు కొంచెములో నమ్మకముగా ఉంటివి నిన్ను అనేకమైన వాటి మీద నియమించెదను, నీ యజమానుని సంతోషములో పాలు పొందుము" (మత్త 25:23). పరలోకములో ఉండుట కేవలము ఒక అద్భుతమైన అనుభూతి. అయితే యేసును ముఖాముఖిగా కలుసుకొని ఆయన మనలను గూర్చి చెప్పే విషయాలు వినుట దానికి మించిన గొప్ప అనుభూతి.

**పౌలు సలహా**

ఈ జీవితకాలములో కేవలం ఆశీర్వాదములు పొందుటకే యేసు కొరకు జీవించకు కాని నిత్యత్వములో ప్రత్యేకమైన కిరీటములును మరియు బహుమానములును పొందుటకు జీవించుము

నీ జీవితములో యేసు చేసిన కార్యములను బట్టి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, కొంతసమయము ప్రార్ధనలో గడుపుము ఆయన ఇప్పుడు ఏమి చేస్తున్నాడో దాన్నిబట్టి నిత్యత్వములో ఆయనతో ఉండబోతున్న దానిని బట్టి స్తుతించుము.

## 24. పౌలు మరియు తిమోతిల చివరి సంవత్సరములు (4:9–22)

పౌలు రోజులలో ఉత్తరములు వ్రాయునప్పుడు ప్రారంభము నందు నీ పేరు వ్రాయబడి, ముగింపు నందు వ్యక్తిగతమైన వ్యాఖ్యలు ఇవ్వబడతాయి. ఇది నేడు  మనము ఉత్తరము వ్రాసే విధానమునకు పూర్తి భిన్నముగా ఉంటుంది. పౌలు తిమోతికి ఏమి తెలియజేయాలని కోరుకుంటున్నాడో దానితోపాటు పౌలు తన స్నేహితులకు వ్యక్తిగతమైన శుభములను తెలియజేస్తున్నాడు (19–21). పౌలు తన రెండవ మిషనరీ ప్రయాణములో తనతో తీసుకొని వెళ్ళుటకు తిరస్కరించిన మార్కును వెంటబెట్టుకొని రావాలని తిమోతిని కోరుతున్నాడు. మరియు అంగీని మరియు చర్మపు కాగితములను తీసుకొని రావాలని కోరుతున్నాడు. మార్కు ఇప్పుడు ఆధ్యాత్మికంగా పరిపక్వత చెందినవాడు మరియు ఆధారపడదగిన సేవకుడు. రోము నందు కేవలము నమ్మకమైన లూకా మాత్రమే ఉన్నాడు (11వ). ప్రభువు నీ ఆత్మకు తోడైయుండును గాక. కృప మీకు తోడైయుండును గాక అని వ్రాస్తూ ముగించినాడు. పౌలు యొక్క జీవితములో కృప అనునది

ముఖ్యమైన అంశము. మనకు కూడా ఇది తప్పక ఉండాలి.

పౌలు యొక్క మరణమును గూర్చి పూర్తి వివరాలు ఎవరికి తెలియవు. కాని అతడు క్రైస్తవులు రోమా ప్రభుత్వముచేత తీవ్రమైన హింసను ఎదుర్కొంటున్నప్పుడు నీరో చక్రవర్తి చేత శిరచ్ఛేదనము చేయబడినాడు. క్రీ.శ. 64 నందు నీరో రోమా పట్టణమును తగుల బెట్టించి ఆ నేరమును క్రైస్తవుల మీద వేయుట వలన హింస ప్రారంభమైనది. పౌలు రోమా పౌరుడు గనుక సిలువ వేయబడకుండా తప్పించబడినాడు. పేతురు మరియు అతని భార్య అదే సమయము నందు సిలువ వేయబడినారు. సాంప్రదాయముల ప్రకారము పేతురు తలక్రిందులుగా సిలువ వేయబడుటకు కోరినాడు. ఎందుకనగా తన యజమానుని వలే సిలువ వేయబడుటకు అర్హుడుగా తనను ఎంచు కొనలేదు.

తిమోతి క్రీ.శ. 66 నందు రోమాలో పౌలును కలుసుకో గలిగినాడు. అప్పుడు తిమోతికి 31 సంవత్సరములు అతడు మిగిలిన జీవితము ఎఫెసులో గడిపినాడు. ఆ పిదప హతసాక్షిగా మరణించి నాడు. తిమోతి క్రీ.శ. 97 నందు డొమిషియన్ లేదా నెర్వా కాలము నందు హింసలను ఎదుర్కొని మరణించినాడు.

తిమోతి దీర్ఘకాలము దేవుని పరిచర్యలో ఉన్నాడు. అతడు పౌలు నుండి చాలా విషయాలు నేర్చుకొని వాటిని ఇతరులకు బోధించుటకు సామర్థ్యము గల మనుష్యులకు అప్పగించినాడు (2తిమో 2:2బీ 1 థెస్స 3:2) తిమోతి కూడా సేవకుని మనస్సు గలవాడు. అతడు ఇతరులచేత సేవ చేయించుకొనుటకు బదులు ఇతరులకు సేవ చేసినవాడు (అపొ 19:22). దేవుడు అతన్ని ఎక్కడ పంపాలనుకున్నప్పుడు అక్కడికి వెళ్ళుటకు అందుబాటులో ఉండేవాడు, మరియు సంఘములలో తలెత్తిన సమస్యలకు పరిష్కారిగా ఉన్నాడు. వాస్తవముగా తిమోతి బోధింపదగినవాడు మరియు నేర్చుకొనుటకు

ఇష్టపడేవాడు (2తిమో 3:10–11). తిమోతి నేర్చుకున్న విషయాలు ఇతరులకు అందించేవాడు.

తిమోతి పౌలు యొక్క లక్ష్యాలు మరియు ఉద్దేశ్యములు సంఘములతో పంచుకునేవాడు. అతడు పౌలు యొక్క ప్రతినిధిగా ఉండగలిగినాడు (ఫిలి 2:19–20). కొందరు కాపరులు దేవుని సేవించుటకు మరియు ఇతరులకు సహాయము చేయుటకు బదులు తమ పేరు మరియు ప్రజల నుండి కీర్తి, ప్రతిష్టలు సంపాదించు కొనుటకు ప్రయత్నిస్తారు. ఎన్నో కష్టాలను తిమోతి ఎదుర్కొన్నప్పటికీ అతడు నమ్మకముగా ఉన్నాడు (1 కొరింథి 4:17). తిమోతి నేటి కాపరులందరికి గొప్ప ఉదాహరణగా ఉన్నాడు.

**పౌలు సలహా**

పౌలు మరియు తిమోతీల జీవితమును అనుసరించుము. ఎందుకనగా వారు లోపము లేని వారయినందున కాదు కాని వారు యేసుని వెంబడించినవారు.

ఇందు నిమిత్తము ప్రభువు నందు నాకు ప్రియుడును నమ్మకమైన నా కుమారుడునగు తిమోతిని మీ యొద్దకు పంపి యున్నాను. అతడు క్రీస్తునందు నేను నడుచుకొను విధమును, అనగా ప్రతి స్థలములోను ప్రతి సంఘములోను నేను బోధించు విధమును, మీకు జ్ఞాపకము చేయును.(1 కొరింథి 4:17)

నీవు ఎక్కువగా ఎవరి వలె ఉన్నావు? పౌలువలెనా? లేదా తిమోతి వలెనా? నీవు ఏ విషయములో పౌలు వలె ఉన్నావు? పౌలు ఎదుర్కొన్న ఏ సమస్యలను నీవు ఎదుర్కొంటున్నావు? నీవు ఏ విషయ ములలో తిమోతి వలె ఉన్నావు? అతడు ఎదుర్కొన్న ఏ సమస్యలను నీవు ఎదుర్కొంటున్నావు? పౌలు మరియు తిమోతి నుండి ఏమి

నేర్చుకున్నావు? అవి ఒక మంచి కాపరిగా ఉండుటకు సహాయ పడతాయా?

## 25. వారి కాపరుల పట్ల క్రైస్తవుల కర్తవ్యము

మనము సంఘస్థుల పట్ల కాపరి యొక్క విధులను చూచి యున్నాము. ఇప్పుడు కాపరుల పట్ల క్రైస్తవుల యొక్క బాధ్యతలను చూద్దాము. గొర్రెలు వాటి కాపరికి స్పందించిన విధానాన్ని బట్టి అతని పని సులభముగా ఉంటుందా కష్టముగా ఉంటుందా అనునవి తెలుస్తుంది. దేవుని ప్రజల విషయములో కూడా ఇది వర్తిస్తుంది. క్రైస్తవులు వారి నాయకులను గౌరవించవలెను (1 తిమో 5:15-25). వారి సేవలను గుర్తించి వారిని గౌరవించుట ద్వారా అది తెలుస్తుంది (1 థెస్స 5:12). ప్రజలు తమ కాపరులకు ఎంతవరకు చేయగలిగితే అంత సహాయము చేయవలెను. వారు ఎల్లప్పుడు కాపరుల కొరకు ప్రార్థించవలెను.

నాయకుని గురించి ఎంత మాత్రము పుకార్లు లేదా విమర్శలు చేయరాదు. (1 కొరింథి 4:3-4). ఒకవేళ బైబిలు పరమైన విషయము లున్నట్లయితే ఆ వ్యక్తి కొరకు ప్రార్థించుము. అతడు వాటిలో కొనసాగు తున్నప్పుడు సంఘములోని సరియైన నాయకుని యొద్దకు వెళ్ళి ఈ వ్యక్తిని గూర్చి అతనితో చెప్పవలెను. వారు అతని విషయమును చూచుకొనగలరు. ఒకవేళ ఇది పరిష్కరించబడకపోయిన యెడల దేవుడు నిన్ను సంఘమువిడిచి వెళ్ళాలని చెప్పినట్లయితే ఎలాంటి విమర్శలు లేదా పుకార్లు పుట్టించకుండా మౌనముగా విడిచి వెళ్ళవలెను (సామె 16:28;11:9-13; 10:18; కీర్త 15:2-3; ఎఫె 4:29).

క్రైస్తవులు వారి నాయకులకు ధైర్యము కలిగించాలి. వారి పరిచర్యలో కష్టాలు ఎదుర్కొంటున్నప్పుడు తాము ఏరీతిగా సహాయము చేయగలరో ఆ రీతిగా సహాయము చేయాలి. క్రమముగా సంఘ కార్య

క్రమములకు హాజరవుట వలన  కాపరి ప్రోత్సహించబడుతాడు.

విశ్వాసులు క్రమముగా ప్రార్థించాలి. వారి నాయకుల పట్ల ప్రేమను కనపరచాలి. నేను 35 సంవత్సరములు కాపరిగా పనిచేసిన సంఘముఅద్భుతమైనది. వారు మా కొరకు ప్రార్థనలు మరియు సహకారములు అందించినారు. పౌలు ఆదిమ సంఘమునకు వారి చందాలు, కానుకలు క్రమముగా ఇవ్వాలని చెప్పాడు (1 కొరింథి 16: 2). దేవుడుపాతనిబంధనలో యూదులకు దశమ భాగము దేవుని పని కొరకు ఇవ్వవలయునని చెప్పాడు (ఆది 14:20బీ 28:22). మరియు ఆ దశమ భాగం ఇవ్వాలనే విషయాన్ని యేసు నిర్ధారించినాడు (లూకా 11:42). మనము ఎంతో కాలము పాత నిబంధన చట్టాలు, కట్టడల క్రింద జీవించవద్దు. అవి ఇప్పటికి మనకు మార్గదర్శకాలుగా ఉన్నప్పటికి పౌలు చెప్పినట్లు దేవుడు మనలను ఎంత అభివృద్ధి పరిచినాడో దానిని బట్టి మనము పరిచర్య కొరకు ఇవ్వవలెను. 2 కొరింథి 8 మరియు 9 అధ్యాయాలు (1కొరింథి 16:2). సంఘము కొంత డబ్బును సేకరించగలిగినట్లయితే కాపరికి సరిపడేంతజీతము ఇవ్వగలము (ద్వితి 24 :15). మనము కాపరికి సరియైన జీతము ఇవ్వగలిగినట్లయితే కాపరి ప్రార్థించుటలోను మరియు బైబిలు అధ్యయనము చేయుటలోను సమయము గడపగలడు

ఒకవేళ ప్రజలు డబ్బు ఇవ్వలేనప్పుడు కాపరి కుటుంబము నకు అవసరమైన భోజనము లేదా మరే ఇతర పదార్ధములు పంచు కొనవచ్చును.

"కాపరి రెట్టింపు సన్మానమునకు పాత్రుడు" అని తెలియపరచి నాడు (2 తిమోతి 5:17-18). అతడు కేవలము గౌరవింపబడుట లేదా అవసరమును బట్టి సన్మానింపబడుట మాత్రమే కాదు గాని తన పరిచర్య అంతటిలో ఆర్థిక సహాయము అందించవలెను. చాలా మంది

క్రైస్తవులు మరియు సంఘములు కాపరి కుటుంబమునకు కావలసిన సహాయము లేదా జీతము ఇవ్వటము లేదు. కాపరికి ఎక్కువ డబ్బు కావలసిన అవసరత లేదు కాని సాధారణ అవసరాలు తీర్చుకొనుట కైనను సంఘము డబ్బును అందించవలెను.

బైబిల్ ప్రకారం క్రైస్తవులు మరియు ఏదైనా సంఘము అప్పు చేయరాదు (రోమా 13 :8; సామె 22:7; కీర్త 37:21; లూకా 14:2 8;హీబ్రూ 13 :5). ఒకవేళ సంఘము కూడుకొనుటకు భవనము కొనుగోలు చేయాలనుకుంటే సాధ్యమైనంత తక్కువ ధరలో త్వరలో దానిని తీర్చగలుగునట్లు చేయవలెను.

ఒక కాపరిగా ఉండుట కష్టమైన పని. నీవు దానిని సాధ్యమైనంత వరకు సులభతరము చేయుటకు ప్రయత్నించవలెను.

## పౌలు సలహా

నీ కాపరి పట్ల గౌరవము చూపించవలెను. అతనికి ఆర్థికముగా సహాయం అందిస్తూ సహకారంగా ఉండవలెను.

యిర్మి 3: 15 “నా కిష్టమైన కాపరులను నియమింతును వారు జ్ఞానముతోను వివేకముతోను మిమ్మునేలుదురు”

నీ ప్రజలు నీ పట్ల గౌరవముతో మసలుకొంటున్నారా? నీవు వారికి మంచి ఉదాహరణను ఉంచి గౌరవముతో మెలుగగలుగు తున్నావా? నీవు వారికి ఒక మంచి గృహ నిర్వాహకులుగా నీ సంఘములో ఉండునట్లు వారికి బోధించుచున్నావా? నీ ప్రజలు నీకు వారు చేయగలిగిన కొలది సహకారము అందించవలసిన ప్రాముఖ్యతను గూర్చి బోధిస్తున్నావా?

## 26. ఇతర కాపరుల పట్ల కాపరుల కర్తవ్యము

2 తిమోతి యందు చూపబడిన ప్రకారము కాపరి యొక్క విధులు మరియు బాధ్యతలు చర్చించినాము. మరియు కాపరి పట్ల క్రైస్తవుల బాధ్యతలను కూడా చూచినాము. చివరిగా కాపరులు ఇతర కాపరుల పట్ల కలిగి ఉండవలసిన బాధ్యతలను అధ్యయనము చేయవలెను.

మన మందరము గొర్రెల గొప్ప కాపరి క్రింద పనిచేయుటకు ఒకే బృందములో ఉన్న వారము. కాబట్టి ఇతర సంఘాల విషయము లోను మరియు కాపరుల విషయములోను పోటీతత్వము, అసూయ, విమర్శలతో కూడిన ధృక్పథాలు కలిగి ఉండకూడదు (lకొరింథి 3:9). మనము అబద్ధ బోధకుల విషయములోనే వారి పరిచర్యను బోధను అంచనా వేసి వారికి తీర్పు తీర్చవలెను కాని మన తోటి సహ కాపరి మరియు వారి పరిచర్య విషయములో తీర్పు తీర్చకూడదు (1 తిమో 5:19-25బీ రోమా 14:4). మనము తప్పక ఒకరికొకరము సహాయము చేయవలెను తప్ప పోటీ పడకూడదు (1 కొరింథి 3:8-8) మనమందరము ఒకే శరీరమై ఉండి కలిసి పని చేయుచున్నాము (1కొరింథి 12:12-27బీ రోమా 12:4). శరీరములోని భాగాలు ఒక దానికొకటి వ్యతిరేకముగా పని చేసినట్లయితే శరీరం బలహీనముగా మారి అనారోగ్యతకు గురి అవుతుంది. ఒకవేళ కాపరి మరియు సంఘము ఇతర సంఘాలతో మరియు కాపరులతో పోటీతత్వము కలిగి ఒకరినొకరు సహకరించుకొననట్లయితే ఇలాగే జరుగుతుంది. ప్రతి ఒక్కరు శ్రమ పడతారు.

మనము ఒకరి కొరకు ఒకరము ప్రార్థించాలి, సహాయము చేసుకోవాలి, ప్రోత్సహించుకోవాలి.

మరియు మన అందరి శత్రువుకు వ్యతిరేకముగా కలిసి పని చేయాలి.
ఇతర కాపరులతో సహవాసము
మరియు సహకారము కలిగి ఉండుట ఎంతో ప్రాముఖ్యము. మనము ఒకరి ఆందోళనలు మరియు అవసరతలు తెలుసుకొనవలెను మరియు ఇతరులు కష్ట సమయములో ఉన్నప్పుడు ధైర్యము మరియు జ్ఞానముతో కూడిన అవగాహన కల్పించవలెను. అవసరమైనప్పుడు మన తలాంతులను మరియు మనలో ఉన్న బలాలను వారితో పంచు కొనవలెను. తిమోతి మరియు అతని సహచరుడైన తీతు కలిసి పరిచర్యను పంచుకున్నారు. పౌలు తిమోతికి సలహాదారుడుగా ఉన్నాడు. పౌలు బర్నాబాను తన సలహాదారుడుగాను మరియు లూకాను  ఒక స్నేహితునిగా కలిగి ఉండి వారితో  ప్రయాణించి పరిచర్య చేసినాడు. యేసుకూడా తన పరిచర్యలో శిష్యులైన పేతురు, యోహాను, యాకోబులను కలిగి ఉన్నాడు. నీకు ఇతర కాపరుల యొక్క అవసరత ఉంటుంది వారికిని నీ అవసరత ఉంటుంది.

**పౌలు సలహా**

కాపరులు తప్పక ఒకరికొకరు తాము చేయగలిగిన విధముగా సహాయము మరియు సహకారమును  అందించుకొనవలెను.
(హెబ్రి 12: 14)

అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగియుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండా ఎవడును ప్రభువును చూడడు.

నీవు ఎవరైనా కాపరితో లేదా సంఘముతో కలువలేక పోతున్నావా? నీ సంబంధము బాగుపడుటకు నీవు ఏమి చేయగలవు? ఏ కాపరిపట్ల అసూయగా ఉన్నావు? ఎందుకు? నీ అసూయ విషయమై ఒప్పుకొని, నిన్ను క్షమించమని అడుగుము.

నీవు అవసరములో ఉన్నప్పుడు ఎవరి యొద్దకు వెళ్తున్నావు?ఎవరితో నీ బాధను మరియు కష్టాలను పంచుకుంటున్నావు? నీ సలహాదారుడు ఎవరు? నీవు ఎవరికి సహకారునిగా ఉంటున్నావు? యౌవన కాపరులు నీ ద్వారా ఏదైనా శిక్షణ పొందుచున్నారా? వారి కొరకు ఏమి చేస్తున్నావు?

# IV. తీతు పత్రిక

## A. తీతు పత్రిక  పూర్వ రంగము

శీర్షిక: గ్రహీత యొక్క పేరు

రచయిత: పౌలు

అంశము: అనుదిన నడవడిక

రచన కాలము: క్రీ.శ. 62

రచన స్థలము: కొరింథి

పత్రిక గ్రహీత: తీతు, పౌలు యొద్ద తర్ఫీదు పొందుచున్న యౌవనస్థుడైన కాపరి

మూల వాక్యము: "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము అనగా మన దేవుడును, మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నవి. ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తి గల ప్రజలను తన కోసము పవిత్ర పరచుకొని తన సొత్తుగా చేసుకొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" (తీతుకు 2: 11 -14)

మూల పదములు:  మంచి (11 సార్లు) సత్ క్రియలు (6సార్లు) హిత (5 సార్లు)

**ఉద్దేశ్యము:**

| 1తిమోతి | తీతుకు | 2తిమోతి |
|---|---|---|
| కాపరత్వ ప్రాధాన్యత | కాపరత్వము తక్కువ ప్రాధాన్యత | కాపరి ప్రాధాన్యత |
| సువార్తను కాయుము (6 :20) | సువార్త ఆచరణ | సువార్త బోధించుము (4:2) |

**అంశము: దైవభక్తి జీవితము ఎలా జీవించాలి.**

పౌలు తన మూడవ మిషనరీ ప్రయాణము తర్వాత యెరుషలేముకు వెళ్ళాడు. యూదుల ధర్మశాస్త్రము ఉల్లంఘించి నాడనే నేరారోపణ వలన అతడు చెరసాలలో పెట్టబడినాడు. మరియు అతని క్షేమము దృష్ట్యా రెండు సంవత్సరములు పౌలు కేంక్రియలో ఒక ఇంటిలో బందీగా చేయబడినాడు. తర్వాత రోమా చక్రవర్తి కైసరు ఎదుట కనబరచబడుటకు రోమాకు కొనిపోబడినాడు. మార్గములో అతడు ప్రయాణించు ఓడ పగిలిపోయినది. యూదులు పౌలు మీద మోపిన నేరములలో దేనిని రుజువు చేయకపోవడం ద్వారా అతడు చెరసాల నుండి విడుదల పొందాడు. పౌలు తర్వాత ఎఫెసీకి వెళ్ళి నాడు. అక్కడ కొంతకాలం ఉండి తిమోతిని అక్కడ విడిచిపెట్టి గ్రీసు వైపుగా వెళ్ళినాడు. పౌలు అక్కడ నుండి 1 తిమోతి పత్రికను వ్రాసినాడు. తరువాత పౌలు క్రేతు పట్టణమునకు వెళ్ళినాడు. పౌలు క్రేతులో తీతును విడిచిపెట్టి కొరింథికి వెళ్ళినాడు. కొరింథి పట్టణము నుండి పౌలు తీతుకు పత్రికను వ్రాసినాడు. అక్కడ పౌలు రెండవసారి ఖైదీగా చేయబడి రోము పట్టణమునకు కొనిపోబడినాడు. పౌలు రోమా చెరలో ఉన్నప్పుడు 2తిమోతి పత్రికను వ్రాసినాడు.

## పూర్వ రంగము

1 & 2 తిమోతి పత్రికల మధ్యలో తీతుకు పత్రిక చేర్చబడినది. తీతు యూదేతరుడు మరియు పౌలు ద్వారా రక్షణలోనికి నడిపించబడినవాడు. యెరుషలేము కౌన్సిల్ జరిగినప్పుడు సున్నతి లేకుండా రక్షింపబడిన వ్యక్తిగా తీతును పెద్దలకు చూపించుటకు పౌలు వెంటబెట్టుకొని వెళ్ళినాడు (అపో. 15:1-11; తీతుకు 2:11-14; గల 2:3). తరువాత పౌలు తీతుకు కొన్ని సున్నితమైన సమస్యలను పరిష్కరించు నిమిత్తము కొరింథికి పంపినాడు. ముఖ్యంగా తీతుకు క్రేతునందు ఉన్నసమస్యలను పరిష్కరించు నిమిత్తము అక్కడ నిలిచి ఉండాలని కోరినాడు.

## I. నాయకుల యొక్క ప్రవర్తన (1:5-6)

సంఘ నాయకులు ఎలా జీవించాలి మరియు ప్రవర్తించాలి అనే విషయాలు పౌలు తీతునకు జ్ఞాపకం చేయుచు ప్రారంభించినాడు. సంఘ నాయకుడు మరియు పరిచారకునికి ఉండవలసిన లక్షణాలు వ్రాయబడినవి. పౌలు తప్పుడు బోధకులను గూర్చియు వారి వలన కలుగు ప్రమాదములను గూర్చి హెచ్చరిస్తున్నాడు. తీతు క్రేతు ద్వీపము లోని గృహ సంఘములన్నిటిని పర్యవేక్షణ చేయుటసాధ్యము కాదు కాబట్టి ప్రతి సంఘమునందు నాయకులను నియమించవలెను. ఇదే వ్యవస్థాగతమైన పరిస్థితులను ప్రతి సంఘము ఏర్పరచవలెను.

## II. సంఘములో సామాన్యుడు లేదా లౌకికుడి యొక్క ప్రవర్తన (2:1-10)

ప్రతి విశ్వాసి ఎలా జీవించాలో పౌలు తిమోతికి తెలియ జేసినాడు. వృద్ధులు ఆశానిగ్రహము గలవారుగా, స్త్రీలు భక్తిభావం

గలవారును మరియు నమ్మకస్తులునై ఉండాలి. యౌవన పురుషులు కూడాస్వస్థబుద్ధి గలవారై ఉండాలి. దాసులు కూడా సంపూర్ణమైన మంచి నమ్మకత్వం గలవారై తమ యజమానులకు తమ జీవితాలను సమర్పించుకొనవలెను.

అన్ని మార్గాలలో, అన్ని కాలములలో వారు దేవుని కృపచేత జీవించవలెను. వారు భక్తిహీనమైన దురాశలు మరియు కోరికల నుండి వెనుదిరుగవలెను. యేసు ఏ సమయములోనైనను తిరిగి వస్తాడు కాబట్టి వారు సిద్ధముగా ఉండవలెను. దేవుని ప్రజలు పరిశుద్ధత అను లక్షణము తప్పక కలిగి ఉండాలి.

వారు ప్రభుత్వముతో గల సంబంధాన్ని బట్టి మంచి పౌరులు గా మెలుగవలెను. ప్రజలందరి దృష్టికి మంచి దానిని ఎల్లప్పుడు చేయుటకు సిద్ధముగా ఉండవలెను. వారు మాట్లాడు విషయాలలో మరియు క్రియలలో యధార్ధత కలిగి యుండాలి. ఎల్లప్పుడు ఇతరు లను క్షమించి, అందరి పట్ల  విధేయతతో మెలుగవలయును. వారు కలహములను మరియు వివాదములను నివారించవలెను. అప్పుడు క్రైస్తవుడుఇలా ఉంటాడని అందరికి కనపరచబడుతుంది.

ఈ సూత్రాలను అనుసరించని వ్యక్తులు తప్పక పశ్చాత్తాప పడునట్లు క్రమశిక్షణ చర్యకులోను చేయబడుతారు. లేని ఎడల వారు సంఘము నుండి తొలగించబడుతారు. ఇది పాపము యొక్క తీవ్రతను గుర్తించుటకును మరియు సంఘము పవిత్రీకరించబడుటకు కారణమౌ తుంది. క్రైస్తవ జీవితము జీవించుట అనునది ఒక ఎంపిక కాదు. ఇది తప్పనిసరి. ఇది అవసరమై ఉన్నది తప్ప ఇది ఒక సలహా కాదు.

## B. **తీతు పత్రిక రూపురేఖలు**

I.నాయకుని యొక్క స్వభావము, ప్రవర్తన, లక్షణములు (1:5-16)

A. దైవభక్తి గల నాయకుల యొక్క స్వభావము (1:5–9)

B. అబద్ధ బోధకుల యొక్క స్వభావము (1:10–16)

II. క్రైస్తవుల ప్రవర్తన (2:1–3:11)

A. ఆయా వయస్సు మరియు హోదాలకు సంబంధించిన వారు & సంబంధాలు (2: 1–10)

1. పెద్దలు (2:1–5)
    a. సాధారణ సూత్రములు (2:1)
    b. వృద్ధులైన పురుషులు
    c. వృద్ధులైన స్త్రీలు
2. యౌవన పురుషులు (2:6–8)
3. యాజకుల దాసులు (2:9–10)

B. లోకముతో వారి సంబంధము (2:11–15)

C. ప్రభుత్వముతో గల సంబంధము (3:1)

D. ప్రజలందరితో గల సంబంధము (3:2–7)

E. అవిశ్వాసులతో గల సంబంధము (3:8–11)

## C. **కాపరులకు ఇవ్వబడు సలహా**

### **1. వాక్య సందేశము అందించుము (1:1–4)**

నీ గురించి ఒక పదము లేదా మాటలలో వివరించమని అడిగినట్లయితే నీవు ఏ పదము ఎంపిక చేసుకొంటావు. పౌలు తన్నుతాను తీతుకు వివరించుకొనుటకు దాసుడు అను పదము వాడినాడు (తీతుకు 1:19). దాసుడు లేదా సేవకుడు అనే పదమునకు వాడబడిన గ్రీకు పదం యొక్క అర్థము "ఒకరి చిత్తము మరొకరి చిత్తముతో మింగి వేయబడుట".

పౌలు తీతుకు ఈ పత్రికను వ్రాయు సమయములో క్రేతు ద్వీపము నందు ఎంతో మంది దాసులు ఉండేవారు. వారు తమ యజమానుల పనులు  చేయుటకు ఉండేవారు. దాసుడు ఆ యజమానుడు చెప్పినట్లు చేయవలెను తప్ప, వారు  ఏమనుకుంటారో, ఏమిచేయాలని కోరుకుంటారో ఆ విధముగా చేయుటకు వీలు లేదు. పౌలుఇక్కడ తాను యేసు యొక్క బానిసను లేదా దాసుడను అని చెపుతున్నాడు. ఆయన ఏమి చేశాడో దానిని చేయటము మాత్రమే కాదు, యజమానుడు ఏమి తలంచుతాడో మరియు భావిస్తాడో అలా చేయాలి పౌలు యొక్క చిత్తము దేవుని చిత్తమును చేయుట.

పౌలు దాసునిగా తన యొక్క ప్రత్యేకమైన పనిని వివరించుటకు మరొక పదము వాడినాడు. తాను యేసు యొక్క సువార్తను ప్రకటించుటకు పంపబడిన అపొస్తలుడను అని వివరించి నాడు (తీతు 1:1b). అతడు రక్షణ సందేశమును అందించుటకు మాత్రమే కాక దేవుని వాక్యమును బోధించుట కొరకు, తద్వారా వారు జ్ఞానమందును మరియు దైవభక్తి యందును ఎదుగునట్లు చేయుటకు పంపబడినాడు. పౌలు నిత్యజీవమును గూర్చి వారికి హామీ ఇచ్చాడు. ఇది దేవుని చేత వాగ్దానము చేయబడినది (1:2). దేవుడు అబద్ధ మాడనేరడు అని ధృవీకరించాడు (2వ), ఈ వచనము క్రేతు పట్టణ మందు ఆరాధింపబడు “జ్యూస్” అను గ్రీకు దేవునికి వ్యతిరేకముగా వాడబడినది. “జ్యూస్” అను గ్రీకు దేవుడు “అబద్ధికుడుగా” పిలవ బడేవాడు. దేవుడు తనను నడిపించిన ప్రతిచోటికి పౌలు ఈ సందేశాన్ని మోసుకొని పోవుట తన ఆధిక్యతగా మరియు గౌరవముగా భావించి నాడు (తీతు 1:3).

పౌలు దేవుని వాక్యము తానెక్కడికి వెళ్తాడొ అక్కడికి మోసు కొని పోవటమే తన పనిగా చెప్పినాడు. ఒక హెూటల్లో నీవు ఎప్పుడు

తినుటకు వెళ్తావో అక్కడ యున్న ఒక వెయిటర్ భోజనం తీసుకొస్తాడు. అయితే అతడు దానిని వండలేదు కాని మరొకరు దానిని వండినారు. అతని పని కేవలము మరొకరు వండిన దానిని తీసుకొని వచ్చి వడ్డించుట. కాపరులు, నాయకులు కూడా ఇలాగే చేయాలి. మనము మన వాక్యమును తయారుచేయము కాని కేవలం దేవుడు చెప్పిన దానిని అందించుతాము. మనము దానిని మార్చవద్దు దానికి ఏది కలపరాదు, దానిని సవరణ చేయవద్దు, దానితో రాజీ పడవద్దు. మనము దేవుని వాక్యమును ప్రజలకు అందించవలయును. పౌలు దానినే చేసినాడు మనము కూడా అలాగే చేయాలి.

పౌలు తీతును "నా నిజమైన కుమారుడు" అని పిలిచినాడు. పౌలునకు అతనితో ఎంత సన్నిహిత సంబంధము ఉన్నదో ఇది చూపిస్తుంది. పౌలు తన చివరి దశయందు క్రీ. పూ. 62 నందు 1 తిమోతి పత్రికను వ్రాసినాడు. క్రీ.శ. 66 నందు తీతు పత్రికను వ్రాసినాడు. మరియు 1 సంవత్సరము తరువాత క్రీ.శ. 67 నందు 2 తిమోతిను వ్రాసినాడు. ఆ తర్వాత ఆరు నెలలకు పౌలు హతసాక్షిగా మరణించినాడు.

తీతు తిమోతి కంటే పెద్దవాడు మరియు తిమోతి కంటే చాలా స్థిరమైన వాడు. తీతు పరిచర్య చేస్తున్న క్రేతులో ఉన్న సంఘము చాలా సమస్యలతో నిండి ఉన్నది. పౌలు తీతును మరలా చూస్తాడో లేదో అనేది తెలియదు. దాని వల్ల తీతును ప్రోత్సహించుటకు మరియు పరిచర్యను కొనసాగించుటకు  ఈ పత్రికను వ్రాసినాడు.

ఈ రోజు యేసును గూర్చిన వర్తమానము తీసుకొని వెళ్ళుట కొరకు మనము "పంపబడిన వారము" పౌలు, తిమోతి మరియు తీతు ఈ పని చేయుటకు లేరు. అయితే మనము ఈ పని చేయాలి. మనము యేసు యొక్క దాసులుగా ఉండుటకు అవకాశము ఉన్నది. మనము ఆయనను గూర్చి చెప్పగలము మరియు ప్రజలు విశ్వాస

మందు ఎదుగుటకు సహాయము చేయాలి. మనము మన జీవితాన్ని యేసుకు సమర్పించుకొందాము.

**పౌలు సలహా**

మనము దేవుని దాసులము ప్రతి చోట ఆయన సత్యము వ్యాపింప చేయుటకు పంపబడినవారము. మత్త 28:18-20

"అయితే యేసు వారియొద్దకు వచ్చి పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడిబీ తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను". దేవుడు మనలను వివరించుటకు ఉపయోగించే ఒక పదము లేదా మాట ఏది? అది "మంచి మరియు నమ్మకమైన దాసుడు" అని చేర్చబడుతుందా?

**2. దేవుని క్రమము రూపకల్పన (1:5)**

దేవుడు నిర్మాణాత్మకమైన సంస్థలను ఇష్టపడతాడు. ఇవి విశ్వాసిని చాలా ఖచ్చితముగా నడిపించునట్లు చేస్తాయి. గణిత శాస్త్రంలో ఉన్న సూత్రాలు ఎంత మాత్రము మారవు. ప్రతిదానికి దాని దాని స్థానము ఉంటుంది. మరియు మిగతా వాటన్నిటికి పరస్పర అనుసంధానము చేయబడుతాయి, అక్కడ క్రమముంటుంది గజిబిజి ఉండదు, ఒక ప్రణాళిక ఉంటుంది. ఏది అప్రయత్నముగా జరుగదు

ఒక నమూనా ఉంటుంది. ఆలాగుననే దేవుడు సృష్టిని ఒక క్రమమైన విధానములో పని చేయనట్లు రూపించినాడు. అలాంటప్పుడు ఆశ్చర్య పడవలసిన అవసరములేదు, దేవుడు సంఘములో కూడా ఒక క్రమము ప్రకారము జరగాలని అనుకొంటాడు. అది ఈ పత్రిక ప్రారంభము నందు చూచాము.

పౌలు తన యొక్క ఉపోద్ఘాతము (తీతు 1:1-4) తరువాత దీనిని ఎందుకు రాస్తున్నాడు అనునది చూపుతున్నాడు "నేను నీ కాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్న వాటిని దిద్ది, ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచి వచ్చితిని" (తీతు 1:5). క్రేతు ద్వీపములో ఆయా స్థలాలలో ఉన్న గృహసంఘములకు తీతు పౌలు ప్రతినిధిగా ఉన్నాడు. పౌలు తన మిషనరీ ప్రయాణాలలో ఎన్నోసార్లు క్రేతును దర్శించినాడు. కాని సంఘములనుస్థాపించలేదు. అపొస్తలుల కార్యములు 2 అధ్యాయము ప్రకారము పెంతెకోస్తు పండుగ దినమున యెరూషలేముకు వచ్చి యేసును తమ రక్షకునిగా అంగీకరించిన యూదులతో అక్కడ గృహ సంఘములు ఏర్పడి యుండవచ్చును (అపొ. 2:11). అక్కడ సంఘముల యందు ఎక్కువ మంది బానిసలు యున్నారు.

తీతు "సంఘంలో ఉన్న వాటిని దిద్దవలెను" (తీతు 1:5) "సరిదిద్ద వలెను" అనుమాట వైద్య పరిభాషలో ఎముక విరిగినప్పుడు వాటిని కట్టుట. సంఘము వ్యవస్థీకరించ బడాలి, అర్హత కలిగిన వ్యక్తులతో నడిపించబడాలి, శిక్షణ పొందిన వ్యక్తులతో దేవుని వాక్యమును అనుసరించు వారితో నడిపించబడాలి. క్రేతులో ఉన్న ప్రజలు అబద్ధికులు, దుష్ట మృగములును, సోమరులు, తిండిపోతులు అను పేర్లతో పిలువబడినారు. క్రైస్తవునిగా మారిన వెంటనే యాంత్రికముగా మార్పురాదు. ప్రతి వ్యక్తి ఎలా జీవించాలో దాన్ని నిర్ధారించుకొనుటకు మనస్సులో స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. పౌలు అక్కడ

ప్రజలు పరిశుద్ధ జీవితము ఎలా జీవించాలో వాటికి సంబంధించిన విషయాలు ఎన్నో వ్రాసినాడు. క్రేతులో అబద్ధ బోధకులు ఉన్నారు కాబట్టి సంఘమును క్రమపరిచే బాధ్యత తీతుకు అప్పగించబడినది.

మొదట తీతు చేయవలసిన పని పెద్దలను నియమించుట (తీతు 1:5). పౌలు సంఘ క్రమము మరియు వ్యవస్థీకరణ అవసరతను గూర్చి మాట్లాడతాడు. పౌలు 2 తిమోతి యందు సంఘ నాయకత్వము మీద దృష్టి పెడితే, తీతు పత్రిక యందు సంఘ వ్యవస్థీకరణ మీద దృష్టి ఉంచుతాడు. సంఘ క్షేమము కొరకు దానికి ఒక సమగ్రరూపం ఉండాలి, సువార్త వ్యాప్తి చెందుటకు మరియు విశ్వాసులు బలపడుటకు ఇది ఎంతో అవసరము?

ఆయా గృహ సంఘాలలో ఉండే పెద్దలు ఆధ్యాత్మిక పరిపక్వత దైవభక్తిగలవారై ఉండాలి. వీరిలో ఇద్దరు లేదా ముగ్గురు ప్రణాళిక సిద్ధపరచుటకు, వాక్యము బోధించుటకు మరియు మార్గదర్శకాలు ఇవ్వటానికి సహాయ పడవలెను. యూదా సమాజ మందిరముల యందు, యూదేతరుల సమాజములోను సంఘము అర్హత గల వారితో నడిపింపబడవలెను.

సంఘములో రెండు వర్గములకు చెందిన నాయకులు ఉంటారు. ఆధ్యాత్మిక నాయకులు లేదా సంఘ పెద్దలు వీరు ప్రజలను ఆధ్యాత్మిక అభివృద్ధిలో నడిపిస్తారు. రెండవ గుంపుకు చెందినవారు పరిచారకులు. వీరు సంఘములో అవసరమైన భౌతిక విషయాలు, భవన నిర్మాణము, ఆర్థిక లావాదేవీలు, ప్రజల సమస్య తీర్చుటపై దృష్టియుంచుతారు.

| | పొయ్మేన్ | ప్రెస్బిటరోస్ | ఎపిస్కోపోస్ | డియకనోస్ |
|---|---|---|---|---|
| లిప్యంతీకరణము | | ప్రెస్బిటరి | ఎపిస్కోపుల్ | డికెన్ |
| అనువాదము | పాస్టర్ | పెద్ద | పర్యవేక్షకుడు బిషప్పు | మినిస్టర్ (సేవకుడు) |
| శబ్దార్థము | కాపరి | కమాండర్ అధికారి | సంరక్షకుడు గార్డియన్ | బల్లదగ్గర వేచియుండు సేవకుడు |
| ప్రధానమైన ఆలోచన /కర్తవ్యము | గొర్రెలను, సంఘములో ని ప్రజలను వాక్యముచేత బలపరచి, నడిపించుట | యూదుల సమాజమంది రములలో ఉండే అధికారి, పరిపక్వత వ్యక్తిగత గౌర వము కలిగి యుండాలి. ఇతడు విధాన రూపకర్త. | అన్యజనుల సమాజ పెద్ద లకు ఇవ్వబడి నబిరుదు | ఇతడు దేవుని సేవకుడు, సేవా ధృక్పథ ము గలవాడు. |
| ఎవరి నుండి కలుగుతుంది | దేవుని నుండి | ఇతరుల నుండి | ఇతరుల నుండి | స్వయం నుండి |
| | ఎఫెసీ 4:11 I పేతురు 5:1-4 | Iపేతురు 5:1-4 Iతిమోతి 5:1,17, 19;1;5-6 | Iతిమోతి 3:1-7, తీతుకు 1:7-9 I పేతురు 5:1-4 | I తిమోతి 4:6 IIతిమోతి 4:5 |

కాపరుల యొక్క కర్తవ్యము సంఘములో పరిస్థితులను క్రమముగా జరుగునట్లు పర్యవేక్షించుట మరియు ప్రజలు సరైన జీవితము కలిగి యుండునట్లు చూచుట. నేటి కాపరుల బాధ్యత క్రమమైన పద్ధతిలో, విధానముతో పరిస్థితులు ఉండునట్లు ప్రణాళిక సిద్ధపరచవలెను. మనము ప్రణాళికలను మరియు లక్ష్యాలను సిద్ధపరచ వలెను. ఒక పెద్ద కుటుంబములో అందరు కలిసి వారి వారి పనులు జరిగించుకొనునట్లు మార్గదర్శకములు చేయునట్లు సంఘంలో ప్రతి ఒక్కరు సమిష్టిగా పనులు నిర్వహించునట్లు కాపరి చూడవలెను. సంఘములో క్రమము లోపింపజేసే ప్రతి పరిస్థితిని తొలగించవలెను. మనము బాధ్యత నిర్వహిస్తున్నాము కాబట్టి పరిస్థితులన్నింటిని నియంత్రణలో ఉండునట్లు శ్రద్ధగా గమనిస్తు, వాటిపై పర్యవేక్షణ నిర్వహించవలెను.

### పౌలు సలహా

ప్రతి సంఘమునకు వాటి విధులు సక్రమముగా నిర్వహింప బడునట్లు పర్యవేక్షణ చేయుటకు నాయకులు అవసరమై యున్నది.

"తోటి పెద్దను, క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని, బయలుపరచబడబోవు మహిమలో పాలివాడనైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమి చేతకాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను, దుర్లాభాపేక్షతో కాక సిద్ధమనస్సుతోను, మీ మధ్య నున్న దేవుని మందను పైవిచారణ చేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింపబడిన వారిపైన ప్రభువులైనట్లుండక మందకు మాదిరులుగా ఉండుడి "ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు". (1 పేతురు 5:1-4)

తక్షణమే నీ సంఘములో సరి చేయబడవలసిన సమస్యలు ఏవి? నీ జీవితములో ఆందోళన, లోపభూయిష్టమైన, మరియు అవ్యవస్థీకరణగా ఉన్న పరిస్థితులు ఏవి? అన్నిటిని వ్యవస్థీకరించాలి అను దేవుని ఆజ్ఞను అనుసరించుటకు నీవు తప్పక ఏమి చేయవలయును.

## 3. దైవభక్తిగల నాయకుల ప్రవర్తన (1:6-9)

పౌలు తీతుకు వ్రాసిన తన పత్రికను సంఘములో లోపముగా ఉన్న వాటిని సరి చేయవలెనని గుర్తు చేస్తూ ప్రారంభించినాడు. అతడు క్రేతు పట్టణములో ఉన్న గృహ సంఘములన్నింటిలో ఆధ్యాత్మిక పరిపక్వత కలిగి, దైవభక్తి మరియు మంచి పేరు కలిగి ఉన్న పురుషులను నియమించవలెనని ఆజ్ఞాపించినాడు. వీరు దేవుని వాక్యమును అనుసరిస్తూ, దేవుని వాక్యము అనుసరించుట ద్వార ప్రజలు ఆధ్యాత్మిక ఎదుగుదల కలిగి ఉండగలరని నిర్ధారించు కొనవలెను. ఎందుకనగా వారి స్థానము చాలా ప్రాముఖ్యమైనది. కాబట్టి వారు కొన్ని లక్షణాలు తప్పక కలిగి ఉండాలి (తీతు 1:6-9). పౌలు ఇవే లక్షణములు కలిగి ఉండాలని తిమోతికి కూడా తెలియ జేసినాడు (1తిమో 1:6-9) ఇంకా ఎక్కువ వివరణాత్మక సమాచారం కొరకు (vst Standards for Pastors and Leaders చూడండి).

ఈ ప్రాముఖ్యమైన విషయాలు గుర్తించవలెను. క్రేతులో ఉన్న యూదుల యొక్క చిన్న గ్రామీణ సంఘముల యందు తిమోతి పరిచర్య చేస్తున్న అతిపెద్ద ప్రాముఖ్య పట్టణమైన ఎఫెసీ నందలి అన్యజనుల సంఘము నందు కూడా ఈ ఉన్నతమైన ప్రమాణాలతో కూడిననియమావళి సంఘ నాయకులు కలిగి ఉండవలెను. ఈ లక్షణములను నేటి ప్రతి స్థలములలో ఉన్న ప్రతి సంఘ నాయకులు కలిగి ఉండవలెను.

ఒక దైవభక్తి గల నాయకుడు దైవభక్తి గల లక్షణాలు కలిగి యుండవలెను. సంఘము నందు పరిపక్వత అనుభవముతో కూడిన పనులు చేయవలెను. అతడు తప్పనిసరిగా ఆధారపడదగిన వాడుగా, విధేయుడు మరియు భక్తిగల  సలహా ఇవ్వగలిగే సామర్థ్యము గలవాడుగా ఉండాలి. సంఘము వెలుపల మరియు లోపల ఉన్న ప్రజల మధ్య మంచి పేరుగల వారుగా ఉండాలి. ఇతరులు మాట్లాడు నప్పుడు అతడుతప్పక ప్రతిది వినవలెను. ఇతరులు తనతో సౌకర్య వంతమైన అనుభూతి కలిగి యుండనట్లు చూచు కొనవలెను. అతడు ఇతరులతో గౌరవముగా మెలగవలెను.

అతడు బైబిలును బాగుగా ఎరిగి ఉండాలి. అందులో నీ సభ్యులను ప్రజలకు బోధించు సామర్థ్యం కలిగి ఉండాలి. అతని జీవితములో పశ్చాత్తాపపడని పాపము ఉండరాదు. అతడు ఏ పాపము లేని పరిపూర్ణుడుగా ఉండలేడు కాని  పాపముపై విజయము పొంది, ఎల్లప్పుడూ యేసు వలె ఉండుటకు అన్ని సమయములలో ఉండాలి. తన భార్యతో, పిల్లలతో సరియైన విధముగా మెలగవలెను.

కాపరి ఎంత మాత్రం భౌతిక సంబంధమైన వాటిపైన దృష్టి పెట్టరాదు. దానికి బదులుగా అవసరతలో ఉన్న ఇతరులకు సహాయము చేయుటకు సిద్ధంగా ఉండవలెను. కుటుంబములోను, సంఘములోను, సమాజములోను యేసుక్రీస్తు వంటి జీవితాన్ని జీవిస్తు మంచిమాదిరి కలిగి యుండాలి. యేసువలే మారుట, నెమ్మదిగా, దీర్ఘ కాలం జరిగే ప్రక్రియ కాని ఇది సరైన దిశగా జరుగవలయును. యేసు మన మాదిరి యేసు వలె మారటం మన లక్ష్యము. నీవు ఆ దిశగా కదలుచున్నావా?

**పౌలు సలహా**

సహా నాయకులు తప్పక ఆధ్యాత్మిక పరిపక్వత, మరియు దైవభక్తి కలిగి ఉండాలి. మరి ఇంటిలో, సంఘములో మరియు సమాజములో క్రీస్తు వలె నడుచుకొనవలెను.

ఎవడైనను నిందారహితుడును, ఏకపత్నీ పురుషుడును, దుర్వ్యాపార విషయము నేరము మోపబడనివారై అవిధేయులు కాక విశ్వాసులైన పిల్లలు గలవాడునై యున్నయెడల అట్టివానిని పెద్దగా నియమింపవచ్చును. ఎందుకనగా అధ్యక్షుడు దేవుని గృహ నిర్వాహకునివలె నిందారహితుడై యుండవలెను. అతడు స్వేచ్ఛాపరుడును, ముక్కోపియు, మద్యపానియు, కొట్టువాడును, సజ్జన ప్రియుడును, స్వస్థబుద్ధిగలవాడును, నీతిమంతుడును, పవిత్రుడును, ఆశానిగ్రహముగలవాడునై యుండి, తాను హితబోధవిషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడు వారి మాట ఖండించు టకును, శక్తిగల వాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొను వాడునై యుండవలెను. (తీతు 1:6-9)

పైన పేర్కొనబడిన లక్షణములు ఉన్నవారు ఎవరైనా తెలుసా? మీరు ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారని ఇతరులు భావిస్తున్నారా? నీవు దేనిని చేరుకొనుటకు కష్టముగా భావిస్తున్నావు? నీవు ఆ విషయములో క్రీస్తు వంటి వాడవుగా ఉండుటకు తప్పక ఏమి చేయాలి.

**4. తప్పుడు బోధకుల ప్రవర్తన (1:10-14)**

పౌలు తాను తీతుకు ఇచ్చిన సూచనలలో సంఘములో లోపము దిద్దుటకు ఆధ్యాత్మిక పరిపక్వతగల, దైవభక్తిగల మనుష్యులను ఏర్పరచాలని కోరుతున్నాడు (తీతు 1:1-5).

అతడు వారు కలిగియుండవలసిన లక్షణాలను వివరించి ఉన్నాడు (1: 6-9). దానికి భిన్నముగా సంఘములో సమస్యలు లేవనెత్తబడుటకు అబద్ధ బోధకులుకారణముగా ఉన్నారు (1:10-16). వారు క్రైస్తవులుగా పేర్కొంటు, సంఘ కార్యక్రమములో పాల్గొంటున్నారు. వారు బోధించే బోధ పౌలు బోధతో పొసగటం లేదు. వారు అవిశ్వాసులై యుండి, సంఘముబయట నుండి దాడి చేస్తున్నట్లయితే వారిని గుర్తించడం చాలా సులభం. కాని సంఘములో చూడటానికి విశ్వాసములో నిష్కపటముగాకనబడుతూ ప్రజలను ప్రభావితం చేయు ప్రజాధారణ పొందిన వారు వారి బోధనల ద్వారా ప్రజలను తప్పు త్రోవ పట్టిస్తున్నట్లయితే ఇది సంఘమునకు చాలా నష్టం కలిగిస్తుంది.

పౌలు వీరిని “అవిధేయులు” (తీతు 1:10). దేవుని సత్యమునకు వ్యతిరేకులు  వదరుబోతులు (ప్రజల అభిప్రాయాలను బోధిస్తారు మరియు దేవుని సత్యమును నిర్లక్ష్యపరుస్తారు) అంటున్నాడు. మరియు మోసపుచ్చువారు (వారు అబద్ధికులుగా ఉంటూ సత్యములో ఉన్నామని ఇతరులను మోసపుచ్చుతారు వీరిలో చాలామంది “సున్నతి పొందిన గుంపుకు” చెందిన యూదులు, వారు తమ్మును తాము క్రైస్తవులుగా పేర్కొంటారు. యూదులు వారి వాదనలలోను మరియు ధర్మశాస్త్ర సంబంధమైన శాసనములు మరియు విధులు, కట్టడలు బోధించుటలోను ప్రసిద్ధులు. యూదులపై ఉన్న ఒక హాస్యోక్తిఏంటంటే ఒక విషయాన్ని గూర్చి “ఇద్దరు యూదులను అడుగు, మూడు అభిప్రాయాలు పొందు”.

ఈ మనుష్యుల “నోళ్లు మూయింపవలెను” పౌలు ఖండిత ముగా ఆజ్ఞాపిస్తున్నాడు. ఆ తర్వాత పౌలు కారణాలు చూపుతున్నాడు. వారు  దుర్లాభము కొరకు ఉపదేశించుచు కుటుంబములకు కుటుంబ ములనే పాడు చేయుచున్నారు. కొందరు “మరుగు చేయబడిన

జ్ఞానాన్ని" ప్రజలకు ప్రకటిస్తామని డబ్బు సంపాదించుకొనుటకు ప్రయత్నించినారు. దురదృష్టవశాత్తు నేటి సంఘ కాపరులు మరియు నాయకులు కూడా తమ పరిచర్యను వృత్తిగా భావించి డబ్బును సంపాదించుటకు గురిగా పెట్టుకొంటున్నారు. వారు పెద్ద పెద్ద సంఘాలలో పనులు చేసుకుంటూ మరియు ఎక్కువ లాభర్జనము గడిస్తున్నారు.

క్రేతు ద్వీపములో జీవించిన "ఎఫీమెనిడిస్" అను వ్యక్తి క్రేతీయులను గూర్చి "వారు అబద్ధికులు, దుష్టమృగములు, సోమరులు తిండిపోతులు" అని పేర్కొన్నాడు. ఆ విషయాన్ని పౌలు ఎత్తి చూపిస్తూ అతడు వారి సొంత ప్రవక్తలలో ఒకడు అని తెలియజేస్తాడు. పౌలుకు 300 సంవత్సరములకు పూర్వము జీవించిన "కాలిమకస్" అనే వ్యక్తి కూడా క్రేతీయులు అబద్ధికులు అని పేర్కొంటాడు. అబద్ధమాడుట క్రేతులో ఉండే ప్రజలకు తప్పు కాదు. వారికి ఏది అవసరమో దానిని పొందుటకు అది ఒక మార్గముగా ఎంచుతారు. గ్రీకు దేవుడుగా పిలవబడు "జ్యూస్" స్త్రీలను ఆకర్షించుటకు అబద్ధమాడేవాడు. అతడు చనిపోయిన తర్వాత క్రేతులో పాతిపెట్టబడినట్లు సాంప్రదాయాల యందు మరియు పురాణముల యందు వ్రాయబడినవి.

వారిని కఠినంగా గద్దింపుము అని పౌలు అజ్ఞాపిస్తున్నాడు (తీతు1:13) వారి బోధను గూర్చి వారిని కఠినముగా గద్దించుము అని తెలియజేయుచున్నాడు. క్రేతీయులు చాలా దురుసుతనము, కఠినమైన వారు, నాగరికత లేని ప్రజలు కాబట్టి సున్నితముగా వారిని సరి చేయుటకు ప్రయత్నిస్తే సరిపోదు, వారిని కఠినముగా గద్దించాలి.

తప్పుడు బోధలు అనేక రీతులుగా ఉండేవి. అయితే క్రేతు నందు "యూదుల కల్పనా కథలు" (తీతు 1:14) అసత్యములైనవిగా ఉండేవి.

పురాణాలు, సంగీతము, మాలిక చరిత్ర, సామెతలు, హాస్యము, ప్రసిద్ధి చెందిన నమ్మకాలు, అద్భుతమైన కథలు, పొడవైన కథలు, ఆచారములు మొదలగునవి యూదామతము యొక్క సాంప్ర దాయములు. వీటితోపాటు రక్తపిశాచులు, రాక్షసులు, ప్రజల పేరు మీద మరుగు చేయబడిన రహస్య సందేశాలు, బైబిలులో వ్రాయబడిన ఎవరికి తెలియని కొన్ని విషయాలు, గతంలో దేవుడు బయలుపరచిన విషయాలు, కథల రూపములో మరియు ఉపమానముల రూపములో చెప్పబడేవి. ప్రజలు వీటికి ఆకర్షితులు అయ్యేవారు. అయితే అవి నమ్మశక్యములు కానివి మరియు అభ్యంతరకరమైనవిగా ఉన్నాయి. కొందరు అవి వాస్తవమై యుండవచ్చును కాబట్టి తెలుసుకొనుటకు ప్రయత్నించేవారు.

**పౌలు సలహా**

తప్పుడు బోధకులను తప్పక ఎదుర్కోవాలి మరియు సరిదిద్దాలి.

"మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీ లోను అబద్ద బోధకులుందురు. వీరు తమ్మునుకొనిన ప్రభువును కూడా విసర్జించుచు, తమకుతామే శీఘ్రముగా నాశనము కలుగజేసికోనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయాలను రహస్యముగా బోధించుదురు, మరియు అనేకులు వారి వారి చేష్టలను అనుసరించి నడుతురు. వీరిని బట్టి సత్యమార్గము దూషింపబడును. వారు అధికలోభులై, కల్పనా వాక్యములు చెప్పుచు, మీ వలన లాభము సంపాదించుకొందురు. వారికి పూర్వమునుండి విధించబడిన తీర్పు ఆలస్యము చేయదు, వారి నాశనము కునికి నిద్రపోదు". (2 పేతు 2: 1–3)

ఏ తప్పుడు బోధల విషయమై నీవు వ్యవహరించవలెను? వాటి విషయమై ప్రజలకు అప్రమత్తముగా ఉండాలని ఎందుకు

విజ్ఞప్తి చేయాలి? అవి ఎందుకు ప్రమాదకరమైనవి? వాటిని వ్యతిరేకించుటకునీవు తప్పక ఏమి చేయాలి?

## 5. నేటి దినములలో తప్పుడు బోధలు 1 (1:15-16)

చదువుము: తీతుకు 1: 15-16

తప్పుడు బోధకులు ప్రమాదకరమైన అబద్ధికులని మరియు వారి బోధలు తప్పక సరిచేయబడాలని మనము చూచియున్నాము. పౌలు కేవలము వారిని గూర్చి మాట్లాడలేదు కాని వారు చాల సమస్యలకు ఎలా కారణమౌతారో వివరించినాడు.

"సత్యమును తిరస్కరించు వారి ఆజ్ఞలను" అనుసరించుటకు ప్రజలు ఎప్పుడు ప్రారంభిస్తారో అది వారికి చాల ప్రమాదకరముగా మారుతుంది (తీతు 1:14). యూదా మతము చట్టబద్ధమైన వ్యవస్థవైపునకు మరలింపిబడి కొన్ని వేల నియమములను మరియు కట్టడలను అభివృద్ధిచేసినది. ప్రతికూలమైన పర్యవసానముల నుండి తప్పింపబడుటకు వాటిని అనుసరించవలెనని ఏర్పరచుకొనినది. చట్టబద్ధత ఎల్లప్పుడూ భయముచేత ప్రేరేపింపబడుతుంది. దేవుడు మనకు ఏమి చేస్తాడోనని మరియు మనము అన్ని విధులు అను సరించపోతే ఇతరులు ఏమి చెప్తారో అనే భయము యూదులు అన్న పానముల విషయములలో, సబ్బాతు దినమున చేసే పనుల విషయములో, ఇతరులతో మరియు దేవునితో ఎలా మెలగవలెను అను వాటి విషయములో కొన్ని వేల చట్టములు ఏర్పాటు చేసినారు. ఎప్పుడైతే వారిలో కొందరు యేసు నందు విశ్వాసులు అయినారో వారు ఈ చట్టములను మరియువిధులను పాటించాలని చెప్పారు. వారు యేసును యూదా మతమునకు కలిపినారు. కాని దీనిని 20 సంవత్స రములకు ముందే ఆదిమ సంఘము అపొ. 15 అధ్యాయము నందు పేర్కొనబడిన యెరుషలేము సమావేశము నందు వ్యతిరేకించినది.

పౌలు తాను వెళ్ళిన ప్రతిచోట ఈ తప్పుడు బోధకులకు విరోధముగా వాదించినాడు. ఇది అతని మొదటి పత్రికైన గలతీ పత్రిక యందు ప్రాముఖ్యమైన సూత్రముగా యుంచబడినది. ఈ అబద్ధములను ప్రజలలోనికి చొప్పించేవారిలో కొందరు నిజమైన విశ్వాసులు ఉన్నారు కాని వారు కృపతో క్రియలను కూడా చేర్చినారు (లూకా 8: 13; 1 తిమో 4:1; హెబ్రి 3: 12), మరికొందరు రక్షింప బడుటకు ఎంత మాత్రమూ యేసునొద్దకు రారు కాని వారి తప్పుడు ఆలోచలను వ్యాపింప చేయుటకు సంఘమునకు హాజరు అవుతారు (లూకా 13: 27; 2 థెస్స 2: 11).

రక్షింపబడుటకు యేసు మాత్రమే సరిపోదు, క్రియలు కూడా అవసరమనే తప్పుడు బోధను ప్రచారము చేసినారు. యూదుల సాంప్రదాయము ప్రకారము ఇతర క్రైస్తవులు కోషెర్ చట్టములు (Kosher laws) పాటించరు కాబట్టి ఆధ్యాత్మికముగా అపవిత్రులు అని పేర్కొంటారు. అయితే పౌలు వీరు మరియు వీరి బోధ అపవిత్ర మైనదని చెప్పినాడు (తీతు 1:15).

పౌలు ముగింపు నందు వారిని గూర్చి చెపుతూ, వారు దేవుని ఎరుగుదుమని చెప్పుదురుగాని తమక్రియల వలన ఆయనను ఎరుగ మన్నట్లున్నారు. వారు అసహ్యులును, అవిధేయులునై, ప్రతి సత్ కార్యము విషయమై భ్రష్టులునైయున్నారు (తీతు 1: 16). ఈ పదములు చాల కటినమైనవిగా యున్నాయి. "భ్రష్టులునైయున్నారు" అనగా వారు పరీక్షింపబడినపుడు వారి క్రియలలో మరియు మాటలలో విలువలేనివారిగా యుండి, దేవుని అమోదము పొందలేక పోయి నందున తిరస్కరింపబడినారు.

నేను యౌవనస్తునిగా ఉన్నప్పుడు కొందరు వ్యక్తులు నాకు సలహాదారులుగా ఉండి నేను ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే జాబితా తయారుచేశారు.

అందులో చాలామట్టుకు ఏమి చేయకూడదోఅనేవే ఎక్కువగా ఉన్నవి. నేను ఏమి చేయకూడదో, ఏమి ధరించకూడదో, ఏమి చదవకూడదో మొదలగు విషయములను వ్రాసినారు. వీటిని నేను దగ్గరగా అను సరిస్తున్నప్పుడు వారు నన్ను అభినందించే వారు, కాని ఎప్పుడైతె వీటిని అనుసరించుటలో తప్పిపోయేవాన్నో అప్పుడు నన్ను శారీరసంబందిగా, భక్తితగ్గి వెనుకకు దిగజారిన వానిగా చూచేవారు. అయితే ఈ పరిస్థితులలో నేను దేవుని కృప క్రింద ఉన్నానని, నానుండిదేవుడు ఏమి ఆశిస్తున్నాడో దాన్ని తెలుసుకొనుటకు ఆయన యొద్దకు రావాలని నేర్చుకొన్నాను. అయితే వారు నన్ను ఏమి చేయాలని కోరారోఅవి అన్ని తప్పుకాదు కాని సరియైన కారణము చేతనేను వాటిని చేయలేదు. ఎందుకనగా నేను భయము చేత పురికొల్పబడినాను. ఒకవేళ నేను వాటిని చేయకపొతే దేవునిచేత మరియు ఇతర క్రైస్తవులచేత తిరస్కరించబడుతానని భయపడేవాన్ని.

కృప అనగా అర్హతలేని వారిపట్ల దేవుడు ఉచితముగా చూపించే దయపుర్వకమైన క్రియ, అది పాపుల రక్షణయందు దేవుడు ప్రదర్శించే దీవెనల ప్రసాదము. క్రియల వలన సంపాదించుకొనునది కాకా దేవుని ప్రేమవలన కలుగునది. మనము కృప వలన రక్షింప బడినాము (ఎఫె 2: 8-9) కృప వలన జీవిస్తున్నాము (హెబ్రి 13: 9).

కొందరు తప్పుడు బోధకులు ధర్మశాస్త్రము యొక్క కట్టడలను, విధులను పాటించుట ద్వార దేవుని ప్రేమను పొందగలమని బోధిస్తూ దేవుని ప్రజలను దాని కాడి క్రింద ఉంచుటకు ప్రయత్నించినారు. మరికొందరు దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు గనుక మనము ఎలా జీవించినప్పటికి, ఏమి చేసినప్పటికి పరవాలేదని బోధించినారు. అయితే ఈ రెండు విపరీత బోధలు సరియైనవి కాదు. మనము ఎప్పుడైతే భయముచేత జీవిస్తామో మనలో ప్రేమ, శాంతి, సంతోషము లేకుండాపోతాయి. అప్పుడు మనము ఇతరులను విమర్శించువారిగా

తయారై, అవిశ్వాసులచేత చెడ్డ సాక్ష్యము పొందుతాము. మరియు మనము అన్నివిషయములలో సరిగా ఉన్నామని తలంచినట్లయితే పాపము చేస్తూ, మనకు మనము దేవునినుండి వేరైపోతాము. అది మనలను మరి ఎక్కువగా పాపము చేయుటకు మనలను నడిపించి, మనలో ప్రేమ, సంతోషము, శాంతి లేకుండా చేస్తుంది. అప్పుడు మనము ఇతరుల ఎదుట చెడ్డ సాక్ష్యము గలవారిగా తయారవుతాము. ఉదాహరణకు తప్పిపోయిన కుమారుడు తన ఇష్టానుసారముగ జీవించుటకు కోరుకొని కష్టాలపాలై, సమస్తమును కోల్పోయి, అపరాధ భావముతో మిగిలిపోయాడు, అయితే అతని పెద్ద అన్న చట్టబద్ధత చేత జీవించి ఇతరులను విమర్శిస్తూ, తీర్పు తీర్చుచూ, ప్రేమ, సంతోషము, శాంతి లేనివానిగా ఉన్నాడు. ఈ రెండు కూడా ప్రమాదకరమైన మరియు విపరీతధోరణులుగా ఉన్నాయి. సాతాను ఈ ధోరణులను సత్యమునకు నకిలీగా వాడుకొంటూ, వారిని సరియైన మార్గములో ఉన్నారని భ్రమపరుస్తూ, బంధకములలోనికి, ఓటమిలోనికి నడిపించుటకు ప్రయత్నిస్తారు.

## పౌలు సలహా

తప్పుడు బోధకులు ప్రమాదకరమైనవారు మరియు నాశనమును కలిగిస్తారు.

నానా విధములైన అన్య బోధలచేత త్రిప్పబడకుడి. భోజన పదార్థములనుబట్టి కాకా, కృపను బట్టియే హృదయము స్థిరపరచు కొనుట మంచిదిబీ భోజనములనుబట్టి ప్రవర్తించినవారికి ఏమియు ప్రయోజనము కలుగలేదు.(హెబ్రీ 13:9)

ఏ విపరీత ధోరణుల చేత నీవు ఎక్కువగా శోధింబడుతున్నావు దేవుని ప్రేమను పొందుటకు ఏమైనా చేయాలని అనుకొంటున్నావా

లేదా మనము ఎలా జీవించినప్పటికైనను పరవాలేదు ఎందుకనగా దేవుడు నిన్ను క్షమిస్తాడని అనుకొంటున్నావా?

## 6. నేటి దినములలో తప్పుడు బోధలు 2 (1:15-16)

చదువుము: తీతుకు 1: 15-16

డబ్బు, చిత్రపటము, మరియు మరే ఇతర వస్తువులైనను వాస్తవమైన వాటి పోలికలో నకిలీవి చేయబడి మార్కెటులోనికి వచ్చినట్లయితే అది చాల ప్రమాదకరము. అది ఎంత దగ్గరిగా ఉంటే అంత మోసపూరితము. ఇది బైబిలు విషయములలో కూడా వాస్తవము ఎందుకనగా సాతాను అబద్ధికుడు మరియు మోసపుచ్చువాడు (యోహా8: 44) మరియు దేవుని సత్యమును తిరస్కరించుట ద్వార దానిని వ్యతిరేకిస్తాడు, అంతేకాదు దానికి నకిలీగా మరొక దానిని విజయవంతముగా సృష్టిస్తాడు. అతడు తన తప్పుడు సిద్ధాంతమును సరియైనదిగా కనబడునట్లుగా చేయుటకు దానికి కొంత సత్యమును జోడించి ప్రమాదకరమైనది తయారుచేస్తారు. అతడు చట్టబద్ధతను ఆధారము చేసుకొని ప్రజలకు కట్టడలను మరియు నియములను ఏర్పరచుట ద్వార వారిని భయములోనికి ఎలా నడిపిస్తారో చూచి యున్నాము. వారు వ్యక్తిగతమైన స్వేచ్ఛను దూరముచేసి అపరాధ భావము మరియు తిరస్కారధోరణిని ఏర్పరుచుతాడు. దేవుని వాక్యములో చెప్పబడినట్లు మనము కృప క్రింద యున్నాము కాని దేవుని ధర్మశాస్త్రమును క్రింద లేము (రోమ 6: 14).

కొందరు అబద్ధ బోధకులు మనము కృప క్రింద యున్నాము కాబట్టి పాపము చేసినప్పటికి ఏమి పర్వాలేదు దేవుడు ప్రేమగల దేవుడు కాబట్టి మనలను అంగీకరిస్తాడని భోధిస్తారు. వీరు చెప్పినట్లు దేవుడు ప్రేమగల దేవుడు అనునది నిజమే కాని ఆయన అవిధేయతను

అనుమతించదు. కేవలము మనము రక్షణ కలిగి యున్నాము కాబట్టి మనకు ఇష్టమైనది ఏదైనా చేసినప్పటికి  పాపముయొక్క పర్యవ సానము ఎదుర్కోవలసిన అవసరత లేదని వారు అంటారు. అయితే మనము పర్యవసానములను తప్పక ఎదుర్కొంటాము, అనగా దాని అర్థము పాపము చేయుట ద్వార మన రక్షణను  కోల్పోతామని కాదు గాని దేవునితో ఉన్న సహవాసమునకు అంతరాయము కలిగి, మన లోని శాంతిని, సమాధానమును, అత్మఫలమును కోల్పోతాము (గలతి 5: 22-23).

నేటి దినములలో ఉన్న మరొక అతి ప్రమాదకరమైన తప్పుడు బోధ, మన రక్షణ యేసు నందు భద్రముగా ఉండదు కాబట్టి దానిని కోల్పోకుండా ఉండుటకు ఇంకేదైనా చేయాలి. ఈలాంటి భావము వ్యక్తి హృదయములో భయాన్ని కలిగించి వారు చేసే పనులు యేసుపైన గల ప్రేమనుబట్టి కాక వారి రక్షణను కాపాడుకొనుటకు చేస్తారు. అది ఎలా ఉంటుంది అంటే ఒక భార్య తన భర్తకు సేవలు చేయకపోతే తనను తిరస్కరిస్తాడేమోనని భయపడినట్లుంది. అయితే ఈ విధముగా చేయుట ద్వార వారి మధ్య ఒక సన్నిహితమైన, ప్రేమపూర్వకమైన, నమ్మకమైన సంబంధము ఏర్పడదు. రక్షణ దేవుని యొక్క ఉచితమైన వరము. ఏదైనా చేయుట ద్వార దీనిని పొందలేము, ఏదైనా చేయుట ద్వార దీనిని పోగొట్టుకోలేము (ఎఫె 2: 8-9బీ  యోహా 3: 16-18, 36; 5: 24; 6: 37-40; 10: 27-30; 20: 3031; రోమ 4: 6-8; 8: 14-16; 28, 37-39; 14: 8;  2 కొరింథీ 1:21-22; ఎఫే 1: 13-14; 3: 12).

నేటి దినములలో సహజముగా చెప్పబడే అబద్ద బోధలలో ఒకటి ప్రతిఒక్కరు ఆరోగ్యముగా, ధనవంతులుగా ఉండుట దేవుని చిత్తము. కాని ఈ విషయము బైబిలునందు ఎక్కడ చెప్పబడలేదు. యేసు మన పాపముల నుండి విడిపించుటకు చనిపోయినాడు తప్ప

మనలకు ఆరోగ్యవంతులుగా  లేదా ధనవంతులుగా ఉంచుటకు చనిపోలేదు. కొన్నిసార్లు ఈ అబద్ధము కొందరిని లోభులనుగాను మరియు స్వార్థ కేంద్రితమైన వారిని గాను తయారు చేస్తుంది. అదే విధముగా ఇది అర్థిక ఇబ్బందులతో, అనారోగ్యతతో బాధపడేవారు వారి విశ్వాసము గూర్చి అనుమానించి అపరాధభావములోనికి నెట్ట బడునట్లుచేస్తుంది.

మేము ప్రజలు ఆశీర్వదించబడుటకు, వారి జీవితాలలో అద్భుతములు జరుగునట్లు దేవుని పేరట ప్రకటించగలమని లేదా ఆజ్ఞాపించగలమని అని చెప్పే  మోసపూరితమైన బోధ మరొకటి నేటి దినములలో ప్రాచుర్యములో ఉంది. కాని  ఏదైనా దేవుడే చేయగలదు (రోమా 4:17). మనము ఆయనను సేవిస్తున్నాము కాబట్టి ఆయనకు అజ్ఞలను జారీచేయలేము. ప్రభువు ప్రార్ధనయందు "నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము నెరవేరుగాక" అని చెప్పబడినది తప్ప "నా రాజ్యము వచ్చు గాక, నాచిత్తము నెరవేరుగాక" అని చెప్పబడలేదు (మత్త 6:10) ఆయన మన యజమాని మనము ఆయన సేవకులము. భాషలలో మాట్లాడుటను దుర్వినియోగము చేయుట మరొక నష్టము కలిగించే అబద్ధబోధ. భాషలలో మాట్లాడుట అనునది ఒకడు రక్షింప బడుటకు సూచనగా ఉంది కాబట్టి ప్రతి ఒక్కరు భాషలలో మాట్లాడాలి అనే బోధ లేఖములకు భిన్నమైన. కృపావరములు దేవుని ద్వార ఎంపిక చేయబడి ఇవ్వబడునని తప్ప మనము వాటిని మన హక్కుగా భావించి పొందునవికావు. దేవుడు ప్రతివారికి వేరువేరు కృపావరములను ఇస్తాడు (1 కొరింథీ 12) కాబట్టి  ఒక వరము కంటేమరొక వరము గొప్పదని అంచనావేసి చెప్పడము సరైనది కాదు (1 కొరింథీ 12: 14) భాషలలో మాట్లాడుట మన రక్షణకు మరియు అధ్యాత్మిక స్థితిగతులకు గుర్తుగా ఉన్నది అనే భావము సాతాను చేతిలోఒక సాధనముగా మారి

ప్రజలలో భయము, అపరాధభావము, గర్వము కలుగుటకు కారణమౌ తుంది.

ఇతర అబద్ధ సిద్ధాంతములు కూడా నేడు వ్యాప్తిలో ఉన్నాయి. కొందరు నరకము లేదా దేవుని తీర్పు ఉన్నదనే వాస్తవాన్ని తిరస్కారి స్తారు. మరికొందరు యేసు యొక్క దైవత్వము కంటే మానవత్వమును ఎక్కువచేసి చూపిస్తారు. ఆయన 100% మానవుడుగాను మరియు 100% దేవుడుగాను ఉంటే దానిని అంగీకరించుటకు బదులు ఆయన దైవత్వమును మానవత్వము కంటే ఎక్కువ చేసి చూపించుటకు మరియు ఆయన మానవత్వమును దైవత్వము కంటే ఎక్కువ చేసి చూపించుటకు ప్రయత్నిస్తారు. యేసు భూమిమీద చేసిన కార్యములను పరిశుద్ధాత్మ ద్వార జరుగునట్లు మేము ప్రకటించగలమని లేదా ఆజ్ఞాపించగలమని కొందరు బోధకులు  చెప్పుతారు. మరి కొందరు తమ్మును తాము ప్రవక్తలమని  ప్రకటించుకొంటారు. కొందరు ఇతరుల పట్లదేవుని చిత్తమేదో తాము తెలుసుకొని చెప్పగలమని చెప్పుతారు. వారు బైబిలు దేవుని యొక్క అంతిమ మరియు సంపూర్ణ మైన దేవుని ప్రత్యక్షతగా భావించక దానిని తిరస్కరించి, ఏది తప్పు లేదా ఏది ఒప్పు అని తామే అలోచించి నిర్ణయించుకోవచ్చనే అబద్ధ బోధను వ్యాప్తిచేస్తున్నారు.అంతిమ నిర్ణయము దేవునిది కాక మనిషిదే ఉంటుందని వాదిస్తారు. తాము ప్రవక్తలమని ప్రకటించుకొనేవారు ప్రతి వారిపట్ల ఏది వాస్తవమైనదో ఏది కాదో అని చెప్పే జ్ఞానము తమకే ఉంటుందని, తమకు మాత్రమే దేవుని సత్యము వెల్లడించబడునని చెప్పుకొంటారు.

ఈలాగున తప్పుడు బోధలు విభిన్నమైన రీతులుగా ఉన్నవి కాబట్టి ప్రతిదానిని దేవుని వాక్యము చేత అంచనా వేయవలెను. దానిని ఎవరు చెప్పుచున్నారు, దాన్ని బలపరచుకొనుటకు ఏ హేతువులను ఆధారము చేసుకొంటున్నారు అనేది ముఖ్యము కాదు. అది

సత్యమునకు నకిలీగా చెప్పబడినాదా లేదా అని పరీక్షించుట వలన గమనించవలెను. ఎందుకనగా అది చాల మోసపూరితమైనది, ఏదైనా బోధ సత్యమునకు కొంచెము పోలిక కలిగియుంటే సరిపోదు కాబట్టి అది తప్పక ఖండించబడాలి.

**పౌలు సలహా**

తప్పుడుబోధ ఎన్నో రీతులుగా ఉంది కాని ఒక్క విషయములో అది సాదారణంగా ఉంటుంది అదేమనగా దేవుని వాక్యములోని పూర్తి సత్యముచేత అది మద్దతు చేయబడదు.

ఈ గ్రంథమందున్న ప్రవచనవాక్యములనువిను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథ మందున్న వాక్యము లలో ఏదైనను తీసివేసినయెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోనువానికి పాలులేకుండా చేయును. (ప్రక 22: 18-19)

పైన పేర్కొనబడిన ఏ తప్పుడు బోధకైనా మీరు బహిర్గత మయ్యారా? గతకాలములో మీరు దేనిచేతనైన మోసగించబడినారా? దానినుండి మీరు ఎలా విడిపించబడినారు? ఈ తప్పుల చేత నీ సంఘములోని ప్రజలు వక్రమార్గము వైపునకు వెళ్ళకుండ ఎలా కాపాడు చున్నావు?

**7. తప్పుడు బోధల పర్యవసానలు (1:10-16)**

చదువుము: తీతు 1: 10-16

నేటి దినముల యందుగల నకిలీ బోధలను గూర్చి మనము మాట్లాడుకొని యున్నాము. అవి చూచుటకు సత్యమునకు దగ్గరగా

ఉన్నట్లు కనబడువచ్చును కాని అందులో చాల తప్పులుంటాయి. మరియు అవి చాల ప్రమాదకరమైనవి, ఆధ్యాత్మికమైన అనారోగ్యతను కలుగచేస్తాయి. వాటి వలన చాల భయంకరమైన పర్యవసానములు జరుగుతాయి. సత్యము దేవుని నుండి మరియు ప్రత్యక్ష పరచబడిన దేవుని వాక్యము నుండి వస్తుంది. ఏదైతే దేవుని వాక్యముచేత పూర్తిగా ఆమోదించబడదో అది మనుష్యుల నుండి కలిగినది తప్ప దేవునినుండి కలిగినది కాదు. క్రైస్తవుల బాధ్యత స్పష్టమై యున్నది అదే మనగా దేవుని వాక్యమును పరిశోధించుట ద్వార మనము దేవుని సత్యమును నేర్చుకొనవలెను. మనము జాగ్రత్తగా ప్రతివాక్యమును విఫలము చెందని దేవుని ప్రమాణము ప్రకారము అంచనా వేయవలెను. ఈ పరీక్ష యందు సరియైనదిగా కనబడేది హితబోధగా మరియు ఈ పరీక్ష యందు విఫలము చెందునది తప్పుడుబోధ అని నిర్ధారించవలెను తప్పుడు సిద్ధాంతము సత్యమునకు కొన్ని తప్పిదములను కలుపుతుంది కాని హితబోధ సత్యము నుండి తప్పిదములను చూపిస్తుంది. దేవుని వాక్యమును అధ్యయనము చేయుట ద్వార, నేర్చుకొనుట ద్వార తప్పిదము నుండి సత్యమును వివేచించగలము (హెబ్రీ 5:12-14). మనముదేవుని సత్యమును మాత్రమే పట్టుకొని యుండవలెను. ఎప్పుడైతే మనము తప్పిదమునకు అనుమతిస్తామో అది కొంచెమై నప్పటికి, ఇంకా ఎక్కువగా దానిని అనుసరించుటకు ద్వారాలు తెరువబడును.

తప్పుడు సిద్ధాంతము పరిశుద్ధ యందు మనలను ఎదుగకుండా చేస్తుంది అయితే హితబోధ దైవభక్తిలోనికి నడిపిస్తుంది. తప్పిదమైనది ఏదో అది నీతిని ఆపివేస్తుంది ఎందుకనగా అది విభిన్నమైన వాటిని మరియు క్రొత్త సంగతులను నేర్చుకొనుట పైననే దృష్టి పెడుతుంది తప్ప అవి సత్యమైనవా మరియు దైవభక్తిగలవా అను వాటిని పట్టించుకొనదు (1 తిమో 1: 3-6).

తప్పుడు సిద్ధాంతము పాపములోనికి నడిపిస్తుంది కాని బైబిలు సిద్ధాంతము పాపమును ఆపుతుంది. తప్పుడు సిద్ధాంతము పాపమును మనలోనికి అనుమతించి, మన మనసులోని, హృదయములోని మూలములను రేకెతించి, మన జీవితమును పాపములోనికి నడిపిస్తుంది. హితబోధ మనలోని పాపమును ఎదిరించి మరియు మనలను పశ్చాత్తాప పడుటకు ప్రేరేపిస్తుంది (2 తిమో 3: 16-17). నిజమైన సిద్ధాంతము లేఖనములయండలి విషయములతో నిండి ఉంటుంది, బోధిస్తుంది, హెచ్చరిస్తుంది, తప్పుదిద్దుతుంది, శిక్షణ నిస్తుంది, పురికొల్పుతుంది మరియు  నీతిలోనికి నడిపిస్తుంది.

తప్పుడు సిద్ధాంతము తప్పులను బోధించే నాయకుల మీద దృష్టి పెడుతుంది. అయితే హితబోధ  ఎవరు నిజమైన దైవజనులో వారిని చూపిస్తుంది. సంఘ నాయకులు తప్పక సత్యమైన బోధను ఎరిగియుండి తప్పుడుబోధను ఖండించవలెను (తీతు 1:9). కొన్నిసార్లు ఒక వ్యక్తి సత్యమంతటిని బోధించకపోతే, కొంత సత్యమును మాత్రమే బోధిస్తే అతడు కాపరిగా లేదా నాయకుడిగా ఉండలేడు.

తప్పుడు సిద్ధాంతము ఇంకా ఎక్కువ తప్పులు ప్రవేశించునట్లు ద్వారములను తెరుస్తుంది అయితే సత్యమైనబోధ తప్పిదమునకు వ్యతిరేకముగా నిలిచి దానినుండి ప్రజలను కాపాడుతుంది. ఏదైతే పూర్తిగా సత్యబోధ కాదో అది సంఘమును బలహీనపరచి, ప్రజలలో విభజనను కలిగించి, తప్పుడుబోధ మరెక్కువగా వ్యాప్తిచెందుటకు ద్వారము తెరువబడుటకు అనుమతిస్తుంది. క్రేతు సంఘమునందు ఇదే సంభవించినది (తీతు 1: 9-10, 16).

తప్పుడు సిద్ధాంతము దేవుని ఆశీర్వాదములను తొలగిస్తుంది కాని హితబోధ మరెక్కువ ఆశీర్వాదములను కలిగిస్తుంది. ప్రకటన గ్రంథము నందు ఈ వాగ్దానములు ఇవ్వబడినవి (ప్రక 1:3; 22:7). దేవుని సత్యమును ఎవరు పట్టుకొనరో వారికి బలమైన హెచ్చరిక

ఇవ్వబడినది (ప్రక 2: 14–16, 20–23). దేవుని వాక్యమును ఎవరు ఘనపరుస్తారో వారిని దేవుడు దీవిస్తాడు మరియు దానిని ఎవరు దుర్వినియోగం చేస్తారో వారిని దేవుడు శపిస్తాడు.

తప్పుడు సిద్ధాంతము సంఘమును బలహీన పరుస్తుంది అయితే సత్యబోధ సిద్ధాంతము సంఘము శ్రమలను ఎదుర్కొనునప్పుడు వాటిని ఎదుర్కొనుటకు వారిని సంసిద్ధులనుగా చేస్తుంది. దేవుని వాక్యమును నేర్చుకొనుట ఎంతో ఆవశ్యకము (2 తిమో 4:2), సంఘములు సత్యము నుండి తొలగిపోవు కాలము వస్తుంది (2 తిమో 4: 3–4). కాబట్టి నీకు అప్పగింపబడినదానిని కాపాడుము అని పౌలు తిమోతికి తెలియజేసినాడు (1 తిమో 6:20, 2 తిమో 1:1 4). కాని తిమోతి దీనిని కాపాడటము మాత్రమే చేస్తే సరిపోదు. అతడు తన తరువాత తరములోని సామర్థ్యము గల నాయకులను ఏర్పరచి, వారికి ఈ వాక్యమును అప్పగించవలెను, వారు వారి తరువాత తరమువారికి బోధించునట్లు దానిని వారికి అప్పగింపవలెను (2 తిమో 2:2).

ముగింపు నందు పౌలు పేర్కొన్న ప్రకారముగా తప్పుడు బోధ చాల ప్రమాదకరమైనది ఎందుకనగా అది దానిలోని తప్పిదములకు సత్యమును కూడా జోడిస్తుంది, మనలను పరిశుద్ధులుగా ఎదుగకుండా ఆపివేస్తుంది, పాపములోనికి నడిపిస్తుంది తప్పుడు బోధకులమీద దృష్టి నిలుపునట్లు చేస్తుంది. ఇంకా మరి ఎక్కువ తప్పులు చేయుటకు ద్వారములను తెరుస్తుంది, దేవుని ఆశీర్వాదములను తొలగించి మరియు క్రైస్తవులను మరియు సంఘమును బలహీన పరుస్తుంది. మరొక వైపుగా హితబోధ సత్యము ద్వార తప్పిదములను చూపిస్తుంది, దైవభక్తిలోనికి నడిపిస్తుంది, పాపమును నిలిపివేస్తుంది, ఎవరు నిజమైన దైవజనులని చూపిస్తుంది, తప్పిదము నుండి ప్రజలనుకాపాడుతుంది. సంఘమును దేవుని

దీవెనలతో నింపి శ్రమ కాలము నందు దృఢముగా నిలిచి ఉండునట్లు సంసిద్ధులను చేస్తుంది.

తప్పుడు బోధను అంత సులభమైనదిగా తీసికొనుటకు వీలులేదు. ఇది సాతాను తన కుయుక్తితో జరిగించే అతి ప్రమాద కరమైన మరియు మోసకరమైన కార్యము. ఇది తప్పక ఎదిరించబడాలి మరియు ఎంత వీలైతే అంత త్వరగా దానిని నిలిపివేయాలి.

## పౌలు సలహా

ప్రతి విధమైన తప్పుడు బోధ విషయములో ప్రజలను అప్రమత్తము చేయాలి, మరియు దానిని తొలగించాలి.

వాక్యము ప్రకటించుము సమయమందును అసమయ మందును ప్రయసపడుము సంపుర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధిచెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద  చెవులు గలవారై తమ స్వకీయ దురశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని, సత్యమునకు చెవి నియ్యక కల్పనాకథలవైపునకు తిరుగుకాలము వచ్చును.(2 తిమో 4:2-4)

నీవు సత్యము నుండి తప్పుడు బోధను వివేచించే సామర్థ్యము కలిగియున్నావా? ఎవరికి సహాయము మరియు సలహా ఇవ్వటానికి వెళ్ళగలవు?
ఎవరైనా ఏదైనా తప్పును బోధించునప్పుడు దానిని ఎదుర్కొనుటకు ఎప్పుడు కష్టమైనదిగా ఉంటుంది?

## 8. తప్పుడు బోధలను ఎలా గుర్తించాలి (1:10-16)

చదువుము: తీతుకు 1: 10-16

తప్పుడు బోధను మరియు తప్పుడు బోధకులను గూర్చి మనము నేర్చుకొని యున్నాము. పౌలు మనలను 1 & 2 తిమోతి మరియు తీతుకు యందలి విషయములలోనికి మనలను తిరిగి తీసుకొనివెళ్ళినాడు. ఇది ఆ రోజులలో మరియు ఈ రోజులలో కూడా ఒక పెద్ద సమస్యగా ఉన్నది. దేవుడు నిత్యము మూడు విధములుగా ఉనికి కలిగియుండి ప్రదర్శింపబడినాడు కాని ముగ్గురు వ్యక్తులుగా కాదు అని టి. డి. జాక్స్ చెప్పాడు. దేవుడు భవిష్యత్తులోని కొన్ని విషయములను గూర్చి మాత్రమే ఎరిగి యున్నాడు, కాని మరికొన్ని ఇతర సంఘటనలు ఆయన జ్ఞానము యొక్క పరిధిలో లేవు అని గ్రెగ్ బోయ్డ్ అభిప్రాయపడినాడు. మనము దేవుని పోలికలో సృష్టించ బడినాము కాబట్టి మనము చిన్న దేవుళ్ళము అని క్రేఫ్లె డాలర్ అంటాడు. జోసెఫ్ స్మిత్ నకు దేవుడు క్రొత్త లేఖనములను బయల్పరచి నాడు కాబట్టి బైబిలులోనిఇతర విషయములను అవి భర్తీ చేస్తాయని మొర్మో నిజము చెపుతుంది. మనము విశ్వాసము ద్వార నీతిమంతుల ముగా తీర్చబడినాము కాని విశ్వాసము ద్వార మాత్రమే కాదు అని రోమన్ కాథోలిసిజం పేర్కొంటుంది. ఈ విధముగా సత్యమునకు నకిలీగా ఎన్నో క్రొత్త సిద్ధాంతములు వస్తున్నాయి. కాబట్టి "ప్రతి ఆత్మను పరీక్షించుడి" (1యోహా 4:1) అని యోహాను తెలియ జేస్తున్నాడు. "సమస్తమును పరీక్షించుడి" (1 థెస్స 5:21) అని పౌలు చెపుతున్నాడు. కాపరులుగామరియు నాయకులుగా ప్రతిదానిని పరీక్షించి మన ప్రజలకు సత్యమును బోధించవలసిన బాధ్యతను మన పైన ఉంచబడి ఉన్నది. కాని తప్పుడు సిద్ధాంతమును హితబోధ నుండి ఎలా వేరుచేసి చూపించగలము? తప్పుడు బోధకులనుండి సత్య బోధకులను ఎలా వేరుచేసి చూపించగలము?

## 8. 1 మూలములను పరీక్షించుట.

హితబోధ దేవుని వాక్యము నుండి కలిగినది, తప్పుడు బోధ దేవుని సత్యమునకు మనుష్యులు తమ స్వంత భావములను కొన్నింటిని కలుపుట ద్వార వచ్చినది. ఇది చాల మోసపూరితమైనది ఎందుకనగా దీనిని బోధించేవారు చాల నమ్మకస్తులుగా మరియు భక్తిపరులుగా కనిపిస్తారు. కాని పూర్తిగా లేఖనములో ఉన్నట్లుగా స్పష్టముగా బోధించనంత మట్టుకు అది తప్పుడు బోధగానే పరిగణించబడుతుంది. సత్యము కేవలము దేవుని నుండి కలుగుతుంది (యోహా 7: 16; గలతి 1: 11–12). నిజమైన సిద్ధాంతము దేవునిచేత ఉద్భవిస్తుంది (తీతుకు 1: 2).

మనిషిచేత ఉద్భవించిన సిద్ధాంతమును తిరస్కరించవలెనని పౌలు కొలస్సి సంఘమును హెచ్చరించినాడు (కొల 2: 22) ఎందు కనగా దీని వెనుక దయ్యము ప్రమేయము ఉంటుంది (1 తిమో 4: 1) దేవుడు సత్యమునకు తండ్రి, సాతాను అబద్ధమునకు జనకుడు (యోహా 8: 44) ఈ విధముగా పరీక్షించవలెను: "ఈ బోధ దేవునిచేత దేవుని వాక్యముచేత ఉద్భవించినదా లేదా దానికి ఎవరైనా కొంత చేర్చినారా"? ఇది కొన్నిసార్లు చెప్పుట సులభమే కాని ఇది కొంత కష్టముగా ఉంటుంది, అలాంటి సమయములో ఈ రెండవ పరీక్షను ఉపయోగించవలెను.

## 8. 2 అధికారికత యొక్క పరీక్ష.

సత్యము స్పష్టముగా స్థాపించబడినది మరియు దేవుని వాక్యము చేత మద్దతు తెల్పబడుతుంది, కాని తప్పుడు సిద్ధాంతము బైబిలు మూలముల నుండి కాక ఇతర రీతిగా ఏర్పడుతుంది.

ఇది బహుశ ఒక బలమైన నాయకుని ద్వారాకాని, ఒక ప్రసిద్ధిచెందిన బైబిలు బోధకుని ద్వారానైనను ఏర్పడి ఉండవచ్చును. దీనికి తోడుగా ఒక మానవ హేతువు, సహేతుకమైన వివరణ ఉపయోగించుట ద్వార బలపరచబడుతుంది. బహుశ అది ఒక వ్యక్తి యొక్క అనుభవము ఆధారముగా ఏర్పడుతుంది. కొనిసార్లు బలమైన భావోద్రేకముల నుండి ఏర్పడుతుంది, అది కేవలము సరియైనదని వారు ఉహించినారు కాబట్టి అది సత్యమైనదని చెప్పినారు. కాబట్టి మనము బెరయలో యున్న ప్రజలవలె యుండవలెను "వారు దేవుని వాక్యమును ఆసక్తితో అంగీకరించి, ఆ సంగతులు ఆలాగున్నవో లేవో అని తెలుసుకొనుటకు లేఖనములు పరిశోదించుచు వచ్చిరి". (అపొ 17: 11). ప్రతి సిద్దాంతము దేవుని వాక్యముతో సరిపోల్చబడాలని వారు గ్రహించినారు అదేవిధముగా పౌలు థెస్సలోనికలోని విశ్వాసులు తన బోధను శ్రద్ధతో అంచనా వేయుటను మరియు అంగీకరించుటను అభినందించినాడు. ఎందుకనగా థెస్సలోనిక విశ్వాసులు వాక్యము దైవావేశమువలన కలిగినదని గుర్తించినారు (1 థెస్స 2:13). హితబోధ సిద్దాంతము దేవుని మనస్సులో ఉద్భవించినది మరియు ఆయన అధికారిక స్వయం ప్రత్యక్షతయైన బైబిలునందు వ్రాయబడినది.

పైన పెర్కొనబడిన రెండు విభిన్న బోధలు బైబిలు నందు బోధించబడినవని మేము నమ్ముచున్నాము అని పేర్కొంటున్నప్పుడు మనము ఏది వాస్తవమైనదని ఎలా తెలుసుకోవాలి? ఆలాంటి సమయములో మనము ఈ క్రింది మూడవ పరీక్షను అన్వయించ వలెను.

**8. 3 నిరంతము మార్పులేని స్థితికి సంబందించిన పరీక్ష**

దేవుని సత్యము అంతయు లేఖనములకు అనుగుణముగా ఉంటుంది అంతే తప్ప వాటిలోని కొన్ని ప్రశ్నార్ధకమైన పాఠ్య

భాగములతో మాత్రమే పరిమితము కాదు. లేఖనము నిరంతము మార్పు లేనిదిగా ఉంటుంది మరియు నిర్థిష్టముగా ఉంటుంది తప్ప దానికి అదేవ్యతిరిక్తముగా ఉండదు. హితబోధ యందు మార్పులేని మరియు అందరు ఎరిగిన సిద్ధాంతములుంటాయి, తప్పుడుబోధ యందు ఇంతవరకు పరిచయములేని, వింతైన, అసాధారణమైన సిద్ధాంతములుంటాయి. హెబ్రీ గ్రంధకర్త తన శ్రోతలను నానా విధమైన అన్యబోధల చేత త్రిప్పబడకుడి అని హెచ్చరించినాడు. మరియు సత్యమునకు భిన్నమైనవి  అంగీకరించవద్దని పౌలు తిమోతికి ఆజ్ఞాపించినాడు (హెబ్రీ 13:9  1 తిమో 1:3, 6:3).  ఈ రెండు భాగముల యందు సిద్ధాంతమును స్థిరపరుచుటకు ఎల్లప్పుడు అది తప్పక లేఖములతో సరిపోల్చబడవలెను మరియు సత్యసభ లేదా దేవుని సంఘము చేత అంగీకరించబడవలెనని నొక్కి చెప్పబడినది . ఎవరైతే సత్యసభ లేదా హితబోధను గూర్చిన జ్ఞానము లేదా సరియైన అవగాహన కలిగియున్నారో వారు తప్పుడు బోధను వెంటనే గుర్తించి దానిని ఖండించే స్థానములో ఉన్నారు.

ఒక విషయమును గూర్చి బైబిలు నందు ఒక చోట ఏమి బోధిస్తుందో అదే విషయమును గూర్చి మరొక చోట దానికి వ్యతి రిక్తముగా చెప్పబడదు. కాబట్టి ప్రతి నిజమైన సిద్ధాంతము ఎలాంటి మార్పు లేకుండా అన్ని లేఖనములకు అనుగుణముగా ఉంటుంది. సిద్ధాంతము ఎప్పటికి విడిగా చూపించబడదు, కాని ఎల్లప్పుడూ బైబిలు అంతటి వెలుగులో పరిశీలించబడి సరియైన విధముగా అవగాహన చేయబడుతుంది. మనము ఎల్లప్పుడూ లేఖనము లేఖనమునకు వివరణ ఇచ్చుకొనుటకు లేదా వ్యాఖ్యానించుటకు అవకాశము ఇవ్వవలెను. చాలమంది తప్పుడుబోధకులు విడిగా ఒక వచనమును లేదా ఒక ఆలోచనను ప్రతిపాదించినపుడు, దానిని బైబిలులోని అన్ని పుస్తకముల కోణములో నుండి పరిశీలించి చూచినపుడు వారు తమ

వాదనయందు తట్టుకొని నిలువబడలేకపోతారు.

ఒకసారి మనము సిద్ధాంతమును ఈ పైన పేర్కొనబడిన మూడు పరీక్షల ప్రమాణముల ద్వార పరిశీలించి, అవి సత్యమైనవని గుర్తించిన తరువాత, అవి ఎంతవరకు మన జీవితముల పైన మరియు మనచుట్టూ ఉన్న వ్యక్తుల జీవితములపైన ఎంతవరకు మంచి ప్రభావమును కలిగిస్తున్నాయని కూడా చూడవలెను. అయితే దీనిని గుర్తించుటకు ఈ క్రింది నాలుగవ పరీక్షను అన్వయించవలెను.

## 8. 4 ఆధ్యాత్మిక ఎదుగుదల మరియు దైవభక్తితో కూడిన జీవితమును గూర్చిన పరీక్ష

హితబోధ సిద్ధాంతము ఆధ్యాత్మిక ఎదుగుదలను కలిగిస్తుంది (1 తిమోతి 4:6). దీనికి తిమోతి ఉదాహరణగా ఉన్నాడు (1తిమో 6: 11; 2 తిమో 1: 5). హితబోధ ఆధ్యాత్మిక ఆరోగ్యము, పరిపక్వత, మరియు జ్ఞానముతో కూడిన క్రైస్తవులను తయారుచేస్తుంది. తప్పుడు బోధ ఆధ్యాత్మిక అనారోగ్యత, అపరిపక్వత, మరియు అజ్ఞానముతో కూడిన క్రైస్తవులను తయారుచేస్తుంది, అయితే వీరు ఎంతమాత్రము క్రైస్తవులుగా పిలువబడరు. మనము దేనిని నమ్ముతున్నమో అది మన క్రియలలో ప్రదర్శింపబడుతుంది. సత్యము పరిశుద్ధ జీవితమును చూపిస్తుంది, తప్పిదము గర్వము, విభజన, ప్రత్యేకముగా ఉండుటకు, స్వనీతిని, మరియు దేవుని వాక్యము అంతటికి అవిధేయత చూపుటకు నడిపిస్తుంది. వారి దృష్టి అంతా యేసు మీద కాక తప్పుడు బోధపైన మరియు తప్పుడు బోధకుల పైన ఉంటుంది.

ఒక బోధ దేవుని వాక్యమును ఆధారము చేసుకొన్నట్లయితే అది సత్యమైనదై ఉంటుంది. అది దేవుని నుండి వస్తుంది. అన్ని లేఖనములలో  ఉన్నట్లు నిలకడగా ఉంటుంది, దాని ఫలితముగా పరిశుద్ధత, నీతితోకూడిన జీవితము మరియు ఆధ్యాత్మికముగా

ఎదుగుదల ఉంటుంది. దానికి వేరైనది ఏదైన ఉంటే విషమును తిరస్కరించినట్లే దానిని తిరస్కరించుము.

నేను వచ్చు వరకు మీకు కలిగియున్నదానిని గట్టిగా పట్టుకొనుడి అని తుయతైర సంఘమును యేసు హెచ్చరించినాడు (ప్రక 2:25). ఒక సంఘ నాయకుడు తప్పక సత్యమందు నమ్మకముగా ఉండి, తప్పిదములో ఉన్న వారిని ఖండించవలెనని పౌలు తెలియపరిచినాడు (తీతు 1:9). మనము కూడా అదే విధముగా చేయవలెను (1 కొరింథీ 5:9).

### పౌలు సలహా

తప్పుడుబోధ నుండి హితబోధ భేధమును గ్రహించుట నేర్చుకొనవలెను.

తీతు 2:1 నీవు హితబోధకనుకూలమైన సంగతులను బోధించుము. పైన పేర్కొనబడిన నాలుగు పరీక్షలకు సంబంధించిన విషయములను అర్ధము చేసుకొన్నావా? నీకు అవి సుపరిచితము కావటానికి  అవసరమైనప్పుడు వాటిని తరచుగా అన్వయించుము. ఒకవేళ నీ చుట్టూ ఈలాంటి బోధ జరుగుచున్నట్లయితే వెంటనే ఈ పరీక్షలను ఉపయోగించుము.

## 9. పురుషుల యొక్క ప్రవర్తన (2:1-2)

చదువుము: తీతు 2: 1-2

పౌలు తీతుకు తన పత్రిక వ్రాసినపుడు క్రైస్తవ సిద్ధాంతములను గూర్చిగాని విశ్వాసములను గూర్చి వ్రాయక పోవుట చాల ఆసక్తికరమైన విషయము. తిమోతికి బోధించినట్లు దేవ శాస్త్రమును గూర్చిగాని, సంఘ క్రమమును గూర్చిగాని తీతునకు వ్రాయలేదు.

తీతుకు పత్రిక యందు అనుదిన జీవితములో విశ్వాసుల నడవడిక, మరియు ప్రవర్తనకు సంబంధించిన విషయములను వివరించుటలో పౌలు దృష్టి ఉంచి యున్నాడు. చాలాసార్లు బైబిలు సత్యమును మనము ఆశించిన ప్రకారము మాట్లాడుటకు ప్రయత్నిస్తారు కాని అది అంతగా మనమీద ప్రభావమును చూపదు. పౌలు మొదట దైవభక్తిగల నాయకుడు ఎలా తప్పక జీవించాలో వ్రాసినాడు (తీతు 1: 1-9), తరువాత తప్పుడు బోధకులు ఎలా జీవిస్తున్నారో వ్రాసినాడు (తీతు 1: 10-16). యేసును గుర్చిన సత్యము మంచి జీవితాలు జీవించునట్లు మార్పు తెస్తుంది, తప్పుడుబోధ యందు ఇమిడియున్న అబద్ధ మరియు మోసపూరితమైన విషయములు మనుష్యులలో అపవిత్రతను మరియు లోభత్వమును కలిగిస్తాయి. మనము ఏమి నమ్ముతున్నాము అనునది చాల ప్రాముఖ్యము కాని దానిని ఎలా ఆచరణలో ఉంచుతున్నాము అనునది ఇంకా ఎక్కువ ప్రాముఖ్యము.

ఆ తరువాత సంఘనాయకులు ఎలా జీవించాలో పౌలు వ్రాసినాడు. క్రేతులో ఉన్న గృహ సంఘముల యందలి నాయకులు ఎలా జీవించాలో పౌలు మాట్లాడుతున్నాడు. ప్రజలు దైవభక్తిగల జీవితము ఎలా జీవించాలో తెలియజేసే బాధ్యత తీతుపై యుంచ బడినది. ఈ పత్రిక యందు పౌలు సంఘములోని ప్రజలను వివిధ వర్గములుగా విభజించినాడు. పురుషులు, స్త్రీలు, వృద్ధులు మరియు యౌవనస్తులు. సంఘములో ప్రతి ఒక్కరు వేరువేరు పాత్రలను పోషించుచున్నప్పటికి అందరు క్రీస్తునందు ఒక్క శరీరముగా ఉండి తప్పక కలసి పనిచేయవలెను.

పౌలు ఈ భాగమును "నీను హితబోధకనుకూలమైన సంగతులను బోధించుము" అను ఒక సాధారణమైన ఆజ్ఞతో ప్రాంభించినాడు (తీతు 2:1). అబద్ధము లేదా అసత్యము నుండి కాపాడబడుటకు సత్యము ఆత్మరక్షణ కొరకు ఉపయోగించే

సరియైన సాధనమైయున్నది. యూదుల యొక్క చట్టబద్ధతకు సంబందించిన బోధ గందరగోళము సృష్టించి, సంఘక్రమమును తారుమారు చేస్తుందని హెచ్చరించినాడు. కాబట్టి సత్యము బోధించుట ద్వారా మాత్రమే లోపములు సరిచేయబడుతాయి. ప్రజలు ఎప్పుడైతే దేవుని వాక్యము ఎరిగియుంటారో అక్కడ అబద్ధము మొలవటానికి ఎటువంటి సారవంతమైన నేల ఉండదు. ఎప్పుడైతే ప్రజలు సత్యమును ఎరిగి దానిని అనుసరిస్తారో అది వారి జీవితాల మీద ప్రభావము చూపుతుంది. తీతుకు 2:1-10 భాగమునందు ఇది వివరించబడినది.

వృద్దులు, చాలా పరిపక్వత చెందిన పురుషులు ఆరు రకములైన ఆధ్యాత్మిక ఎదుగుదలకు సంబంధించిన గుర్తులను ప్రదర్శించవలెను. మొదటిది, మితనుభావము కలిగియుండుట. మితనుభవము అనగా అన్ని విషయములయందు సమతుల్యత కలిగియుండుట, స్పష్టమైన ఆలోచన చేయగలుగుట, అప్రమత్తత కలిగి యుండుట, అన్నివిషయములలో ఒక హద్దుకు లోబడియుండుట. రెండవది, మాన్యులునై యుండుట . మాన్యులుగా యుండుట అనగా తీవ్రమైన మనస్తత్వం, గంభీరమైన ఆలోచన విధానము. మూడవది, స్వస్థబుద్ధి కలిగియుండుట, అనగా  హఠాత్తుగా ముందుకు వెళ్ళకుండా ఉండుట, స్వయం నియంత్రణ కలిగియుండుట. నాల్గొవది, విశ్వస మందు లోపము లేకుండుట, అనగా దేవుని యందు మరియు దేవుని వాక్యమందును  నమ్మకము కలిగి యుండుట. ఐదవది,  ప్రేమ యందు లోపములేకుండుట , అనగా ఇతరుల పట్ల ప్రేమతో మెలగుట ఆరవది, సహనమునందు లోపములేకుండుట, అనగా పట్టుదల కలిగి యుండుట, దీర్ఘశాంతము కలిగి యుండుట మరియు నమ్మకత్వము కలిగియుండుట.

ఇవి మనుష్యులు రూపాంతరము చెందునట్లు అతనిలో దేవుని శక్తిని కలిగిస్తాయి. కేవలము దేవుని ఆత్మ మాత్రమే ఈ లక్షణములను

ఉత్పత్తి చేస్తాడు. దీనికి భిన్నముగా యేసు తమ జీవితాలలో లేకుంటే మనుష్యులు కేవలము ఇతరులను నియంత్రించి, బలవంతముగా లోపరచుకొనుటకు ప్రయత్నిస్తారు. యెజెబెలు ఈ కోవకుచెందిన వ్యక్తి. ఇతరులు కోపము చేత నియంత్రించబడువారిగా అవుతారు. మరియు ప్రజలను నియంత్రించుటకు తమలోని కోపమును ప్రదర్శిస్తారు. వారు చాల సమస్యాత్మకంగా మరియు స్నేహ రహితులుగా మారుతారు. కయీను ఈ కోవకు చెందినవాడే. యేసులేని వ్యక్తుల్లో ఉండే మరొక గుర్తు అహంకారము. ఈలాంటి ప్రజలు ఎల్లప్పుడు గర్వంగా ఉంటూ, వారిని గూర్చి వారు ఎల్లప్పుడూ బాగుంటామని ఇతరులే తప్పులు చేస్తారని తలంచుకొంటారు. వారు ఇతరులను ప్రత్యేకముగా బలహీనులను, పేదవారిని తక్కువచేసి చూస్తారు. హేరోదు ఈ కోవకు చెందిన వ్యక్తులలో ఒకడు. కొందరు ప్రతి విషయములో వ్యతిరేక భావముతో, విమర్శనాత్మక దృక్పథముతో ఉంటారు. వారు ఏ విషయములో అనుకూలమైన, నిస్సందేహమైన దృక్పథముతో ఏమి చెప్పకుండా, పరిస్థితులనైనప్పటికి వాటితో సంబంధము లేకుండా ఇతరులపై ఫిర్యాదు చేస్తుంటారు. యోబు స్నేహితులలో ఈలాంటి లక్షణములు కనబడుతాయి.

కేవలము క్రీస్తులో ఉన్నప్పుడే మనము క్రీస్తువలె మారుతాము. ఇదే మన జీవితాలలో మరియు మన ప్రజల జీవితాలలో దేవుని లక్ష్యము. మన ప్రజలు ఈ మార్గములో జీవించునట్లు వారికి బోధించి, శిక్షణనిచ్చు బాధ్యత మనము కలిగియున్నాము.

## పౌలు సలహా

మితానుభవము గలవారును, మాన్యులును, స్వస్థబుద్ధి గలవారును, విశ్వాస ప్రేమ సహనముల యందు లోపము లేనివారునై యుండవలెనని క్రైస్తవులకు బోధించుము.

సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సలమైన దుష్టత్వము మిరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయ గలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరికొకరు క్షమించుడి.(ఎఫెసీ 4: 31-32)

పౌలు పేర్కొన్న ఈ విషయములపట్ల నీవు వ్యక్తిగతముగా ఎలా ఉన్నావు? నీ ప్రజలు వారి జీవితాలలో ఈ లక్షణములను కలిగి యున్నారా? ఈ విషయముల యందు వారు ఎదుగుటకు నీవు ఎలా సహాయము చేయగలవు?

## 10. స్త్రీలు & యౌవనస్థుల యొక్క ప్రవర్తన (2:3-8)

చదువుము: తీతు 2:3-8

లేఖన సత్యమును ప్రజలు తమ జీవితాలకు అన్వయించుకొని, క్రీస్తువలే మారుటకు ప్రజలకు బోధించబడవలెను. ఇది ప్రజలను క్రీస్తుకు దగ్గరగా  నడిపించి వారి జీవితములలో సత్ క్రియలను కలిగినవారై,  దేవుని మహిమపరచునట్లు చేస్తుంది. వృద్ధులైన పురుషులు మితానుభవము గలవారును, మాన్యులును, స్వస్థ బుద్ధి గలవారును, విశ్వాస ప్రేమ సహనముల యందు లోపములేని వారునై యుండులాగున బోధించవలెనని పౌలు  తీతుకు తెలియపరచినాడు. పౌలు దీనిని స్త్రీలకు కూడా అన్వయించినాడు. వృద్ధస్త్రీలు మరియు ఆధ్యాత్మిక పరిపక్వత చెందినవారు కూడా దేవుని సత్యమును వారి జీవితములకు ఎలా అన్వయించుకొనవలెనో భోధించబడినది. వారు తప్పక వారి జీవితముల ద్వార మరియు ప్రవర్తన ద్వార యేసును చూపించవలెను (తీతు 2: 3-5). పౌలు చెప్పినట్లుగా "వారు ప్రవర్తనలయందు భయభక్తులుగలవారై యుండవలెను", అనగా వారు పరిశుద్ధ జీవితము మరియు దైవభక్తిగల జీవితము కలిగినవారై

యుండవలెను. దీని అర్ధము వారు కొండెములు చెప్పువారై, ఇతరుల మీద పుకార్లు సృష్టించి, విమర్శించు వారుగా ఉండకూడదు. కొందరు ప్రజలు ఇతరుల జీవితాలను గూర్చి ముందుగా ఊహించుకొని, వారిని అన్నివిషయములలో తీర్పు తీర్చుతారు. దురదృష్టవశాత్తూ వారు ఇతరులపట్ల ఎంతమాత్రము కనికరమును చూపించరు. ఈ ప్రతికూల దృక్పథము వారి హృదయములను తీవ్రమైన కృరత్వముతో నింపుతుంది. పరిసయ్యులు ఈ విధానములోనే యేసు పట్ల ప్రవర్తించినారు.

పరిపక్వత చెందిన స్త్రీలు కలిగియుండవలసిన మరొక లక్షణము, వారు మిగుల మద్యపానాసక్తులునై యుండకూడదు. ఇది ప్రజలలో చెడు సాక్ష్యం కలిగించి, ఆరోగ్యమును పాడుచేస్తుంది. మధ్యపానమును గూర్చి, దాని వలన కలిగే దుష్ప్రభావములను గూర్చి సామెతల గ్రంధము నందు చెప్పబడినది (సామె 21: 17; 23: 20-21, 31; 31: 4,6). అయితే ఈరోజులలో చాల రకములైన ఇతర మత్తు పదార్ధములు తీసుకొనుట ద్వార ప్రజలు వ్యసనపరులౌతున్నారు. కాఫీలో కెఫిన్ కలుపుకొనుట ద్వార, సోడా మరియు చాక్లెట్ మొదలగునవి ఎక్కువ మోతాదులో తీసికొనుట ద్వార వాటికి బానిసలుగా మారుతున్నారు. మితిమీరి మద్యపానము తీసుకొనుట ఎలా ప్రమాదకరమో లోతు యొక్క సంఘటన స్పష్టమైన ఉదాహరణగా ఉన్నది (ఆది 19: 30-38).

కొండెగాడ్రను మరియు మద్యపానాసక్తులుగానుండక, దైవభక్తిగల స్త్రీలు మంచి ఉపదేశముచేయువారునై యుండవలెను (తీతు 2:3) ఇతర స్త్రీలకు ఏవి సహాయకరముగా ఉంటాయో వాటిని వీరు బోధించవలెను. పరిపక్వత చెందిన స్త్రీలు తప్పక వారి పిల్లలు ఎదుగుచున్నప్పుడు వారికి సలహాదారులుగా ఉంటూ, ఒక భార్యగా,

తల్లిగా తరువాత రోజులలో తన పాత్రను ఎలా పోషించవలేనో వారికి మార్గదర్శకములను ఇవ్వవలెను. యౌనవ స్త్రీలు స్వయం నియంత్రణ కలిగి ఎలా ఎదుగవలేనో బోధించవలెను. యౌనవ స్త్రీల యందు ఉండవలసిన ప్రాముఖ్యమైన లక్షణము పరిశుద్దత, అనగా క్రియల యందును మరియు తలంపులయందును పవిత్రత కలిగి యుండాలి, క్రేతు పట్టణము యందలి స్త్రీలకు అనైతికముగా జీవించుట సాధారణ మైన విషయము.

"ఇంటిలో పనిలో నిమగ్నులై ఉండవలెను" అనగా ఇల్లు మరియు కుటుంబము వారికి అత్యంత ప్రాధాన్యమైనవిగా ఉండవలెను ప్రస్తుతము ఒక స్థలమునుండి మరొక స్థలమునకు వెళ్లి కబుర్లు చెప్పుట మరియు మద్యము త్రాగుట చేయుచున్నారు కాబట్టి వాటిని మానివేసి తమ కుటుంబ సంబంధమైన విషయముపై దృష్టి పెట్టవలెను "దయ" కలిగి ఉండుట వారు కలిగి ఉండవలసిన మరొక లక్షణమ. అనగా కఠినముగా వ్యవహరించక లేదా ఎవరిని కష్టపెట్టకుండుట. మరియు "వారి భర్తలకు లోబడి ఉండవలెను" అనగా క్రూరముగా ఉండక తమ ప్రవర్తన ద్వార ఇతరులఎదుట మంచి సాక్ష్యము గలవారై ఉండవలెను. పౌలు  తప్పక కలిగి ఉండాలని చెప్పిన లక్షణములు స్త్రీల వ్యక్తిగత జీవితమునకు మేలు కలిగించునవిగా మాత్రమే కాక ఇతరుల ఎదుట మంచి క్రైస్తవ సాక్ష్యము కలిగి ఉండుటలో దోహదపడుతాయి. కాబట్టి ఎవరు కూడా దేవుని వాక్యమునకు హాని కలిగించకూడదు. ఒకవేళ క్రేతు సంఘము యేసు మత్రమే ఇవ్వగలిగే శాంతి మరియు సంతోషమును ఇతరులు కనుగొనగలుగునట్లు సహాయపడవలెనంటే మరియు వారు  యేసు వైపునకు  ఆకర్షించబడాలంటే తమ అనుదిన జీవితములో ఈ లక్షణములను చూపించవలసిన అవసరత ఉన్నది.

యౌవన స్త్రీలు చేయవలసిన పైనున్న విషయములన్నియు యౌవన పురుషులు కూడా యేసు కొరకు వారి జీవితములో మంచి

సాక్ష్యమును కలిగి ఉండుటకు చేయవలెను (తీతు 2:6). యౌవన పురుషులకు పౌలు నొక్కి చెప్పు లక్షణము "స్వయం నియంత్రణ". ఈ పాఠ్య భాగమునందు స్వయం నియంత్రణ అను గ్రీకు పదము నాలుగు సార్లు వాడబడినది (2, 4, 5, 6వ). క్రైస్తవులందరిలో అనగా అన్ని వయస్సులకు చెందిన వారిలో కూడా స్వీయ నిగ్రహము కలిగి ఉండవలసిన ప్రాముఖ్యతను తెలియజేయుటను ఇందులో సూచించ బడినవి. చాలా పర్యాయములు యౌవనస్తులు ఇతరులకు బాధ కలిగించే విధముగా ప్రవర్తిస్తారు. ఆయా సమయాలలో తమకు ఏది ఆనందముగా అనిపిస్తుందో దానిని హఠాత్తుగా చేస్తూ వారి కీర్తికి కూడా హాని కలుగ చేసుకొనుచున్నారు. దీనిని గూర్చి తీతు తన ప్రజలను హెచ్చరించవలెను. మరియు తనకు తాను స్వయం నియంత్రణలో ఉంటూ ఒక మాదిరిని వా రి ముందు ఉంచవలెను. (తీతు 1:7). చాలాసార్లు నాయకులముగా మనము చెప్పు వాటికంటే మనము చేయు వాటిని ప్రజలు దగ్గరగా దృష్టించి వాటిని నేర్చు కొంటారు. మనము చెప్పునవి మన క్రియలలో కనబడక పోయినట్లైతే మనలను వేషధారులుగా చూస్తారు మరియు మనము బోధించు వాటిపై దృష్టిని కేంద్రీకరించరు.

మనము కూడా తీతు వలె అందరికి ఒక మాదిరిని చూపిస్తే ప్రజలు మన నుండి నిజాయితీని, నిష్కపటమును మరియు ఆరోగ్య కరమైన సంభాషణను నేర్చుకొనగలరు. కావున దీనిని బట్టి క్రైస్తవులు మంచి సాక్ష్యమును కలిగి ఉంటారు మరియు అవిశ్వాసులు ఎంత మాత్రమూ యేసును హేళన చేయలేరు (తీతు 2:7-8).

**పౌలు సలహా**

క్రైస్తవ స్త్రీ పురుషులందరూ దైవభక్తి కలిగి జీవించుట ద్వారా యేసుకు మహిమ కలుగును.

ద్వితి 12: 32 నేను మీకాజ్ఞాపించుచున్న ప్రతి మాటను అనుసరించి చేయవలెను. దానిలో నీవు ఏమియు కలుపకూడదు దానిలోనుండి ఏమియు తీసివేయకూడదు. ఒకవేళ నీవు నూతన క్రైస్తవునికి యేసు కొరకు ఏ విధముగా జీవించవలెనో బోధించు నప్పుడు నీవిచ్చు సలహా ఏమి? ప్రాముఖ్యమైన మూడుప్రత్యేకమైన లక్షణములను జాబితాగా చూపుము.

## 11. దాసుల యొక్క ప్రవర్తన (2:9-10)

చదువుము: తీతు 2:9-10

వివిధ వయస్సుల స్త్రీ పురుషులు వారి దైనందిన జీవితము విశ్వాసులుగా జీవించవలసిన విషయములను గూర్చి పౌలు సూచనలను ఇచ్చుటలో ఆశ్చర్యమేమి లేదు కాని క్రైస్తవ బానిసలు వారి యజమానులకు లోబడి ఉండవలెనను విషయము మనకు ఆశ్చర్యము కలిగిస్తుంది (తీతు 2:9-10). క్రీ.శ మొదటి శతాబ్దము నందు బానిసత్వ వ్యవస్థ ఆచరణలో ఉండేది. కట్టుబానిస లేదా బానిస ఒక వస్తువుతో సమానముగా పరిగణించబడే వాడు అనగా మానవుని కంటే తక్కువగా చూడబడేవాడు. కాని దేవుడుకట్టుబానిసలను కూడా ఇతరులతో సమానముగా చూచేవాడు. తరచుగా ఆయన వాక్యము వారి పరిస్థితిని నేరుగా చూపిస్తుంది. కట్టుబాని సలను గూర్చి ఎఫెసీ పత్రిక 6వఅధ్యాయము నందు అనేకమైన విషయములు చెప్పబడినవి.

ఫిలేమోను పత్రిక అంతా కూడా కట్టుబానిస ఒనేసిమును గూర్చి చెప్పబడినది. ఈ విభాగము చివరిభాగములో కొన్ని వచనములలో కట్టుబానిసల యొక్క విధులను, యజమానులకర్తవ్యము మరియు బాధ్యతలను గూరి చర్చించబడినది. ఎందుకు? ఎందుకనగా పెద్దలు, పరిపక్వతచెందిన విశ్వాసులు, అదేవిధముగా యౌవనస్తులు పరిపక్వత చెందుతున్న విశ్వాసులు ఈ వర్గములో చేర్చబడుతారు.

పౌలు బానిసలు తమ యజమానులకు ఎదురు మాట చెప్పక, ఏమియు అపహరింపక, సంపూర్ణమైన మంచి నమ్మకమును కనుపరచుచు, యేసునకు నమ్మకమైన ఉదాహరణగా ఉండుడని జ్ఞాపకము చేయుచున్నాడు (తీతు 2:9-10). ఆదిమ సంఘములో చాలామంది క్రైస్తవులు బానిసలుగా ఉన్నారు. వీరిలో చాలామంది పేదవారు ఉన్నారు. తరచుగా ఎవరైతే పేదవారిగా ఉంటారో వారు మొట్టమొదట సువార్తకు స్పందిస్తారు. ప్రపంచమంతట కూడా నేటికి ఇది సత్యము. రక్షణ వారిని పాపమునుండి స్వతంత్రులనుగా చేస్తుంది కాని వారి యజమానులకు వారు చేయవలసిన బాధ్యతల నుండి కాదు బహుశ కొందరు తప్పుడు బోధకులు క్రైస్తవులైన తర్వాత వారు తమ యజమానులకు లోబడవలసిన అవసరము లేదని చెప్పి ఉండవచ్చు, ఎందుకనగా క్రీస్తులో అందరు సమానులే. ఒకవేళ ప్రతి క్రైస్తవ బానిస తమ యజమానులకు లోబడనవసరము లేదంటే సమాజములో జరుగే అంతరాయమును నీవు ఊహించగలవా? ప్రతి బానిస తను క్రైస్తవుడనని చెప్పుకొనిన యెడల దానినిబట్టి వారు తమ యజ మానులకు లోబడనవసరములేదు. బానిసత్వము అనునది ఖచ్చితంగా తప్పే మరియు అది నిర్మూలించబడాలి కాని అలా చేయుట ఆ పరిస్థితులలోసరియైనది కాదు, అది గందరగోళ వాతావరణమును మరియు క్రైస్తవులకు వ్యతిరేకమైన అల్లరిని సృష్టిస్తుంది. పాత నిబంధన లోని మోషే ధర్మశాస్త్రమునందు బాని సత్యమును గూర్చిన చట్టములు

సవరించబడి, బానిసల మానవత్వమునకు దుర్వినియోగము కలిగించు విషయములు సరిచేయుటతోనే పరిమితము చేయబడినది (నిర్గమ 20: 10 21: 20-27). ఇశ్రాయేలుసమాజములో బానిసలు, పూర్తిగా తన సహజ హక్కులను మరియు హుందాతనముతో కూడిన జీవితమును కలిగియుండునట్లు గుర్తించినారు (ద్వితి 5: 14; 31: యోబు 13-15). ఒక వ్యక్తి తన బానిసను లేదా సేవకుని దుర్విని యోగపరచినట్లయితే అది అవివేకముగాను మరియు అవినితిగాను పరిగణించబడుతుంది (ద్వితి 23: 15-16).

పౌలు బానిసత్వమును ఎందుకు ఖండించలేదో, నివారించ టానికి ఎందుకు ప్రయత్నించలేదో అను విషయము ఇప్పడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది (ఎఫె 6: 5). అయితే ఒకవిధముగా చుస్తే పౌలు దీన్ని చేసినాడు కానీ మనమనుకొన్నట్లుగా ప్రత్యక్షంగా కాదు. పరోక్షముగా బానిసల హుందతనముతో కూడిన జీవితము కొరకు ఆలోచించినాడు. దీనిని మనము అర్ధముచేసుకొనుటకు పౌలు దినములలో ఉన్న విషయములను తెలుసుకొనవలెను. ప్రాచీన పశ్చిమాసియా ప్రాంతములైన ఐగుప్తు, సుమేరియా, బబులోను, అషూరు, తూరు, సిదోను, సిరియా, మోయాబు, అమ్మోను, ఎదోము, గ్రీకు, రోము మొదలగు ప్రాంతములయందు బానిసత్వ వ్యవస్థ వాడుకలో ఉన్నట్లు చారిత్రాత్మక గ్రంథములయందు వ్రాయబడినవి. అంతేకాక, క్రీ.శ మెదటి శతాబ్దము నందు సుమారు 80 నుండి 90 శాతము మంది బానిసలు రోమా సామ్రాజ్యములో ఉండేవారు. అయితే ఆనాటి విధానమునకు మరియు ఆధునిక బానిసత్వ విధానమునకు చాల వ్యత్యాసము కలదు.

మనము అమెరికాలోని బానిసత్వమును గూర్చి అలోచించి నట్లయితే, వారు అట్లాంటికా మరియు చైనా ప్రాంతము వరకు గల ఆఫ్రికాలోని నల్లజాతి ప్రజలపట్ల అతికరముగా వ్యవహరిస్తారు.

అయితే రోమా సామ్రాజ్యములోగల బానిసత్వము దీనికి భిన్నమైనది. వీరిలో చాలా మంది యుద్ధభూమిలో చంపబడకుండా బానిసలుగా పట్టబడినవారే, అయితే వీరిలో చాలామంది  కేవలము ఒక దశాబ్దకాల మునకే వారి స్వేచ్ఛను తిరిగి పొందగలుగుతారు. కాని అమెరికా సంయుక్త రాష్ట్రములలోని నల్లజాతి బానిసలూ వారి జీవితాంతము బానిసలుగానే పరిగణించబడుతారు. కాబట్టి వివిధ ప్రాంతములలో ఉన్న ప్రజల సామాజిక, సంస్కృతిక స్థితిగతులనుబట్టి మనము అవగాహనచేసికొన వలసిన అవసరము ఉన్నది.

సువార్త ద్వార  పాపమునుండి విడిపించి, ఆధ్యాత్మిక స్వేచ్ఛ కలిగించాలని పౌలు యొక్క ఉద్దేశము, కాబట్టి బానిసత్వము నుండి విడిపించి, శారీరక స్వేచ్ఛ కలిగించుటను ప్రాముఖ్యమైనదిగా పెట్టు కోలేదు. పౌలు ఎఫెసీ సంఘమునకు దాసులు యజమానులకు లోబడవలెను అని వ్రాస్తున్నప్పుడు (ఎఫె 6:5), ఆ పట్టణమునందు సుమారు 250,000 మంది  రోమా పౌరులు మరియు 400,000 మంది బానిసలు యున్నారు. అయితే బానిసలలో చాలామంది పేదవారు కాబట్టి వారి యజమానులనుండి బయటకు వచ్చినట్లయితే వారు బ్రతకటము కూడా కష్టమైపోయి  సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది.

బానిసత్వమును పూర్తిగా నిర్మూలము చేయుటకు క్రొత్త చట్టాలు తేవటానికి బదులు, యజమానులు బానిసల మధ్య సంబంధాలలో మార్పు తేవటానికి పౌలు ప్రయత్నిస్తున్నాడు. క్రైస్తవ యజమానులు తమ దాసులపట్ల దయతో మెలగవలెను, క్రైస్తవ దాసులు తమ యజమానులకు విధేయులై యుండుట ద్వార మంచి ఉదాహరణ నెలకొల్పవలెను. క్రైస్తవ దాసులు  మంచి ప్రవర్తనను కలిగి యుండుట ప్రజలు చూస్తారో, అప్పుడు వారు బానిసత్వము సామాజిక దురాచారము అను పౌలు వాదనను తీవ్రమైనదిగా

తీసుకొంటారు (1తిమో 1:10). అప్పుడు బానిసలు కూడా స్వతంత్రులు కాగలిగితే వారు అవుతారు (1 కొరింథీ 7:21). అదే విధముగా యజమానులు కూడా తగిన సమయమందు తమ దాసులను తమతో సమానులుగా పరిగణిస్తారు (ఫిలే 16). మొదట ప్రభుత్వం పౌలు బోధను చాలా సంవత్సరముల వరకు వ్యతిరేకించి నప్పటికి, క్రమక్రమముగా ఆయన బోధ అంతటా వ్యాపించినది.

ప్రపంచములోని ఏకదేవుని ఆరాధికులుగా పరిగణింపబడే మూడు ప్రాముఖ్యమైన మతములైన యుదామతము, క్రైస్తవ మతము మరియు ఇస్లాము ఈ మూడింటి యందు క్రైస్తవమతమే బానిసత్వ మును పాపముగా పరిగణించి అది తప్పక నిర్మూలము చేయబడాలి అనేభావనను అభివృద్ధి చేసినది. రోమా సామ్రాజ్యం పతనము చెందిన దశాబ్దకాలము నాటికే బానిసత్వవ్యతిరేక బోధలు క్రైస్తవ దేవశాస్త్రము నందు కనబడి క్రమక్రమముగా అది లేకుండా చేయబడినది. అయితే యూరప్ నందు బానిసత్వపు ఛాయలు కొనసాగుతూ ఉన్నప్పుడు క్రైస్తవ కార్యకర్తలు మరియు సంఘములు వ్యతిరేకించి ఉద్యమము చేయుట ద్వార అది కూడా నిషేధించబడినది.

బానిసలు మరియు యజమానులు నిర్వర్తించవలసిన బాధ్యతలు మరియు పాత్రలను నేటి ఉద్యోగులు మరియు వారి యజమానులకు మధ్య ఉండవలిసిన సంబందమునకు అన్వయించ వలెను. మొదటి శతాబ్దము నందలి బానిసలకు ఇవ్వబడిన సూచన లను, నేటి కాలములోని పెద్దవారైన, పరిపక్వత చెందిన మరియు యౌవనులైన విశ్వాసులుగా మనము పనిచేసే స్థలములలో దేవుని ప్రతి నిధులుగా ఎలా ఉండగలుగుతున్నాము? మనము ఆదివారము నాడు ఉన్నట్లుగానేమిగతా దినములలో ఉండగలుగుటకు ఏమి చేయవలెను? మీ యజమానులకు తప్పక లోబడి యుందుడి.

**పౌలు సలహా**

మీరు ఎవరికి సేవచేస్తున్నారో వారికి విధేయులైయుండుడి, అప్పుడు యేసు కొరకు మంచి సాక్ష్యమును ఉంచగలవు.

యేసు ఒకవేళ నీ యజమానిగా నున్నట్లయితే ఎలా వ్యహరిస్తాడు? మీరు ఎలా వ్యవహరిస్తారో? ఒకవేళ నీ పనివారు యేసు కొరకు పనిచేస్తున్నట్లయితే ఆయన వారితో ఎలా వ్యహరిస్తాడు? మీరు వారితో ఎలా వ్యవవహరిస్తారు?

## 12. దైవిక ఎంపికలు చేయుట (2:11-15)

చదువుము: తీతు 2: 11-15

జీవితము ఎంపికల శ్రేణి. ప్రతిరోజు మనము చిన్న లేదా పెద్ద విషయములను గూర్చి నిర్ణయాలు చేస్తుంటాము. మనము ఏమి ధరించుకోవాలి, ఏది మొదట చేయాలి, ఎంత తినాలి, ప్రశ్నలకు ఎలాస్పందించాలి, ఏ సలహా ఇవ్వాలి, నిరుత్సాహ పరిస్థితులలో, కష్టములలో ఎలా స్పందించాలి మొదలగునవి. మనము వీటిని గూర్చి గ్రహించకపోతే ఎంపిక చేసుకొనుటలో ఎప్పటికి ఔను లేదా కాదు అనే చెప్పవలసి వస్తుంది. జీవితము ఈ ఎంపికల మీదనే కట్టబడు తుంది. చాల విషయాలు చిన్నవిగా కనబడుతాయి కాని అవి చాల పెద్ద పర్యవసానములను కలిగిస్తాయి. యేసుకొరకు జీవించాలా లేదా తమ స్వయంకొరకు జీవించాలా అనునది జీవితములో మనము చేయవలసిన ముఖ్యమైన ఎంపిక, కాని ఎంపికలు చిన్న నిర్ణయముతో వస్తాయి, అవి అంత పెద్దవేమి కాదు. ఏదైనా పాపము లేదా భక్తి హీనమైన వాటిని గూర్చి ఆలోచిస్తున్నపుడు మనలో రేకెత్తించబడే శోధనలకు మనము ఎలా స్పందిస్తున్నాము? కామోద్రేక, లైంగిక

సంబంధమైన విషయాలు చదివే లేదా వినే అవకాశాలు కలిగినప్పుడు వాటితో మన మనస్సులను, జీవితాలను నింపుకొంటున్నాము? మనము చెప్పేవిలేదా చేసేవే వాస్తవమైనవని సరియైనవని ఆలోచించ వచ్చు, కాని అవి దేవుని వాక్యమునకు వ్యతిరేకమై ఉండవచ్చును వాటిపట్ల నీ స్పందన ఏమి? ఇతరులపై చిన్నచిన్న ఫిర్యాదులు, చాడీలు చెప్పే విషయములను గూర్చి ఎలా ఆలోచిస్తున్నాము? రక్షింపబడక ముందు మనము వేటిని కోరుకొంటామో వాటిని చేసేవారము, కాని యేసు మనలో నివసిస్తున్నపుడు పరిస్థితులలో మార్పు వస్తుంది. ఇప్పుడు మనము భక్తిహీనమైన, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకు చుండవలెను. (తీతు 2: 12). రక్షింపబడక ముందు మనము పాపమును ఎదిరించలేక పోయినాము, కాని ఇప్పుడు దేవుని కృప మనలో పనిచేయుచున్నందున మనము ఎదిరించగలము (తీతు 2: 11). మనము గుర్తుంచుకోవలసిన విషయమేదనగా ఈ లోకము తాత్కాలికమైనది మరియు ఒక రోజు త్వరలో మనము యేసుతో ఉండబోతున్నాము (తీతు 2:13). కేవలము ఆయన సన్నిధిలో ఉన్నామనే తలంపు ఏ సమయములోనైనా మనము విధేయతతో పరిశుద్ధముగా జీవించుటకు మన మనస్సు కేంద్రీక రించుటకు సహాయపడుతుంది. ఆయన మన కొరకు చేసినవన్నింటిని జ్ఞాపకము చేసికొనినప్పుడు, మన పాపముల నుండి పరిశుద్ధపరచబడి, ఆయనను సంతోష పెట్టు మార్గములో మనము జీవించుటకు పురి కొల్పబడుతాము (తీతు 2:14).

మనము కూడా అదే విధముగా ఈ విషయములను మన ప్రజలకు బోధించవలయును. అదే పౌలు తీతునకు చెప్పెను (తీతు 2: 15). ఆయన వారికి బోధించవలసి యున్నది. బోధించుట అనగా వినువారు అర్ధముచేసికొనునట్లు దేవుని సత్యమును ప్రకటించుట,

బహిరంగముగా వెల్లడి చేయుట, దగ్గరిగా దానిని చూపించుట. అదే దేవుడు కాపరులకు మరియు  నాయకులకు ఇచ్చు మొదటి ఆజ్ఞ, అదేమనగా “నా గొర్రెలను కాయుము” (యోహా 21:15–17). దీనిని అధికారముతో చేయవలెనని  తీతునకు ఆజ్ఞాపింపబడినది. ఆ అధికారము దేవుని నుండి వచ్చినది. యేసు దేవుని నుండి వచ్చిన అధికారముతో బోధించెను (మత్త 7:28–30). మనకు కూడా అలాంటి అధికారము కలదు (లూకా 9:1; మత్త 10:1). మనము దేవుని వాక్యము చెప్పవలయునుమరియు అది దేవుని అధికారమును కలిగి ఉండవలెను (హెబ్రీ 4:12) మనము బోధించునప్పుడు లేదా నేర్పించునప్పుడు యేసు అధికారముతో బోధించినదే మనము కూడా బోధించుచున్నాము. దేవుని వాక్యమును స్పష్టముగా మరియు అధికార ముతో ప్రకటించుటకు మనకు అధికారము కలదు కాని ఒక్క వాక్యమును కూడా మార్చుట లేదా దానికి కొంత చేర్చుట, తీసివేయుట అతీతముగా వెళ్ళుట చేయకూడదు. మనము బోధించునప్పుడు, నేర్పించునప్పుడు, హితబోధ చేయునప్పుడు, సలహా ఇచ్చునప్పుడు మనము దేవుని కొరకుమాట్లాడుచున్నాము మరియు ఆయన సత్యమును ఇతరులకు అందజేయుచున్నాము.

“ప్రోత్సహించుట మరియు గద్దించుట, ఖండించుట అనునవి మన బోధయందును మరియు ఇతరులకు  నేర్పించుటలోను భాగమై యున్నవి. సరియైనది చేయునట్లు మనము ప్రజలను ప్రోత్సహించాలి. కొందరు బైబిలు బోధకులు తిట్టుతారు మరియు ఖండిస్తారు కాని అది ప్రజలకు మంచి చేయుటకు సహాయపడదు. అపరాధమును గూర్చి నొక్కిచెప్పుట మరియు భయము కలిగించుట సరియైన ప్రేరణలుకావు. జీవితము అనేది  కష్టముల కడలి, ప్రజలు బాధలలో ఉంటారు కాబట్టి సరియైన నిర్ణయము చేయుటకు ప్రతి ఒక్కరికి ప్రోత్సహకరమైన మాటలు అవసరమై యున్నవి. కాని ఎవరైనా దేవుని వాక్యమునకు

నిరంతరము అవిధేయులైతే మనము వారి పాపమును ప్రేమతో ఎత్తిచూపవలెను. మనము వారిని ఖండించుట లేదా ఓడించుట చేయకూడదు కాని వారు తమ మార్గములను సరిచేసుకొని సత్య మార్గములో ముందుకు వెళ్ళుటకు ప్రోత్సహించవలెను. దేవుని వాక్యము బోధించుట లేక నేర్పించుట అనగా అది.

ఈ భాగములో తీతునకు పౌలు ఇచ్చు చివరి ఆజ్ఞ ఏదనగా "ఎవరును నిన్ను తృణీకరించనీయకుము." తృణీకరించుట అనగా అగౌరపరచుట లేదా నిర్లక్ష్యము చేయుట. తృణికరించబడకుండ చూచుకొనుట అనునది మన వ్యక్తిగత విషయమునకు సంబంధించినది కాదు గాని మనము ఎవరికి ప్రాతినిధ్యము వహిస్తున్నామో మరియు ఎవరిని గురించి మాట్లాడుతున్నామో వారిని తృణీకరించుట అవుతుంది ఆ విధముగా జీవించి మరియు మాట్లాడితే నీవు యేసుకు గౌరవము మరియు మహిమను తీసుకొనిరాగలవు, అయినప్పటికిని ప్రజలచేత నీవు తృణీకరించబడితే వారు యేసును తృణీకరించినట్లే, ఆయనకు అగౌరవము తీసుకువచ్చేది ఏదియు చేయకూడదు.

ఈ దినము నీవు చిన్న మరియు పెద్ద నిర్ణయాలను మరియు ఎంపికలను చేయబోతున్నావు కాని గుర్తించుకో ప్రతిది కూడా యేసు కోరుకునే వాటిపైననే ఆధారపడి ఉండాలి, ఎందుకనగా ఒక రోజు బహుశ త్వరలోనే నీ పాపములన్నిటికి ప్రాయశ్చిత్తము చెల్లించిన ఆయనతో నీవు ఉండబోతున్నావు.

## పౌలు సలహా

పాపమునకు కాదని చెప్పు కాని యేసుకొరకు దైవభక్తి గల జీవితము మరియు పవిత్ర జీవితము జీవించుటకు అవునని చెప్పు. ఇతరులకు ఆయన వాక్యమును నేర్పించుము తద్వారా వారు అదే పనిని చేయగలరు.

ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల ఎటువంటి ఖడ్గముకంటేను వాడిగా ఉండి ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించుమట్టుకు దూరుచు హృదయము తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. (హెబ్రీ 4:12 )

ఎప్పటికప్పుడు నీవు ఎంపిక చేసుకొను విషయములలో కష్ట తరమైన సమయమును కలిగి ఉన్నావా? నీవు అవిధేయుడవగుటకు ఏది నిన్ను శోధిస్తుంది? మరల నీకు అవకాశము ఇవ్వబడినప్పుడు భక్తిగల నిర్ణయములు తీసికొనుటకు నీవేమి చేయుదువు?

## 13. అధికారుల యొక్క ప్రవర్తన (3:1-7)

చదువుము: తీతు 3:1-7

క్రైస్తవ జీవితము జీవించుట అంటే సైకిలును నడిపించుతో పోల్చబడినది. నీవు దాన్నినడిపిస్తున్నప్పుడు ముందుకైనా వెళ్ళుతావు లేదా పడిపోనైనా పడితావు. కాని ఎక్కడో ఒకచోట ఆగిపోవటము అనేది ఉండదు. యేసు కొరకు జీవించుట అనునది పౌలు తీతునకు గుర్తుచేసిన వాటన్నిటిని జీవితమునకు అన్వయించుకొనుట మరియు తన ప్రజలకు జ్ఞాపకము చేయవలెనని తీతుకు పౌలు తెలియపరచిన విషయములను అనగా ప్రభుత్వముతో మరియు ఇతర అధికారముతో నాయకులతో ఉండవలసి సంబంధము కూడా అన్వయించుకొనవలెను (తీతు 3:1). తమ నాయకులకు మరియు అధికారులకు లోబడి ఉండవలెనని ప్రజలకు జ్ఞాపకము చేయవలెనని తీతుకు ఆజ్ఞాపించబడి నాడు మరియు ప్రభుత్వమునకు, ఉద్యోగస్తులకు, తల్లితండ్రులకు, భర్త లకు, కాపరులకు మరియు అందరు నాయకులకు లోబడవలెను. లోబడుడి అను ఆజ్ఞ పరిమితమైనది, అనగా దేవుని వాక్యమునకు

వ్యతిరేకమైన రీతిగా చేయాలి అని మనము ఆజ్ఞాపింపబడనంత వరకు మనము లోబడవచ్చును. లోబడి విధేయులుగా ఉండవలెను, అనగా ఇతరులను సేవించుటకు నమ్మకముతో, ప్రేమపూర్వకముగా సంసిద్ధత కలిగి యుండుట. కాపరులు దీనిని ప్రజలకు బోధించాలి, బోధించుటకు ముందుగా వారు తమ జీవితమును ఉదాహరణ ఉంచాలి.

పౌలు తీతుకు 3:2 నందు ఎవరిని దూషింపక, జగడమాడక ఉండవలెనని ప్రజలకు బోధించుచున్నాడు. అనగా ఎవరిని శపించక, తృణీకరణ భావముతో చూడక, సంఘమునకు మరియు యేసునకు శత్రువులైన వారితో కూడా చెడుగా మాట్లాడక, క్రైస్తవ ప్రేమతో సత్యము మాట్లాడవలెను. శాంతులునై యుండవలెను అనగా ఎవరితో జగడమాడక అందరిపట్ల స్నేహభావముతో యుండవలెను. మనుష్యు లందరియెడల సంపూర్ణమైన సాత్వీకమును కనుపరచవలెను, అనగా సాధువైన, ఉదారమైన, సామరస్య స్వభాముతో, మితస్వభావముతో, సహనముతో, కపటము లేకుండ హృదయపూర్వకముగా యేసువలె ఇతరులను ప్రేమించవలెను. పౌలు  తీతుకు 1 అధ్యాయము నందు ఈ లక్షణముల సంఘ నాయకుల ఉపయోగించినాడు. నాయకులు ఈ విధానములో ప్రజలకు శిక్షణ నియ్యవలెను. కాని మొదట ఈ లక్షణములను వారి స్వంత జీవితములో కలిగియుండవలెను 1:5-9. విధేయులై యుండుడి అని తీతుకు 3:2 నందు పౌలు మాట్లాడుతూ, మనమందరము  అవిశ్వాసులుగా ఉన్నప్పుడు వారివలె జీవించినామని జ్ఞాపకము చేస్తున్నాడు (తీతు 3: 3), కాబట్టి ఇప్పుడు మనము కలిగి యున్న స్థితినిబట్టి అతిశయపడవలసిన కారణము లేదనిచెపుతున్నాడు. కేవలము దేవుని కృప ద్వారానే మన జీవితాలు అవిశ్వాసుల జీవితాలకు భిన్నముగా ఉన్నవి. రక్షణను గూర్చి మనము ప్రగల్భాలు చెప్పుకొనుటకు, ఆ కార్యములో ఏదైనా మన ప్రమేయము

యున్నందున దానిని మన ఖాతాలో జమ చేసుకొందాము అను కొనుటకు అవకాశము ఏమిలేదు. కేవలము ఆయన కనికరము చేత మనలను క్షమించగలిగినాడు. కేవలము ఆయన పరిశుద్ధాత్మ మనలో పనిచేయుట ద్వారనే మనము మన పాపములను గుర్తించి, ఆయన క్షమాపణ పొందవలసిన అవసరతను తెలుసుకోగలిగినాము. యేసు దేవుడు–మనిషి మరియు మన రక్షకుడు కాబట్టి  మనము రక్షింప బడుటకు ఆయన వైపులను తిరుగవలెనని పరిశుద్ధాత్మ ద్వార గ్రహింప గలిగినాము. మనము ప్రగల్భాలు చెప్పుకొనుటకు ఎలాంటి అవ కాశములేదు కేవలము ఆయన అద్భుతమైన ప్రేమ మనకును మరియు నిత్య నరకమునకు మధ్యలో నిలువబడుట ద్వార, మనము ఆయనతో నిత్యము పరలోకములో ఉండగలుగుచున్నాము. కాబట్టి దేవుడు మనపట్ల చూపించిన కనికరమును మనము ఇతరులపట్ల చూపించ వలెను.

మనము విశ్వసించకముందు, మనకును దేవునికిని మధ్యలో కొన్నివేల అడుగులు వేయవలసిన అవసరత ఉండెను. కాని దేవుడే మనలను చేరుకొనుటకు అన్ని అడుగులు వేసినాడు కేవలము చివరిగ మనము వేయవలసిన అడుగు తప్ప. ఎవరైనా ఆయనను నమ్ముటకు వారిని  బలవంతము చేయడు కాని మనకు నిర్ణయము తీసుకొనే స్వేచాను ఇచ్చాడు. ఆ చివరి నిర్ణయము తీసుకొనే విషయాన్ని దేవుడు మనకే విడచిపెట్టాడు. కాని పరిశుద్ధాత్మ మనలో పనిచేసి దేవుడే మన ఆధారము కాబట్టి ఆ నిర్ణయము చేయాల్సిన అవసరత ఉందని చూపించకపోతే మనము ఆ చివరి అడుగు కూడా వేయలేము. దేవునికే మహిమ, ఘనత కలుగును గాక! మనము ఎప్పుడు ఎలాగు ఏమి  చేయలేము, కాని ఒకప్పుడు మనము ఎలా ఉన్నామో అలాంటి ప్రజలను విధేయతతో, ప్రేమతో, దయతో చేరుకోవలసిన అవసరత ఉన్నది. బహుశ దేవుడే, ఆయన కనికరము చొప్పున, మన ద్వార

సువార్త వినుటకొరకు వారి కన్నులను తెరుస్తాడు.

మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక, ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి అశీర్వాదమును మనకను గ్రహించెను ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయా సంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వార తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండ వలెనని జగత్తుపునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది. కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన యేర్పాటునుబట్టి, ఆయన తన దయాసంకల్పము చొప్పున తన చిత్తమునుగూర్చిన మర్మమును మనకు తెలియచేసి, మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు, ఆ కృపను ఆయన పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవే గాని సమస్తమును క్రీస్తునందు ఏకముగాసమకూర్చవలెనని తనలోతాను నిర్ణయించుకొనెను... ఆయన తన చిత్తనుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాడు. (ఎఫెసీ 1: 3-14)

మౌనప్రార్థన చేయుటకు కొన్ని క్షణాల సమయము తీసుకొనుము మరియు దేవుడు నిన్ను ఎన్నుకొనకపొతే, నిన్ను విశ్వాసములోని నడిపించుటకు తన కార్యము జరిగించకపోతే నీ జీవితము ఎలా ఉండేదో అలోచించుము. దీనికొరకు దేవునికి కృతజ్ఞతలు చెల్లించుము.

దేవునికి వ్యతిరేకముగా ఏదైనా ఫిర్యాదు చేసినట్లయితే లేదా ఆయన నీ జీవితములో చేసిన కార్యములను గూర్చి నీవు ప్రగల్భాలు చెప్పుకొంటు న్నట్లయితే ఆయనను క్షమించమని అడుగుము.

## 14. యేసు ఆగమనము కొరకు వేచి యుండుట (3:8-15)

చదువుము: తీతు 3: 8-15

ఎవరైతే వాక్యమును బోధిస్తారో లేదా నేర్పిస్తారో వారు తమ సందేశమునకు ముగింపు చాల ప్రాముఖ్యమైనదని భావిస్తారు. నీ శ్రోతలను ఒక సవాలుతో విడచిపెట్టుటకు మరియు వారు వినిన దానిని ఆచరణలో పెట్టునట్లు వారిని పురికొల్పుటకు ఇది నీకు చివరి అవకాశము. పౌలు కూడా తీతుకు తాను వ్రాసిన పత్రికయందు ఈ అన్ని విషయములను ఉంచుటకు ప్రయత్నించినాడు (తీతు 3: 8-15)

పౌలు తన చివరి మాటలను తాను ముందుగ పేర్కొన్న సత్క్రియలనుచేయుము (తీతు 1: 1-7) అను మాటను ప్రస్తావిస్తూ ప్రారంభించినాడు. సత్ క్రియలను శ్రద్ధగా చేయుటయందు మనస్సుంచునట్లు నీవీసంగతులను గూర్చి దృఢముగా చెప్పుము, అని పౌలు తీతుకు ఆజ్ఞాపించుట ద్వార మరొకసారి ప్రజలకు వాక్యము నేర్పించుట మరియు బోధించుట యొక్క ప్రాముఖ్యతను పౌలు గుర్తుచేస్తున్నాడు (తీతు 3: 8). ఒక వ్యక్తి యేసు యొక్క ఉచితమైన రక్షణనుపొంది, చనిపోయిన తరువాత పరలోకమునకు వెళ్తాము అంటే దాని అర్ధము తమ జీవితములో వారు ఎంతమాత్రము పాపముచేయరు అని కాదు (1 యోహా 1:7-10). రక్షింపడినప్పుడు మన పాత స్వభావము మారదు కాని మనము నూతన స్వభావమును పొందుతాము, దేవుని ఆత్మలో ఉంటాడు కాబట్టి పాపము మన మీద ప్రభుత్వము చేయదు (రోమా 6: 12-23). అయినప్పటికి మనము

రక్షింపబడక ముందు చేసినట్లుగా పాపము చేయుటకు మనకు స్వేచ్ఛ ఉంటుంది. మనము రక్షింపబడిన తరువాత కూడా మన శరీరము బలముగా ఉంటుంది, కొన్నిసార్లు అది రక్షింపబడక ముందు ఉన్నదాని కంటే ఎక్కువగా కూడాబలంగా ఉంటుంది. అయితే మనము పాపము చేసినప్పుడు మన రక్షణను పోగొట్టుకొనము కాని దాని పర్యవసానము లను ఎదుర్కొనవలసి ఉంటుంది. పాపము మనలో పరిశుద్ధాత్మ కార్యమును నిలిపివేస్తుంది కాబట్టి ఆయన శాంతిని, మార్గదర్శ కత్వమును, శక్తిని, సహాయమును అనుభవించలేము (ఎఫె 4: 30; 1 థెస్స:5: 19). ఎప్పుడైతే మనము దేవుని ఆత్మతో నింపబడుతామో (రోమా 8:9) ఆయన ఫలములతో నింపబడగలము (గల 5: 22-2) అప్పుడు విశ్వాసులు ఆధ్యాత్మికముగా బలపడుతారు (తీతు 3: 8) మరియు అవిశ్వాసులు యేసు నొద్దకు ఆకర్షింపబడుతారు.

ఇవి మంచివియు, ప్రయోజనకరమైనవి, అనగా తర్కముల లోనికి, ధర్మశాస్త్రమును గూర్చిన వివాదములలోనికి వెళ్ళకపోవుట, ప్రత్యేకముగా పాతనిబంధనకు సంబంధించిన చట్టములు, కట్టడలు అనుసరించకపోవుట. క్రైస్తవులు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు, అను విషయములను పట్టించుకొనకపోవుట మంచిది (తీతు 3:9). చట్టబద్ధతకు సంబంధించిన విషయములు, ధర్మశాస్త్రమునకు సంబంధించిన విషయములు నిష్ ప్రయోజనమును వ్యర్ధమునై యున్నవి. ఎందుకనగా వాటినుండి మంచిది ఏదియు రాదు మరియు వాటివలన ప్రజలలో కలహములు, విభజనలు, ఏదైతే తప్పో దానిని గూర్చిన భయము, ఇతరులకంటే మనము నీతిమంతులమనే గర్వము, కృప స్థానములో ధర్మశాస్త్రమును కూడా ఉంచుటవలన కలిగే ఫలితాలు చోటు చేసుకొంటాయి.

ఈలాంటి ప్రజలను సరిచేయాలి అని ప్రయత్నిస్తే ఒకటి రెండు మారులు మాత్రమే మందలించవలెను (మత్త 18:15-17).

కాని వారు అదే తప్పిదములలో కొనసాగుతున్నట్లైయితే వారిని మనము ఏమి చేయలేము (తీతు 3:10). వారిమీద మన దృష్టిని నిలిపి మన సమయమును వ్యర్థము చేసుకొనరాదు. అయితే సంఘములోని ఇతరులను వారి మాటలు వినకుండా హెచ్చరించవలెను, మరియు వారికి సంఘములో మాట్లాడుటకు అవకాశము ఇవ్వకూడదు. అట్టివారు మార్గము తప్పి తిరుగువారు మరియు పాపము చేయువారు, తమకు తామే శిక్ష విధించుకొనువారు (తీతు 3: 11). ఈ పదములు చాల కఠినమైనవి కాని ఇవి వాస్తవమైనవి. వారు చాల ప్రసిద్ధిగాంచిన వారైనప్పటికి, చాల నమ్మకస్తులుగా కనబడినప్పటికి, ప్రజలు వారిచేత ప్రభావితులై వారిని మెచ్చుకొంటూ వారి మాటలు వినుటకు ప్రయత్నము చేస్తున్నప్పటికి వారినుండి మన ప్రజలను తప్పించవలెను. ఒకవేళ మీ సంఘములో ఆరాధన తరువాత మీరందరూ ఒక్కొక్క వ్యక్తి తీసుకొనివచ్చిన ఆహారమును అందరు తినుచుండగా ఒక వ్యక్తి తన ఆహారములో కొంత విషము కలిపి తెచ్చాడని నీకు తెలిస్తే నీ ప్రజలను దానిని తిననిస్తావా ఎంతమాత్రమూ చేయవు అలాగుననే తప్పుడు బోధ విషయములో కూడా ఇది వాస్తవమే. అది చాల కొద్దిగా బోధించ బడినప్పటికి దాని నష్టము చాల ఉంటుంది.

పౌలు ఈ పత్రికను కొన్ని వ్యక్తిగతమైన సూచనలను తెలియపరుస్తూ  ముగించి (తీతు 3:12-15) దానిని తీతుకునకు పంపినాడు,చివరిగా ఈ రోజులలో ఉన్న మనకు కూడా అది ఇవ్వబడి నది. మనము పౌలుతో  కూర్చుండి ఆయన శిక్షణను పొందలేక పోవచ్చు కానిమనము తిమోతి మరియు  తీతుకు పత్రికలను చదివి వాటిని అనుసరించుట ద్వార మనము కూడా ఆ పత్రికను స్వీకరించిన గ్రహీతలుగా ఉండగలము. ఏది సరియైనదో, ఆధ్యాత్మికముగా పవిత్ర మైనదో మరియు వేటిని ఇతరులకు బోధించవలయునో  వాటిని చేయుము. ఎవరైనను వేరే బోధను నేర్పిస్తున్నట్లయితే వారిని

హెచ్చరిస్తాము అప్పుడు వారు తిరస్కరింపబడుతారు మరియు తొలగించబడుతారు. ఈ మాటలు  కఠినమైనవిగా అనిపించ వచ్చును కాని చరిత్రలో ఇవి వాస్తవముగా జరిగినవి, నేటి కాలములో మన విషయములో కూడా అవి వాస్తవము.

## పౌలు సలహా

ఏది మంచిదో దానిని చేయుము మరియు ఎవరు అబద్ధమును, తప్పిదమును బోధిస్తున్నారో వారితో కలసి చేసేదీ ఏమీ లేదు.

మనము మేలుచేయుట యందు విసుకక యుందము. మనము అలయక మేలు చేసితిమేమి తగినకాలమందు పంటకోతుము. కాబట్టి సమయము దొరికినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారియెడలను మేలుచేయుదము. (గలతీ 6: 8-10). దేవుడు ముందుగా సిద్ధపరిచిన సత్ క్రియలు చేయుటకైమనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము. (ఎఫెసీ 2: 10)

ఎప్పుడైన ప్రజలు నిన్ను చూసినప్పుడు నీవు చేస్తున్న మంచి పనులను గూర్చి దేవుని మహిమపరుస్తున్నారా? తప్పుడు బోధకుల విషయములో నీవు ఎలా స్పందిస్తున్నావు? నీ సంఘములో ఎవరైనా వారి ద్వార తప్పుడు త్రోవకు నడిపించబడు చున్నప్పుడు వారిని సరిచేస్తున్నావా? ఎవరైనా మరొకసారి తప్పుడు సిద్ధాంతము బోధిస్తు న్నట్లయితే నీవు ఏమి చేయాలి?

## V. కాపరుల & నాయకుల కొరకైన ప్రమాణాలు

మనము నాయకత్వమును గూర్చి ఆలోచించినప్పుడు వ్యక్తి చేస్తున్న క్రియలను బట్టి అతని నాయకత్వ పాత్ర చూపించబడుతుందని అనుకొంటాము. అయినప్పటికిని, మనము బయటకు చేసే పనులు మన అంతరంగిక ప్రవర్తన మీద ఆధారపడి యుంటాయి కాని అవి మన జ్ఞానము మీద లేదా మన వ్యక్తిత్వము మీద ఆధారపడి యుండవు నాయకత్వము అనునది మొదట మనము ఏమైయున్నామో దానికి సంబంధించినది తప్ప మనము ఏమి చేస్తున్నామో దానికి సంబంధించి నది కాదు. పౌలు 1 తిమో 3: 1-7 తీతు 1: 5-9 నందు దైవభక్తిగల నాయకులకు ఉండవలసిన లక్షణముల జాబితాను ఇచ్చినాడు. అవన్నియు మన అంతరంగిక సమతుల్యత, పరిపక్వతకు సంబం ధించిన విషయములు. అయితే వాటిలో కొన్ని మనము ఎంపిక చేసుకొనితీసుకొనుటకు ఒక జాబితాగా అవి ఇవ్వబడలేదు. కాని అవన్నియు కలిపి ఒక వ్యక్తిని - దైవభక్తిగల నాయకుని గూర్చి వివరించుటకు వ్రాయబడినవి. యేసు ఒక్కడు మాత్రమే ఈ జాబితాలో ఉన్న లక్షణములను తన జీవితములో నెరవేర్చినాడుబీ కాబట్టి ఈ లక్షణములు కలిగియుండుటలో మనము ఎదుగుచున్నపుడు మనము ఆయన వలె మారుతాము. ఇప్పుడు మనము వాటిని చూద్దాము.

### A. దైవభక్తిగల నాయకుడు తప్పక దైవభక్తి గల నాయకునిగా ఉండుటకు ఇష్టపడాలి

చదువుము: 1 తిమో 3: 1-7; తీతు 1: 5-9

ఒక వ్యక్తి మొదట దైవభక్తిగల నాయకునిగా ఉండుటకు అపేక్షించవలయునని చెపుతున్నాడు. అతడు “తన హృదయమును

దాని పైన నిలుప వలెను" మరియు దానిని "కోరుకొనవలెను" (1 తిమో 3: 1). కాబట్టి ఎవరితోనైనా సేవ చేయుమని ఎప్పుడు మాట్లాడకండి అతడు ఎంతో మంచి నాయకుడిగా మారవచ్చని మీరు అనుకొనవచ్చును కాని దేవుడు అతనిలో తప్పక ఆ కోరికను ఉంచాలి అప్పుడు మాత్రమే అతడు దానికి స్పందించి ఆయనను అనుసరిస్తూ మరియు సేవించగలుగుతాడు. ఈ విధమైన ప్రాథమికమైన సత్యములు లేకుంటే ఎవరు కూడా మంచి నాయకునిగా మారలేరు.

### పౌలు సలహా

దేవుడు తనను సేవించమని ఎవరిని బలవంతము చేయడు, దాన్ని చేయటానికి తమ అంగీకారాన్ని వ్యక్తము చేయాలి.

ఆయనను సేవించుటకు దేవుడు ఈ కోరికను ఎప్పుడు నీ హృదయములో ఉంచాడు? దీనికి కట్టుబడి ఉంటూ పని చేయుట నీకు కఠినంగా అనిపిస్తుందా? ఆయనను సేవించుటకు నీ మనస్సును మార్చుకొన్నావా? ఆయనను సేవించుటకు నీ నిబద్ధతను తిరిగి నిర్ధారించుకొనుము. దేవుడు ఆయనను సేవించుటకు నిన్ను పిలిచి నప్పుడునీవు ఆశ్చర్యపడినప్పటికి, గర్వముతో లేదా దురాశతో కాక ఆయనను సేవించాలనేకోరిక నీలో ఉన్నట్లైతే ఆయన తప్పక ఆ ఆపేక్షను నీలో ఉంచుతాడు.

### B దైవభక్తిగల నాయకుడు అంతరంగములో దైవిక లక్షణాలు కలిగి ఉండాలి

చదువుము: 1 తిమో 3: 1-7; తీతు 1: 5-9

ఎవరు దేవుని చేత పిలువబడినారో మరియు ఆయనను సేవించుటకు స్పందించి ఎదురుచూస్తున్నారో వారి కొరకు పౌలు దైవ

భక్తిగల నాయకునికి యుండవలిసిన 25 రకములైన లక్షణములను వ్రాసినాడు. ఒక వ్యక్తి వీటిని పొందుకొనుటకు, ఆధ్యాత్మికముగా ఎదుగుటకు తన జీవితకాలము పడుతుంది. యేసు తప్ప ఈ లక్షణము లను పరిపూర్ణముగా మరెవరు తన జీవితములో కలిగి యుండలేదు. ఇది మన జీవితకాలమంతటిలో ప్రారంభించి, కొనసాగించవలసిన ప్రక్రియ.

అంతరంగములో ఉండవలిసిన మొదటి లక్షణము సమతుల్యత (1 తిమో3:2). ఇది వ్యక్తిలోని కోపము, భావోద్రేకము, విపరీతమైన ధోరణిని విడచిపెట్టుటను సూచిస్తుంది. వారు త్వరగా మోసగించబడరు మరియు ఆ పరిస్థితులనుండి తప్పించుకొంటారు. వారు ఎల్లప్పుడూ స్థిరముగా మరియు నిలకడగా ఉంటారు, తమకు కలిగే ఒత్తిడిని తట్టుకొని నిలబడుతారు.

తరువాత లక్షణము సున్నితమైన కార్యదీక్ష కలిగియుండుట (1 తిమో 3: 2) ఇది కూడా మొదటి దానివంటిదే కాని కొంచెము దానికి భిన్నమైనది. ఈ వ్యక్తి స్వయం నియంత్రణ, హేతుబద్ధత కలిగి యుండి, తానూ ఎదుర్కొనే సమస్యలను పరిపక్వతతో మరియు తన అనుభవముతో పరిష్కరించుకొంటాడు.

మరియు ఒక మంచి నాయకుడు క్రమశిక్షణ కలిగి యుంటాడు (తీతు 1: 8). దీని అసలైన అర్థము “బలము నియంత్రణలో యుంచబడుట”. దైవభక్తిగల నాయకుడు ఆహారమును అతిగా సేవించడు, నిద్ర ఇతర విషయములలో మితముగా ఉంటాడు. అతనికి ఎప్పుడు వద్దని లేదా కాదని చెప్పాలో తెలుసు (సామె 25: 28). అతడుసులభముగా శోధనలకు లోనుచేయబడదు. ఎవరైనా ఎక్కువగా డబ్బును ఖర్చుపెట్టుతూ ఉంటే వారికి  దూరంగా ఉంటాడు. త్వరగా కోపపడుట, గర్వముగా ఉండుట, సోమరిగా ఉండుట చేయదు, అవన్నియు తన స్వాధీనములో ఉంటాయి.

**పౌలు సలహా**

ఒక దైవభక్తిగల నాయకుడు సమతుల్యత, సున్నితమైన కార్యదీక్ష, క్రమశిక్షణ కలిగియుండుట.

కొలబద్ద పైన గల 1-10 అంకెలలో, నీలోని సమతుల్యత, సున్నితమైన కార్యదీక్ష, క్రమశిక్షణ అను ఈ మూడింటికి నీవు ఎంత రేటు వేస్తావు? నీ యొక్క మంచి స్నేహితుడు లేదా నీ భాగస్వామి ఎంతరేటు వేస్తారు? ఎప్పుడు అవసరమో అప్పుడు స్వయం నియంత్రణ కలిగి యుంటున్నావా? నీవు జ్ఞానముముతో కూడిన నిర్ణయాలు చేస్తావనే మంచి పేరు ఉన్నందున ఇతరులు సలహాలు తీసుకొనుటకు నీ యొద్దకు వస్తున్నారా?

## C. **దైవభక్తిగల నాయకుడు ఒకరిపట్ల ఒకరు దైవిక లక్షణాలు కలిగి ఉండాలి**

చదువుము: 1 తిమో 3: 1-7; తీతు 1: 5-9

దైవభక్తిగల నాయకునిగా యుండుటకు ఇతరులతో కలసి పోవువారిగా ఉండవలసిన అవసరమున్నది. దైవభక్తిగల నాయకునిలో ఉండాలని దేవుడు ఎదురుచూస్తున్న లక్షణములను ఎన్నింటినో పౌలు తన జాబితాలో పేర్కొన్నాడు. అందులో ఒక దైవభక్తి గల నాయకుడు త్వరితముగా కోపపడువాడుగా ఉండకూడదు (తీతు 1:7) ఘర్షణ పడువాడుగా ఉండకూడదు (1 తిమో 3:3). అతడు త్వరగా లేదా సులభముగా కోపపడకూడదు లేదా ఇతరులతో వాదనపడుట ద్వారా వారిలో కోపము రేపకూడదు (సామె 29:22). అతడు తన భార్యతో, తన పిల్లలతో సరియైన విధముగా మెలుగుట అవసరము. అతడు ఎంతో ఒత్తిడి క్రింద ఉన్నప్పటికీ ప్రశాంతముగా ఉండవలెను. కాని దేవుని యందలి కోపము, నీతితో కూడిన ఆగ్రహము, యేసు

దేవాలయములో క్రయవిక్రయము చేయువారిని వెల్లగొట్టునపుడు చూపిన ఆగ్రహము కలిగియుండాలి, కానీ అది కూడా దేవుని స్వాధీనములో ఉంచబడవలెను, అది కేవలము పాపమునకు వ్యతిరేక మైన చర్యగా ఉండవలెను. కాని మన జీవితాలు పాపముతో ముగించ బడకుండా చూసుకోవలెను (ఎఫె 4:26). నాయకుడు జగడమాడు వాడును, కలహించువాడునై యుండకూడదని మరొక లక్షణము కలిపినాడు (1 తిమో 3:3). ఇతరులు, అతనిని గూర్చి కలహా ప్రియుడని చెప్పుకొనకూడదు. తననువిమర్శించువారిని మరియు అవమానించువారిని తానూ  అవమానించకూడదు. అతడు తన సంభాషణయందు ఎప్పుడువాస్తమైనవే మాట్లాడవలెను తప్ప ఇతరులపై పెత్తనము చేయరాదు (సామె 20: 3) దానికి బదులుగా అతడు వినుటకు ఇష్టపడేవాడుగా, నేర్చుకొనేవాడుగా, అవసరమైనప్పుడు తన అభిప్రాయములు మార్చుకొనుటకు సిద్దముగా ఉండవలెను.

మరియు నాయకుడు తన స్వంత మార్గములోనే నడుచుకొంటు, గర్వముతో, అహంకారముతో ఉండకూడదు (తీతు 1:7). అందరితోకలసి అన్ని పనులలో పాల్గొంటూ వాటిని నేర్చుకొనువాడుగా ఉండవలెను.

పౌలు పేర్కొన్న మరొక లక్షణము సాత్వీకము. అనగా ఇతరులపట్ల  సహనముగా, దయతో, శ్రద్దగా మెలగుట. దీని అర్థము లోబడుటకు ఇష్టపడుట, తనను నొప్పించువారిని క్షమించి, పట్టించు కొనక పోవుట. ప్రజలు ఈ వ్యక్తిని విమర్శించుటకు లేదా అతని స్థోమతను తగ్గించటానికి తలంచరు.

**పౌలు సలహా**

దైవభక్తిగల నాయకుడు దయగలవాడుగా, సాత్వీకము గలవాడుగా మరియు ఇతరులతో కలసి మెలసి పోవువాడుగా ఉంటాడు.

నీ భార్య లేదా పిల్లలు నీవు చాల కోపము తెచ్చు కొంటున్నావని అంటున్నారా? నీవు ఎల్లప్పుడూ బాగానే ఉంటానని అనుకొంటున్నావా? ఒకవేళ ఎవరైనా మంచి ఉద్దేశ్యముతో ఏదైనా చెపితే వినటానికి మరియు నీ మనస్సు మార్చుకొనుటకు సిద్ధముగా ఉంటావా? పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ నీవు దయగా, సహనముతో ఇతరులపట్లనడచుకొంటున్నావని, నిన్ను చూచినవారు చెప్పగలుగు చున్నారా?

**D. దైవభక్తిగల నాయకుడు దైవకీర్తి ప్రసిద్ధి చేయువాడుగా ఉండాలి**

ఈ పైన పేర్కొనబడిన విలక్షణములు ఒక నాయకుని గూర్చి ఇతరులు ఏమని తలంచుతారో మరియు వారి వెనుక ఏమను కొంటారో అను విషయములను తెలియచేస్తున్నవి. ప్రజలు నిన్నుగూర్చి ఇతరులకు ఎలా వివరించాలని అనుకొంటున్నవో దానికొరకు ఇవి తప్పకుండా కలిగియుండాలి . యేసు ప్రతినిధులుగా ప్రతి క్రైస్తవుడు మంచి పేరు కలిగి యుండుట ఎంతో ప్రాముఖ్యము. ఇది ప్రత్యేక ముగా ప్రతి నాయకులు కలిగి యుండవలెను.

దైవభక్తిగల నాయకుడు కలిగి యుండవలసిన మంచి పేరును గూర్చి పౌలు వివరిస్తూ అతడు నిందారహితుడునై (1 తిమో 3:2) యుండవలెనని పేర్కొంటాడు. నిందలేనివారుగా అను మాటకు ప్రాథమిక అర్థము, ముడుతలు లేకుండా సున్నితముగా, సాఫీగా ఉన్న వస్త్రము. నాయకులు ప్రశ్నార్థకమైన ప్రవర్తన కలిగియుండరాదు,

ఇతరులతో పరిష్కరించబడని వివాదాలు గలవాడుగా ఉండకూడదు, అతనిలో ఎలాంటి రహస్య పాపము ఉండకూడదు. మనుష్యులు వారిని మోసము చేశామని మనలను గూర్చి చెప్పేటట్లుగా ఉండకూడదు, మనము గర్వముగా, దురాశాపరులుగా ఉంటామని చెప్పుకొనునట్లుగా ఉండకూడదు. అనగా దానిఅర్థము మనము ఎలాంటి తప్పులు చేయకుండా పరిపూర్ణులముగా ఉంటామనికాదు, కాని మనము ఇతరు లపట్ల, ఏదైనా తప్పిదము చేసినట్లయితే వారిని క్షమాపణ అడిగి దానిని సరిచేసుకొనవలెను.

దైవభక్తిగల నాయకుడు మర్యాదస్తుడుగా(1 తిమో 3:2 ) ఉండవలెనని పౌలు చెపుతున్నాడు.  అతడు ఒక క్రైస్తవ పెద్దమనిషిగా, గౌరవింపతగిన యోగ్యుడుగా ఉండాలి.

దైవభక్తిగల నాయకుడు నీతిమంతుడునై (తీతు 1:8) ఉండవలెను. మనము యదార్థముగా, అన్నివిషయములలో నమ్మకముగా ఉండవలెను. మనము చేసిన వాగ్ధానములను నిలువ బెట్టుకొనవలెను, సమయమునకు బిల్లులు చెల్లించవలెను, ఇతరులతో దయగా మాట్లాడవలెను.

మనము అతిధిప్రియులుగా ఉండవలెను (తీతు 1:8). పౌలు దినములలో వసతి గృహములు ఉండేవికావు, కాబట్టి ప్రజలు ప్రయాణించి ఒక ప్రాంతమునకు వెళ్ళినపుడు అక్కడ ఒకరి గృహములో ఆశ్రయము పొందేవారు. అందువలన దైవభక్తిగల నాయకుడు త్యాగపూరితమైన స్వభావముతో అతిధులపట్ల శ్రద్ధ తీసుకొంటూ, తనకు కలిగిన దానిని వారితో పంచుకొనేవాడు.

వీటన్నిటిని కలిగియుండుట ద్వార ఒక దైవభక్తిగల నాయకుడు సంఘములను బయటి వ్యక్తుల ద్వార మంచి పేరు కలిగి యుంటాడు. (1 తిమో3:7). మన సమాజములో ఉన్న ఇతరులు మనము గౌరవమునకు తగినవారమని గుర్తించ గలరు. కొన్నిసార్లు

మనము యేసునుగూర్చి ఏమి విశ్వసిస్తున్నమో దానితో వారు ఏకీభవించక పోయినప్పటికి మనము మంచి వారమని, నమ్మకమైన వారమని, యధార్ధపరులమని వారు అంగీకరిస్తారు.

**పౌలు సలహా**

ఒక దైవభక్తిగల నాయకుడు యేసు వలే ఇతరులతో మంచి పేరు కలిగియుంటాడు.

నీ సమాజము నందు నీవు ఎలాంటి పేరు, ప్రఖ్యాతిని కలిగి యున్నావు? నీ గురించి క్రైస్తవేతరులైన వారు ఏమని ఆలోచిస్తున్నారు? క్రైస్తవులు నీ సంఘమునకు హాజరు కానివారు నీ గురించి ఏమి మాట్లాడుకొంటున్నారు? నీవు చెప్పుతున్న మాటలు మంచివని, నమ్మకమైనవని ప్రజలు తెలుసుకొంటున్నారా? నీవు యేసునకు ప్రతినిధిగా ఉండుట ద్వార ప్రజలు యేసు మంచివాడని తలస్తున్నారా?

## E. దైవభక్తిగల నాయకుడు దైవిక ఆధ్యాత్మిక జీవితము కలిగి ఉండాలి

చదువుము: 1 తిమో 3: 1-7 తీతు 1: 5-9

పౌలు తాను ఇచ్చిన జాబితా యందు దైవభక్తిగల నాయకునికి ఉండవలిసిన ఆధ్యాత్మికమైన మరియు పరిపక్వత గల విలక్షణముల పైన దృష్టి ఉంచినాడు. ఇవి కూడా ప్రతి నాయకునికి ఎంతో అవసరము. దైవభక్తిగల నాయకుడు తప్పక పరిశుద్ధత కలిగి ఉండవలెను. దేవుని కొరకు జీవించాలనుకొనే మరియు ఆయనను సంతోష పెట్టాలనుకొనే పురుషులు మరియు స్త్రీలు దీనిని కలిగి యుండవలెను.

తన ఆలోచనలలో లేదా క్రియలలో పాపము లేకుండా ఉండుటకు తన సామర్థ్యత కొలది చేస్తున్నానని చెప్పవలెను. మనలో ఎవరు కూడా పరిపూర్ణులుగా ఎప్పటికి ఉండలేరు, కాని మన జీవితములలో ఒప్పుకొనని పాపము ఇంకను ఏది లేదనే నిశ్చయతను కలిగి ఉండాలి. అతని జీవితములో దేవుని సన్నిధి కలదని ఇతరులు గుర్తించగలగాలి. అతని క్రైస్తవ నడకలో ప్రయాణములో పరిపక్వతను కలిగి ఉండుట అవసరమై ఉన్నది దీనిని బట్టి అతడు మరింత పరిశుద్ధముగా ఉండగలడు.

అతడు పరిపక్వత చెందుటకు క్రైస్తవ జ్ఞానము కూడా అవసరమై ఉన్నది. దైవభక్తిగల నాయకుడు హితబోధను గట్టిగా చేపట్టుకొనువాడై ఉండవలెను పౌలు చెప్పుచున్నాడు (తీతు 1:9). వాక్యము యొక్క సత్యమును వివరించగల సామర్థ్యముగలవాడై ఉండవలెను మరియు దానిని కాపాడువాడై ఉండవలెను. అతడు తన దైనందిన జీవితములో సత్యమును తప్పక ప్రదర్శించువాడై ఉండవలెను

ఎందుకనగా మన దైనందిన జీవితములో బైబిలు జ్ఞానములో పరిపక్వత చెందుటకు సమయము పట్టును. సంఘములో క్రొత్తగా చేరినవాడు నాయకుడు ఉండకూడదని పౌలు చెప్పుచున్నాడు (1తిమో 3:6). "క్రొత్త" అనగా నూతనమైనది, సున్నితమైన మొక్క. అది బలమైనదిగా ఎదగాలంటే దానికి సూర్యరశ్మి మరియు నీరు అవసరమై ఉన్నది. అలాగుననే నూతన విశ్వాసులు దేవుని వాక్యమును నేర్చుకొని దానిని వారి జీవితములకు అన్వయించుకొనవలెను. ఆధ్యాత్మికముగా ఎదుగుటకు పరిపక్వత చెందుటకు సమయము పడుతుంది. ఒకవేళ దీనికి సరియైన సమయము పట్టనప్పుడు నూతనముగా వచ్చిన నాయకుడు అతని పదవినిబట్టి గర్వించి పాపములో పడుతాడు. కాబట్టి ఒక క్రైస్తవుడు ఎదుగుతూ ఉన్నప్పుడు అతనిని కొంత కాలము మరియొక పరిపక్వతగల

నాయకుని క్రింద సహాయకునిగా ఉంచవలెను దీనిని బట్టి అతడు నేర్చుకొని శిక్షణ పొందుతాడు అదేవిధముగా అతడు గర్వపడకుండా లేక స్వయంకేంద్రిత జీవితము లేనివాడుగా పరిపక్వతతో నాయ కత్వము చేయగలవాడై ఉండువరకు ఒకరి అధికారము క్రింద ఉంటూ అతనికి లెక్క అప్పగించువాడునై ఉండవలెను.

చివరిగా ఒక నాయకుని ఆధ్యాత్మిక జీవితమునకు సంబంధించిన లక్షణమేదనగా అతడు బోధించగలవాడై ఉండవలెను (1 తిమో 3: 2) అనగా మొట్టమొదట అతడు బోధించగల ఆత్మను కలిగి ఉండవలెను. బైబిలు జ్ఞానములో ఎదుగునప్పుడు నేర్చుకొనుటకు మరియు ఆధ్యాత్మికముగా ఎదుగుటకు ఇష్టపడవలెను. అప్పుడు అతడు దేవుని సత్యమును ఇతరులతో సంభాషించగలడు. నాయకులందరికి బోధించే వరము ఉండకపోవచ్చు అయినను వారి సామర్ధ్యము కొలది దేవుని సత్యమును పంచుకోగలరు. మన మందరము సౌవార్తీకరణ చేయుట లేదా ప్రార్ధన చేయుట అను వరములు కలిగి ఉండక పోవచ్చు కాని ఏ విధానములోనైన ఉత్తమమైనవి చేయగలము. ఇది బోధకులుగా ఉన్న నాయకులందరిలో ఇది సత్యము. నాయక నైపుణ్యాన్ని తాకే లక్షణము ఇదొక్కటే. వీటన్నితో పాటుగా దేవుని వాక్యమును బోధించుట మరియు నేర్పించుట కాపరులకు, నాయకులకు ఎంత ప్రాముఖ్యమైనదో దేవుడు మరల తిరిగి చూపిస్తున్నాడు.

## పౌలు సలహా

దైవభక్తి గల నాయకుడు తప్పక ప్రతిరోజు దేవునితో సమయము గడుపుతూ ఉండాలి  మరియు తన విశ్వాసములో ఎదుగుతూ ఉండాలి.

నీవు పరిశుద్ధతలో ఎదుగుచూ, పాపముపై విజయము సాధిస్తున్నావా? నిన్ను ఓడిస్తున్న పాపములు నీ జీవితములో ఏమైనా ఉన్నాయా? ఆ ప్రాంతములలో విజయము సాధించాలంటే నీవు ఏమి కలిగి ఉండాలి? నీవు బైబిలును విశ్వాసముతో అధ్యయనము చేస్తూ మరియు నేర్చుకుంటున్నావా? నీవు లోపములను గుర్తించ గలుగుతున్నావా మరియు వాక్యమునుండి  దేవుని సత్యమును ఇతరులకు చూపించగలుగుతున్నావా? ఇతరులకు దేవుని సత్యమును గూర్చి సంభాషిస్తున్నప్పుడు ఉత్తమమైనది చేయుచున్నావా? నీవింకను పరిపక్వత చెందుతూ మరియు విశ్వాసములో జ్ఞానములో ఎదుగు చున్నావా?

# VI. సంఘర్షణ-పరిష్కారము

## A. ఘర్షణలు అనివార్యములు (సంఘర్షణ పరిష్కారము 1)

సంఘర్షణ లేదా కలహముల నుండి తప్పించుకొనలేము. కయీను మరియు హేబెలు నుండి ప్రస్తుతము ప్రతి జాతి, వ్యక్తిగత, కుటుంబ, మరియు సంఘముల యందు కలహములు చోటుచేసు కొంటున్నవి. అవి మన పాప స్వభావము నుండి కలుగుతాయి. యాకో 4:1-2 నందు చెప్పబడినట్లు మీలో యుద్ధములు పోరాటములును దేనినుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే గదా? మీరాశించుచున్నారు గాని మీకు దొరుకుటలేదు, పోట్లాడుదురు యుద్ధము చేయుదురు గాని దేవుని అడుగనందున మీకేమియు దొరుకదు. కేవలము సమాధాన కర్త తిరిగి వచ్చినపుడే నిజమైన శాంతి భూమిమీద ప్రజలమధ్య నెలకొల్పబడుతుంది. అప్పటివరకు మన వివాదములు, కలహములను మనము సర్దుబాటు చేయబడాలి మరియు వాటిని నియంత్రించాలి, అయితే మనకు మనముగా వాటిని నియంత్రించలేమని నేర్చుకోవాలి.

పౌలు, తిమోతి, తీతుకు కూడా ఇతర ప్రజలచేత చాల వివాదములను ఎదుర్కొన్నారు. వాటిలో చాలావరకు తమ తోటి క్రైస్తవులతోనేఎదుర్కొన్నారు. ఎఫెసీ సంఘములోని మనుష్యుల మధ్య ఉన్న సమస్యలు, విభేదములు పరిష్కరించుటలో తిమోతికి సహాయ కరముగాఉంటుందని 1 తిమోతి పత్రికను పౌలు వ్రాసినాడు. ఆ ఉద్దేశ్యము కోసమే పౌలు తిమోతిని అక్కడకు పంపినాడు, కాని ప్రజల మధ్యలో ఉన్న వివాదములను, కలహములను నిలిపివేయుటకు అతడు చాల కష్టపడవలిసి వచ్చెను. ఈ రోజులలో కూడా చాలా మంది కాపరుల విషయములో మరియు సంఘముల విషయములో ఇది వాస్తవము.

కలహములు, వివాదములు రావటము సహజమే, కాని అవి తప్పక భక్తిమార్గములో పరిష్కరించుటకు ప్రయత్నించవలెను. ఎప్పుడైతే విశ్వాసులు వాటిని పరిష్కరించుటకు ముందుకురారో, అప్పుడు పలుకు బడిగల, సంపన్నులైన, బలవంతులు వారి స్వంత పద్ధతిలో వాటిని పరిష్కరించుటకు ప్రయత్నించి, సమస్యను ఎక్కువ చేస్తుంటారు. అక్కడ సంతృప్తికరమైన రాజీ, లేదా ఇరువురి మధ్య మైత్రి చేకూరటం కాక ఒకరు గెలటము మరొకరు ఓడిపోవటమువంటివి మాత్రమే ఉంటాయి కాబట్టి సంఘములో లేదా కుటుంబములలో ఎదురయ్యే సమస్యలు ఈ విధానములోపరిష్కరించకూడదు. నా పిల్లలు పోట్లాడుకొని ఒకరితో ఒకరు కలిసి ఉండక పోవటము చూచినప్పుడు చాల బాధ కలుగుతుంది. అలాగుననే మన పరలోకపు తండ్రి కూడా ఆయన పిల్లల మధ్య ఈలాంటి కార్యములు తలెత్తినపుడు వాటిని చూచి బాధపడుతాడు.

మనమందరమూ స్వాభావికముగా స్వార్ధ పరులముగాను మరియు స్వార్ధ కేంద్రితమైన వారముగాను జన్మించినాము కాబట్టి కలహములు, వివాదములు మన మధ్య అనివార్యమైనవి. కొన్నిసార్లు మనము స్వార్ధమును ముందుంచుటకు ప్రయత్నిస్తాము, అది మన పాప స్వభావము. సాతాను మన శరీరములను రెచ్చగొట్టి, ఎంత సాధ్యమైతే అంతగా వివాదములను ప్రత్యేకముగా, సంఘములోను, క్రైస్తవులమధ్య, కుటుంబములలోను లేవనెత్తుతాడు.

పోరాడి లేదా కలహపడి దానిలో గెలవటమే లోకము ఎంచుకొనే పద్ధతి. కాని సిలువ మార్గమును ఎంచుకొన్నట్లైతే కలహాములు, వివాదములు తలెత్తినప్పుడు మన వైపుగా వ్యక్తిగత యదార్ధతను మరియు విధేయతను కనపరచవలెను. చాలాసార్లు వారిలోఉన్న తప్పిదముపైన, స్వంత విషయాలపైన దృష్టి పెట్టుటకంటే ఇతరులను నిందించుటకు ప్రయత్నిస్తారు. అది వారికి చాల

సులభమైనది. అయితేదేవుని వాక్యములో చెప్పబడినట్లు "అందరును పాపము చేసియున్నారు'(రోమా 3:23). యేసు కూడా దీనిని బోధించినాడు, "నీ కంటిలోనున్నదూలము నెంచక నీ సహోదరుని కంటిలోనున్న నలుసును చూచుట యేలా? నీ కంటిలో దూల ముండగా, నీవు నీ సహోదరుని చూచి నీ కంటిలో నున్న నలుసును తీసివేయనిమ్మని చెప్పనేల? వేషధారి, మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును" (మత్త 7: 3-5).

మనము యేసును వెంబడించు వారమైతే కలహములు వచ్చినపుడు ఇతరుల గురించి కంటే ఎక్కువగా మనలో ఉన్న తప్పి దములనుచూచు కొనవలెను. ఈ మొదటి అడుగు వేసినట్లయితే అక్కడ ఇరువురి మధ్య మైత్రి లేదా సయోధ్య ఏర్పడుతుంది. దానిలో నీవు గెలిచినావో లేదా ఓడినావో లేదా రెండు వర్గములవారు గెలిచినారనో లేదా ఓడిపోయినారనో అనునది ముఖ్యముకాదు. దీనిని అన్ని రకములైన సంబంధములలో ఉపయోగించవలెను, ప్రత్యేకముగా ఇది వివాహ విషయాలలో వాస్తవమైనది, కాని వ్యక్తిగత విషయములలో మరియు సంఘ సభ్యుల మధ్య సత్ సంబంధము నెలకొల్పబడుటలో కూడా అవసరమైయున్నది.

కలహములకు దోహదము చేయటానికి అనుకోకుండా ఏదైనా మనము చేసియున్నామా? కలహములు నివారించబడుటకు లేదా పూర్తిగా సద్దుమనిగేల చేయుటకు నీవేమి చేయగలవు? ఇతర వ్యక్తుల పట్ల నీ వైఖరి దయ, క్షమాపణతో కూడినదిగా ఉన్నదా, లేదా లోపల పగతీర్చు కోవాలనే లేదా తీవ్రమైన కోపముతో ఉన్నాదా?

## B. మొదటి చర్య తీసుకొనవలయును (సంఘర్షణ పరిష్కారము 2)

తమ పిల్లలు ఇతరులతో కలసిమెలసి ఎలా ఉండాలో నేర్పించుట తల్లిదండ్రుల జీవితములో ఒక కష్టమైన మరియు సవాలుతో కూడిన విషయము. అదేవిధముగా నిత్యము కలహాములతో, వివాదములతో వుండే ప్రజలను  సరిచేయుట కూడా కాపరులు కష్టతరమైన విషయము. మన స్వంత వివాహములు మరియు ఇతరులతో మనకున్న సంబంధములలో కూడా వివాదములను అంతము చేయటం కష్టము. తరచుగా, మనము కలహించుకోకుండ ఆపవచ్చును కాని వారి మధ్య జరిగిన వాటిని పరిష్కరించలేము, వారు ఒకరినిబట్టి ఒకరు గాయపరచబడిన భావములు మిగిలిపోతాయి. మరొక వివాదము లేవనెత్తబడినప్పుడు, గతములో కలిగిన బాధలు గుర్తుకు వచ్చి, మనము ఉన్న చోటికి తిరిగి వస్తాము.

కేవలము సమస్యలను విస్మరించి నటించుట ద్వారా ఉనికి కలిగి యుండుటకు వేరే అవకాశము ఉండదు. దేవుడు చెప్పినట్లు సమస్త మనుష్యులతో సమాధానము కలిగి ఉండుడి. ఇది మన మీదనే ఆధారపడి ఉంటుంది (రోమా 12: 18). దాని అర్థము ఏ వివాదమైన అది మనవలన ప్రారంభమైనదా లేదా అనేది ముఖ్యము కాదు గాని దానిని నిలిపివేయలసిన భాద్యత మనపైన ఉంటుంది. సంఘర్షణ పరిష్కార నిర్వహణలో మనము వేసే రెండవమెట్టు, అభిప్రాయ నిర్ణయము చేయుటలో చొరువ తీసుకొనుట, తరువాత ఆ పరిస్థితిలో మన స్వంత పాత్ర కొరకు యదార్థముగా పోరాడుట.  జరిగిన విషయములో మనము పూర్తిగా తప్పు చేయనివారమైనప్పటికి, మనము తప్పుచేసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళి అతనిలో స్వస్థతను తీసుకురావలిసిన బాధ్యత ఇంకా మనమీద ఉన్నది. “మరియు నీ సహోదరుడు నీ యెడల తప్పిదము చేసినయెడల నీవు పోయి, అతని తప్పిదమును

తెలియజేయుము, అది నీకును నీ సహోదరినికి మధ్య మాత్రమే జరుగవలెను" (మత్త 18:15). యేసు కూడా మన ఎడల తప్పిదము చేసిన వ్యక్తితో సమాధానపడవలెనని చెప్పెను, ఒకవేళ మనము అతని పట్ల ఏ తప్పిదము చేయకున్నప్పటికిని ఆరాధించుటకు ముందే వెళ్లి సమాధానపడవలెనని చెప్పెను. కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమే మైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలి పీఠము నెదుటనే నీ యర్పణము నర్పింపుము" (మత్త 23-24). ఎవరో ఒకరు మనతో సరియైన సంబంధము కలిగియుండక పోయినట్లయితే మనము దేవునితో సరియైన సంబంధము కలిగి యుండలేము.ఒక తప్పిదము జరుగుటకు మనము కారణము కానప్పటికి ఆ సమస్యను పరిష్కరించి నిలిపి వేయవలసిన బాధ్యత కలిగి యున్నాము(గలతి 6:1). ఒకసారి మన సహోదరుడు తప్పిదములో చిక్కుకొనినట్లుగా తెలిసినట్లయితే మనము వారిని కనుగొని సమస్యకు పరిష్కారము చూపవలెను. వారిని మనము ఎంత మాత్రము విడచిపెట్టవద్దు, వారు మన దగ్గరకు రావటానికి ఎదురు చూడాలి, వారుక్షమాపణ చెప్పునట్లుగా ఆలోచించాలి. అయితే మనము మొదట చొరవ తీసుకొని వెళ్లి మాట్లాడవలెనని దేవుడు తెలియజేస్తున్నాడు. ఇదివివాహ విషయములలో, సంఘము విషయములో మరియు అన్నిచోట్లవాస్తవమైయున్నది.

నిన్ను ఇష్టపడని ఒక వ్యక్తిని కనుగొని, తిరిగి అతనితో ఐక్య పడాలనుకొనుట తగ్గింపు, మరియు ధైర్యముతో కూడిన విషయము. ప్రత్యేకముగా నీవు ఏ తప్పు చేయలేదని ఖచ్చితముగా తెలసినప్పుడు, క్షమాపణ కోరుట చాల కష్టతరము. అయితే ఇతరులు నీతో ఎలా మెలగాలని ఆశిస్తావో, నీవు వారితో అలాగే మెలగాలి.

నీవు ఒకవేళ ఒక వ్యక్తిచేత అవమానించబడినట్లయితే, అది వారికి చిన్న విషయము కావచ్చును, లేదా దానిని గుర్తించకపోవచ్చును అయితే సమస్య నీకును దేవునికి మధ్య ఉన్నది. వారిని క్షమించి, ముందుకు వెళ్ళుము, కేవలము అది చిన్నవిషయమే అని నీవు అనుకుంటున్నట్లయితే దానిని పట్టించుకోవాల్సిన పనిలేదు.

నీవు ఒక వ్యక్తితో మాట్లాడటానికి వెళ్తున్నట్లయితే దేవుని సమాధానము కొరకు మరియు నడిపింపు కొరకు ప్రార్థించవలెను. నీవు ఏమి మాట్లాడాలనుకొంటున్నావో వాటిని వ్రాసుకొన్నట్లయితే అవి నీకు సహాయకరముగా ఉంటుంది. ప్రేమగలిగి సత్యము చెప్పుము (ఎఫె 4:15). పాత్రలు తారుమారు చేయబడ్డప్పుడు, మీరు ఎలా మాట్లాడాలనుకుంటున్నారో వారితో అలా మాట్లాడుము. పౌలు చెప్పినట్లు వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాష యేదైనను మీ నోట రానియ్యకుడి (ఎఫె 4: 29).

ఆ వ్యక్తి యొక్క స్పందన జాగ్రతగా, దగ్గరగా ఉండి వినుటకు ప్రయత్నించుము. ఆ సమయములో నీవు ఏమి చెప్పాలనుకొంటున్నావో దానిని గూర్చి అలోచించకు, వారి స్థానంలో నిన్ను నీవు ఉంచుకొని వారిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించుము. నీవు ప్రతిస్పందించ టానికి ముందు వారి మాటలను ఖచ్చితంగా క్లుప్తపరచుటకు సామర్థ్యత కలిగియుండాలి. వారు క్షమాపణ అడిగినట్లయితే వారిని ఏషరతులు లేకుండా క్షమించి, మరల వాటిని ఎన్నడు తిరిగి పునరావృతము చేయకుము. ఎల్లప్పుడు మత్తయి సువార్త లోని సూత్రముతో అలోచించుటకు ప్రయత్నించుము. ఇతరులు నీతో ఎలా మాట్లాడాలని నీవు ఆశిస్తావో నీవు వారితో అలాగే మాట్లాడు. ప్రేమ గలిగి సత్యము చెప్పుము (ఎఫె 4:15). సమస్య ఒకసారి పరిష్కారము జరిగిన తరువాత, వాటిని క్షమించి దానిని మర్చిపోవాలి,

మరియు వాటిని గూర్చి మరెన్నడూ లేవనెత్తవద్దు, నీ మనస్సులో నుండి కూడా వాటిని తుడిచి వేయవలెను.

ఒకవేళ మత్త 18:15–17 లో చెప్పబడినట్లుగా ఒక వ్యక్తి పాపము చేసినట్లయితే, అతడు ఒంటరిగా ఉన్నప్పుడు వెళ్లి అతనిపట్ల నీవు కలిగి ఉన్న శ్రద్ధను వ్యక్తము చేయుము (15). అతడు ఒకవేళ అనుకూలముగా స్పందించకపోతే, నీతో కూడా మరో ఇద్దరు పరిపక్వ తగల విశ్వాసులతో కలిసి వెళ్లి అతనితో మాట్లాడుము (16), ఒకవేళ అతనిలో ఇంకా పశ్చాత్తపము కలుగకపోతే అతని విషయమును సంఘమునకు తెలియజేయాలి. ఆ తరువాత సంఘమంతయు ప్రార్థించి, అతడు పశ్చాత్తపపడునట్లు, ప్రోత్సహించవలెను. ఇప్పుడు కూడా అతడు తన పాపము విషయములో పశ్చాత్తపపడకపోతే అతనిని అన్యునిగా ఎంచుకొనవలెను. అప్పుడు పరిశుద్ధాత్మ అతనిలో ఒప్పుదలను కలిగిస్తాడు (17).

ఎవరైనా ఒక వ్యక్తి నీకు వ్యతిరేకముగా చెప్పే విషయము ఏదైనా నీలో ఉన్నదా? అతనితో మాట్లాడి సమాధానము తీసుకొని రావటానికి చేయవలసినవన్నియు చేసియున్నావా? అక్కడ ఉన్న పరిస్థితి కొరకు ప్రార్థించుము. అతనిలో స్వస్థత తీసుకురావటానికి ఇంకా ఏమైనా చేయలా అని దేవునిని అడుగుము.

## C సమాధాన స్థాపన విఫలము చెందినపుడు (సంఘర్షణ పరిష్కారము 3)

క్రైస్తవులు ఒకరితో ఒకరు కలహపడకుండా చేయుట మరియు ఒకరితో ఒకరు సమాధానము కలిగియుండునట్లు చేయకపోయుట ఎందుకు కొన్నిసార్లు కష్టమైనదిగా యుంటుంది?

ఒక వ్యక్తిగా, మరియు ఒక కాపరిగా ప్రజలమధ్యలో కలహములు చోటు చేసుకోవటము, ప్రత్యేకముగా వాటిలో నేను జోక్యము చేసుకోవలసి రావటము ఇష్టపడేవాన్ని కాదు. నేను ప్రతి సమస్య సావధానముగా పరిష్కరించబడి, తిరిగి ప్రతిది యదాస్థానములోనికి రావాలని కోరుకొనేవాన్ని. కాని ప్రతి ఒక్కరు అలా వుండటం నేను చూడలేదు. కొందరు కలహాములలోనే సంతోషించేవారుగా ఉంటారు. ఈలాంటి వారు ఎల్లప్పుడు వారి జీవితములలో ఒకటి లేదా అంత కంటే ఎక్కువ విషయాలలో తమ సంబంధాలు దెబ్బతిని ఉండటము చూస్తాము. అలాంటి ప్రజలకు సహాయము చేయుటలో, వారిలో ఏర్పడ్డ గాయాలను స్వస్థపరచుటలో నేను చాల కష్టపడేవాన్ని. కాని బైబిలు నందు మనము ఈలాంటి విషయాలలో జోక్యము చేసుకొని వారి సంబంధములను పునఃస్థాపితము చేయాలని అజ్ఞాపించబడినది. దానికి మనము ఏమి చేయగలము?

కలహములు అనివార్యములు మనము తప్పక చొరవ తీసుకొనవలెను.  ఒకవేళ సమస్య మన తప్పిదమువలన జరుగకపోయి నప్పటికి మనము పరిష్కరించుటకు సహాయము చేయవలెను. ఒకవైపు లేదా రెండు పార్టీలకు చెందినవారు మనస్తాపమునకు గురై వారు రాజీపడుటకు ఇష్టపడకపొతే మనము ఏమిచేయవలెను? ఇది కేవలము నిర్లక్ష్యము చేసేదికాదు. ఇది శరీరములో ఒక భాగము నుండి మరొక భాగమునకు వ్యాపించే పుండు వంటిది. దీన్ని ప్రారంభములోనే అరికట్టకపోతే శారీరమంతటికి దాని విషము వ్యాపిస్తుంది. ఇద్దరు విశ్వాసుల మధ్య ఉన్న మనఃస్పర్ధలు క్రీస్తు శారీరమైన సంఘ మంతటిపై దుష్ప్రభావమును చూపుతాయి. కాబట్టి అవి తప్పక పరిష్కరించబడవలెను.

ఒకవేళ నీవు ఆ సమస్యలకు ఆరోగ్యవంతమైన పరిష్కారము ఇవ్వలేకపోతే, అప్పుడు ఒక కాపరినిగాని లేదా సంఘములో పరిపక్వత చెందిన నాయకుని యొక్క సహాయము తీసుకొనవలెను (మత్త 18:15-17 ఫిలి 4:2-3). కొన్నిసార్లు మధ్యస్తముగా పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి సలహాలను ఇవ్వగలిగే వ్యక్తిని బయటినుంచి తీసుకొనివస్తే వారు నీవు ఏమి చేయవలెనో సలహా చెప్పుతారు. దేవుడు బైబిలు ప్రకారమైన జ్ఞానయుక్తమైన సలహాలను వాడుకొంటాడు కాబట్టి దేవుడు వాడుకొనే మధ్యవర్తుల సలహా తీసుకొనుటకు ఇష్టపడుము.

వారి మధ్యలో ఏర్పడే వివాదములను పరిష్కరించు కొనుటకు విశ్వాసులు తప్పక సమర్థులై ఉండవలెను, వారు ఎంతమాత్రము ఉన్నతస్థాయిలో ఉన్న అవిశ్వాసులైన వ్యక్తులను సంప్రదించకూడదు (1 కొరింథీ 6:1-8). ఒకవేళ నీ వైపునుండి తప్పు జరిగినట్లయితే ఎంత వీలైతే అంత త్వరగా వాటిని పరిష్కరించుకొనుటకు ప్రయత్నించుము (మత్త 5: 25-26).

ఒకవేళ ఈ ప్రయత్నాలు ఏవి పని చేయకపోనట్లయితే ఇరుపార్టీలవారు మధ్యస్తముగా ఉన్న మధ్యవర్తి దగ్గరికి వెళ్లి తమ పరిస్థితిని యదార్థముగా వివరించవలెను. ప్రక్రియలోనికి వెళ్ళకముందే ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తి ఎలాంటి తీర్మానము చేస్తే దానికే కట్టుబడి ఉంటామని అంగీకారము చేయవలెను. బయట అవిశ్వాసులైన లాయర్లకు లేదా జడ్జిలకు ఎక్కువ మొత్తములో డబ్బులు ఖర్చుపెట్టేకంటే ఈ విధముగా మధ్యవర్తి ద్వార పరిస్థితులను పరిష్కరించుకోవటము మంచిది. వ్యక్తిగత హక్కుల కొరకు లేదా పగ మరియు ప్రతీకారము తీర్చుకోవాలని అనుకొనుటకంటే సహోదరుల మధ్య సమాధానము కలిగియుండుట చాల ప్రాముఖ్యము.

కొన్నిసార్లు, నీకు వ్యతిరేకముగా తప్పుచేసిన ఒకవ్యక్తి విషయములో, లేదా నీ సంఘములో ఉన్న వ్యక్తుల మధ్య వివాదములకు పరిష్కారము జరిగినప్పటికీ వారు ఇంకా అలాగే కొనసాగుతూ ఉంటే, కొన్నిసార్లు ఒక పార్టీవారుగాని లేదా రెండు పార్టీలకు చెందినవారుగాని సమాధానపడుటకు ఇష్టపడకపోతే, వారి విషయములో మనము ఏమిచేయాలి? రోమా 12:18 లో చెప్ప బడినట్లు "శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. మనము అందరితో సమాధానముగా నివసించుటకు ఆజ్ఞాపించబడితిమి కాని ఇక్కడ రెండు జరుగుచున్నవి. ఒకవేళ మనకుఎంత సాధ్యమో అంతవరకు చేయగలుగుతాము మరియు మనపై ఆధారపడిన ప్రతిదానిని కూడా చేసిన తరువాత, ఇంకా మనము చేయవలసినవలసినవి ఏమి లేవు. మనము కేవలము ఆ వివాదముల నుండి బయటి వచ్చేస్తాము. ఒకవేళ వారిని సమాధాన పరచుటకు బలవంతము చేసినట్లయితే పరిస్థితులు జటిలంగా మారవచ్చును. మనలో ఉన్న శాంతిని కూడా పోగొట్టుకొంటాము. యేసు అర్ధము చేసికొనగలడు. ఆయన పట్ల అయిష్టత చూపు వారిని కూడా సమాధానపరచుటకు ప్రయత్నించగలడు కాని ఒకవేళ వారు ఆ విధముగా లేనట్లైతే వారినుండి దూరముగా వెళ్ళుతాడు. ఆయన ఆ విధముగా చేసి తనను అనుసరించు వారిని కూడా ఆ విధముగా చేయుమని చెప్పెను. (మత్త 10: 14 లూకా 9: 5). అదే విధముగా పౌలు కూడా చేసి ఉన్నాడు (అపొ 13:51). అయిననూ వారి కొరకును మరియు వారి పరిస్థితి కొరకును ప్రార్ధన చేయుము మరియు క్షమాపణను వెదకుడి అంతేతప్ప మీ హృదయములో పగను ఏర్పరచుకొనకుము. వారిని ప్రేమించి, క్షమించి ముందుకు కొనసాగుడి.

2కొరింథీ13:11 తుదకు సహోదరులారా, సంతోషించుడి, సంపూర్ణులై ఉండుడి, ఆదరణ కలిగి ఉండుడి, ఏకమనస్సు గలవారై ఉండుడి, సమాధానముగా ఉండుడి, ప్రేమ సమాధానములకు కర్తయగు దేవుడు మీకు తోడై ఉండును.

నీవు ఎవరితోనైనా దీర్ఘ కాలముగా విరోధము కలిగి ఉన్నావా? ఇప్పుడు దానిని పరిష్కరించుటకు నీవు ఏ విధముగా సహాయపడగలవు? నీ జీవితములో బాగుచేయలేని విడిపోయిన సంబంధాలు ఏమైనా ఉన్నాయా? ఆ సంబంధము కొరకు ప్రార్థన చేయుము మరియు వారిని ప్రేమించుటకు, క్షమించుటకు సహాయము చేయుమని దేవునిని అడుగుము. అదే విధముగా వారి కొరకు ప్రార్థన చేయుము.

**D ఫిలిప్పి సంఘము నందు సంఘర్షణ (సంఘర్షణ పరిష్కారము 4)**

విశ్వాసుల మధ్య కలహములుండుట క్రొత్తేమి కాదు. పౌలు తన ఇద్దరు స్నేహితులతో మరియు ఫిలిప్పిలో అతనితో పాటు పనిచేసిన వారితో వివాదములను ఎదుర్కొన్నాడు. ఫిలిప్పి 4:2-9 వచనములను చదువుము. ఫిలిప్పి 4:2-3 ప్రభువునందు ఏకమనస్సు గలవారై యుండుడని యువోదియను, సుంటుకేను బతిమాలు కొనుచున్నాను. అవును, నిజమైన సహకారీ ఆ స్త్రీలు క్లెమెంతుతోను నా ఇతర సహకారులతోను సువార్తపనిలో నాతో కూడ ప్రయాసపడిన వారు గనుక వారికి సహాయము చేయుమని నిన్ను వేడుకొనుచున్నాను. ఆ సహకారుల పేర్లు జీవగ్రంథమందు వ్రాయబడి యున్నవి. ఈ అసమ్మతి చాలా తీవ్రమైనదని ప్రతి ఒక్కరికి తెలుసు. ఈ ఇద్దరు శత్రువులగుటకువారిద్దరి మధ్య ఏమి సంభవించినదో మనకు తెలియదు కాని ఈ విషయమును వారు పరిష్కరించుకోలేదు

కావున వారి మధ్య సత్ సంబంధము నెలకొల్పబడుటలో సహాయము చేయవలెనని పరిపక్వత చెందిన విశ్వాసిని పౌలు అడుగు చున్నాడు.

తరువాత పౌలు క్రైస్తవులు ఏ విధముగా జీవించాలో, ఎలా ప్రవర్తించాలో వ్రాయుచున్నాడు, కాని బహుశ ఇంకనూ ఆ వివాదము అతని మనస్సులో ఉండవచ్చును. అందువలన, తరువాతి వచనాలలో జీవితము అంతటికి సంబంధించిన విషయము మరియు అక్కడ జరిగిన సమస్యను గూర్చి సంభోదిస్తున్నాడు. మనము ఇతరులతో ఎలా కలసి ఉండవలేనో వాటిని గూర్చిన స్పష్టమైన సూత్రములను కనుగొనగలము.

**1.ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి (4: 4)**

"ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి!" కష్ట పరిస్థితులలో ఉన్నప్పటికి, ఇతరులతో వివాదములతో ఉన్నప్పటికి మనము యేసులో ఆనందించవలయును. పౌలు ఈ ఆజ్ఞను రెండు పర్యాయములు నొక్కిచెప్పి యున్నాడు. బాధ ఉన్నప్పటికి మనము ఆనందించగలము ఎందుకనగా మన ఆనందము మన పరిస్థితులలో నుండి  వచ్చునది కాదు కాని యేసు మన కొరకు చేసిన వాటన్నిటిలో నుండి వచ్చునది (ఫిలి 2:1–11). దేవుడు ఒక మంచి ఉద్దేశ్యముతో మనకు కష్ట పరిస్థితులను అనుమతిస్తాడు అయినప్పటికిని విశ్వాసము ద్వారా మనము ఆనందించగలము (ఫిలి 1:18–21).

**2. మీ సహనమును సకల జనులకు తెలియబడనియ్యుడి 4: 5a.**

"మీ సహనమును సకల జనులకు తెలియబడనియ్యుడి." అత్యంత బహిరంగముగా బోధించగల ఆత్మకు కట్టుబడి ఉండుము. నీ భాగమును నీవు చూసుకొనుము మరియు ఏమి అభివృద్ధి పరచుకొన

వలయునో చూసుకొంటూ ఇతరులపై దృష్టి పెట్టకుము (మత్త 7:3). ఇతరులతో చాడీలు చెప్పకుము విమర్శించకుము, నిన్ను నీవు కాపాడు కొనుటకు ప్రయత్నించకుము లేదా ఇతరులపై దాడి చేయకుము నీలో అతనిలో దేవుని కార్యము జరుగనీయుము.

### 3. ప్రభువు సమీపముగా ఉన్నాడని గుర్తుంచుకొనుము 4:5b

"ప్రభువు సమీపముగా ఉన్నాడు". నీవు ఒంటరిగా లేవు దేవుడు నీతో కూడా ఉన్నాడు. దేవుడు సరియైన సమయములో మరియు సరియైన మార్గములో నిన్ను భద్రముగా ఉంచి సంరక్షిస్తాడు.

### 4. వివాదమును గూర్చి ఆందోళన చెందకు కాని దాని పరిష్కారమునకై దేవునిని అడుగు 4:6

దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్ధన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. నేను వివాదమును మరియు ఘర్షణను గూర్చి భయపడుచున్నాను. అవి నాకు గొప్ప ఒత్తిడిని మరియు కోపమును తెప్పించును. నేను వాటిని దేవునికి అప్పగించు దిశగా నేర్చుకొనుచున్నాను మరియు ఆయనే నాపట్ల, వాటిపట్ల శ్రద్ధ కలిగి ఉన్నాడు. సమస్య పరిష్కారమునకై ఇతరుల యొద్దకు వెళ్ళవద్దు, దేవుని సలహా మరియు సహాయమునకై వెదకుము.

### 5. దేవుని సమాధానముతో నీ హృదయాన్ని మరియు మనస్సును కాపాడుకొనుడి 4:7

ఐనప్పటికిని దీనికి ఒక అర్ధము ఉన్నట్లు కనబడక పోవచ్చును దేవుడు వాగ్దానమిస్తూ "అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని

సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి ఉండును.” నీ జీవితములో శాంతి ఫలముల కొరకు ప్రార్థించుము, ఒత్తిడిని బాధను కలిగించు తలంపుల నుండి తిరుగుము వాటిని యేసువైపునకు త్రిప్పుము.

**6. ప్రత్యర్థిలో ప్రశంసనీయమైనది ఏదో కనుగొనుము 4:8**

“మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతి గలవో, వాటి మీద ధ్యానముంచుడి”. ఇతరులలో ఉన్న ఒక మంచిని గూర్చి ఆలోచించు అతని సమస్యను గూర్చి అనుకూల దృక్పథముతో చూడుము. కేవలము ప్రతికూల దృక్పథముతో సమస్యను పెద్దది చేసి చూడవద్దు.

**7. మంచి ఆదర్శవంతమైన వ్యక్తిని కనుగొనుము మరియు ఈ విషయములను ఆచరణలోపెట్టి కొనసాగించుడి 4:9.**

నా నుండి మీరు ఏమి నేర్చుకొంటిరో లేదా ఏవి పొందితిరో లేక ఏవి వింటిరో నాలో ఏమి చూచితిరో  వాటిని సాధన చేయుడి. మరియు సమాధాన కర్తయైన దేవుడు మీతో కూడా ఉండును. పౌలు ఎంతో వ్యతిరేకతను మరియు విమర్శను భరించాడు. ఎంతో మంది విశ్వాసుల ద్వారా వివాదాలను చవిచూసాడు (ఫిలి 1:12-20). ఇలాంటి సమయములో ఎలా స్పందించవలెనో ఒక మంచి మాదిరి చూపుచున్నాడు. మీకు తెలిసిన వారి జీవితములలో నుండి లేదా బైబిలులో నుండి వేరే మంచి ఉదాహరణలను నీవు కనుగొనగలవు. వారి నుండి నేర్చుకొనుము. వారు స్పందించిన విధముగా స్పందించుము.

ఎప్పుడైతే మన శత్రువులు సిలువకు శత్రువులుగా ఉండి (ఫిలి 3:18) మరియు చెడును వ్యాపింపజేస్తూ ఉంటే మనము వారికి వ్యతిరేకముగాఉండి ప్రభువులో స్థిరముగా ఉండవలెను (ఫిలి 4:1). ఒకవేళ వారు మనతోటి విశ్వాసులైతే, మనము వారితో కలసి క్రీస్తు శరీరమునకు సమాధానము కలుగునట్లు పని చేయవలెను (1 కొరింథీ 12:25-27)

ప్రస్తుత నీ పరిస్థితిలో పైనున్న సూత్రములలో ఏవి నీకు ఉపయోగముగా ఉన్నవి? నీ జీవితమునకు మరియు సంబంధములకు ఈ సత్యములను నీవు ఏ విధముగా అన్వయించగలవు?

# ముగింపు

సామెతలు 27:17 ప్రకటించునదేమనగా, “ఇనుము చేత ఇనుము పదునగును. అట్లు ఒకడు తన చెలికానికి వివేకము పుట్టించును.” అలాగుననే  మనము సంఘ కాపరులముగా ఒకరి నుండి ఒకరము, ప్రాముఖ్యముగా అనుభవజ్ఞుల కాపరుల నుండి నేర్చుకొనగలము.  పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రికలో ఈ విధముగా తెలియజేయుచున్నాడు. నీవు అనేక సాక్షుల ఎదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము (2తిమో 2:2). పౌలు తాను ఎరిగిన దానిని తిమోతికి అందజేసాడు, అదేవిధముగా ఇతరులు కూడా వారు ఎరిగిన దానిని ఇతరులకు అందించుటను బట్టి ఈ దినమున మనకు కూడా సంక్రమించినది. 2000 సంవత్సరముల క్రితము పౌలు ఇచ్చిన సలహా ఇప్పటికిని మంచిదిగా ఉన్నది, దానిని నేర్చుకొని, ఇతరులకు అందించవలయును. మనము నేర్చుకొనిన ఈ విషయములను యౌవన నాయకులకు మరియు కాపరులకు అందించ వలయును అప్పుడు వారు ఇంకా బాగుగా యేసును సేవించ గలరు. అదే విధముగా తరువాత వారు దానిని ఇతరులకు అందించగలరు. ఈ పుస్తకము నుండి మీరు నేర్చుకొనవలెనని మరియు ఈ విషయము లను ఇతరులకు అందజేస్తూ, ఇతరులకు సహోదరులుగా ఉంటూ వారికి శిక్షణనిస్తూ దేవుని సేవలో వాడబడాలని నా ప్రార్థన.

ఈ క్రింది పునః పరిశీలన ప్రశ్నలకు జవాబిచ్చుటకు కొంత సమయము తీసికొనుము. నీ స్వంత జీవితమునకు మరియు పరిచర్య కొరకు నీవు నేర్చుకొనినవి నీవు అన్వయించు కొనుటకు సహాయపడును.

దేవుని జ్ఞానము, అవగాహన మరియు అంతఃదృష్టి  కొరకు అడుగుతూ మరియు ప్రార్థించుము. తొందరపడకుండా నీ సమయమును ప్రార్థనలో గడుపుము. వీటిని గూర్చి నీ స్నేహితునితో, సహ సంఘ కాపరితో లేదా సహచరునితో మాట్లాడుము. దేవుడు నీకు బోధించు వాటికి నీవు స్పందించగలవు. నీ జీవితమునకు ఏ విధముగా అన్వయించుకొంటూ ఏమి ఆలోచిస్తున్నావో వాటిని వ్రాసుకొనుము. ఇవి కేవలము నీ లాభము కొరకే, నీవు జవాబుల్లో చెప్పవలసిన అవసరతలేదు.

పౌలు జీవితము నుండి నేర్చుకొని వేటిని నీకు ఎక్కువగా అన్వయించు కొన్నావు?

తిమోతి జీవితము నుండి ఎక్కువగా ఏ విషయములను నీ జీవితమునకు అన్వయించుకొన్నావు?

తిమోతికి మరియు తీతునకు పౌలు ఏమి సలహా ఇచ్చెను వాటిలో ఏవి ఎక్కువగా నీకు అన్వయింపబడుతాయి?

నీవు ఎవరి వలె ఎక్కువగా ఉన్నావు, పౌలువలేనా, తిమోతివలెనా లేక తీతు వలెనా?

వారిలో ఒకొక్కరి నుండి నీవు ఏమి నేర్చుకొనినావు?

పౌలు కాపరులకు మరియు నాయకులకు ఇచ్చిన ఉండవలసిన లక్షణముల జాబితాలో నీ బలములు ఏవి?

పౌలు కాపరులకు మరియు నాయకులకు ఇచ్చిన ఉండవలసిన లక్షణముల జాబితాలో నీ బలహీనతలేవి?

నీ బలాలను ఇంకను మంచిగా ఉపయోగించుటకు నీవేమి చేయగలవు?

నీ బలహీనతలను అధిగమించుటకు నీవేమి చేయగలవు?

ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదములో సయోధ్య కలిగించుటకు నీవు చేసిన ప్రయత్నమును గూర్చి ఆలోచించుము, నీవు ఎంత వరకు దానియందు విజయవంతుడవైనావు?


ప్రజల మధ్య సమస్యలను పరిష్కరించుటకు ఈ పుస్తకము నుండి నీవు నేర్చుకొనినవి ఏ విధముగా సహాయపడినవి?

నీ ప్రజలలో కొంతమందికి ఎవరైనా బైబిలునకు విరుద్ధమైన సిద్ధాంతములను బోధిస్తే నీప్రజలను కాపాడుటకు నీవేమి చేయగలవు?

తప్పుడు బోధ చేయుచున్న వ్యక్తిని పునరుద్ధరించుటకు నీవేమి చేయగలవు?

ఒకవేళ పౌలు వ్యక్తిగతముగా నీతో మాట్లాడినట్లైన ప్రస్తుత నీ పరిచర్యకు సహాయపడు రీతిగా అతడు నీకు ఏ సలహాను ఇస్తాడు?

- - - - - - - -



రెవ.డా. జెర్రీస్మోయర్ 1975లో డల్లాస్ థియోలాజికల్ సెమినరి నుండి మాస్టర్ ఆఫ్ థియాలాజీ పట్టభద్రులు మరియు 2006లో D.Min పట్టాను పొందారు. వీరు 2016 వరకు అమెరికాలో 35 సంవత్సరాల పాటు సంఘ కాపరిగా సేవలందించారు.  వీరు క్రిస్టియన్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ పేరున సంస్థను స్థాపించి వివాహ, కుటుంబ, యవ్వనస్థుల మధ్య సమావేశాలను ఏర్పాటు చేసే పరిచర్యను కొనసాగిస్తున్నారు.

వీరు కౌన్సిలింగ్ మరియు కాపరులకు తర్భీదు ఇచ్చే సేవలను అందిస్తున్నారు.

2006 నుండి భారతదేశంలో పాస్టర్ల మధ్య పరిచర్య చేస్తున్నారు.

1979 నాన్సీ గారితో వివాహము జరిగింది. ఈమె నర్స్.

ఈ దంపతులకు మనుమలు, మనుమరాండ్రలతో కూడిన పెద్ద కుటుంబం ఉంది.

- - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - -


ఆయనను కలుసుకునేందుకు ఈ-మెయిల్

Jerry@christiantrainingorganization.org

www.christiantrainingorganization.org